EENADU Epratibha
టార్గెట్ ఏపీపీఎస్సీ
ప్రణాళికతో పఠనం.. ఉద్యోగానికి సోపానం!
■ వీడియో పాఠాలు ■ ఈ-బుక్స్ ■ ప్రాక్టీస్ టెస్ట్స్
■ కరెంట్ అఫైర్స్ ■ రియల్ టైం ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్స్
SCAN HERE
www.epratibha.net 8008001640

ఈనాడు



విజయవాడ 28-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 199

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి!



జస్టిస్ లిసా గిల్ పేరును సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

2 నెలల ముందే సీజే పదవులు భర్తీ చేసే సంప్రదాయానికి శ్రీకారం



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా జస్టిస్ లిసా గిల్ రానున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో గురువారం సమావేశమైన కొలీజియం ఆమె పేరును కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డులకెక్కనున్నారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ పదవీకాలం ఏప్రిల్ 24తో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెండు నెలల ముందుగానే జస్టిస్ లిసా గిల్‌ను న్యాయమూర్తిగా ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్ బాధ్యతల నుంచి వైదొలిగిన మరుసటిరోజు నుంచి (మిగతా 5లో)

రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం

శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేయనున్న అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం రానుంది. అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్... మెట్‌గ్లాస్ ఇండియా పేరుతో శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ సీఈఓ సీన్ ఎం.స్టాక్ వెల్లడించారు. శుక్రవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉపయోగించే పరికరాలను ఇందులో ఉత్పత్తి చేయనున్నారు. ఈ సంస్థ తొలిదశలో సుమారు 77-80 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టి ఎల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ఏడాది చివరినుంచి ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అధునాతన జపాన్ సాంకేతిక (మిగతా 5లో)

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర	ఫారం దగ్గర లైవ్ బర్డ్	140 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	242 కిలో
₹ 72	రిటైల్ లైవ్ బర్డ్	167 కిలో	స్కిన్‌లెస్	276 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

రూ.లక్ష కోట్లతో ఉద్యాన హబ్



రాయలసీమను ప్రపంచ నంబర్ 1 చేస్తాం

40 లక్షల ఎకరాల్లో సాగు.. 100 కోట్ల టన్నుల ఉత్పత్తి లక్ష్యం

సమర్థ జల నిర్వహణతో నీటి ఎద్దడి నివారణ

వ్యవసాయ పద్దులపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కౌలు రైతుల్ని ఆదుకుంటాం

ఈనాడు - అమరావతి

రాయలసీమను ప్రపంచానికే నంబర్ 1 ఉద్యాన హబ్‌గా మార్చబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 40 లక్షల ఎకరాలకు సాగును విస్తరించి, 100 కోట్ల (1000 మిలియన్) టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఇక్కడ అన్ని రకాల ఉద్యాన పంటలు పండిస్తామన్నారు. దీనికి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు చేయనుండగా. మౌలిక సౌకర్యాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నుంచి అదనంగా మరో రూ.70 వేల కోట్ల పెట్టుబడులొస్తాయని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివీ..

దేశంలో ఎక్కువ పండ్లు పండించే రాష్ట్రం ఏపీ. నంబర్ 1 స్థానంలో ఉంది. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాం. 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలతో 400 మిలియన్ టన్నుల పండ్లు, కూరగాయలు ఉత్పత్తవుతున్నాయి. దీన్ని రాబోయే రోజుల్లో రెట్టింపు చేస్తాం.

కౌలు రైతులు పరిమితంగా సాగు చేయాలి

కౌలు రైతులు ఒక్కొక్కరు 30 నుంచి 40 ఎకరాలు సాగు చేస్తున్నారు. నష్టాలొచ్చినప్పుడు కోలుకోలేని స్థితికి వెళుతున్నారు. పరిమితంగా సాగు చేయాలి. వారికి అండగా నిలిచేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

ఏలూరు వద్ద కోకో సిటీ

బర్లీ పొగాకు, ఉల్లి, కోకో, మామిడి తదితర పంటలకు రూ.500 కోట్లు మార్కెట్ జోక్యం కింద ఇచ్చి ఆదుకున్నాం. అన్ని వాణిజ్య పంటలూ సాగు చేయాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏలూరు వద్ద ప్రపంచంలోనే మొదటి కోకోసిటీ రాబోతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యమిస్తున్నాం. టెక్నాలజీ, (మిగతా 5లో)

నీటి భద్రత ముఖ్యం

ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశముందని అంచనా. వర్షాలు తక్కువగా పడినా, ఎక్కువగా కురిసినా నీటి భద్రత ముఖ్యం. నీరుంటే ఏ పని అయినా చేయొచ్చు. రైతులు, సాగునీటి సంఘాలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. సమర్థ నీటి నిర్వహణతో నీటి ఎద్దడి నివారించొచ్చు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

నేడు విజయనగరం జిల్లాకు సీఎం చంద్రబాబు చీపురుపల్లి మండలం పైలపేటలో పింఛన్ల పంపిణీ 2లో



‘ప్రచండ్’లో రాష్ట్రపతి గగన విహారం

రాజస్థాన్‌లోని జైసల్మేర్ వైమానిక స్థావరం వద్ద తేలికపాటి హెలికాప్టర్ ‘ప్రచండ్’లో గగన విహారానికి ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లోపలి పేజీలో

రెడ్‌బుక్‌లో జగన్ పేరుందో, లేదో త్వరలో తెలుస్తుంది



తిరుమల లడ్డూ కల్తీ బాధ్యులెవరూ తప్పించుకోలేరు

11 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వద్దు

ఐడియాస్ ఆఫ్ ఇండియా-2026 సదస్సులో మంత్రి లోకేశ్

కేజ్రీవాల్, కవితకు క్లీన్‌చిట్

మనీశ్ సిసోదియా, మరో 20 మందికి కూడా విముక్తి

దిల్లీ మద్యం కేసులో రౌజ్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు

సీబీఐ అభియోగాలు నిరాధారమంటూ కొట్టివేత

తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ




కోర్టు తీర్పు అనంతరం కేజ్రీవాల్ భావోద్వేగం ★ హర్షం వ్యక్తం చేస్తున్న కవిత

దిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. వారితో పాటు మరో 20 మందిపై నమోదైన అభియోగాలను దిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. వారందరికీ కేసు నుంచి విముక్తి కల్పించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించారని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)పై మండిపడింది. అయితే ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ వెంటనే దిల్లీ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. దర్యాప్తులోని పలు అంశాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని సీబీఐ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ట్రయల్ కోర్టు తీర్పుపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన నేతృత్వంలోని ఆప్ వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. కేజ్రీవాల్ నివాసం, ఆప్ కార్యాలయాల వద్ద కార్యకర్తలు (మిగతా 5లో)

లడ్డూ కల్తీతో.. మా గుండెలు పగిలిపోయాయి

జగన్‌కు హిందూ ధర్మం మీద విశ్వాసం లేదు

ఆయన కనుసన్నల్లోనే మహాపచారం

వై.వి.సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిల తీరు దుర్మార్గం

మార్చి 28న సామూహికంగా ప్రాయశ్చిత్త దీక్షలు

సాధు పరిషత్ సదస్సులో స్వామీజీలు

లోపలి పేజీల్లో


బొత్సకు అస్వస్థత



హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు

తన ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైకాపా నేత

ఇదీ సంగతి!



అఫ్గాన్, పాక్‌లలో నెత్తుటేర్లు

పరస్పరం భీకర దాడులు చేసుకున్న పొరుగుదేశాలు

274 మంది తాలిబన్లను హతమార్చామన్న ఇస్లామాబాద్

55 మంది పాక్ సైనికులను తుదముట్టించామన్న కాబుల్

అఫ్గాన్‌తో బహిరంగ యుద్ధంలో ఉన్నామన్న పాక్



అఫ్గాన్‌లోని ఖోస్త్ ప్రావిన్స్‌లో దాడులకు సిద్ధంగా తాలిబన్ సైనికులు

ఇస్లామాబాద్, కాబుల్: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తాజాగా యుద్ధరూపం దాల్చాయి! ఇరు దేశాలు గురువారం రాత్రి నుంచి పరస్పరం భీకర దాడులు చేసుకుంటున్నాయి. తమ దాడుల్లో 274 మంది తాలిబన్లు హతమయ్యారని పాక్ ప్రకటించింది. మరో 400 మంది గాయపడ్డారని తెలిపింది. మరోవైపు- తాము 55 మంది పాక్ సైనికులను తుదముట్టించామని అఫ్గాన్ పేర్కొంది. అయితే తాజా దాడుల్లో తమ సైనికులు 12 మందే (మిగతా 5లో)





(c) eenadu

లడ్డూ కల్తీతో.. మా గుండెలు పగిలిపోయాయి

- సాధు పరిషత్ సదస్సులో స్వామీజీల ఆవేదన




లడ్డూ కల్తీ నిందితులను శిక్షించాలని కోరుతున్న శివస్వామి, శ్రీనివాసానంద సరస్వతి, కృష్ణమాచార్య స్వామి తదితరులు
★ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సాధువులు, స్వాములు, మాతాజీలు

ఈనాడు, అమరావతి, గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: 'గత వైకాపా ప్రభుత్వ పాలకులు మహాపాపం చేశారు. జగన్‌కి హిందూ ధర్మం మీద విశ్వాసం లేదు. 20 కోట్ల లడ్డూలను కల్తీ చేసి అపవిత్రం చేశారు. హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారు. రసాయనాలు కలిపిన ప్రసాదాన్ని కోట్లమంది భక్తులతో తినిపించారు. ఉల్లి, వెల్లుల్లి తింటేనే.. తపస్సు దెబ్బతింటుందేమో అని ఆలోచించే మాచేత.. జంతుకొవ్వు, రసాయనాలు కలిపిన పదార్థాలను తినిపించారంటే.. వారినేం చేయాలి? లడ్డూ కల్తీ బయటపడ్డాక మా గుండెలు పగిలిపోయాయి' అని పలువురు స్వామీజీలు, మాతాజీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి మహా పాపం చేసిన దుర్మార్గులను శిక్షించకుండా ఇంకా ఎందుకు ప్రభుత్వం వేచి చూస్తోందో అర్థం కావడం లేదు. దీనికి బాధ్యులైన వారందరినీ అరెస్టు చేయాలి. ఏడుకొండలవాడి సన్నిధిలో జరిగిన మహాపాపానికి ప్రాయశ్చిత్తం చేసుకునేందుకు.. మార్చి 28న హిందువులంతా ఒకేసారి ఆలయాల్లో ముడుపులు చెల్లించి.. గోవింద నామం స్మరిస్తాం' అని తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, మంగళగిరికి చెందిన కృష్ణమాచారి స్వామి, భక్తి చైతన్యానంద సరస్వతి స్వామి, రుద్ర యోగేశ్వరనంద స్వామి, భాజిల్ గురుస్వామి, మంగళ మహారాజ్ స్వామి, విద్యా శంకరానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాపచారానికి పాల్పడ్డారు..

వైకాపా నాయకులు లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి మహాపచారం చేశారని.. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి ధ్వజమెత్తారు. 'జగన్, వై.వి.సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి తప్పు చేసి కూడా కనీసం పశ్చాత్తాపం లేకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. పొరపాటు జరిగింది. క్షమించండి అంటారని ఆశించాం. కానీ వాళ్లు ఇంకా తప్పుమీద తప్పు చేస్తూనే ఉన్నారు. జగన్ కనుసన్నల్లోనే ఈ కల్తీ జరిగింది. భగవంతుడికి కొట్టే కొబ్బరికాయ కుళ్లిపోతేనే మనసు చివుక్కుమంటుంది. అలాంటిది.. దేవాదిదేవుడికి నైవేద్యంగా పెట్టే లడ్డూలను అపవిత్రం చేశారు. వాటిని భక్తులకు పంచి.. మహాపచారానికి పాల్పడ్డారు. ఇది క్షమించరాని నేరం. జగన్‌రెడ్డి క్రైస్తవ ఎజెండాతో పాలన సాగించి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారు. తాజాగా కడప వెళ్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని.. తీర్థం ఇస్తే.. కింద పడేయడం స్పష్టంగా కనిపిస్తోంది. హోమంలో హవిస్సులు వేయడానికీ ఇష్టపడలేదు. అతనికి హిందూత్వం మీద విశ్వాసం లేదనడానికి.. ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి' అని శ్రీనివాసానంద ప్రశ్నించారు.

వారిని శిక్షించే వరకూ ఉద్యమిస్తాం..

– శివస్వామి, తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి

శ్రీవారి ప్రసాదం కల్తీ అనేది.. హిందూ సమాజంలో ఓ విస్ఫోటనం. సాధు సమాజం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. ఈ కల్తీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. వారికి శిక్ష పడేవరకూ ఉద్యమిస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీని ఆహ్వానిస్తున్నాం. ఈ పాపానికి ఒడిగట్టిన దోషులను వదలొద్దు. కల్తీ వ్యవహారంతో జరిగిన పాపానికి.. ప్రాయశ్చిత్తం చేసేందుకు ఓ మహా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించాం. హిందువులంతా దానిలో భాగస్వాములవ్వాలి. దోషులుగా ఉన్న వాళ్లు.. రకరకాల జిమ్మిక్కులు, మేజిక్కులు చేస్తూ.. ప్రజలను, న్యాయవ్యవస్థను కూడా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. వారికి శిక్ష పడేవరకూ మేం పోరాటం చేస్తాం. దిల్లీ కేంద్రంగానూ గొంతెత్తి.. ఈ మహాపచారాన్ని ప్రపంచానికి తెలియజేస్తాం.

దారుణం చేసినా.. చర్యలు తీసుకోరా?

– మంగళగిరికి చెందిన కృష్ణమాచారి స్వామి

పాలల్లో కల్తీ జరిగి నలుగురు చనిపోతే.. ఆరు గంటల్లో నిందితుడిని పట్టుకున్న ఈ ప్రభుత్వం.. రెండేళ్లుగా తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో ఎందుకు వేచి చూస్తోందో మాకు అర్థం కావడం లేదు. లడ్డూను కల్తీ చేశారని పక్కాగా తేటతెల్లమైంది. ఐదేళ్లు మాతో కల్తీ పదార్థాలను తినిపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేచి చూసే ధోరణిని వీడాలి. ఈ పాపం చేసినోళ్లు ఎంత పెద్దవాళ్లయినా తక్షణం అరెస్టు చేయాలి.

పథకం ప్రకారం హిందువులపై దాడి..

★ లడ్డూ ప్రసాదం కల్తీతో దైవాపచారం చేసినోళ్లు లోకానికి హాని చేసినట్లేనని పిడుగురాళ్లలోని శివరామ దీక్షితుల పీఠం మాతాజీ పేర్కొన్నారు.

★ జగన్ మోసాల గురించి హిందువులంతా గ్రహించారని.. గుంటూరుకు చెందిన పూర్ణయ్యస్వామి మండిపడ్డారు. వైకాపా హయాంలో పథకం ప్రకారం హిందువులపై దాడి జరిగిందన్నారు.

★ వైకాపా నేతల కల్తీ నెయ్యిపై తాము ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నామని.. గతంలో కేసులు కూడా వేశామని వినుకొండకు చెందిన సుభోధయ ఆనందస్వామి వెల్లడించారు.

భారీ ఎత్తున ప్రాయశ్చిత్త దీక్ష

లడ్డూ కల్తీపై మార్చి 28న తిరుపతిలో స్వామీజీలు, ధార్మిక సంస్థలు, హిందూ బంధువులందరితో కలిసి ప్రాయశ్చిత్త దీక్ష చేపడతామని స్వామీజీలు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని తెలుగువాళ్లంతా.. మార్చి 28 శనివారం సాయంత్రం తమతమ ఇళ్లలోనే దేవుడి వద్ద 11 రూపాయలు ముడుపు కట్టుకుని.. సామూహికంగా దగ్గరలోని ఏదో ఒక ఆలయానికి వెళ్లి ముడుపు చెల్లించి ధర్మజ్యోతి వెలిగించాలని సూచించారు. కోట్ల మంది కలిసి ఒకే సమయంలో.. గోవింద నామాలను పఠించడం ద్వారా.. స్వామిని శాంతింపజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ముడుపు చెల్లించమని జగన్‌నూ కోరతాం..

స్వామి వారిని శాంతింపజేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులందరినీ ముడుపులు సమర్పించమని అడుగుతామని స్వామీజీలు తెలిపారు. హిందూ ధర్మంపై విశ్వాసం ఉందని చెబుతున్న.. జగన్‌ను కూడా ముడుపు చెల్లించమని పత్రికా ముఖంగా కోరతామన్నారు.

స్థిరాస్తి కొనుగోలులో సందేహాలా?

'ఈనాడు స్థిరాస్తి - క్రెడాయ్ హైదరాబాద్'
ఉచిత వెబినార్

ఈనాడు స్థిరాస్తి | CREDAI HYDERABAD

తెలుగు రాష్ట్రాల్లో ఏ నలుగురు కలిసినా మాట్లాడుకునేది రియల్ ఎస్టేట్ గురించే. పెరుగుతున్న ధరలను తట్టుకుని రాబడి ఇస్తున్న పెట్టుబడి మార్గంగా ఎక్కువ మంది దృష్టిని స్థిరాస్తి రంగం ఆకర్షిస్తోంది. నివాసం ఉండేందుకు ఫ్లాట్, విల్లాలు; భవిష్యత్తులో పిల్లల చదువు, పెళ్లిళ్ల కోసం స్థలాలపై పెట్టుబడులు పెడుతున్నారు. పదవీ విరమణ తర్వాత అద్దెల ఆదాయం కోసం ఫ్లాట్లు, వాణిజ్య స్థలాలు కొనేవారూ ఉన్నారు. తీరా కొన్నాక సకాలంలో ప్రాజెక్ట్ పూర్తికాకపోవడం, నాణ్యత లోపాలు, కొన్నింటికైతే అసలు అనుమతులే లేకపోవడం, మధ్యలోనే పనులు ఆగిపోవడం లాంటి సమస్యలను కొనుగోలుదారులు ఎదుర్కొంటున్నారు. కొనేటప్పుడు ఏమేం చూడాలి? సమస్యలు వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి? ప్రాజెక్టులకు స్థానిక సంస్థల నుంచి అనుమతి, రెరా గుర్తింపు ఉందా లేదా తెలుసుకోవడం ఎలా? ఫార్మ్ ప్లాట్లు కొనవచ్చా? ఇలాంటి సందేహాలను నివృత్తి చేసేందుకు 'ఈనాడు స్థిరాస్తి- క్రెడాయ్ హైదరాబాద్' సంయుక్తంగా ఉచిత వెబినార్ నిర్వహిస్తున్నాయి.

ఏమేం చర్చిస్తారంటే..

- గంటన్నరపాటు సాగే సెషన్‌లో స్థిరాస్తి కొనుగోలుదారులకు రెరా నిబంధనలపై అవగాహన కల్పిస్తారు.
- రెరా రిజిస్ట్రేషన్ ధ్రువీకరించడానికి, రెరా నిబంధనలు పాటించని ప్రాజెక్టులను గుర్తించడానికి చెక్‌లిస్ట్‌ను చెబుతారు.
- డెవలపర్ బాధ్యతలు, కొనుగోలుదారుల హక్కులను వివరిస్తారు.
- వివాదాలను పరిష్కరించడానికి న్యాయ,చట్టబద్ధమైన అంశాలను న్యాయనిపుణులు వివరిస్తారు.
- సందేహాలను జూమ్ చాట్‌లో నమోదు చేస్తే.. నిపుణులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్, ఈనాడు.నెట్ ద్వారా వెబినార్‌లో జాయిన్ కావచ్చు

వెబినార్ తేదీ: శనివారం, ఫిబ్రవరి 28, 2026
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు

జూమ్ మీటింగ్ కోసం... | యూట్యూబ్ లైవ్ కోసం...

Join from PC, Mac, iPad, or Android:
Zoom - https://hov.to/4039bda6
Zoom ID: **98906417903** / PASSCODE: **125945**
Youtube Live - https://hov.to/7834f379

నేడు విజయనగరం జిల్లాకు సీఎం చంద్రబాబు

ఈనాడు, విజయనగరం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయనగరం జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. ఉదయం ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీ పైలపేటకు సీఎం చేరుకుంటారు. 11.30 గంటలకు చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిని సందర్శిస్తారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం సందర్భంగా బాలికలతో 20 నిమిషాల పాటు మాట్లాడతారు. 12 గంటలకు రావివలస గ్రామంలోని ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిల్లీ నుంచి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. తర్వాత 2.50 గంటల వరకు ప్రజావేదిక నిర్వహిస్తారు. వివిధ పథకాల లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. రావివలస పంచాయతీ పైలపేట గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. 3.15 నుంచి 4.45 గంటల వరకు పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. 4.55 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

'సామాజిక మాధ్యమం దుర్వినియోగం'పై నేడు సదస్సు

ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

ఈనాడు, అమరావతి: స్వేచ్ఛ-ది ఫ్రీడమ్ ఫౌండేషన్, సీఆర్ మీడియా అకాడమీ సంయుక్తంగా 'సామాజిక మాధ్యమాల దుర్వినియోగం-భావప్రకటన స్వేచ్ఛ, నియంత్రణ మధ్య సమతుల్యత' అనే అంశంపై శనివారం విజయవాడలో సదస్సు జరగనుంది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దగ్గర్లోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 9.45 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీ మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ తదితరులు పాల్గొంటారు.

గూగుల్ డేటా సెంటర్ నోటిఫైడ్ పార్ట్‌నర్‌గా అదానీ ఇన్‌ఫ్రా

ఈనాడు, అమరావతి: గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత నోటిఫైడ్ పార్ట్‌నర్‌గా అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదానీ సంస్థ చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. డేటా సెంటర్ ఏర్పాటుకు రైడెన్ సంస్థ రూ.87,520 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది.

హిందూస్థాన్ బెవరేజెస్‌కు భూ కేటాయింపులు రద్దు

ఈనాడు, అమరావతి: హిందూస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనకాపల్లి జిల్లా రాంబిల్లి క్లస్టర్‌లో కేటాయించిన 50.04 ఎకరాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థకు కేటాయించిన భూములకు నిర్దేశిత నిబంధనల మేరకు ధర చెల్లించలేదు. వాటిని వెనక్కు తీసుకుని వేరే సంస్థకు కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

జీతాలొస్తున్నాయి కదా? ఏ పోస్టులో ఉంటే ఏం?

- గ్రూప్-1 అధికారులకు సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- అప్రాధాన్య పోస్టులకు బదిలీని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ డిస్మిస్

ఈనాడు, దిల్లీ: "మీకు జీతాలు వస్తున్నాయి కదా? ఎక్కడ పోస్టింగ్ ఇస్తే ఏంటి? జీతాలు ఆపి ఉంటే చెప్పండి.. అప్పుడు మీ పక్షాన ఉంటాం" అని సుప్రీంకోర్టు 2018 ప్రకటన ఆధారంగా ఎంపికైన గ్రూప్-1 అధికారులను ఉద్దేశించి పేర్కొంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో చోటు చేసుకున్న అవకతవకలు, అక్రమాల నిగ్గు తేల్చే దిశగా ఏపీ హైకోర్టు ఈనెల 11న వెలువరించిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎం.సన్నీ వంశీకృష్ణ, మరో ఐదుగురు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీపై శుక్రవారం విచారించిన జస్టిస్ రాజేష్ బిందల్, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. గ్రూప్-1 అవకతవకల్లోని వాస్తవాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి దాని బాధ్యతలను అదనపు డైరెక్టర్ జనరల్ (డీజీ) ర్యాంక్ అధికారికి అప్పగించాలని, గ్రూప్-1 పరీక్షలో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న వారందరినీ ప్రాధాన్య పోస్టుల నుంచి తొలగించి అప్రాధాన్య పోస్టులకు బదిలీచేయాలని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తప్పుపడుతూ పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పీఎస్ పట్వాలియా వాదనలు వినిపించారు. 'వారు ప్రధాన పోస్టుల్లో ఉంటే అన్ని విషయాలనూ మేనేజ్ చేసే పరిస్థితుల్లో ఉంటారని ఎంపిక కాని అభ్యర్థుల తరఫు న్యాయవాదులు చేసిన వాదనలను దృష్టిలో ఉంచుకొని హైకోర్టు వారందర్నీ అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఆర్‌డీఓలుగా పోస్టింగ్‌లు పొందిన 265 మంది ఈ ఉత్తర్వుల కారణంగా ప్రస్తుతం ఎలాంటి పోస్టింగ్ లేకుండా పోయారు. ఆర్‌డీఓ స్థాయి అధికారి అదనపు డీజీ స్థాయి అధికారిని ప్రభావితం చేయగలరా?" అని ధర్మాసనానికి విన్నవించారు. తన ఉత్తర్వులను అమలు చేయలేదన్న కారణంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కోర్టు ధిక్కరణ నోటీసు జారీచేసింది అని గుర్తుచేశారు.

ఫలానా పోస్టే ఇవ్వాలని ఏమైనా ఉందా?

ఈ క్రమంలో జస్టిస్ రాజేష్‌బిందల్ జోక్యం చేసుకుంటూ "మీకు ఫలానా పోస్టే ఇవ్వాలని ఏమైనా ఉందా? మీరు ఏ పోస్టింగ్‌లో ఉన్నా జీతం వస్తుంది కదా? ఎవరైనా మీ జీతాలను ఆపారా?" అని ప్రశ్నించారు. లేదని న్యాయవాది సమాధానం ఇవ్వగా.. అలాంటప్పుడు ఇంకేం ఇబ్బంది? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. 'మీకు జీతం అన్నది మైనర్ పార్ట్ ఏమో' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. 'ఒకవేళ మీకు జీతాలు రాకపోతే చెప్పండి మేం మీవైపు ఉంటాం' అని పేర్కొన్నారు. 'ఈ నియామకాల్లో చాలా గోల్‌మాల్ జరిగినట్లు అర్థమవుతోంది, కొన్ని పేపర్లను రిసార్ట్‌లో కరెక్షన్ చేసినట్లు చెబుతున్నారు' అని వ్యాఖ్యానించారు. న్యాయవాది పట్వాలియా స్పందిస్తూ తాము ఆ రిసార్ట్‌లో పేపర్ కరెక్షన్‌కు సంబంధించిన అభ్యర్థులం కాదని, ఆ రిసార్ట్ పేపర్లను రద్దుచేసి మళ్లీ ఎంపిక చేశారని, అందులోంచి వీరంతా ఎంపికయ్యారని పేర్కొన్నారు. తమ ఎంపిక ప్రక్రియను ఎవ్వరూ సవాల్ చేయలేదన్నారు. 'అలాంటప్పుడు హైకోర్టు ఈ అభ్యర్థులను అప్రాధాన్య పోస్టులకు పంపాలని ఎందుకు చెప్పడం?' అని ప్రశ్నించారు. ఆ వాదనలతో జస్టిస్ బిందల్ విభేదించారు. 'ఈ విషయంలో వాస్తవాలు తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని హైకోర్టు చెప్పింది. మీకు జీతాలు ఆపలేదు కాబట్టి ఏమీ అన్యాయం జరగనట్లే' అని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

సిట్ విచారణను పర్యవేక్షిస్తాం

- కొలిక్కి వచ్చేవరకూ ఈ వ్యవహారాన్ని మేమే చూస్తాం
- గ్రూప్-1 పరీక్ష మూల్యాంకనం అక్రమాలపై స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో అక్రమాల నిగ్గు తేల్చేందుకు తమ ఆదేశాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ పారదర్శకత, చిత్తశుద్ధితో విచారణ చేస్తుందని భావిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. సిట్ విచారణ పూర్తి చేసి కోర్టుకు నివేదిక ఇచ్చేవరకూ ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై దాఖలైన అప్పీళ్ల విచారణకు న్యాయస్థానం ఇప్పటికే తగిన సమయం కేటాయించడంతో అప్పీళ్ల విచారణ ఓ కొలిక్కి వచ్చేవరకూ తామే విచారణ కొనసాగిస్తామని (పార్ట్ హెర్డ్) స్పష్టం చేసింది. సిట్ నివేదిక దాఖలు చేసేందుకు విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ గ్రూప్-1 పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందినవారిని అప్రాధాన్య (నాన్ ఫోకల్) పోస్టులకు బదిలీ చేసి, వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు ఈ నెల 25న జరిగిన విచారణలో సీఎస్ విజయానంద్ హైకోర్టును సమయం కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ వ్యవహారంపై విచారణ జరిగింది. సీఎస్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ కోర్టు ఆదేశాలను అమలుచేసి, వివరాలను మెమో రూపంలో కోర్టు ముందు ఉంచామన్నారు. సిట్ ఏర్పాటు చేశారా అని ధర్మాసనం ప్రశ్నించగా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశామన్నారు. సిట్ విచారణను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

సీఎస్ విజయానంద్, ముఖ్యకార్యదర్శి శ్యామలరావుకు నోటీసులు

గ్రూప్-1లో ఎంపికై ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నవారిని అప్రాధాన్య పోస్టులకు తక్షణం బదిలీ చేయాలంటూ ఈ నెల 11న ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను సీఎస్ విజయానంద్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు అమలుచేయని కారణంగా కోర్టుధిక్కరణ కింద వారిని శిక్షించాలంటూ సుజాత అనే అభ్యర్థి దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం ధర్మాసనం విచారణ జరిపింది. అధికారులిద్దరికీ నోటీసులు జారీచేసింది. కౌంటర్ వేయాలంటూ విచారణను మార్చి 16కు వాయిదావేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్

బిడ్ (ఆర్ఎఫ్‌పి) సవరణ ప్రకటన

PM-SETU పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని క్లస్టర్-1లో గల ఐటిఐల స్థాయి పెంపు కోసం యాంకర్ ఇండస్ట్రీ పార్ట్‌నర్ ఎంపిక కొరకు బిడ్ నం. GEM/2023/B/7196400 తేది 05.02.2026కి కొన్ని మార్పులు అనగా 09.03.2026 వరకు **బిడ్ (ఆర్ఎఫ్‌పి) మార్పు/పొడిగింపు** చేయబడినవని సాధారణ సమాచారం కొరకు అందరికీ తెలియచేయబడుతున్నది. మరిన్ని వివరాలకు లాగిన్ కండి: https://gem.gov.in.

DIPR NO.19211/CL/ADVT/1/1/2021-22 — సం/- డైరెక్టర్

తెలంగాణ గిరిజన సహకార సంస్థ
(గిరిజన సంక్షేమ శాఖ)
4వ అంతస్తు, డిఎస్ఎస్ భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్-500028 ఇమెయిల్:mktgtsgcc@gmail.com

ఇ-టెండరు ప్రకటన — తేది 27.02.2026

తెలంగాణ గిరిజన సహకార సంస్థ హైదరాబాద్‌కు సోప్ నూడిల్స్‌ను సరఫరా చేయుటకు గానూ తయారీదారులు మరియు వ్యాపారుల నుంచి ఇ-టెండర్లు కోరబడుతున్నవి. వెబ్‌సైట్ www.tender.telangana.gov.in నుంచి అర్హతా ప్రమాణాలు మరియు ఇతర వివరాలు గల టెండరు డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. మరే ఇతర స్పష్టీకరణలకైనా, దయచేసి శ్రీ కె.సతీష్‌కుమార్, సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్), టిజిఎస్‌సిసి 98497 55554పై సంప్రదించండి.

సం/- జి.ప్రతాప్ రెడ్డి, జనరల్ మేనేజర్/ కన్వీనర్, టిజిజిసిసి లిమిటెడ్, హైదరాబాద్.
DIPR R.O. No.16140-PP/CL/ADVT/1/2025-26 Dt.27.2.2026.

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
(A Government of Andhra Pradesh Undertaking & An ISO 27001-2022 Certified Company)

E-PROCUREMENT TENDER NOTICE

The **APTRANSCO** invites bids online for Carrying out O&M including Watch & Ward, Housekeeping, MRT & Telecom of E.H.T. SS and lines on work contract basis for the following works for a period of 36 months in Visakhapatnam Zone i.e., Spec.No.e-Proc. Nos. 60 to 79/25-26 of CE/Z/VSP. **Date & Time of availability of tenders: 28-02-2026 at 10:00PM** on e-procurement site. Further details can be seen at **http://apeprocurement.gov.in** .

R.O.No.GMCC/APTRANSCO/60/26 — **Sd/- Chief Engineer-Zone-VSP**

GOVERNMENT OF ANDHRA PRADESH
EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, VIJAYAWADA

e-procurement Tender Notice

NIT Nos: 109 and 112/MD/APEWIDC/VJA/2025-26, Dated: 27.02.2026
Downloading commencement on 04.03.2026 and closing date may be viewed in e-procurement.gov.in

Tenders are invited for Civil works and Furniture (1) Construction of 1st Floor and 2nd Floor over Academic Block-C at SK University at Ananthapuramu (2) Construction of Compound wall at JNTU-GV in Vizianagaram (3) Construction of New Dormitory, Over Head Tank (Syntex) and Dining Cum Kitchen in APSWREIS at Velugonda from eligible civil contractors and (4) Rate Contract to Supply Furniture to Educational Institution & Hostels located in 26 Districts of Andhra Pradesh (2 Years Rate Contract) from eligible original equipment manufactures (OEM)/original equipment manufacturing firm/compines.

Further details may be viewed at **http://tender.apeprocurement.gov.in** Contact No. 08645 295758

Note:1.Changes / amendment if any will only be communicated through above e-procurement platform.

Sd/- Managing Director, APEWIDC, Vijayawada

ANDHRA PRADESH INDUSTRIAL CORRIDORS INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION LIMITED (APICDC)
(formerly known as "NICDIT KRISHNAPATNAM INDUSTRIAL CITY DEVELOPMENT LIMITED")
Regd Office: 1st Floor, IHC Corporate, Plot No. 3, 4, 6 Industrial Park, Mangalagiri, Guntur Dist., AP-522 503.

APICDC invites applications for the following positions:

S. No.	Details	No's of Posts	Type of Recruitment
1	General Manager (Projects)	1	Deputation/APICDC rolls
2	General Manager (Land & Asset Management)	1	Deputation/APICDC rolls
3	Manager (Land)	1	Deputation/APICDC rolls
4	Manager (Community & Social Infrastructure	1	Deputation/APICDC rolls
5	Manager (Power)	1	Deputation/APICDC rolls
6	Company Secretary	1	APICDC rolls
7	General Manager (Commercial & Marketing	1	APICDC rolls
8	Manager (Marketing & Strategy)	1	APICDC rolls
9	Junior Engineers (Civil)	2	APICDC rolls
10	Manager (HR & ADMN)	1	APICDC rolls
11	Assistant Manager (Finance & Accounts)	1	APICDC rolls
	Total Posts	**12**	

For detailed job description and eligibility criteria, please visit our web-sites **www.apicdc.in** or **www.apiic.in.** Interested eligible candidates may send their updated resumes with required documents to e-mail: **managerhr@apicdc.in** on or **before 05.00 PM on 20-03-2026.**

DIPR No. 4873PP/CL/Advt/1/1/2021-22 — **Sd/- MD, APICDC**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref. B1/84/2025 — **Dt. 27-02-2026**

ఫారమ్ నెం.VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1)ని అనుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.55.89 సెంట్లు భూమిని ప్రజా ప్రయోజనమునకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ముంపునకు గురయ్యే నిమిత్తం ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, దొరమామిడి గ్రామమునకు సంబంధించిన భూములు అవసరమైనవి స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు భావించినందున 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూ సేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థవారు అవసరమగు బడ్జెట్‌లను సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టం లోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు, రాజమహేంద్రవరం, 30వ చట్టంలో 19(1)వ విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు వాటి విస్తీర్ణం య.55.89 సెంట్లు భూమిని ప్రజా ప్రయోజనమునకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ముంపునకు గురయ్యే నిమిత్తం అవసరమైనవి ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు | మండలం : బుట్టాయిగూడెం | గ్రామం : దొరమామిడి

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింది విస్తీర్ణం (య సెంట్లు)	భూమి తరగతి	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు/ ఆసక్తిగలవారు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు కట్టడములు ఇతరముల వివరములు
1	7	12.49	మెరక	పాయం గవరయ్య S/o చెంచయ్య	పాయం గవరయ్య S/o చెంచయ్య	23	6	10	25	టేకుచెట్లు-30, తంగేడుచెట్లు-11 తాటి చెట్లు-10, వేప చెట్లు-38, పాల చెట్లు-12, బొమ్మిడి చెట్లు-24, సీతాఫలం- 3, అరటి చెట్లు-2, ఇప్ప చెట్లు-1, జీడిమామిడి తోట
2	16-1A	1.57	మెరక			అటవీ భూమి	అటవీ భూమి	17	14	టేకు -2
3	16-2	6.97	మెరక			అటవీ భూమి	అటవీ భూమి	17	14	టేకు చెట్లు-46, తాటిచెట్లు-30, కరక్కాయి-1, తంగేడు చెట్లు -35, జమాయిల్-60, నల్లా జీడిమామిడి-1, జీడిమామిడి తోట
4	23-2	2.41	మెరక			అటవీ భూమి	780	8	24	టేకు చెట్లు-46, తాటి చెట్లు-30, ఒడుగు చెట్లు-18, రేల చెట్లు -11, ఆరేటు చెట్టు-1, వేప చెట్టు-7
5	74-1	3.21	మెరక	పోలోజు మోహనరావు	పోలోజు మోహనరావు	73	27	26	73	టేకు చెట్లు-10, పామాయిల్ -5
6	235-1B	4.02	మెరక	కూరం గంగా లక్ష్మి	కూరం గంగా లక్ష్మి	242	231	234	235-2	పామాయిల్-12
7	299-2B2	1.00	మెరక	మహ్మద్ నజీర్ అహ్మద్ అలీషా	మహ్మద్ నజీర్ అహ్మద్ అలీషా	310	296	299	299	తాడి-8
8	299-2B2	1.00	మెరక	మహ్మద్ మాలిక్	మహ్మద్ మాలిక్	310	296	299	గ్రామ కంఠం	తాడి-8, జోర్ -1
9	380	6.00	మెరక	పఠాన్ షకీలా	పఠాన్ షకీలా	380	334	380	380	తాడి-30, టేకు -10, జామ్ ఆయిల్ తోట
10	380	3.96	మెరక	పఠాన్ రహీమ్ ఖాన్ (D)	పఠాన్ ఫరూక్ ఖాన్ S/o రహ్మతుల్లా ఖాన్ (ఆలియాస్ రహీమ్ ఖాన్) & పఠాన్ షారుక్ ఖాన్ (ఆలియాస్ షేక్ ఇంతియాజ్) S/o రహీమ్ ఖాన్ (D)	719	381	381	383	జీడి మామిడి తోట, వేప-2, చింత -1, నిమ్మ చెట్టు-1
11	381	1.00	మెరక	షేక్ ముంతాజ్ బేగం	షేక్ ముంతాజ్ బేగం	380	380	719	380	వేప-1, జామ్ ఆయిల్-4
12	381	6.46	మెరక	పఠాన్ బాజీ ఖాన్	పఠాన్ బాజీ ఖాన్	719	380	719	381	టేకు-4, జీడి మామిడి తోట, వేప చెట్టు-2
13	368-1A	1.84	మెరక	కడిమి నాగేశ్వరరావు	కడిమి నాగేశ్వరరావు	380	334	380	380	జీడి మామిడి -70, టేకు -3, తాడి -5, కొబ్బరి -1, వేప-4, వెల్ -1
14	487-2	1.00	మెరక	కలపాల శ్రీను	కలపాల శ్రీను	451	481	486	488	బోరు -1, తాడి -10, ఉసిరి - 2, టేకు -2
15	487-2	1.00	మెరక	కలపాల నాగరాజు	కలపాల నాగరాజు	451	481	486	488	-
16	487-2	0.96	మెరక	తగరం మరియమ్మ	తగరం మరియమ్మ	451	481	486	488	-
17	487-2	1.00	మెరక	కలపాల వెంకటేశ్వరావు	కలపాల వెంకటేశ్వరావు	451	481	486	488	-
మొత్తం :		55.89								

ఈ భూముల ప్లాను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, వి.ఆర్ పురం యూనిట్-II, చింతూరు నందు ఉంచబడినది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన ఎవ్వరును లేరు. బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

కె.అంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్.పురం యూనిట్-2, చింతూరు

సం/- వి.అభిషేక్, ఐ.ఎ.ఎస్., స్పెషల్ కలెక్టర్ (భూసే) (ఎఫ్ఎసి), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

(c) eenadu



బీఆర్ నాయుడికి విరాళం అందిస్తున్న దాత రాచమల్లు వెంకటసుజిత కుటుంబం

తితిదేకు రూ.కోటి విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ఖాజాగూడకు చెందిన రాచమల్లు వెంకటసుజిత తితిదే శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళం అందించారు. తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిసిన దాత కుటుంబం విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసింది. దాతను ఛైర్మన్ అభినందించారు.

గ్రహం అనుగ్రహం

28–2–2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
ద్వాదశి: రా. 8-40 తదుపరి త్రయోదశి
పునర్వసు: ఉ. 9-43 తదుపరి పుష్యమి
వర్జ్యం: సా. 5-22 నుంచి 6-54 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-27 నుంచి 8-58 వరకు తిరిగి రా. 2-32 నుంచి 4-04 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-24 నుంచి 7-56 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.24; సూర్యాస్తమయం: సా.6.01

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	31.0
హైదరాబాద్	20.7	33.9
నిజామాబాద్	20.9	34.4
ఖమ్మం	21.0	34.0
మహబూబ్‌నగర్	21.6	34.4
అనంతపురం	21.6	37.1
శ్రీకాకుళం	22.0	31.0
తాడేపల్లిగూడెం	22.0	34.0
కడప	22.0	36.0
రాజమహేంద్రవరం	22.0	38.0
తిరుపతి	22.2	36.1
విశాఖపట్నం	22.4	31.2
విజయవాడ	22.5	34.7
గుంటూరు	23.0	34.0
ఒంగోలు	23.2	33.9
కర్నూలు	23.2	36.2
నెల్లూరు	23.9	34.8
నరసాపురం	24.5	35.0

నేడు బ్లూజెట్ హెల్త్‌కేర్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- రూ.2,300 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు ఏర్పాటు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం ఇండస్ట్రియల్ పార్కులో బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ పరిశ్రమకు మంత్రి నారా లోకేశ్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఆ సంస్థ ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియట్లు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ.2,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 1,750 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఇది మహారాష్ట్ర ప్రధాన కార్యాలయంగా ఉన్న సంస్థ. ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. రాంబిల్లి మండలంలో 102.48 ఎకరాలను.. ఎకరా రూ.40 లక్షల చొప్పున దీనికి కేటాయించాం. 2028-29 ఆర్థిక సంవత్సరానికి సంస్థ కార్యకలాపాలను ప్రారంభించనుంది' అని ప్రభుత్వం పేర్కొంది. పరిశ్రమ ఏర్పాటు ద్వారా స్థానికంగా ఫార్మారంగానికి అనువైన వ్యవస్థ బలోపేతం అవుతుందని.. అనుబంధ పరిశ్రమలు వస్తాయని తెలిపింది.

కడపలో తెదేపా తీర్థం పుచ్చుకున్న ఇద్దరు వైకాపా కార్పొరేటర్లు

అరవిందనగర్, నగరపాలక, (కడప), న్యూస్‌టుడే: కడప నగరపాలక సంస్థలో వైకాపాకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు రామలక్ష్మణరెడ్డి, శివకోటిరెడ్డి శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. వారితో పాటు 46వ డివిజన్‌కు చెందిన వైకాపా సీనియర్ నాయకుడు నాగేంద్రరెడ్డి తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా కడప నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం వారికి సూచించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇప్పటికే 8 మంది వైకాపా కార్పొరేటర్లు తెదేపాలో చేరారు. తాజాగా చేరిన వారితో ఆ సంఖ్య 10కి చేరింది.


టైలర్లకు ఆధునిక పరికరాలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ఆదరణ 3.0 పథకం కింద టైలర్లకు ఆధునిక పరికరాలు అందిస్తామని మంత్రి సవిత వెల్లడించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర టైలర్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఆకాశపు స్వామి మంత్రిని కలిశారు. శనివారం మంగళగిరిలో నిర్వహించే రాష్ట్ర టైలర్స్ డే వేడుకలకు ఆమెను ఆహ్వానించారు.












(c) eenadu

అప్పుడు నెయ్యం... ఇప్పుడు కయ్యం!

అనాగరిక ముష్కర మూకలకు స్వర్గధామంగా, విఫలరాజ్యంగా పరువుమాసిన భ్రష్టదేశం పాకిస్థాన్! మతఛాందస పాశాల పిడికిట్లో చిక్కుకున్న విషాద వర్తమానం అఫ్గానిస్థాన్‌ది! ఆర్థిక, సామాజిక అగచాట్లతో అంగలార్చుతున్న ఈ రెండు దేశాలు కొన్నాళ్లుగా కొట్లాటలకు దిగుతున్నాయి. నిన్న మొన్నటి వరకు నెరిపిన నెయ్యానికి నీళ్లొదిలేసి కయ్యానికి కాలుదువ్వి సామాన్య జనానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి! తమ గడ్డపై తెహ్రీక్‌-ఇ-తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) ఉగ్రవాదులు చెలరేగిపోవడానికి కారణం అఫ్గాన్ తాలిబన్లు ఇచ్చిన అలుసేనని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. టీటీపీ అనేది పాక్ అంతర్గత సమస్య అంటూ కాబుల్ కొట్టిపడేస్తోంది. ఈ వాదోపవాదాల నడుమనే పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఇటీవల వరసగా భయానక ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. అందుకు ప్రతిగా అఫ్గానిస్థాన్ భూభాగాలపై కిందటి వారంలో పాక్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. దానికి ప్రతీకారం తీర్చుకోవడానికంటూ సరిహద్దుల్లోని పాక్ బలగాలపై అఫ్గాన్ సేనలు మొన్న గురువారం దండెత్తాయి. కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లపై భీకర వైమానిక దాడులతో నిన్న అఫ్గానిస్థాన్‌కు బదులిచ్చిన పాకిస్థాన్- తమ సహనం నశించిపోయిందంటూ సెలవిచ్చి సమర ప్రకటన సైతం చేసింది. 2021లో అఫ్గాన్‌లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తాలిబన్లు తాను గీసిన గీత దాటరని పాక్ కన్న కలలు కల్లలయ్యాయి. న్యూదిల్లీతో సత్సంబంధాలకు కాబుల్ ప్రాధాన్యమిస్తుండటంతో ఇస్లామాబాద్‌లో అసూయాద్వేషాలు ఎగదన్నుతున్నాయి. ఈ నేపథ్యంలో నోళ్లు తెరుచుకుంటున్న మారణాయుధాలు ప్రాంతీయ శాంతి సుస్థిరతలకు పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి!

నూట ముప్పైమూడేళ్ల క్రితం పాక్, అఫ్గాన్‌లను విభజిస్తూ 2600 కిలోమీటర్ల మేర బ్రిటిషర్లు సరిహద్దు గీత గీశారు. డ్యూరాండ్ రేఖగా పిలిచే అది తమ ప్రాంతాలను కుటుంబాలను నిలువునా చీల్చిందని స్థానిక పష్తూన్లు ఆనాటి నుంచి మండిపడుతున్నారు. అందుకే దాన్ని పాకిస్థాన్ గుర్తించినా, అఫ్గానిస్థాన్ మాత్రం ఒప్పుకోవట్లేదు. ఆ రేఖ వెంబడి పాక్ కంచె నిర్మించడం తాలిబన్లకు ఏమాత్రం రుచించట్లేదు. అది సరిహద్దుల్లో సాయుధ ఘర్షణలకు కారణమవుతోంది- పష్తూన్ గిరిజన ప్రాంతాల పాక్షిక స్వయంప్రతిపత్తిని తొలగించి ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లో విలీనం చేసిన ఇస్లామాబాద్‌ను అస్థిరపరిచేందుకు టీటీపీ ఎడతెగని దాడులకు పాల్పడుతోంది. ఉగ్రవాద నిర్మూలన నెపంతో సాధారణ ప్రజలపై పాక్ సైన్యం దారుణ దాష్టీకాలకు తెగబడుతోందనే కథనాలూ వెలువడుతున్నాయి. అది అఫ్గాన్లలో ఆగ్రహానికి కారణమవుతూ ఇస్లామాబాద్‌కు వారిని మరింత దూరంచేస్తోంది!

ఇండియా, అఫ్గాన్‌లతో ఒకేసారి యుద్ధం చేయగలనంటూ పాకిస్థాన్ బీరాలు పలుకుతోంది. కానీ, 2024-25లో అక్కడ పేదరికం 29శాతానికి, ఆర్థిక అసమానతలు దాదాపు 33శాతానికి పెరిగాయి. నిరుడు డిసెంబరు నాటికి పాక్ విదేశీమారక ద్రవ్య నిల్వలు పది బిలియన్ డాలర్ల కంటే దిగువకు పరిమితమైతే- వచ్చే నాలుగేళ్లలో దాయాది దేశం తిరిగి చెల్లించాల్సిన అప్పులు వంద బిలియన్ డాలర్లకు చేరాయి. సైనికంగా ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న అఫ్గానిస్థాన్ సైతం దీర్ఘకాల యుద్ధాన్ని తట్టుకునే పరిస్థితిలో లేదు. ఇటు పాక్‌ను చంకనెక్కించుకుని తిరుగుతున్న చైనా- అటు అఫ్గాన్ వనరులపైనా కన్నేసింది. ఆరేళ్ల నాడు అఫ్గానిస్థాన్‌ను సమస్యల సుడిగుండంలో వదిలేసి పోయిన అమెరికా స్వప్రయోజనాలకోసం మళ్లీ ఇక్కడ పావులు కదుపుతోంది. స్వీయ భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తూ, ఇండియా అనుక్షణం అప్రమత్తంగా ఉండక తప్పదు!



జీవితం ఎప్పుడు సుఖంగా సాగుతుందో ఎప్పుడు కష్టాలు ఎదురవుతాయో చెప్పలేం. మనం సర్దుకుపోయేదాన్ని బట్టే కష్టమైనా సుఖమైనా. గుర్తుపెట్టుకోవాల్సింది ఏంటంటే- మంచిది ఏది సాధించాలన్నా కష్టంగానే ఉంటుంది. చెడు చేయడం చాలా తేలిక.

– మొరార్జీ దేశాయ్

తప్పెవరిది?

సమాజంలో విలువలు పడిపోతున్నాయని తెగ బాధ పడిపోతాం. ఎదుటివాడు చేసే తప్పులను ఎత్తి చూపేటప్పుడు వచ్చే ఉద్రేకం, ఆవేశం మనం కానీ, మనవాళ్లు కానీ తప్పుచేసినప్పుడు రావు. పైగా వాటిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తాం. అవసరమైతే సమర్థిస్తాం కూడా. సమాజంలో విలువలు పడిపోవడానికి కారణం ఎవరో కాదు అందరమూ. కాబట్టి ఒక తప్పు జరిగిందంటే దానికి బాధ్యులెవరు? తప్పెవరిది? ఎవరికి శిక్ష పడాలి?

కర్తా కారయితా చైవ ప్రచారకశ్చ నిందితః
అనుమంతా చ పంచైతే పాపస్యాధికరిణః... అనే శ్లోకం తప్పు ఎవరిదో వివరంగా చెబుతుంది. తప్పు చేసేవాడు, తప్పు చేయడానికి ప్రేరేపించేవాడు, తప్పును మంచి అని ప్రచారం చేసేవాడు, తప్పు చేయడానికి అనుమతి ఇచ్చేవాడు, తప్పును సమర్థించేవాడు... ఈ అయిదుగురు పాపానికి, శిక్షకు పాత్రులని దానికి అర్థం.



దుర్యోధనుడు ద్రౌపదిని నిండు సభలోకి ఈడ్చుకు రమ్మని దుశ్శాసనుణ్ని ఆజ్ఞాపిస్తాడు. ఆమెనలా బలవంతంగా తీసుకొచ్చి వస్త్రాపహరణం చేస్తున్నా, తప్పుచేస్తే అడ్డుకుని దండించాల్సిన మహారాజుగా, తండ్రిగా ధృతరాష్ట్రుడు నోరు విప్పలేదు. గురువుగా ద్రోణాచార్యులు, న్యాయకోవిదుడైన భీష్ముడు, సభాసదులు ... ఎవరూ అది తప్పని చెప్పలేదు. దుర్యోధనుడు చెప్పగానే అది మంచిదా చెడ్డదా అని ఆలోచించకుండా ద్రౌపది పట్ల అమానుషంగా ప్రవర్తించిన దుశ్శాసనుడికి యుద్ధంలో ఘోరమైన చావే శిక్ష. తప్పు చేయించిన దుర్యోధనుడు రాజ్యాన్నే కాక తమ్ముళ్లందరినీ, అపరాధాన్ని అడ్డుకోని ధృతరాష్ట్రుడు కొడుకులందరినీ, ద్రోణాచార్యుడు తనను తానూ పోగొట్టుకున్నారు. కోరినప్పుడే చావు వచ్చేలా వరం పొందినా అంపశయ్యపై బాధననుభవించాడు భీష్ముడు. ఇలా అందరూ తప్పు చేయమని ప్రోత్సహించిన దుర్యోధనుడితో పాటు శిక్ష అనుభవించారు. రావణాసురుడు శూర్పణఖ మాటలు విని తను చేసేది తప్పని తెలిసీ సీతను అపహరించాడు. తప్పని చెప్పిన విభీషణుడు తప్ప రావణుడితోపాటు అతడికి ఎదురు చెప్పనివారంతా ఏమయ్యారో మనకు తెలుసు.

అంతర్యామి


ప్రస్తుత సమాజంలో నడివీధిలో ఒక వ్యక్తిని మరొకడు నరుకుతున్నా, ఆడబిడ్డలను వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. తనవాళ్లు కాదన్న నిర్లక్ష్యం, తమకేమైనా అవుతుందన్న భయం... అందుకు కారణం. ఇదే నేరాలు, ఘోరాలు పెరగడానికి ఊతమిస్తుంది. ఆర్థిక, అంగ, రాజకీయ బలాల ముందు చట్టాలు నీరుగారిపోతుండటంతో శిక్ష పడుతుందన్న భయం నేరస్థుల్లో పోయింది. తప్పు చేస్తే శిక్ష తప్పదన్న భయం ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

కొంతమంది అంటుంటారు... మనం ఒక్కరం నీతిగా ఉంటే సరిపోతుందా అని. సమాజం మారాలంటే అందరూ మారాల్సిన పనిలేదు. పై శ్లోకంలో చెప్పినట్లు చేయించేవాడైనా, చేసేవాడైనా, చూసేవాడైనా, సమర్థించే వాడైనా, అది మంచి అని ప్రచారం చేసేవాడైనా... వీరిలో ఏ ఇద్దరు ఎదురు తిరిగి నీతికి నిలబడినా చాలు... మొత్తం సమాజం మారితీరుతుంది. ఆ ఇద్దరిలో మనమొకరం కావాలి!

– శేషచంద్ర

సరైన కార్యాచరణతోనే శాస్త్రసాంకేతిక ప్రగతి!

సర్ సీవీ రామన్ 1928లో రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారతదేశానికి భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి సాధించారు. నాటి నుంచి ఇండియా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. నేడు శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణల్లో మేటిగా నిలుస్తోంది. పటిష్ఠ కార్యాచరణకు నిధులూ, నిపుణ మానవ వనరులూ తోడైతే వైజ్ఞానిక రంగంలో మన దేశం మరింతగా దూసుకుపోగలుగుతుంది.



విజ్ఞానశాస్త్రం స్థిరంగా, సూటిగా పురోగమించే స్థితి నుంచి అనూహ్యంగా సామర్థ్యాలను పెంచుకుంటూ, కొత్త ఆవిష్కరణలను వేగంగా అమలులోకి తెచ్చే దశకు చేరుకున్న తరుణంలో ఈ ఏడాది సైన్స్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఒకప్పుడు ప్రయోగశాలలకే పరిమితమైన సాంకేతికతలు నేడు సమాజాలను, ఆర్థిక వ్యవస్థలను, ప్రాదేశిక రాజకీయాలను మార్చేస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధన-అభివృద్ధికి పెట్టుబడులు పెంచుతూ, వ్యూహపరంగా స్వావలంబన సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది. కానీ, రాబోయే దశాబ్దంలో సమూల సంస్కరణలు చేపడితేనే ఆ కృషి ఆశించిన ఫలితాలను ఇస్తుంది.

అద్భుత ఆవిష్కరణలు

నేడు సైన్స్ నెమ్మదిగా వృద్ధి చెందే స్థితి నుంచి అమాంతం ఉన్నత శిఖరానికి లంఘించే స్థాయికి చేరుకుంది. 1969లో అపోలో 11 వ్యోమనౌకను చంద్రుడిపై దింపడానికి తోడ్పడిన కంప్యూటర్ల కన్నా నేడు సామాన్యులు సైతం వాడుతున్న స్మార్ట్‌ఫోనే ఎక్కువ ప్రాసెసింగ్ శక్తి కలిగి ఉండటం దీనికి నిదర్శనం. 2023-25 నాటికి కృత్రిమ మేధ(ఏఐ) కోడింగ్, కళాసృజన, ప్రాథమిక వైజ్ఞానిక ఆవిష్కరణలు చేయగల స్థితికి ఎదిగింది. బయోటెక్నాలజీ రంగంలోనూ అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయి. మానవ జన్యుపటాన్ని సీక్వెన్సింగ్ చేసే ఖర్చు బాగా తగ్గడంతో ప్రెసిషన్ (సునిశిత) వైద్యం, క్రిస్పర్ జన్యు ఎడిటింగ్, ఎంఆర్ఎన్ఏ వేదికలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. అవి కొవిడ్ కాలంలో కొత్త వ్యాక్సిన్లను రికార్డు సమయంలో అందించాయి. కొత్త మందుల ఆవిష్కరణ, మెటీరియల్ సైన్స్, క్రిప్టోగ్రఫీలో క్వాంటం కంప్యూటర్లు సంచలనాలకు బాటలు వేస్తున్నాయి. పునర్వినియోగార్హ రాకెట్లు అంతరిక్ష ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించాయి. ఫలితంగా అంతర్జాతీయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు, రియల్ టైమ్ భూపరిశీలనకు ఉపకరించే ఉపగ్రహాల సముదాయాన్ని తక్కువ ఖర్చులో రోదసిలోకి ప్రయోగించడం సులువైంది.

ఇప్పుడు కనిపిస్తున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల చక్రీయ వృద్ధికి మూడు కారణాలున్నాయి. అవి- భారీగా ఉత్పన్నమవుతున్న డేటా, చవగ్గా లభ్యమవుతున్న కంప్యూటింగ్ శక్తి, అల్గారిథమ్‌లలో నవీకరణలు. ఈ మూడింటికీ పరస్పర సంబంధం ఉండటంవల్ల వేగవంతమైన టూల్స్, సరికొత్త అప్లికేషన్ డొమైన్‌లు అందుబాటులోకి వచ్చాయి. రక్షణ రంగం ఏఐ సాయంతో గుంపుగా దాడిచేసే డ్రోన్ల దండు(స్వార్మ్) వైపు మారుతోంది. హైపర్‌సానిక్ ఆయుధాలకూ, ఎలక్ట్రానిక్ సమరానికీ మళ్లుతోంది. వ్యక్తికి తగ్గ చికిత్స చేసే రోజులు వస్తున్నాయి. వాతావరణ మోడలింగ్ ఏఐ, రియల్ టైమ్ ఉపగ్రహ డేటాతో ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టి హెచ్చరించగలుగుతున్నారు. కర్బన ఉద్గారాలను పరిహరించే పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతోంది. నేటి సంచలన ఆవిష్కరణలు వేగంగా రేపటి రోజువారీ వాడుక సాధనాలుగా మారుతున్నాయి. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ఈ తరహా అనూహ్య వృద్ధి సంభవిస్తోంది. హైపర్ సానిక్ గ్లైడ్ వాహనాలు, లేజర్ ఆయుధాలు, స్వయంచాలిత ఆయుధాలు, క్వాంటం కమ్యూనికేషన్లు శత్రువును భారత్ వైపు తేరిపార చూడలేని స్థితిని సృష్టిస్తున్నాయి. రక్షణ రంగానికి, పరిశోధన-అభివృద్ధికి ఎక్కువ నిధులు ప్రత్యేకించడం వల్లే ఈ విజయాలు సాధ్యపడుతున్నాయి. పౌర-సైనిక ప్రయోజనాలకు ఉపయోగపడే సాంకేతికతల వృద్ధికి భారత్ ప్రాధాన్యమిస్తోంది. ఈసారి బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు భారీగా దక్కాయి. వీటిలో రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) వాటా కూడా పెరిగింది. నేటి రక్షణ ఆర్‌అండ్‌డీ బడ్జెట్‌లో 25శాతాన్ని పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలకు కేటాయించారు. నవ కల్పనలు ప్రభుత్వ ప్రయోగశాలలకే పరిమితం కానక్కర్లేదనీ, వాటి పరిధిని విస్తరించాలనీ ప్రభుత్వం భావించడం వల్లే కేటాయింపులు పెంచుతున్నారు. ప్రభుత్వ పెట్టుబడులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆయుధ ఎగుమతులు పెరుగుతున్నాయి. రక్షణ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం క్రమంగా విస్తరిస్తోంది.

కేటాయింపులు పెరగాలి

భారత్ తన పరిశోధన అభివృద్ధి, శాస్త్రసాంకేతిక రంగాలను వచ్చే దశాబ్దంలో మరింత ఉద్ధృతంగా అభివృద్ధి చేయాలి. పరిశోధన, అభివృద్ధిపై చేసే వ్యయాన్ని 2035 కల్లా జీడీపీలో రెండు శాతానికి పెంచాలి. అందులో 60శాతం వాటాను ప్రైవేటు రంగానికి కేటాయించాలి. సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటర్లు, సింథటిక్ బయాలజీలలో ఆర్‌అండ్‌డీకి పన్ను ప్రోత్సాహకాలు పెంచాలి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ఆధ్వర్యంలో 20-30 ప్రాంతీయ నవీకరణ క్లస్టర్లను ఏర్పరచి, వాటిని రక్షణ ప్రయోగశాలలతో అనుసంధానించాలి. ఆవిష్కరణలు ఎలాంటి యాజమాన్య వివాదాలు లేకుండా ప్రయోగశాల నుంచి మార్కెట్‌కు వేగంగా చేరేలా మేధాహక్కుల చట్టాన్ని సరళీకరించాలి. మరోవైపు, నిపుణ మానవ వనరుల అభివృద్ధికి నిధులు పెంచాలి.

మహిళలకు ప్రత్యేక ఫెలోషిప్‌లు, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లు, ల్యాబ్‌లలో మహిళా అనుకూల మౌలిక సదుపాయాలను కల్పించడం అత్యవసరం. స్టెమ్ విద్యను విస్తరించి అత్యాధునిక శాస్త్రసాంకేతిక రంగాల్లో ఏటా పీహెచ్‌డీల సంఖ్యను పెంచాలి. విదేశాల్లోని భారత సంతతి పరిశోధకులు, విదేశీ పరిశోధకులను ఆకర్షించాలి. యువతకు అధునాతన టెక్నాలజీలలో శిక్షణ ఇవ్వాలి. క్వాంటం కంప్యూటింగ్, స్వదేశీ సెమీకండక్టర్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, మలితరం ఉపగ్రహాలు, రాకెట్లు, హైపర్ సానిక్‌లపై జాతీయ మిషన్లను ప్రారంభించాలి. అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించుకోవాలి. బలమైన మౌలిక సదుపాయాలు, డేటా పర్యావరణ వ్యవస్థలను నిర్మించాలి. ప్రతి స్థాయిలో శాస్త్రీయ దృక్పథాన్నీ నైతికతనూ పొందుపరచాలి. సైన్స్, సాంకేతికతలపై తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టాలి. రానున్న దశాబ్దంలో శాస్త్రసాంకేతిక ప్రగతి పరుగులు పెట్టనుంది. దాన్ని మనం అందుకుంటామా, వెనకబడిపోతామా అన్నది మనమే తేల్చుకోవాలి.



డాక్టర్ జి.సతీష్‌రెడ్డి
జాతీయ భద్రత సలహా మండలి సభ్యులు, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్

కష్టకాలంలో కాస్త ఓపిక వహిస్తే జీవితంలో పైకి ఎదగడం కష్టం కాదని నిరూపించడమే కాక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఓ మహిళ జీవితగాథ ఇది. ఒంటరి తల్లిగా కొడుకును పోషించుకోవడానికి పనిమనిషిగా జీవితాన్ని ప్రారంభించారామె. ఊహించని విధంగా లభించిన ప్రోత్సాహం ఆమెను ఖగోళ శాస్త్రవేత్తను చేసింది. ఆమె పేరు విలియమినా ఫ్లెమింగ్.

విలియమినా 1857 మే 15న స్కాట్లాండ్‌లో జన్మించారు. పేద కుటుంబం. చిన్న వయసులోనే తండ్రి మరణించారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పద్నాలుగేళ్లకే సహాయ ఉపాధ్యాయినిగా పనిచేయడం ప్రారంభించారు. ఇరవయ్యేళ్ల వయసులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జేమ్స్ ఫ్లెమింగ్‌తో వివాహమైంది.

పనిమనిషి నుంచి పరిశోధకురాలిగా...



భార్యాభర్తలిద్దరూ ఉపాధి వెతుక్కుంటూ అమెరికాకు వలస వెళ్లారు. అక్కడే కొడుకు పుట్టాడు. సరైన ఉద్యోగం దొరక్క, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కొన్నాళ్లకే జేమ్స్ భార్యాబిడ్డల్ని వదిలేసి వెళ్లిపోయాడు. చేసేది లేక బిడ్డను పోషించుకోవడానికి బోస్టన్‌లో ఒకరింట్లో పనిమనిషిగా చేరింది విలియమినా. ఆ ఇంటి యజమాని హార్వర్డ్ కాలేజీ అబ్జర్వేటరీ డైరెక్టర్ ఎడ్వర్డ్ చార్ల్స్ పికరింగ్.

విలియమినా చదువుకుందని, టీచర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్న సంగతి కుటుంబసభ్యుల ద్వారా పికరింగ్ దృష్టికి వచ్చింది. అప్పటికే కాలేజీలో తన సహాయక సిబ్బంది పనితీరు నచ్చక విసిగిపోయి ఉన్న పికరింగ్, విలియమినాకు తన దగ్గర పార్ట్ టైమ్ క్లర్కుగా పనిచేసే అవకాశాన్ని ఇచ్చారు. ప్రారంభంలో గణాంకాల నమోదు, రికార్డుల నిర్వహణ పనులు చెప్పారు. విలియమినా పనితీరు, ఆసక్తిని గమనించి కొద్దికాలంలోనే పూర్తిస్థాయి ఉద్యోగినిని చేయడమే కాక మరికొందరు మహిళలతో కలిపి ఏర్పాటుచేసిన 'హార్వర్డ్ కంప్యూటర్' అనే బృందంలో ఆమెను భాగస్వామిని చేశారు పికరింగ్. ఆ బృందంతో కలిసి పనిచేస్తూ నక్షత్రాలను ఎలా పరిశీలించాలి, ఏయే వివరాలు నమోదు చేయాలి.. అనే విషయాలపై కొద్దికాలంలోనే ఆమె పట్టు సాధించారు. పికరింగ్ మార్గదర్శకత్వంలో స్వభావం ఆధారంగా నక్షత్రాల వర్గీకరణను విజయవంతంగా చేశారు. దీన్ని పికరింగ్- ఫ్లెమింగ్ వర్గీకరణ అని పిలుస్తున్నారు. ఆధునిక నక్షత్రాల వర్గీకరణకు ఈ విధానమే పునాది. తన జీవితకాలంలో సుమారు పదివేల నక్షత్రాలను వర్గీకరించారు విలియమినా. ఆమె ఆవిష్కరణల్లో అత్యంత కీలమైనదిగా హార్స్ హెడ్ నెబ్యులాను పేర్కొంటారు.

పనిని ఇష్టపడి, అంకితభావంతో చేస్తున్న విలియమినాను 1898లో హార్వర్డ్‌లో ఖగోళ ఫొటోల క్యూరేటర్‌గా నియమించారు. ఆ పదవికి ఎంపికైన తొలిమహిళ ఆమే. రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీలో గౌరవ సభ్యురాలిగానూ ఎంపికై, ఆ గౌరవం అందుకున్న తొలి అమెరికా వనిత అయ్యారు. పలు అవార్డులు, గౌరవాలు పొందిన విలియమినా పేరును చంద్రుడిపై ఓ బిలానికి, ఓ గ్రహ శకలానికి పెట్టడం విశేషం. పరిశోధనలు కొనసాగిస్తూనే న్యుమోనియా కారణంగా 54 ఏళ్ల వయసులో చనిపోయారు విలియమినా. నక్షత్రాల ఏర్పాటు, గెలాక్సీల నిర్మాణాలను అర్థం చేసుకోవడానికి ఆమె ఆవిష్కరణలు ఎంతగానో తోడ్పడ్డాయి. ఖగోళ ఫొటోగ్రఫీ, డేటా విశ్లేషణలో సరికొత్త శకానికి ఆమె నాంది పలికారు. లింగవివక్షను అధిగమించి, ఖగోళశాస్త్రంలో మహిళలు పనిచేయడానికి దారి చూపిన వ్యక్తిగా విలియమినాను ప్రపంచం గుర్తించింది.

– మధుసూదన్‌రెడ్డి శానాల

చిన్నారులకు ప్రాణగండం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం దూసుకుపోతున్నా అభివృద్ధిలో అసమానతల వల్ల చిన్నారుల మరణాలు ఆగట్లేదు. ప్రపంచవ్యాప్తంగా 2023లో 3.7 శాతం చిన్నారులు అయిదేళ్లు నిండకుండానే కడతేరిపోయారు. మలేరియా, న్యుమోనియా వంటి వ్యాధుల విజృంభణకు తోడు పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు, పారిశుద్ధ్య వసతుల లేమి వల్ల ఆఫ్రికా దేశాల్లో ప్రతి పది మంది పసికందుల్లో ఒకరు అయిదో పుట్టినరోజు చూడలేదు. 2023లో ఆయా దేశాల్లో అర్ధాంతరంగా అసువులు బాసిన చిన్నారుల సంఖ్య... (శాతాల్లో)

నైజర్	11.5
నైజీరియా	10.5
సోమాలియా	10.4
చాద్	10.1
దక్షిణ సూడాన్	9.9
గినియా	9.5
సియెర్రా లియోన్	9.4
సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్	9.2
మాలి	9.1

(ఆధారం: యూఎన్ ఐజీఎంఈ నివేదిక-2025)

అవినీతి తగ్గిపోయిందట!

'ఏవరు స్వామీ తమరు నాముందు ప్రత్యక్షమయ్యారు, ఏం కావాలి?'

'నీకే ఏదైనా వరం ఇచ్చేందుకు వచ్చాను'

'నేనేదో మామూలు ఆటో డ్రైవర్‌ను, నాకు వరాలెందుకు స్వామీ'

'నీ ఆటోలో దొరికిన బంగారు నగల సంచీని సొంతదారులకు చేర్చావు చూడూ, నీ నిజాయతీకి మెచ్చి వచ్చాను!'

'దేశంలో అవినీతి తగ్గిందట, అదేదో ఇండెక్స్‌లో మన ర్యాంకూ పైకొచ్చిందట! మరి, నేను కూడా నిజాయతీగా ఉండాలి కదా'

'అదంతా, నిజమే!'

'నిజంగానే నిజం స్వామీ!'

'అయితే పుట్టుక నుంచి చావుదాకా మనిషికి అవసరమైన కొన్ని పత్రాలను తీసుకురా! ఎక్కడా లంచం ఇవ్వద్దు, అదే షరతు!'

'అవినీతి తగ్గాక, లంచంతో పనేముంది స్వామీ'

'మాటలెందుకు, ముందు పని చూడు'

★ ★ ★

'సార్, మా అబ్బాయి బర్త్ సర్టిఫికెట్‌లో కరెక్షన్ చేయాలి'

'కరెక్షన్‌కు ఆధారంగా పత్రాలేమున్నాయి?'

'పిల్లాడికి బర్త్ సర్టిఫికెటే తొలి పత్రం, అంతకన్నా ముందు ఆధారాలంటే, పూర్వజన్మలోకి వెళ్లాల్సిందే సార్'

'ఆ పంచులన్నీ పక్కింటోళ్లతో రీల్స్‌లో వేసుకో, ఆధారం ఉంటే చూపించు, లేకపోతే బయల్దేరు'

'పనయ్యే మార్గమే లేదా సార్'

'రెండువేలు కొడితే మార్గం, రోడ్డు, రహదారి అన్నీ కనిపిస్తాయి. ఇదీ పంచంటే, అదుర్స్ కదూ!'

★ ★ ★

'ఏయ్ ఆటో ఆపు, కాగితాలన్నీ చూపించు'

'ఆర్సీ, లైసెన్సూ, ఇన్సూరెన్సూ, పొల్యూషనూ, బండి రెన్యువలూ, ఖాకీచొక్కా.. అన్నీ ఉన్నాయి సార్'

'డ్రంకెన్ డ్రైవింగ్ సంగతేంటి?'

'మిషిన్ పగిలేలా ఊదుతా, చెక్ చేసుకోండి'

'నంబర్‌ప్లేట్ సరిగ్గా కనిపించడం లేదు'

'రోడ్లన్నీ గుంతలే.. పడితే బురదలే...'

'ప్రశ్నకు పాట సమాధానం కాదు'

'గుంతలో పడితే, బురద పడిందని 'షార్ట్'గా చెబుతున్నా, తుడిచేద్దాం సార్'

'ఇది నోపార్కింగ్ ప్లేస్, ఇక్కడెందుకు ఆపావ్'

'నేనెక్కడ ఆపాను, మీరే చెకింగంటూ ఆపారు'

'ఇప్పుడు బండి ఆగి ఉందా లేదా?'

'మీరు ఆపితేనే ఆగింది కదా'

'ఆగినచోట నోపార్కింగ్ బోర్డు ఉంది కదా, ఫైన్ తీయ్'

'వసూళ్ల వేటకు డిసైడయ్యాక, కాటు తప్పదనుకుంటా!'

'చలానా ఆన్‌లైన్‌లో కట్టుకో, ఇప్పుడు వెయ్యి కొట్టు'

'ఇది డబ్బుల్ ధమాకా సార్'

★ ★ ★



'సార్, నా రేషన్ కార్డు సంగతేమైంది'

'నువ్వు పేదరిక రేఖ పైకి ఎక్కేశావు కదయ్యా'

'ఆటోవాణ్ని జంక్షన్‌లో స్టాప్‌లైన్‌నే ఎక్కను, పేదరిక రేఖ పైకెప్పుడు ఎక్కాను సార్'

'పేదోడివని ప్రూఫు తెచ్చుకో'

'రోజంతా రోడ్డు మీద తిరిగే నా బతుకే ఒక పెద్ద ప్రూఫ్ సార్'

'ఆ మాట పత్రాలు చెప్పాలి. పత్రాలుంటేనే పనవుతుంది'

'మరెలా?'

'కాగితాలతోనే పనవుతుందంటే అర్థం కావడం లేదా?'

'ఏం కష్టం చేశారని ఇచ్చుకోవాలి సార్'

'ప్రజలకోసం చెమటోడ్చి కష్టపడితే, ముష్టి నాలుగు రాళ్లు తప్ప మాకేం వస్తుంది. ఇంతగా కష్టపడుతున్నప్పుడు ఇల్లయినా కాస్త సౌకర్యంగా ఉండాలా, ఇల్లంటే కనీసం కోటి పెట్టి కట్టాలా, హాయిగా పనిచేయాలంటే కారులో రావాలా... ఇలాంటి చిల్లర ఖర్చులన్నీ మీరే పెట్టుకోవాలి. ఏదో ఫ్రెండ్‌కు టీ తాగిచ్చామనుకోవాలంతే!'

'మీ టీ ఖర్చులు చాలా కాస్ట్‌లీ సార్'

'కొన్ని విలువలంతే, అన్నీ లెక్కలకు అందవు'

★ ★ ★

'సార్, మా నాన్న డెత్ సర్టిఫికెట్ కావాలి'

'చచ్చిపోయాడు అనేందుకు ఆధారాలున్నాయా?'

'మనిషిగా గుర్తించే ఆధార్ కార్డు, తన జీవితాన్ని ఒక్కరైనా బాగు చెయ్యకపోతారా అన్న ఆశతో బతికున్నంత కాలం ఓట్లేసిన ఓటరు కార్డు, చచ్చిపోయినట్లు చెప్పే ఆస్పత్రి రికార్డు, అంత్యక్రియలు జరిపించినట్లు శ్మశాన పత్రం.. అన్నీ ఉన్నాయి సార్'

'అదేంటయ్యా, ఆస్పత్రి రికార్డులో 'బ్రాట్ డెడ్' అనీ, శ్మశానంలో ఇచ్చిన కాగితంలో 'నేచురల్ డెత్' అనీ ఉంది, ఇలాగైతే కష్టం'

'మరెలాగైతే ఈజీ సార్'

'వచ్చిన మనిషి ఏమీ తీసుకుపోడు, వదిలేసిన దాంట్లో కొంచెం పంచాలంతే!'

'లంచాల దెబ్బకి చావు కూడా తప్పించుకోలేదన్న మాట!'

★ ★ ★

'స్వామీ, నా వల్ల కాలేదు, డబ్బుల్లేకుండా ఒక్కపనీ అవ్వలేదు, మన్నించండి... ఎక్కడో ఉంటారనుకుంటా కొందరు నిజాయతీపరులు. నాకందరూ మేత మహానుభావులే తగిలారు'

'ఇప్పుడు కూడు గూడుతో పాటు అవినీతి కూడా కనీస అవసరమైందయ్యా చాలా మందికి. ఆకలి, అవినీతి రెండూ వాళ్లకి ప్రకృతి సహజాలు. పదోపరకో పుచ్చుకుంటే మామూళ్లు అంటారు. పనిచేసిపెడితే ఇచ్చేవి టీ ఖర్చులు. సాయం చేస్తే బీరుబిర్యానీ పార్టీ. ఆర్థిక ప్రయోజనాలుంటే కమీషన్లు. ఏదీ, ఎక్కడా లంచాలనే పేరే లేదే! ఇప్పుడన్నీ పేమెంట్లే! మారిన లెక్కల్లో అవినీతి చిక్కిపోయినట్లు కనిపిస్తుందన్నమాట!'

'అయితే, అవినీతి తగ్గిందన్న రేటింగ్‌లనూ అనుమానించాలంటారా స్వామీ?'

'మారుతున్న కాలానికి మారాల్సిన ఆలోచనలంటే ఇవే! కాన్సెప్టులు చూడగానే అన్ని కంటెంట్లనూ నమ్మొద్దంతే!'

– శ్రీనివాస్ దరెగోని

బంగారు కత్తి

రామాపురంలో కాంతయ్య అనే పెద్ద వ్యాపారి ఉండేవాడు. ఎప్పుడూ తాను డబ్బున్న వాడిననే గర్వం చూపించేవాడు. ఎవరితోనూ సరిగ్గా కలిసేవాడు కాదు. ఊళ్లో ఎవరైనా కొత్తగా ఏదైనా వ్యాపారం పెడితే కాంతయ్యకు అస్సలు నచ్చేది కాదు. ఏదో ఒకటి చేసి దాన్ని మూయించేవాడు. ఆ ఊరి వాళ్లంతా ప్రతి ఏడాది వన భోజనాలకు వెళ్తుంటారు. ఆ ఏడాది కూడా ఎప్పటిలాగే వెళ్లారు. అన్ని కుటుంబాల వాళ్లు అక్కడే రకరకాల వంటలు చేసుకుని తింటారు. అందరితో పాటు కాంతయ్య కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనానికి వెళ్లాడు. అక్కడ కూడా తన గొప్పదనం చూపించుకోవాలి అనుకున్నాడు. అందుకే ఇంట్లో వాళ్లు ఎంత చెప్పినా వినకుండా కూరగాయలు తరగడానికి సాధారణ కత్తి కాకుండా



మేలిమి బంగారంతో చేసిన దాన్ని తీసుకెళ్లాడు. అందరూ కాసేపు రకరకాల ఆటలు ఆడుకుని ఎవరి వంటలు వాళ్లు చేసుకుంటున్నారు. కొంతమంది వంట కూడా పూర్తయి తినడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ కాంతయ్య కుటుంబానిది ఇంకా కూరగాయలు తరగడం కూడా అవ్వలేదు.

బంగారు కత్తి చూడటానికి బాగుంటుంది కానీ ఇలాంటి వాటికి పనికి రాదు కదా మరి! దాంతో వారి చుట్టుపక్కల ఉన్న వాళ్లు తమ ఆహారం వీళ్లకూ వడ్డించారు. అప్పుడు కాంతయ్య.. 'నా దగ్గర డబ్బు ఎక్కువగా ఉందని గర్వంగా బంగారు కత్తిని చేయించి తీసుకొచ్చాను. అసలు దానికి ఇక్కడ విలువే లేదు. కూరగాయలు తరగడానికి కావాల్సింది మామూలు కత్తి. ఏది ఎక్కడ వాడాలో దాన్ని అక్కడే వాడాలి. అనవసరమైన చోట కూడా గొప్పలకు పోతే చివరికి నష్టమే తప్ప లాభం లేదు' అని అనుకున్నాడు. అప్పటి నుంచి డబ్బు ఉందనే గర్వాన్ని వదిలేసి అందరితో కలిసిమెలిసి ఉండటానికి ప్రయత్నించసాగాడు.

– లైశెట్టి కుమార్

నేనెవర్ని?

1. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'వెల'లో ఉంటాను కానీ 'కల'లో లేను. 'నూలు'లో ఉంటాను కానీ 'నూరు'లో లేను. 'గురువు'లో ఉంటాను కానీ 'చెరువు'లో లేను. ఇంతకీ నేనెవర్ని?
2. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'ఆట'లో ఉంటాను కానీ 'వేట'లో లేను. 'చలి'లో ఉంటాను కానీ 'పులి'లో లేను. 'రమ'లో ఉంటాను కానీ 'జామ'లో లేను. 'వీణ'లో ఉంటాను కానీ 'వీధి'లో లేను. నేనెవర్ని?

జవాబు: 1.వెలుగు 2.ఆచరణ

(c) eenadu

రూ.లక్ష కోట్లతో ఉద్యాన హబ్

(మొదటి పేజీ తరువాయి)

నాలెడ్జి అందిపుచ్చుకుంటున్నాం. ప్రతి రైతుకు ఏఐ అగ్రానమిస్ట్ సహకారం అందించేలా చర్యలు తీసుకుంటాం.



ఉచిత విద్యుత్తుకు రూ.13,722 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు పనిచేస్తున్నాయి. ఈ ఏడాది 69 వేల కనెక్షన్లు అదనంగా ఇచ్చాం. 2026-27లో ఉచిత విద్యుత్తుకు రూ.13,722 కోట్లు కేటాయించాం. పంటలకు 1,250 టన్నుల సూక్ష్మపోషకాలు సరఫరా చేశాం. 47 లక్షల మందికి పెట్టుబడి రాయితీగా రూ.310 కోట్లు ఇచ్చాం. ధాన్యం రైతులకు 24 గంటల్లోపే డబ్బు జమ చేస్తున్నాం. రికార్డు స్థాయిలో రూ.10,876 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు చెల్లించాం.

2029 నాటికి 50 లక్షల ఎకరాలకు ప్రకృతి సేద్యం

రాష్ట్రవ్యాప్తంగా 8,168 గ్రామాల్లో 17.77 లక్షల ఎకరాల్లో 15 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. 2029 నాటికి 50 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం విస్తరించేలా కార్యక్రమం చేపట్టాం. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆహారశుద్ధి రంగంలో రూ.14,232 కోట్ల పెట్టుబడులొచ్చాయి. పెద్దఎత్తున ఉపాధి వస్తుంది.

అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఆక్వా హబ్‌గా ఏపీ

ఆక్వాలో దేశంలోనే మనం నంబర్ 1. ఎగుమతుల్లో మన రాష్ట్ర వాటా 34%. ఈ ఏడాది 17% వృద్ధి నమోదైంది. ఆక్వా జోన్ పెద్దఎత్తున అభివృద్ధి చేస్తాం. యూనిట్ విద్యుత్తు రూ.1.50 చొప్పున ఇచ్చి ఆక్వా రంగాన్ని పునరుద్ధరించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. దేశంలోని చేపల ఉత్పత్తిలో 29%, రొయ్యల ఉత్పత్తిలో 75% ఏపీలోనే ఉంది. అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఏపీ ఆక్వాకల్చర్ హబ్‌గా మారనుంది.

జాతీయ వృద్ధిరేటు కంటే మనదే ఎక్కువ

దేశంలో వ్యవసాయ వృద్ధి రేటు 0.39% కాగా మన రాష్ట్రంలో 7.83% ఉంది. జీడీపీలో వ్యవసాయ పరంగా 10% వాటా కలిగిన ఏకైక రాష్ట్రం మనదే. వైకాపా ఐదేళ్ల పాలనలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. వారికి అండగా నిలిచేలా విభిన్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్వర్ణాంధ్ర పది సూత్రాల్లో అగ్రిటెక్ ఒకటి. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, టెక్నాలజీ, ప్రభుత్వ మద్దతు ద్వారా రైతుల్ని ముందుకు తీసుకెళుతున్నాం.

వైకాపా పాలనలోనే ఎక్కువగా రైతు ఆత్మహత్యలు

వైకాపా పాలనలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగాయి. మృతుల కుటుంబాలకు కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.5.67 కోట్ల బకాయిలు చెల్లించాం. రైతులు అధైర్యపడొద్దు. అండగా ఉంటాం. ఎక్కడైనా ఆత్మహత్య చేసుకుంటే ఏ కారణంతో చేసుకున్నారో అధ్యయనం చేయిస్తున్నాం.

అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద రాష్ట్ర వాటా రూ.14 వేలు, కేంద్ర వాటా రూ.6 వేలు కలిపి రూ.20 వేలు ఇస్తున్నాం. వైకాపా హయాంలో ఇచ్చింది రూ.7,500 మాత్రమే. చెప్పినదాని కంటే తక్కువ ఇవ్వడమే కాక ఇతర పథకాల్లో కోత పెట్టారు. మత్స్యకారుల సేవలో పథకం కింద రూ.20 వేల చొప్పున రూ.242 కోట్లు అందించాం.

115 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదాతో రూ.95 కోట్ల పొదుపు

✦ అన్నమయ్య జిల్లాలో 2024 నవంబరులో నీటిమట్టం 12.97 మీటర్లు ఉంటే ఇప్పుడది 6.67 మీటర్లకు చేరింది. సమర్థ నీటినిర్వహణ ద్వారా 6.3 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. చరిత్ర సృష్టించిన పాలనాయంత్రాంగాన్ని అభినందిస్తున్నా. ✦ 2024లో 336 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తే 2025లో 221 మిలియన్ యూనిట్లకు వాడకం తగ్గింది. ఈ 115 మిలియన్ యూనిట్ల ఆదాతో రూ.95 కోట్లు పొదుపు చేశాం. ✦ ఇదే సమయంలో ఉద్యానపంటల సాగు 20 వేల హెక్టార్లు పెరిగింది. రూ.1,634 కోట్ల విలువైన పంట ఉత్పత్తి అధికంగా వచ్చింది. ✦ సమర్థ పనితీరుతో వచ్చే ఫలితాలకు ఇదొక ఉదాహరణ.

కేజ్రీవాల్, కవితకు క్లీన్‌చిట్

(మొదటి పేజీ తరువాయి)

సంబరాలు చేసుకున్నారు.

దిల్లీ మద్యం విధాన రూపకల్పనలో ఎలాంటి కుట్ర, నేరం లేదని ప్రత్యేక జడ్జి జితేంద్ర తన 598 పేజీల తీర్పులో పేర్కొన్నారు. అభియోగాలను నిరూపించే సాక్ష్యాలను సమర్పించడంలో సీబీఐ విఫలమైందని తెలిపారు. నిందితులపై ప్రాథమిక కేసులు నమోదు చేయలేదని, సీబీఐ అభియోగపత్రంలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. సాక్షుల వాంగ్మూలాలతో అభియోగాలు సరిపోవడం లేదన్నారు. సాక్షిగా ఉన్న ఒక వ్యక్తి మాటల్లో కేజ్రీవాల్ పేరు ప్రస్తావనకు రావడంతో దాని ఆధారంగానే అప్పటి దిల్లీ ముఖ్యమంత్రిపై కేసు పెట్టారని ఆక్షేపించారు. ఈ కేసులో 'సౌత్ గ్రూప్' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.


✦ కొందరికి ప్రయోజనం చేకూర్చేలా మద్యం విధానాన్ని మార్చారనేది ప్రధాన ఆరోపణ. అయితే, ఈ పాలసీ.. చట్టబద్ధమైన చర్చలు, సంప్రదింపులతో పాటు సంబంధిత సంస్థల ఆమోదంతోనే రూపొందిందని న్యాయస్థానం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ సలహాలను తీసుకోవాల్సిన చట్టపరమైన అవసరం లేకున్నా దానిని కూడా పాటించారని తెలిపింది.

✦ మద్యం కేసులో అవినీతికి పాల్పడడం ద్వారా సమకూరిన డబ్బును నిందితులు గోవా అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించారన్న ఆరోపణ సీబీఐ తన వాదనలను సమర్థించుకోవడానికి చేసిన యత్నంగా కోర్టు అభిప్రాయపడింది.

✦ లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని సీబీఐపై మండిపడింది. నిందితులను దీర్ఘకాలం జైలులో ఉంచడం వారి స్వేచ్ఛను హరించిందని అభిప్రాయపడింది.

సీబీఐ అధికారిపై దర్యాప్తునకు ఆదేశం

సరైన ఆధారాలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగిని మద్యం కేసులో ఇరికించిన సీబీఐ అధికారిపై సంస్థాగతమైన చర్యలు తీసుకోవాలని జడ్జి జితేందర్ సింగ్ ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ సింగ్‌ను ప్రథమ నిందితుడి(ఎ1)గా చేర్చడాన్ని ఆక్షేపిస్తూ ఈ వ్యాఖ్య చేశారు. అందుకు బాధ్యుడైన సీబీఐ అధికారిపై దర్యాప్తు జరపాలన్నారు. దర్యాప్తు సంస్థ విశ్వసనీయతను పరిరక్షించడానికి ఈ చర్య అవసరమని అభిప్రాయపడ్డారు.



మనీశ్ సిసోదియా

కేసు నుంచి వీరందరికీ విముక్తి..

ట్రయల్ కోర్టు తీర్పుతో దిల్లీ మద్యం కేసు నుంచి విముక్తి లభించిన నిందితులు(ఎ1-ఎ23)... కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రు, మనీశ్ సిసోదియా, అమన్‌దీప్ సింగ్ ధాల్, అర్జున్ పాండే, బుచ్చిబాబు గోరంట్ల, రాజేశ్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చన్‌ప్రీత్ సింగ్ రాయత్, కవిత కల్వకుంట్ల, అరవింద్ కేజ్రీవాల్, దుర్గేశ్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశీష్ చంద్ మాథుర్, శరత్ చంద్రారెడ్డి.

కన్నీరు పెట్టిన కేజ్రీవాల్

తీర్పు అనంతరం కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భావోద్వేగంతో కన్నీటిపర్యంతమయ్యారు. రాజకీయ కుట్రతోనే ఐదుగురు ఆప్ నేతలను జైలులో పెట్టారని ఆరోపించారు.

మనీలాండరింగ్ కేసు ఏమవుతుంది?

కేజ్రీవాల్ తదితరులపై సీబీఐ నమోదు చేసిన అవినీతి కేసును కోర్టు కొట్టివేసినందున దానికి అనుబంధంగా ఉన్న ఈడీ (మనీలాండరింగ్) కేసు కూడా రద్దవుతుందని ఆప్ నేత తరఫు న్యాయవాది ఒకరు తెలిపారు. అయితే, ప్రధాన కేసు ఫలితంతో సంబంధం లేకుండా మనీలాండరింగ్‌ను ప్రత్యేక కేసుగానే పరిగణించాలని ఈడీ కోరుతోంది.



సాక్ష్యాల్లేని ఆరోపణలను అనుమతించలేం: దిల్లీ కోర్టు

దిల్లీ: దర్యాప్తు సంస్థ మోపిన అభియోగాలకు బలమైన సాక్ష్యాలు ఉండాల్సిందేనని కల్వకుంట్ల కవితను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ జిల్లా కోర్టు ప్రత్యేక జడ్జి జితేంద్ర సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సాక్ష్యాధారాలను సమర్పించడానికి బదులుగా తమవైన కథనాలతో సరిపుచ్చడాన్ని అనుమతించలేమని తెలిపారు. అప్పటి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో కవిత కుమ్మక్కయ్యారని అనడానికి సీబీఐకి ఉన్న ఏకైక ఆధారం మాగుంట శ్రీనివాసులు రెడ్డి వాంగ్మూలం మాత్రమేనని జడ్జి పేర్కొన్నారు. 'తాను కేజ్రీవాల్‌ను కలిసినప్పుడు కవిత ఫోన్ చేస్తారని ఆయన చెప్పారన్న శ్రీనివాసులు రెడ్డి వాంగ్మూలం మినహా మరే ఆధారాలను సీబీఐ చూపలేదన్నారు. కేవలం మధ్యవర్తుల ద్వారా మద్యం కుంభకోణానికి ప్రధాన సూత్రధారులుగా అయ్యారంటూ చిత్రీకరించారని ఆక్షేపించారు. రూ.100 కోట్ల నగదును ముందస్తుగా సమకూర్చడానికి సంబంధించి వ్యక్తుల మధ్య సంభాషణలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుమారుడు రాఘవ్ మాగుంట వాంగ్మూలాలను సీబీఐ ప్రవేశపెట్టినప్పటికీ అవన్నీ సందేహాస్పదంగానే ఉన్నాయని, దర్యాప్తు సంస్థ ఆరోపణలకు బలం చేకూర్చలేకపోయాయని జడ్జి అభిప్రాయపడ్డారు. మరో నిందితుడు శరత్ చంద్రారెడ్డికి అనుకూలంగా వ్యవహరించడం ద్వారా కవిత భూలావాదేవీ తదితరాల్లో అనుచిత లబ్ధిపొందారన్న ఆరోపణలను న్యాయస్థానం తోసిపుచ్చింది.

భారాస రాజకీయంగా నష్టపోయింది.. కవితకు న్యాయం జరిగింది: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: దిల్లీ మద్యం కేసుతో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా నష్టపోయింది మాత్రం భారాస పార్టీయేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కవితకు కోర్టులో ఈ రోజు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. దిల్లీ మద్యం కేసుపై కోర్టు తీర్పు నేపథ్యంలో.. శుక్రవారం 'ఎక్స్'లో కేటీఆర్ స్పందించారు. రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రత్యర్థులను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అల్లిన కుట్రలు ఒక్కొక్కటిగా వీగిపోతుండటం హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు.

భారాస ఓటమికి కారణం అహంకారం కాదా?: కవిత

"కోర్టు తీర్పుపై కేటీఆర్ అన్న చేసిన వ్యాఖ్యలు చూశాను. లిక్కర్ కేసు కారణంగానే భారాస ఓడిపోయినట్లు రాశారు. పార్టీ ఓడిపోవడానికి నేనా కారణం? రెండు పడక గదుల ఇళ్లు, ఉద్యోగాలివ్వకపోవడం వంటి వాటితో పాటు.. దోపిడీదారులకు టికెట్లు ఇవ్వద్దని ఎంత మొత్తుకున్నా వాళ్లనే ప్రజలపై రుద్దాలనే ప్రయత్నం.. ఇవన్నీ ఓటమికి కారణం కాదా? ముఖ్యంగా.. అహంకారం అనే అంశం కాదా చర్చలో ఉన్నది? ఈ రోజు వచ్చిన తీర్పును మీకు అనుగుణంగా మలుచుకొని, భారాస ఓటమిని నా మెడలో వేయాలనే తాపత్రయం ఎందుకు? మూడేళ్లుగా ఈ కేసులో పార్టీ నాకు ఎందుకు సహకరించలేదు? ఇప్పటికైనా కేటీఆర్ వాస్తవాలు అంగీకరించాలి. భారాస ఎందుకు ఓడిపోయిందో నిజాయతీగా ఆలోచించుకోవాలి" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు.

రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం

(మొదటి పేజీ తరువాయి)

పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇందులో ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టనున్నారు. తొలిదశలో ఏడాదికి 30వేల టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ పనిచేస్తుంది.

స్థానికులకు జపాన్‌లో శిక్షణ

ఇక్కడి ఉద్యోగాల్లో స్థానిక యువతకే ఎక్కువ అవకాశం ఇస్తామని సీఈఓ సీన్ ఎం. స్టాక్ చెప్పారు. తమ అవసరాలకు తగ్గట్టు ఉద్యోగులను ఎంపిక చేసి వారికి జపాన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. "మేం తొలి ఎలక్ట్రిక్ స్టీల్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టబోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ఏర్పాటుకు కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది. వ్యాపారం చేయడానికి అనువైన వాతావరణం అక్కడుంది. ఈ ప్లాంట్ తక్కువ విద్యుత్తు వినియోగంతో సాగుతుంది. ప్రస్తుతం భారత్ ఏటా 22-26వేల టన్నుల ఎలక్ట్రిక్ స్టీల్ దిగుమతి చేసుకుంటోంది. మా ప్లాంట్‌లో తొలిదశలో 30వేల టన్నులు ఉత్పత్తి చేస్తాం. కాబట్టి దిగుమతులు తగ్గుతాయి. భారతదేశ ఆర్థిక పురోగతిని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఇదే మంచి సమయం అని నిర్ణయించి ఏపీలో ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నాం. తొలిదశలో 77-80 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నా, తర్వాత 150-160 మిలియన్ డాలర్లకు తీసుకెళ్తాం. ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా రెట్టింపు చేస్తాం. తొలి దశలో 200 మందికి, మలిదశలో 500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్లాంట్‌లో స్టీల్ ఉత్పత్తికి మేం బొగ్గు వినియోగించం. అంతా విద్యుత్తు ఫర్నేస్ ద్వారానే జరుగుతుంది. ఇనుప ఖనిజాన్ని స్థానిక ఉత్పత్తిదారుల నుంచే సేకరిస్తాం" అని ఆయన వెల్లడించారు.

అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఆక్వా హబ్‌గా ఏపీ

ఆక్వాలో దేశంలోనే మనం నంబర్ 1. ఎగుమతుల్లో మన రాష్ట్ర వాటా 34%. ఈ ఏడాది 17% వృద్ధి నమోదైంది. ఆక్వా జోన్ పెద్దఎత్తున అభివృద్ధి చేస్తాం. యూనిట్ విద్యుత్తు రూ.1.50 చొప్పున ఇచ్చి ఆక్వా రంగాన్ని పునరుద్ధరించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. దేశంలోని చేపల ఉత్పత్తిలో 29%, రొయ్యల ఉత్పత్తిలో 75% ఏపీలోనే ఉంది. అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఏపీ ఆక్వాకల్చర్ హబ్‌గా మారనుంది.

తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరు

- వైకాపా హయాంలో ఇళ్ల స్థలాల సేకరణలో, ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిపై ఇప్పటికే విచారణ
- ఉగాదికి 3లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు
- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్ల స్థలాలకు భూ సేకరణ, ఇంటి నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని, చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, ఎవరూ తప్పించుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అప్పట్లో ఇసుక విధానాన్ని దుర్వినియోగం చేశారని, దీనిపై కూడా విచారణ జరుగుతోందని, తప్పు చేసిన వారిపై చర్యలుంటాయని తెలిపారు. గృహనిర్మాణశాఖ బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాం. ఉగాదికి రెండు రోజుల ముందు మరో 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం. జూన్ నాటికి 2.50 లక్షలు, సెప్టెంబరు నాటికి 2.10 లక్షలు పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహిస్తాం. ఇప్పటికే సొంతింటి కోసం 7 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలి. అర్హులందరికీ ఇళ్లు నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది' అని వివరించారు.

స్థలాల లభ్యత లేని చోట జీ+2 తరహాలో నిర్మాణం

2029 నాటికి అర్హులందరికీ ఇళ్ల స్థలాలిస్తాం. అర్హుల ఎంపిక ప్రారంభించాం. 2.20 లక్ష మందికి ఇంటి స్థలాలు లేనట్లు దరఖాస్తు చేసుకున్నాం. వారందరికీ అందిస్తాం. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్లు ఇస్తాం. స్థలాల లభ్యత లేని చోట జీ+2 తరహాలో నిర్మాణాలు చేపడతాం' అని పేర్కొన్నారు.

త్వరలోనే రూ.913 కోట్లు విడుదల

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణం చేపట్టారనే కక్షతో వైకాపా ప్రభుత్వం 2.70 లక్షల మందికి సంబంధించి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు రూ.913 కోట్లు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. త్వరలోనే వారికి సాయం చేస్తాం' అని సీఎం వివరించారు.

హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి!

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ లిసా గిల్‌ను సీజేగా ప్రతిపాదిస్తు సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆమె పంజాబ్-హరియాణా హైకోర్టులో సేవలందిస్తున్నారు. అక్కడ సీనియారిటీ పరంగా మూడో స్థానంలో ఉన్నారు. స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య, ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సుదీర్ఘకాలం చండీగఢ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

భర్తీలో కొత్త సంప్రదాయం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పదవుల భర్తీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజే పదవీవిరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తిని ప్రతిపాదించాలని నిర్ణయించింది. న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచడానికి ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా సీజేగా ప్రతిపాదించిన వారిని 2 నెలల ముందుగానే సంబంధిత హైకోర్టుకు బదిలీచేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. దీనివల్ల సీజేగా బాధ్యతలు చేపట్టేలోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటుపడటానికి వీలవుతుందని పేర్కొంది. అందులో భాగంగానే జస్టిస్ లిసా గిల్‌ను మొదట ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ చేసి, ప్రస్తుత సీజే పదవీ విరమణ చేశాక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టేందుకు వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించింది.

✦ మరోవైపు ఏపీ హైకోర్టు ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయన అలా వెళ్తే ఆ స్థానంలో జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుంది.

శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజును వైకాపా ప్రభుత్వ హయాంలో సీఐడీ కస్టడీలో హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఫిర్యాదుపై నమోదైన కేసులో నిందితుడైన బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్‌నాయక్‌పై అరెస్టు వారెంట్ జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం శనివారానికి వాయిదా వేసింది.





ఐఎన్ఎస్ అంజదిప్ నౌక నామఫలకాన్ని ఆవిష్కరించిన అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ★ నౌక ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

'ఐఎన్ఎస్ అంజదిప్' యుద్ధనౌక ప్రారంభం

వడపళని, సింధియా(విశాఖపట్నం), న్యూస్‌టుడే: భారత నౌకాదళం అవసరాల నిమిత్తం డాల్ఫిన్ హంటర్ ఇంజినీరింగ్ సాంకేతికతతో రూపొందించిన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అంజదిప్'ను శుక్రవారం చెన్నైలో ప్రారంభించారు. నౌకాదళ ప్రధాన అధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి నౌకను జాతికి అంకితం చేశారు. ఇందులో తేలికపాటి టార్పెడోలు తదితరాలు ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన జీఆర్ఎస్ఈ సంస్థ నిర్మించిన ఈ నౌక పొడవు 77 మీటర్లు. 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. దేశ సముద్ర రక్షణను బలోపేతం చేస్తుందని, ఈ ఏడాది మరో 15 నౌకలను కమిషన్ చేయనున్నట్లు త్రిపాఠి పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం కిమ్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహణ



అమలాపురంలో సిద్ధమైన ప్రపంచ తెలుగు మహాసభల వేదిక

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం వేదికైంది. పట్టణంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కిమ్స్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. భారీ వేదికను సిద్ధంచేసి, దానికి నందమూరి తారక రామారావు పేరు పెట్టారు. తొలిరోజు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణరాజుతో పాటు ప్రవచనకర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

అఫ్గాన్, పాక్‌లలో నెత్తుటేర్లు

(మొదటి పేజీ తరువాయి)

మరణించారని ఇస్లామాబాద్ చెప్పగా.. తమవారు 13 మందే ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు వెల్లడించడం గమనార్హం. దీంతో మృతుల సంఖ్య విషయంలో కొంత గందరగోళం నెలకొంది. అఫ్గాన్‌తో ప్రస్తుతం తాము 'బహిరంగ యుద్ధం'లో ఉన్నామని పాకిస్థాన్ శుక్రవారం ప్రకటించింది. ఇస్లామాబాద్ సైన్యం ఈ నెల 22న అఫ్గాన్ సరిహద్దు ప్రాంతాల్లో భారీగా వైమానిక దాడులు చేపట్టింది. తమ దాడుల్లో 70 మంది ముష్కరులను హతమార్చామని నాడు వెల్లడించింది. అందుకు ప్రతీకారంగా అఫ్గాన్ గురువారం పాక్ సరిహద్దుల్లో విరుచుకుపడింది. దీంతో గురువారం అర్ధరాత్రి దాటాక అఫ్గాన్‌లోని కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్సులపై 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' పేరుతో ఇస్లామాబాద్ వైమానిక దాడులు నిర్వహించింది.

మా ఓపిక నశించింది: పాక్ రక్షణ మంత్రి

అఫ్గాన్‌తో బహిరంగ యుద్ధంలో ఉన్నట్లే తాము భావిస్తున్నామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "మా ఓపిక నశించింది. ఇక అఫ్గాన్‌తో బహిరంగ యుద్ధమే. మేం దూకుడుగా ముందుకెళ్తాం. తాలిబన్ల బలాలు, బలహీనతలన్నీ మాకు తెలుసు. నాటో బలగాల ఉపసంహరణ తర్వాత అఫ్గాన్‌లో శాంతి నెలకొంటుందనుకున్నాం. కానీ తాలిబన్లు అఫ్గాన్‌ను భారత వలస రాజ్యంగా మార్చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి ఉగ్రవాదులను సమీకరించుకొని.. ఉగ్రవాదాన్ని ఎగదోయడం మొదలుపెట్టారు" అని ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భీకర దాడులతో సరిహద్దుల్లో అఫ్గాన్‌కు చెందిన 73 పోస్టులను తాము ధ్వంసం చేశామని, మరో 18 పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాక్ సమాచార శాఖ మంత్రి అతావుల్లా తరార్ తెలిపారు. 115 యుద్ధట్యాంకులు, శతఘ్నులను కూడా ధ్వంసం చేశామన్నారు. తాలిబన్ల దాడుల్లో పాక్ సైనికులు 12 మందే మరణించారని పేర్కొన్నారు. డ్యూరాండ్ రేఖ వెంబడి తాము జరిపిన ప్రతీకార దాడుల్లో 55 మంది పాక్ సైనికులు హతమయ్యారని అఫ్గాన్ రక్షణ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. మరికొందరిని బందీలుగా తీసుకున్నామనీ తెలిపింది. పాక్ సైన్యానికి చెందిన రెండు కీలక కార్యాలయాలు, 19 చెక్‌పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. పాక్‌పై దాడులు ఇంకా ముగియలేదని స్పష్టం చేసింది. ఆ దేశ దాడుల్లో తమవారు 13 మందే మరణించారని పేర్కొంది.



అఫ్గానిస్థాన్ దాడితో పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సు బాజౌర్ గ్రామంలో ధ్వంసమైన ఓ మసీదు పైభాగం





సభా సమయం

లడ్డూపై మండలిలో ఆగని రచ్చ

- మంత్రి కేశవ్ వ్యాఖ్యల్ని తప్పుబడుతూ ఛైర్మన్ ప్రకటన
- తీవ్ర అభ్యంతరం తెలియజేసిన మంత్రులు, అధికారపక్ష ఎమ్మెల్సీలు
- లడ్డూపై చర్చకు వైకాపా సభ్యుల వాయిదా తీర్మానం
- ఛైర్మన్ పోడియంపైకి ఎక్కి నినాదాలు
- కేవలం 12 నిమిషాలే సాగిన సభ


సభ వాయిదా వేయడంతో మండలి ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్తున్న వైకాపా ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: తిరుపతి లడ్డూ అంశంపై శుక్రవారం కూడా శాసనమండలిలో తీవ్ర గందరగోళం చెలరేగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలు, ప్రత్యారోపణలు, నినాదాలతో సభ కేవలం 12 నిమిషాలే నడిచింది. సభలో గురువారం ఆర్థిక, శాసనసభా వ్యవహారాలశాఖల మంత్రి పయ్యావుల కేశవ్ తనపై సత్యదూరమైన ఆరోపణలు చేశారని ఛైర్మన్ ప్రకటన చేశారు. దీనిపై మంత్రులు, అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తిరుపతి లడ్డూ అంశంపై వైకాపా సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించడంతో వారు వెల్‌లోకి వెళ్లి ఆందోళనకు దిగారు. దీంతో ఛైర్మన్ సభను వాయిదా వేశారు. లడ్డూ ప్రసాదం అంశంపై శుక్రవారమే చర్చకు సిద్ధమని ప్రభుత్వం నోటీసిచ్చింది. సభ మళ్లీ మొదలయ్యాక కూడా వైకాపా సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో మార్చి నాలుగో తేదీకి వాయిదా వేశారు.

ఆర్థిక మంత్రి సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు: ఛైర్మన్

ఉదయం 10.07 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమయ్యాక ఛైర్మన్ మోషేనురాజు మొదట ఎజెండాలోని అంశాలను చదివారు. అనంతరం మాట్లాడుతూ.. 'గురువారం సభ వాయిదాపడి, మళ్లీ ప్రారంభమయ్యాక తిరుపతి లడ్డూ ప్రసాదంపై లఘు చర్చ చేపట్టడానికి ముందు సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లుగా భావించాలని నేను ప్రకటించా. కానీ ప్రశ్నోత్తరాలను కొనసాగించాలని అధికార పార్టీ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా అడిగి, లడ్డూ ప్రసాదం చర్చ అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరం. అదే సందర్భంలో ఆర్థిక మంత్రి నాపై కొన్ని సత్యదూరమైన ఆరోపణలు చేశారు. లఘు చర్చపై నోటీస్ కోసం సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శికి సెక్రటరీ జనరల్ పంపిన ప్రతిని చూపించి.. నేను ప్రభుత్వం తరఫున ప్రకటన చేయడానికి అంగీకరించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారు. సభను తప్పుదోవ పట్టించాలనుకున్నారు. అది సమంజసం కాదు. అధికారపక్ష సభ్యులే చర్చను అడ్డుకోవడం మంచి సంప్రదాయం కాదు. ఇరుపక్షాల సభ్యులు సభ గౌరవాన్ని పెంపొందించేలా నడుచుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రులు, తెదేపా ఎమ్మెల్సీలు లేచి తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. ఛైర్మన్ స్పందిస్తూ.. 'దానిపై ఇక ఎవరూ మాట్లాడేందుకు అనుమతించేది లేదు. ఛైర్‌ను ఇంకా అవమానించాలని మీరనుకోవడం భావ్యం కాదు' అని పేర్కొన్నారు. వివరణ ఇచ్చేందుకు అనుమతించాలని తెదేపా సభ్యులు పట్టుబట్టడంతో మంత్రి అచ్చెన్నాయుడుకి అనుమతిచ్చారు.

పోడియంలోకి దూసుకెళ్లి వైకాపా సభ్యుల నిరసన

శుక్రవారం సభ మొదలైన వెంటనే వైకాపా ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, కేఆర్‌జే భరత్, సిపాయి సుబ్రమణ్యం తిరుమల లడ్డూపై చర్చకు వాయిదా తీర్మానమివ్వగా ఛైర్మన్ తిరస్కరించారు. వాయిదా తీర్మానంపై చర్చకు అనుమతించాలంటూ వైకాపా సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి, సభను అడ్డుకున్నారు. పోడియం పైకి ఎక్కి ఛైర్మన్ కుర్చీని చుట్టుముట్టి నినాదాలు చేశారు. గందరగోళం మధ్య ఛైర్మన్ సభను ఉదయం 10.19 గంటలకు వాయిదా వేశారు. అయినా వైకాపా సభ్యులు వెల్‌లోనే కూర్చుని కొద్దిసేపు నినాదాలు చేశారు. ఫోన్లలో వీడియోలు తీసుకున్నారు. సెల్ఫీలు దిగారు. మధ్యాహ్నం 12.52 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన వెంటనే మళ్లీ పోడియంలోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేయడంతో ఛైర్మన్ సభను బుధవారానికి వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా వైకాపా సభ్యులు వెల్‌లోనే కొద్దిసేపు నినాదాలు చేసి వెళ్లారు.

ఛైర్మన్ అంటే మాకు అపారమైన గౌరవం: అచ్చెన్న



'ఛైర్మన్ అంటే మాకు అపారమైన గౌరవం ఉంది. నిబంధనలకు విరుద్ధమైన అంశాలేవీ గురువారం సభలో మాట్లాడలేదు. ఒక అంశంపై చర్చించాలని ప్రతిపక్షం భావించినప్పుడు నోటీసివ్వాలి. వాళ్లు నోటీసివ్వకపోయినా శాసనమండలి బీఏసీలో అంగీకరించాం కాబట్టి మేమే ముందుకొచ్చాం. బుధవారం శాసనసభలో లడ్డూ ప్రసాదంపైనే చర్చ జరిగింది. అక్కడ ప్రతిపక్ష సభ్యులు లేకపోయినా.. మా పార్టీ సభ్యుడితో నోటీసిప్పించి మరీ చర్చించాం' అని అచ్చెన్నాయుడు తెలిపారు. ఛైర్మన్ జోక్యం చేసుకుని... అక్కడ ప్రొసీడింగ్స్, ఇక్కడి పద్ధతి వేర్వేరని తెలిపారు. 'మండలిలో ప్రతిపక్షసభ్యులు నోటీసు ఇవ్వకపోయినా ఛైర్మన్‌గా మీ మాటను గౌరవించాం. ప్రతిపక్ష సభ్యులకు చర్చపై ఆసక్తి లేకపోయినా బాధ్యత కలిగిన ప్రభుత్వంగా కాపీలను సభలో పెట్టి, వాటిని మంత్రి చదివిన తర్వాత చర్చకు వైకాపా సభ్యులకు అవకాశమివ్వాలన్నాం. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకుంది ఎవరో మీరే చూశారు' అని అచ్చెన్న పేర్కొన్నారు. ఇంత అసమర్థ ప్రతిపక్షాన్ని తానెప్పుడూ చూడలేదని ధ్వజమెత్తారు. 'లడ్డూ అంశంపై మేం చర్చకు సిద్ధమని చెబుతున్నా.. పోడియంపైకి ఎక్కి సభ జరగకుండా అడ్డుకుంటున్నారంటే వైకాపా దగ్గర సరకు లేదని అర్థమవుతోంది. వైకాపా పాలనలో తిరుమల పవిత్రతను ఎలా దెబ్బతీశారో బయటపడుతుందని వాళ్లకు భయం. మార్చి 4న తిరుపతి లడ్డూపై చర్చకు మేం సిద్ధం. ఒక రోజు చాలదనుకుంటే రెండు రోజులు చర్చిస్తాం' అని అచ్చెన్న తెలిపారు.

ఖరీఫ్ సాగు రెండు మూడు నెలలు ముందుకు

మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఖరీఫ్ సీజన్‌ను రెండు, మూడు నెలలు ముందుకు తెస్తున్నామని, దీనిపై రైతులకు శాసనసభ్యులు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అన్ని రిజర్వాయర్లలో నీరు అందుబాటులో ఉందని, ముందస్తు సాగు చేస్తే తుపాన్ల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆయన చెప్పిన వివరాలివీ.. "క్లస్టర్ బేస్డ్ విధానంలో ఉద్యానపంటల సాగుకు ముందుకెళ్తున్నాం. వివిధ పంటల సాగుకు అనుగుణంగా జిల్లాలను క్లస్టర్లుగా విభజించి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. కేంద్రం కూడా సానుకూలంగా ఉంది. వ్యవసాయం నుంచి ఉద్యానసాగు వైపు రైతులు మళ్లితే లాభాలొస్తాయి. ఉద్యానసాగును ప్రోత్సహించేందుకు గతంలో ఇచ్చినట్లే డ్రిప్‌లు, స్ప్రింక్లర్లను రాయితీపై అందిస్తాం. గతేడాది వ్యవసాయ యాంత్రీకరణకు రూ.61 కోట్లు ఖర్చుచేస్తే ఈ ఏడాది రూ.137 కోట్లు కేటాయించాం.

చెరకు సాగుకు ఉచిత విద్యుత్తు: రైతు సేవాకేంద్రాల పరిధిలో ఎంతమంది రైతులున్నారు? ఎంత భూమి ఉంది? ఏయే పంటలు పండిస్తున్నారనే సమగ్ర నివేదికను తయారుచేస్తున్నాం. వరితో పాటు ఉద్యానపంటలు, నర్సరీలకూ ఉచిత విద్యుత్తును అమలుచేస్తున్నాం. ఈ ఏడాది చెరకు సాగుకూ ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పారు.

ఇళ్ల స్థలాలకు భూసేకరణలో రూ.7,500 కోట్ల కుంభకోణం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలకు భూసేకరణ పేరుతో రూ.7,500 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వైకాపా నాయకులు గుత్తేదారుల అవతారమెత్తి దోపిడీ చేశారని మండిపడ్డారు. పేదల సొమ్ము తిన్న పెద్ద నాయకుల బాగోతం బయటకు తీయాలన్నారు. బడ్జెట్‌లో గృహనిర్మాణశాఖకు కేటాయింపులపై చర్చ సందర్భంగా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు మాట్లాడారు. 'ఒక్క అనంతపురం జిల్లాలోనే నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు రూ.213 కోట్లు ఖర్చుచేశారు. దీనికి స్థలం విలువ కలిపితే రూ.500 కోట్ల వరకు చేరుతుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల ఆస్తులు వృథాగా మారిపోయాయ'ని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఆంధ్ర వర్సిటీని గత ప్రభుత్వంలో వైకాపా కార్యాలయంగా మార్చేశారు

- శాసనసభలో విద్య, ఐటీశాఖల మంత్రి లోకేశ్
- విజిలెన్స్ నివేదిక వచ్చాక మాజీ వీసీపై కఠిన చర్యలు
- ఏయూ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం
- విశ్వవిద్యాలయాల్లో 'మ్యాన్‌పవర్ ఆడిట్' నెల రోజుల్లో పూర్తవుతుంది



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ పాలనలో విశ్వవిద్యాలయాల్లో ఆ పార్టీ కార్యకర్తలను విచ్చలవిడిగా నియమించారని, దీనిపై మ్యాన్ పవర్ ఆడిట్ చేయిస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ వెల్లడించారు. 30 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం(ఏయూ)లో అనేక ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని విశాఖ నగర ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'మ్యాన్‌పవర్ ఆడిట్ పూర్తయ్యాక నాకో స్పష్టత వస్తుంది. ఎంత మంది ఉన్నారు? ఏ సంవత్సరంలో వారిని నియమించారనే విషయాలు తెలుస్తాయి. ఆ తరవాత ఆర్థికశాఖతో సంప్రదించి ఉద్యోగుల పదోన్నతుల విషయంలో నిర్ణయం తీసుకుంటాం' అని లోకేశ్ అన్నారు.

టాప్ టెన్ ర్యాంకింగ్‌లో ఏయూ నిలిచేలా కృషి..

'ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి చేసిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. 45 రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉంది. దాన్ని శాసనసభలో పెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం. ఆంధ్ర విశ్వవిద్యాలయం 2019లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 29వ స్థానంలో ఉండేది. 2023 నాటికి 76వ ర్యాంక్‌కు పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 41వ ర్యాంకుకు తెచ్చాం. ఇప్పుడు టాప్ టెన్‌లోకి తేవాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. యూనివర్సిటీ క్యాటగిరీలో 2019లో 16వ ర్యాంకులో ఉండేది. 2023 నాటికి 43వ ర్యాంకుకు పడిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక 2025లో 23వ ర్యాంకుకు తెచ్చాం. ఏయూ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం. కార్యక్రమ నిర్వహణపై వీసీతో శనివారం విశాఖలో సమీక్షిస్తాం' అని మంత్రి లోకేశ్ సూచించారు.

మనమిత్ర యాప్ 2.0 త్వరలో ప్రారంభం

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 'ప్రాసెస్ రీ ఇంజినీరింగ్' చేసి 'మనమిత్ర యాప్ 2.0'ను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. యాప్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మనమిత్ర యాప్ సేవలపై ఎమ్మెల్యే పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

సామర్థ్యానికి మించి భారతి సిమెంట్స్‌కు సరఫరా బాధ్యత

- ఏ ప్రాతిపదికన సరఫరా చేపట్టాలని నిర్ణయించింది ఆనాటి ముఖ్యమంత్రే
- మంత్రి పార్థసారథి



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంటు సరఫరాకు భారతి సిమెంట్ కంటే ఉత్పత్తి సామర్థ్యంలో అల్ట్రాటెక్ సిమెంట్, ఇండియా సిమెంట్స్ పెద్దవైనా.... వాటిని కాదని ఉత్పత్తి సామర్థ్యానికి మించి 3 రెట్లు అదనంగా సరఫరా బాధ్యతను భారతి సిమెంట్స్‌కు కట్టబెట్టారని గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి మండిపడ్డారు. 'సిమెంటు సరఫరా ఏ ప్రాతిపదికన చేపట్టాలనే దానిపై నాటి ముఖ్యమంత్రే స్వయంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి కంపెనీల ఎంపిక బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సిమెంట్ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్‌కు ఇచ్చారు. సరఫరా కంపెనీల ఎంపిక బాధ్యతను ఏపీఎస్‌కు అప్పగిస్తే జాగ్రత్తలు తీసుకుంటారు. అలా జరగకూడదనే అసోసియేషన్‌కు అప్పగించారు. భారతి సిమెంట్స్‌పై ఉండే ప్రేమను ఇలా వెలిబుచ్చారు' అని వెల్లడించారు. గృహనిర్మాణశాఖ పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడారు.

రాక్రీట్ రూ.80 కోట్ల అవినీతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం పేరుతో ఆ పార్టీ నాయకులకు కాంట్రాక్టులు అప్పగించారు. ఒక్క రాక్రీట్ సంస్థకు 70 వేల ఇళ్లను కేటాయించారు. ఆ సంస్థ ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేదు. రూ.80 కోట్ల అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ తేల్చింది. ఆ సంస్థకు కేటాయించిన ఇళ్లను రద్దు చేశారు. వేరే సంస్థకు కేటాయించి పూర్తి చేయిస్తున్నాం. నెల్లూరు జిల్లాలోనూ రూ.101.19 కోట్ల అవినీతి జరిగినట్లు విజిలెన్స్ విచారణలో బయటపడింది.

అమరావతి అభివృద్ధి ఆగిపోవాలని కుట్ర: రాజధాని అమరావతి అభివృద్ధి ఆగిపోవాలని పేదలకు ఇళ్ల స్థలాలు అక్కడ కేటాయించేందుకు ప్రయత్నించారు. అప్పట్లో నాకు ఒక అధికారి ఈ విషయాన్ని స్వయంగా తెలియజేశారు. పెనమలూరు నియోజకవర్గానికి చెందిన వారికి కూడా అమరావతిలో స్థలాలు కేటాయించాలని చూశారు.

2029 నాటికి 17.63 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం: ఇప్పటికే వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, కొత్తగా మంజూరు చేసినవి కలిపి 2029 నాటికి 17.63 లక్షల గృహాల్ని పూర్తి చేయనున్నాం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పట్టణ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు, గ్రామీణ పథకానికి రూ.2.39 లక్షలు అందించనున్నాం. వైకాపా ప్రభుత్వంలో రూ. 1.80 లక్షల మాత్రమే ఇచ్చేవారు. మార్చి లేదా ఏప్రిల్‌లో కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద కొత్తగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయనుంది. 10.42 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 6 లక్షల మంది అర్హులుంటారని అంచనా వేస్తున్నాం. కేంద్రం ఇళ్లు మంజూరు చేశాక నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులకు సమాచారం అందిస్తాం' అని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

శ్రీశైలంలో మండపం నిర్మాణానికి రూ. 1.5 కోట్ల విరాళం


శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రమేష్ నాయుడికి చెక్కు అందజేస్తున్న గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానంలో మండపం నిర్మాణానికి శ్రీభ్రమర టౌన్ షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాధవి, రామచంద్రరావు దంపతులు రూ.1.5 కోట్లు విరాళం చెక్కును దేవస్థానం ఛైర్మన్ రమేష్‌నాయుడుకు అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మండపం నిర్మాణంద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విరాళం అందజేశామన్నారు. రాతి మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే దంపతులు ముందుకు రావడంపై ఛైర్మన్ హర్షం వ్యక్తం చేశారు.

డిజిటల్ అరెస్ట్ పేరిట వృద్ధ దంపతులకు వేధింపులు

- సైబర్ నేరస్థుల ఆట కట్టించిన సీఐ


వీడియోకాల్‌లో ఉన్న సైబర్ నేరస్థుడిని ప్రశ్నిస్తున్న సీఐ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ఓ విశ్రాంత ఉద్యోగిని డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ నేరగాళ్లు వేధిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు సమయానికి అక్కడికి వెళ్లి వారి ఆట కట్టించారు. ఈ ఘటన మచిలీపట్నంలో చోటు చేసుకుంది. బెల్ కంపెనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి హరినాథ్, భార్యతో కలిసి ఈడేపల్లిలో నివసిస్తున్నారు. శుక్రవారం ఆయనకు గుర్తుతెలియని నంబరు నుంచి వీడియో కాల్ రావడంతో లిఫ్ట్ చేశారు. పోలీస్ యూనిఫాం ధరించి ఉన్న ఓ వ్యక్తి తాను పుణె యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) అధికారిగా పరిచయం చేసుకున్నాడు. ఇటీవల తాము అదుపులోకి తీసుకున్న నలుగురు ఉగ్రవాదుల నుంచి హరినాథ్‌కు చెందిన ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నామని చెప్పాడు. ఉగ్రవాదులకు ఎందుకు సహకరించాల్సి వచ్చిందో చెప్పాలంటూ నిలదీస్తూ ఆయనను డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వారిని వీడియో కాల్‌లోనే ఉంచి తాము చెప్పినట్టు చేయాలంటూ తీవ్ర భయాందోళనకు గురిచేశాడు. హరినాథ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి ఈ విషయాన్ని గమనించి సైబర్ మోసంగా అనుమానించారు. వెంటనే చిలకలపూడి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సీఐ అబ్దుల్‌నబీ బాధితుడి ఇంటికి వెళ్లి సైబర్ నేరస్థుడ్ని వీడియో కాల్‌లో గట్టిగా ప్రశ్నించారు. కాల్‌లో సీఐని చూసిన వెంటనే కంగుతిన్న అతను క్షణం ఆలస్యం చేయకుండా కాల్ కట్ చేసి.. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశాడు. సకాలంలో వచ్చి తమను ఆదుకున్న సీఐకి హరినాథ్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదని, ఈ తరహా కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ అవగాహన కల్పించారు.

కౌన్సిల్ సమావేశానికి తాచుపాము తెచ్చిన వైకాపా కౌన్సిలర్

తన వార్డులో పనులు చేయడం లేదని ఆరోపణ


డబ్బాలోని పామును చూపుతున్న అనిల్‌కుమార్

నిడదవోలు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని 20వ వార్డు వైకాపా కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి తాచుపామును తీసుకురావడం కలకలం రేపింది. ఓ సీసాలో బంధించి ఉన్న సర్పాన్ని సంచిలో పెట్టుకొని కౌన్సిల్ సమావేశ మందిరంలోకి తెచ్చి.. తన కుర్చీ పక్కన పెట్టుకున్నారు. ఆ విషయం ఏఈ హేమంత్ దృష్టికి రావడంతో.. సంచి బయటపెట్టి రావాలని కోరినా ససేమిరా అన్నారు. తరువాత ఛైర్మన్ ఆదినారాయణ గట్టిగా చెప్పడంతో పాము ఉన్న సంచిని బయటపెట్టి, హాల్‌లోకి వచ్చారు. ఐదేళ్ల కాలంలో తన వార్డులో అభివృద్ధి పనులేవీ చేపట్టలేదని.. ఖాళీ స్థలాలు, పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం పాఠశాల ఆవరణలోంచి తాచుపాము రహదారిపైకి వచ్చిందని, ఓ బాలుడు చూసుకోకుండా దాని పక్కనుంచే వెళ్లాడన్నారు. పాము కాటేసి ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వార్డులో పరిస్థితిని వివరించేందుకే ఆ పామును పట్టించి, సమావేశానికి తీసుకొచ్చానని చెప్పారు.

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు రూ.1,060 కోట్ల కేటాయింపు

మంత్రి నిమ్మల రామానాయుడు



ఈనాడు, అమరావతి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం బడ్జెట్‌లో రూ.1,060 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.600 కోట్లు, ప్రాధాన్యక్రమంలో మరో 11 ప్రాజెక్టులకు రూ.460 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన వివరించారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే సుజల స్రవంతి ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో 63.20 టీఎంసీల నీటితో 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుబాటులోకి రానుంది. విశాఖ పారిశ్రామిక అవసరాలకు కూడా నీరందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. తొలి విడతలో రూ.2,022 కోట్లు, రెండో విడతలో రూ.4,210 కోట్ల పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుజల స్రవంతి ప్రాజెక్టులో 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వంలో చేసిన పనులు తప్ప వైకాపా పాలనలో ఒక్క రూపాయి ఖర్చు చేసి తట్ట మట్టి, అర బస్తా సిమెంట్ పని కూడా చేయలేదు' అని మంత్రి పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి ఏం చేస్తున్నారు?

- గన్నవరం విమానాశ్రయం నుంచి అరకొరగా సర్వీసులు: ఎమ్మెల్యే బొండా ఉమా

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు, ఇతరత్రా పనులపై దేశ విదేశాల నుంచి ఎక్కువ మంది వస్తున్నా గన్నవరం విమానాశ్రయం నుంచి తగిన సర్వీసులు లేవని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెదేపాకి చెందిన ఎంపీ కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రిగా ఉండి కూడా ఏం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్‌లో ఎమ్మెల్యే ఈ అంశంపై మాట్లాడారు. 'హైదరాబాద్‌కు ఇప్పటికీ రోజూ ఐదు విమానాలే వెళ్తున్నాయి. విశాఖకు రెండు, మూడు సర్వీసులే నడుస్తున్నాయి. వారానికి ఒకటి, రెండు చొప్పున కడప, కర్నూలుకు నడుపుతున్నారు. రాష్ట్రేతర ప్రాంతాలతో కలిపి రోజుకు 14-15 విమానాలు గన్నవరం నుంచి వెళ్తున్నాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో ఇలాంటి పరిస్థితి ఏమిటి? విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి లేఖలు రాసినా అదనపు సర్వీసులు పెరగలేదు. తక్షణమే మరోసారి లేఖ రాసి ఎక్కువ విమానాలు నడిపేలా చర్యలు తీసుకోవాలి' అని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

జనసేన కేంద్ర కార్యాలయంలో కార్లు ధ్వంసం

- నిందితుడు శ్రీకాకుళం జిల్లా వాసి
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు


ధ్వంసమైన కారు అద్దం


నిందితుడు నారద నీలాద్రి

ఈనాడు, అమరావతి, మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలోకి ఒక వ్యక్తి చొరబడి కార్లు ధ్వంసం చేయడం కలకలం రేపింది. భద్రత సిబ్బందిని నెట్టేసి, డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ధ్వంసం చేశాడు. నీలాద్రి అనే అతడిని అదుపులోకి తీసుకున్న మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ఖాజూరుకు చెందిన నారద నీలాద్రి (39) కంప్యూటర్ దుకాణంలో పనిచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఉపముఖ్యమంత్రి నివాసం, కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడంతోపాటు కార్లపై దాడిచేయడం విస్మయానికి గురిచేస్తోంది. పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో ఉన్నప్పుడే ఈ ఘటన జరగడం భద్రతా సిబ్బంది వైఫల్యాల్ని తేటతెల్లం చేసింది.

భవన నిర్మాణ కూలీలతో కలిసి చొరబాటు: జాతీయ రహదారి పక్కన జనసేన కేంద్ర కార్యాలయం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. అదే ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో నీలాద్రి భవన నిర్మాణ కార్మికులు వెళ్లే ప్రవేశమార్గంలో వారితో కలిసి లోపలికి ప్రవేశించాడు. అక్కడ ప్రైవేటు భద్రతా సిబ్బంది తనిఖీ చేయలేదు. నీలాద్రి నేరుగా సీఎస్‌వో కార్యాలయం వద్దకు వెళ్లి ఫర్నిచర్ శుభ్రం చేస్తుండగా.. భద్రతాధికారి అనుమానంతో ప్రశ్నించారు. ఆయనను తోసేసి అక్కడి సిబ్బందిపై దాడికి దిగాడు. అడ్డుకునేందుకు సిబ్బంది ప్రయత్నం చేయగా పారిపోతూ అక్కడే ఉన్న ఒక కర్ర తీసుకుని కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం, పైలట్ వాహనం అద్దాలు పగలగొట్టాడు. ప్రత్యేక భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు. విచారణలో నీలాద్రి పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. ఇది తనకు మూడోజన్మ అని, తనను అమ్మవారు పవన్ కల్యాణ్ కార్యాలయానికి పంపించారని చెప్పినట్లు సమాచారం. అతడి మానసిక స్థితి సరిగా లేదని పోలీసులు భావిస్తున్నారు.

ఏజీ కుమార్తె, అల్లుడిని ఆశీర్వదించిన గవర్నర్


వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, నాగరాణిల కుమార్తె మానస, గొడవర్తి కోటేశ్వరరావు, శిరీషల కుమారుడు సిద్ధార్థల వివాహ రిసెప్షన్ శుక్రవారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. వేడుకకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, హైకోర్టు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు, ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మార్పును విశ్వసించండి



మన ప్రమేయం లేకుండానే మన జీవితం మారుతుంటుంది. మనుషులు దూరం కావొచ్చు.. కాలాలు మారుతుండొచ్చు.. మనం వెళ్లే దారి మార్పులకు 'సరికావచ్చు.. ఆయా మార్పులు మనకు ఇబ్బందిగా అనిపించినా అవి మనలను ముందుకు తీసుకువెళ్తాయి. మార్పు ప్రక్రియను విశ్వసించాలి. – ఒలీవియా, కంటెంట్ క్రియేటర్

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సౌందరరాజన్ కన్నుమూత



హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ ఎంవీ సౌందరరాజన్(90) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. రెండేళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. ఆలయం వద్ద ఉన్న ఇంట్లోనే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా, ఏపీ అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడిగా... ఆలయ రక్షణ ఉద్యమానికి కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లకుండా ఆయన తీవ్ర పోరాటం చేశారు.

(c) eenadu

పరీక్షల భయాన్ని తరిమికొట్టేయండి..!

పదో తరగతి విద్యార్థుల కోసం ఉచిత వెబినార్ 1న

ఈనాడు ప్రతిభ | శ్రీచైతన్య విద్యాసంస్థలు

ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. చదువుల్లో విద్యార్థి సామర్థ్యానికి టెన్త్ క్లాస్ ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తుంది. అందుకే పదో తరగతి వార్షిక పరీక్షలనగానే విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. అధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతోపాటు తమపై తల్లిదండ్రులకు ఉండే అంచనాలను అందుకోవాలనే తపన ఆందోళనను



పెంచేస్తుంది. పరీక్ష తేదీలు దగ్గర పడుతున్న కొద్దీ కొందరిలో భయం పెరిగి జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతుంటుంది. ఇలాంటి అనవసర భయాలను, ఆందోళనలను పోగొట్టి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలు, 'ఈనాడు-ప్రతిభ' సంయుక్తంగా ఉచిత వెబినార్ నిర్వహిస్తున్నాయి. పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలో వివరిస్తూ, అత్యుత్తమ మార్కులు సాధించడానికి ఈ వెబినార్ మార్గదర్శనం చేస్తుంది. ప్రముఖ సబ్జెక్టు నిపుణులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తక్కువ సమయంలో సిలబస్‌ను ఏ విధంగా రివిజన్ చేయాలో తెలియజేస్తారు. పరీక్షల భయాన్ని పోగొట్టి, మానసిక స్థితిని స్థిరపరిచేందుకు సైకాలజిస్టులు సూచనలు చేస్తారు. గత ఏడాది టాపర్లుగా నిలిచిన విద్యార్థులు తమ అనుభవాలను వివరించి స్ఫూర్తిని నింపుతారు. టెన్త్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకూ ఈ వెబినార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఇదిగో ఈ అంశాలపైనే సూచనలు

- యాక్టివ్ రీకాల్, మైండ్ మ్యాపింగ్ ద్వారా క్లిష్టమైన అంశాలను ఎలా గుర్తుంచుకోవాలి?
- గణితం, సైన్స్‌లో స్కోరింగ్ పాయింట్లు, ప్రజెంటేషన్ టిప్స్.
- ఏకాగ్రతను పెంచే చిన్న చిన్న వ్యాయామాలు.
- పరీక్ష గదిలో టైం మేనేజ్‌మెంట్.
- ఆరోగ్యం, ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.
- విద్యార్థులు అడిగే సందేహాలకు నిపుణుల సమాధానాలు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్, ఈనాడు.నెట్ ద్వారా వెబినార్‌లో జాయిన్ కావచ్చు

వెబినార్ తేదీ:	మార్చి 1, 2026 (ఆదివారం)
సమయం:	ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

జూమ్ మీటింగ్ కోసం... | యూట్యూబ్ లైవ్ కోసం...

Join from PC, Mac, iPad, or Android:
Zoom - https://hov.to/b2c7ec22
Youtube Live - https://hov.to/d4ce0f1a
Zoom ID - 953 5694 9081 Passcode: 115422

మంగళాద్రివాసా.. మహిమాన్విత రూపా..



మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఆరో రోజైన శుక్రవారం స్వామివారిని చిన్న శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల ముఖ మండపం వద్ద కైంకర్యపరులు దేవకీ భగవన్నారాయణ, పద్మజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు సింహవాహనంపై విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – మంగళగిరి, న్యూస్‌టుడే

నెమలి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ రోజు ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చూడతారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకవర్గం ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సృజనకు సై.. నవ్యతకు జై!

ఆలోచనల్లో జనహితం.. ఆవిష్కరణల్లో నవ్యపథం. మేలుకోరేలా.. మేలుకొల్పేలా.. అక్షరాలయం నుంచే మేధో అడుగులు. సృజనకు జీవం పోస్తూ.. ఆధునికతకు సాంకేతికత జోడిస్తూ.. వైజ్ఞానిక ప్రపంచంలో దూసుకెళ్తున్న కృషిపథం. **నేడు జాతీయ సైన్స్ దినోత్సవం** పురస్కరించుకొని.. అద్భుతాలు ఆవిష్కరిస్తున్న యువ, బాల తరంగాల విజ్ఞాన వికాసంపై ప్రత్యేక కథనం.

గ్రీన్ టెక్నాలజీతో భళా..

రావి, మర్రి, మారేడు, మామిడి, ఉసిరి, వేప, వెదురు, చింత వృక్షాల పెంపుతో.. ప్రాణవాయువును పెంచి కాలుష్య రహిత సమాజానికి బాటలు వేయవచ్చు. సౌర, పవన శక్తి వినియోగంతోనూ మరింత మేలు చేయవచ్చని ఆచరణాత్మక ప్రాజెక్టును తీర్చిదిద్దాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఈ ప్రాజెక్టు ఎంపికైంది. అబ్దుల్ కలామ్ యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా అందుకున్నాం.



విద్యార్థినులు - బి.విజయదుర్గ, ఐ.రుక్మిణి - గైడ్ జె.నాంచారమ్మ, (మైలవరం గిరిజన సంక్షేమ బాలికల గురుకులం)

తాగునీటి నాణ్యత కనిపెట్టొచ్చు..



అతి తక్కువ ఖర్చుతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి తాగునీటి నాణ్యతను కనుగొనే అంశమిది. ఐవోటీని ఏఐతో అనుసంధానం చేశారు. ఇందులో రెండు ఈఎస్‌పీ 32 కంట్రోలర్ వినియోగించగా మొదటిది నీటి పీహెచ్, టీడీఎస్, టర్బిడిటీ, ఉష్ణోగ్రతలను కనుగొంటుంది. రెండో కంట్రోలర్ ఆ విలువలను పంపిస్తారు. తర్వాత ఏఐ ద్వారా నీటి క్వాలిటీ ఇండెక్స్‌ను ర్యాండమ్ ఫారెస్ట్ రిగ్రెషన్ అల్గారిథమ్ ద్వారా అంచనా వేసేలా రూపొందించారు. తద్వారా తక్కువ ఖర్చు, తక్కువ విద్యుత్తు వినియోగంతో నీటి నాణ్యత తెలియజేయవచ్చు. **- బేబీ మానస బృందం (పీవీపీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఐటీ విభాగం)**

క్యాన్సర్ ముప్పు.. ముందే తొలగు

ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించి మరణాలు తగ్గించేలా రోబోటిక్స్, ఆటోమేషన్‌తో క్యాన్సర్ నిర్ధారణ పరికరాన్ని రూపొందించా. ఆరోగ్య పరిస్థితి క్షీణించే వరకు చాలా మంది క్యాన్సర్ ఉందని గుర్తించలేక మృతి చెందుతున్నారు. బయోసెన్సార్లు, ఇమేజింగ్, ఆటోమేటెడ్ సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త పరికరం రూపొందించా. దీంతో క్యాన్సర్‌ను ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు. చాలా తక్కువ ఖర్చుతోనే లభిస్తున్న దీన్ని ఉపయోగించి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను గ్రామీణ ప్రాంతాల్లోనూ చేయొచ్చు. **- పి.లక్ష్మీఈశ్వరి, బీఎస్సీ బయోకెమిస్ట్రీ విద్యార్థిని, సిద్ధార్థ మహిళా కళాశాల**



నీటి పొదుపు.. మేటి మలుపు

వాననీటిని ఒడిసిపట్టి నీటిపొదుపు.. భూగర్భ జలాల పెంపునకు ఇదో మంచి ప్రయత్నం. ఇళ్లపై నుంచి వృథాగాపోయే నీటిని ఓ పైపు ద్వారా ట్యాంకులోకి వెళ్లేలా చేసి నిల్వ చేయాలి. ఆ నీటిని బిందుసేద్య విధానంలో ఇంట్లో ఉన్న తోటలకు వినియోగించి నీటి సమస్య ఉండదు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలతో వర్మి కంపోస్టు ఎరువు, గోశాల నుంచి వచ్చే గోమయంతో పంచగవ్య కషాయాలను సాగు, పెరటితోటలకు వినియోగించొచ్చు. సహజ సిద్ధ వ్యవసాయం, వనరులు సద్వినియోగంతో అందరూ ఆరోగ్యంగా జీవించవచ్చు. **- ఎన్. నవకిషంత్, ఎం.ప్రణీత్, మైనార్టీ గురుకుల పాఠశాల, బందరు**



సైన్స్ సమగ్ర మహోత్సవ్‌లో భళా

ఆటోమెటిక్ విద్యుత్తు ఆన్/ఆఫ్..



సెన్సార్‌తో విద్యుత్తు ఆటోమెటిక్‌గా నియంత్రించే పద్ధతి నమూనా తీర్చిదిద్దాం. మనవ స్పర్శ ద్వారా ఇంటిలో విద్యుత్తు దీపాలు వెలిగి, బయటకు వెళ్లగానే ఆరిపోతున్నాయి. విద్యుత్తు పొదుపునకు చక్కటి మార్గమిది. **- సి.హెచ్.సంతోష్, కె.కార్తిక్, ఎస్.విజయ్ (ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల, మారేడుమిల్లి, పోలవరం జిల్లా)**

చిన్నారులను రక్షించేలా..



బోరు బావిలో పడిన చిన్నారులను యంత్రాలతో రక్షించే నమూనాను ఆవిష్కరించాం. బోరు బావిలోని చిన్నారితో మాట్లాడటం, ఆక్సిజన్ అందించడం, తెరపై బొమ్మ కనిపించేలా చేయడం, సులువుగా వెలికితీయడానికి ఉపకరిస్తుంది. **(కలిమిరం మున్సిపల్ స్కూల్, రాయదుర్గం, అనంతపురం జిల్లా)**

– న్యూస్‌టుడే,ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ సిటీ, మైలవరం, మచిలీపట్నం (గొడుగుపేట), కానూరు

కట్టూబొట్టు.. అందాల కనికట్టు

అలరించిన 'సాగా ఆఫ్ ది డివైన్ థీమ్' ఫ్యాషన్ షో



తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం టెక్నో కల్చరల్ ఫెస్ట్‌లో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో శుక్రవారం 'సాగా ఆఫ్ ది డివైన్ థీమ్'తో జరిగిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సుమారు 50 మంది విద్యార్థులు పురాణాలు, ఇతిహాసాల్లోని పాత్రలకు సంబంధించిన వస్త్రధారణలో మెరిశారు. ఆద్యంతం భారతీయ ప్రాచీన సంస్కృతి ప్రతిబింబించింది. ఇందులో ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన విద్యాసాగర్ బృందం ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నుంచి వచ్చిన డా.ఫాతిమా బిల్ గ్రామీ, ఎస్ఆర్ఎం డైరెక్టర్ అనూప్ సింగ్, గురుప్రీత్ సింగ్, ప్రొ.సోనీవాద్వాలు ఫ్యాషన్ షోకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్: (శనివారం) సాయంత్రం: 6.18
సహరి: (ఆదివారం) ఉదయం: 5.08

సీజేఐ పర్యటనకు విస్తృత బందోబస్తు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మార్చి ఒకటో తేదీన విజయవాడ పర్యటనకు వస్తున్న సందర్భంగా అధికారులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా తదితరులు శుక్రవారం పరిశీలించారు. లోక్‌భవన్, హోటల్ నోవోటెల్, పటమట డొంక రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు సూచనలు చేశారు. డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీలు ఎం.బి.ఎం.మురళీకృష్ణ, కోటేశ్వరరావు, సెంట్రల్ ఏసీపీ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, జేసీ ఇలక్కియా, డీసీపీ కృష్ణకాంత్ పటేల్

త్వరపడితే మీరు.. తల్లడిల్లనీరు!

ఎ.కొండూరు ప్రాజెక్టుకు తుది దశలో కష్టాలు

ఈనాడు, అమరావతి

కిడ్నీ బాధితులకు స్వచ్ఛజలాలు అందించేందుకు రూ.50 కోట్లతో నిర్మిస్తున్న కృష్ణా జలాల ప్రాజెక్టుకు.. తుది దశలో గండాలు తప్పడం లేదు. నిరుడు ఆగస్టుకే ప్రాజెక్టును పూర్తిచేసి ఆరంభించాలనేది లక్ష్యం. ఆపై.. ఈ ఏడాది జనవరికి ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రారంభిస్తామన్నారు. అయితే.. ఫిబ్రవరి దాటిపోతున్నా ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియకుంది. పంప్‌హౌస్, ట్యాంకులు, పైప్‌లైన్ పనులు ఎప్పుడో పూర్తిచేసి..ఇంటింటికీ నల్లాలనూ వేశారు. ట్రయల్‌రన్ దిగ్విజయంగా పూర్తయితే.. 21 పంచాయతీల్లో 38 తండాలకు కృష్ణా జలాలు అందుతాయి. కానీ.. నెలలుగా ఆలస్యం జరుగుతోంది.

ఎ.కొండూరు పరిధి గిరిజన తండాల్లో.. పదేళ్లలో 300 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో చనిపోయారు. వైకాపా హయాంలో ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేశారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలైనా పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. అత్యంత వేగంగా పనులు చేపట్టారు. ప్రధాన ట్యాంకు, పంప్‌హౌస్, పైప్‌లైన్, తండాల్లో సంపులు, ట్యాంకులు, నల్లాలన్నీ వేశారు. ట్రయల్‌రన్‌లో సమస్యలు గుర్తించి.. పరిష్కరించాక.. జనవరిలో ఆరంభిస్తామన్నారు. రోజుకు 32 లక్షల లీటర్ల స్వచ్ఛ జలాలు 50 వేల మందికి అందిస్తామని తెలిపారు. కానీ.. చివరిలో చతికిలపడి.. ప్రాజెక్టు లక్ష్యం నీరు గారిపోతోంది.



కుదప కృష్ణా జలాల సంపు వద్ద ఎప్పుడో సిద్ధమైన ప్రధాన ట్యాంకు, పైపులైన్

క్షేత్రంలో సమస్యలు అనేకం..

✪ ప్రాజెక్టు పనులు పూర్తిచేసినా.. నీటి పంపిణీకి సమస్యలు తప్పడంలేదు. ప్రాజెక్టు పురోగతి పర్యవేక్షణకు తగిన సిబ్బంది లేరు. ✪ కొత్తగా కట్టిన ట్యాంకులు.. పాత వాటిని చాలాచోట్ల ప్రాజెక్టుకు అనుసంధానించారు. ✪ గతంలో చేతి పంపులకు మోటార్లను పెట్టి.. భూగర్భ జలాలను పాత ట్యాంకులకు ఎక్కించేవారు. ఇప్పటికీ ఆ కనెక్షన్లను కొన్నిచోట్ల తప్పించలేదు. ✪ ట్యాంకు ఖాళీ అయితే.. మళ్లీ భూగర్భ జలాలను ఎక్కించేస్తున్నారు. ఈ భూగర్భ జలాలే కలుషితం అయ్యాయని ఏళ్లుగా గగ్గోలు పెడుతున్నారు. ✪ ఈ నీళ్లు సగం ట్యాంకులో ఉండగా.. కృష్ణా జలాలు వదులుతుంటే.. రెండూ కలిసిపోతున్నాయి. ✪ కొన్ని ప్రాంతాల్లో వాల్వులు సరిగా బిగించలేదు. దీంతో సంపుల్లో నీటిని ఎగువ ప్రాంతాలకు పంపింగ్ చేయడం కష్టమవుతోంది. ఆ ప్రెజర్‌కు పైప్‌లైన్లు ఊడిపోతున్నాయి. ✪ నల్లా కనెక్షన్లు గ్రామాలకు ఇచ్చినా.. అవీ సరిగాలేవు. నీళ్లు రావడం లేదనీ.. క్లోరినేషన్ సరిగా చేయడంలేదని తండావాసులు వాపోతున్నారు. చేసేదిలేక చాలా తండాల్లో క్యాన్ల నీటినే కొని తెచ్చుకుంటున్నారు.

కేంద్రీయ విద్యాలయానికి ముందడుగు

ఐదు ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి - నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ముందడుగు పడింది. రూ.3.75 కోట్ల విలువైన ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. 2023 సెప్టెంబరులో జరిగిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ సమావేశంలో నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తొలిసారి కేంద్రం పచ్చజెండా ఊపింది. తర్వాత ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేయడంతో.. ఎంపీ కేశినేని శివనాథ్ 2024 ఆగస్టు నుంచి పలుమార్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి నందిగామలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రాలను అందించారు. కేంద్రీయ విద్యాలయ ఉన్నతాధికారులనూ సంప్రదించారు. ఎట్టకేలకు 2025 అక్టోబరులో నందిగామకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ కేంద్రం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది.

ప్రస్తుతం రూ.40 లక్షలతో రహదారి నిర్మాణం: నందిగామలోని రాఘవపురంలో ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని.. స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఆ స్థలానికి సరైన మార్గం లేకపోతే.. రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో రహదారి ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ప్రభుత్వం తాజాగా జీవో నంబరు 145 జారీ చేస్తూ.. ఆ ఐదు ఎకరాలను అధికారికంగా కేటాయించింది. ఈసందర్భంగా కేంద్ర



గతంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విన్నవిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంపీ, ఎమ్మెల్యే సౌమ్య ధన్యవాదాలు తెలిపారు.

మంచి అవకాశం.. నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ద్వారా.. స్థానికంగా విద్యారంగానికి ఇదో మంచి అవకాశమని సౌమ్య తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యాలయాన్ని మంజూరు చేయించారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటనలతో కాలం వెళ్లదీశారని.. తాము వచ్చాక. కార్యరూపంలోకి తెచ్చామన్నారు.

డ్రగ్స్ కేసులో గ్రీష్మ కోసం వేట

మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి..

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో తాజాగా రాజేష్ అరెస్టుతో కదలిక వచ్చింది. దీంతో తప్పించుకుని తిరుగుతున్న మరో కీలక నిందితురాలైన ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ కోసం మళ్లీ వేట ప్రారంభించారు. ఇప్పటికే ఆమె కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆమె విజయవాడ కోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. ఇదే కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న మహేష్ విచారణలో గ్రీష్మ పాత్ర గురించి వెలుగులోకి వచ్చింది. ఇద్దరూ బెంగళూరులో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆ కళాశాలలో పలువురికి గ్రీష్మ డ్రగ్స్ సరఫరా చేసేదని తేలింది. ఈమె నుంచి మహేష్ కొనేవాడు. మహేష్ అరెస్టు తర్వాత నుంచి అజ్ఞాతంలోకి వెళ్లింది. ఈమెను ప్రశ్నిస్తేనే మత్తు మందు సరఫరా మూలాలు వెలుగులోకి వచ్చే వీలుంది. గతంలో ఆమె కోసం ప్రత్యేక బృందం గాలించినా ఫలితం లేకపోయింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన జగదీష్‌కుమార్, అఖిలేష్ విజయవాడ నుంచి తరచూ బెంగళూరు వెళ్లి మహేష్ నుంచి ఎండీఎంఏ కొని తెచ్చేవారని దర్యాప్తులో తేలింది. ఈమె ఫోన్‌ను పోలీసులు ట్రాక్ చేయగా.. గుడివాడ, హైదరాబాద్, బెంగళూరు చూపించింది. తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసింది. ఆమె స్నేహితుల ఫోన్లపై నిఘా ఉంచారు. వారి వేరే నంబర్లతో టచ్‌లో ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

సంకేతం.. సరిలేక సంకటం!



ఏలూరు రోడ్డులో చుట్టుగుంట కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని పనిచేయక వాహనచోదకులు తికమక పడుతున్నారు. మాచవరం నుంచి సీతారాంపురం వచ్చీ వెళ్లే దిశగా... ఏ సిగ్నల్ కూడా వెలగకపోవడంతో చోదకులకు ఆగాలో.. వెళ్లాలో తెలియకుంది. ముందుకు వెళితే సీసీ కెమెరాల్లో ఫొటోలు తీసి చలానాలు వేస్తారేమోనన్న భయంతో చాలా సేపు ఆగిపోతున్నారు. మిగిలిన వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ఆగాక కాస్త సమయం తీసుకుని అనుమానంతో ముందుకెళ్తున్నారు. - **ఈనాడు, అమరావతి**

సదా మా జ్ఞాపకాలలో సజీవంగా...

ప్రథమ వర్ధంతి



కీ॥శే॥ ఆచంట శివరాంప్రసాద్ (గణి) గారు

20.09.1950 - 11.03.2025

అపారమైన ప్రేమ.. అంతులేని ఆప్యాయత.. అందరి యెడల ఆదరణ..
అన్ని కలగలసిన అరుదైన వ్యక్తిత్వం మీది...
మా అందరి జీవితాలపై చిరకాలం నిలిచిపోయే చిరునవ్వు సంతకం మీది..
మీరు లేరన్నది ఒక చేదు నిజం.. మీతో గడిపిన ప్రతి క్షణం ఒక తీపి జ్ఞాపకం.. ఏడాది గడిచినా..
ఆ స్మృతులను స్మరించుకుంటూ మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని
భగవంతుడిని మనసారా ప్రార్థిస్తూ.. అంజలి ఘటిస్తున్నాము..

భార్య: ఆచంట కామేశ్వరి

కుమారుడు - కోడలు:
ఆచంట శ్రీకాంత్ - బిందు భార్గవి
మనుమలు: శ్రీహాన్, శ్రీనీత్

కుమార్తె - అల్లుడు:
మిక్కిలినేని రాజ్యలక్ష్మి - భానుప్రసాద్
మనుమడు: సంహిత్

పెద్దఅన్నయ్య: ఆచంట చంద్రశేఖరరావు (లేటు) - బాలామణి (రాణి)
ఆచంట రామబ్రహ్మం (రాము) - ఉమ
ఆచంట గోపిచంద్ - పావని
దేవినేని దుర్గాభవాని - శ్రీనివాస్

చిన్నఅన్నయ్య: ఆచంట వెంకటసుబ్బారావు (లేటు) - లక్ష్మి
ఆచంట శ్రీనివాస్ - మాధవీలత
నందమూరి నాగమణి - చంద్రశేఖర్

మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

ఏ ప్రాణం పోకూడదని..



కంచె ధ్వని చేసేలా, కాంతి పంట అంతా పడేలా ఏర్పాటు చేశారిలా...

రైతులు ఎండనక వాననక ఎంతో కష్టపడి పండించిన పంట జంతువుల బారిన పడి నష్టపోతుంటారు. దీనికి పరిష్కారంగా పొలం చుట్టూ అనధికారికంగా విద్యుత్తు కంచెలు ఏర్పాటు చేయడం వల్ల మూగజీవాలతో పాటు, రైతులు, మనుషులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి పరిష్కారంగా చిత్తూరు జిల్లా నింద్ర చవరంబాకం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు డి.మనోజ్, టి.అభినయ్ తమ చిట్టిబుర్రలకు పదును పెట్టి ఓ ఉపాయం కనుక్కున్నారు. పంటకు రక్షణగా తీగలతో ఏర్పాటు చేసిన కంచెకు ఖాళీ ప్లాస్టిక్ సీసాలలో రాళ్లు వేసి, మువ్వలు, గిలకలు వంటివి కట్టాలి. గాలికి లేదా ఏదైనా జంతువు ఈ కంచెను తాకగానే అవి కదిలి ధ్వని వచ్చేలా ఏర్పాటు చేయడంతో జంతువులు పంట జోలికి రాకుండా దూరంగా వెళ్లిపోతాయి. మరోవైపు ఒక చెట్టు లేదా కర్రకు అద్దాలు వేలాడదీసి వాటిపై టార్చిలైటు నుంచి వచ్చే కాంతి పడేలా ఏర్పాటు చేశారు. అద్దాలు గాలికి తిరుగుతూ, ఊగుతూ టార్చిలైటు నుంచి వచ్చే కాంతి అటూఇటూ పరావర్తనం చెందడం కారణంగా పొలం అంతా కాంతి కదులుతూ ఉండడంతో ఎవరో లైట్ వేస్తున్నారు.. వస్తున్నారని జంతువులు భ్రమించి పంట దరిచేరవని చెప్పారీ చిన్నారులు. ఆంధ్రప్రదేశ్ సైన్స్‌సిటీ ఆధ్వర్యంలో సైన్స్ సమగ్ర మహోత్సవ్-2కె26 పేరున రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి ఎంపిక చేసిన అత్యుత్తమ 30 ఆవిష్కరణలను విజయవాడ గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్‌లో శుక్రవారం ప్రదర్శించారు. ఇందులో భాగంగా మనిషిదైనా, మూగజీవానిదైనా ఏ ప్రాణమూ పోకూడదని విద్యార్థులు ఉంచిన ప్రదర్శన ఆకట్టుకుంది.

- ఈనాడు, అమరావతి

తాజాదనం తగ్గదు..



స్మార్ట్ ఫుడ్ ప్రొటెక్టర్ పనితీరు వివరిస్తున్న విద్యార్థులు

సాధారణంగా కూరగాయలు, పండ్లు తాజాదనం కోసం రిఫ్రిజిరేటర్లను ఉపయోగిస్తాం. ఇవి విద్యుత్తు ఉంటేనే పనిచేస్తాయి. పైగా ఖర్చుతో కూడుకున్నవి. ఫ్రిజ్ నుంచి వచ్చే క్లోరోఫ్లోరో కార్బన్ కారణంగా ఓజోన్ పొర దెబ్బతిని వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. పైగా ఫ్రిజ్‌లో ఉంచిన వాటిలో పోషక విలువలు సైతం తగ్గుతాయని, దీనికి ప్రత్యామ్నాయంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ఎస్‌ఎస్‌వీవీ ప్రభుత్వ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు వైష్ణవ్, విఘ్నేష్, మణికంఠ బయాలజీ ఉపాధ్యాయురాలు మేక రామలక్ష్మి ఆధ్వర్యంలో 'స్మార్ట్ ఫుడ్ ప్రొటెక్టర్' అనే నూతన పరికరాన్ని తయారు చేశారు. 'జింక్ నానోకోటింగ్' వేసిన అల్యూమినియం డబ్బాలో పండ్లు, కూరగాయలు ఉంచుతాం. వాటిపై ఒక పాత్రలో యాక్టివ్ కార్బన్, జియోలైట్ యాక్టివ్ కార్బన్ క్రిస్టల్స్ నింపిన బ్యాగు ఉంచుతాం. ఇవి తేమను పీల్చడం, పండ్లు, కూరగాయలు పండేటపుడు వచ్చే ఇథిలీన్ వాయువులను పీల్చుకుంటాయి. ఈ కారణంగా త్వరగా అవి పాడవ్వవు. బయట వాతావరణం కన్నా 5 నుంచి 7 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ కారణంగా నాలుగు నుంచి వారం రోజుల వరకూ వస్తువులు పాడవ్వవని తెలిపారు. వాడకాన్ని బట్టి మూడు నుంచి 6 నెలలకు ఈ జియోలైట్ క్రిస్టల్స్ పనిచేస్తాయి. నానోకోటింగ్ కారణంగా సూక్ష్మజీవులు లోపలకు వెళ్లవు. మనకు కావాల్సినంత స్థాయిలో దీనిని తయారు చేసుకోవచ్చని, దీనికి రూ.800 ఖర్చు అయిందని చెప్పారు. ఇంకా ఈ స్మార్ట్ ఫుడ్ ప్రొటెక్టర్‌లో ఆహారం పాడైతే తెలిసేలా ఎరుపురంగు లైటుతో పాటు బజర్ మోగేలా, బాగుంటే ఆకుపచ్చరంగు లైటు, డిస్‌ప్లే సైతం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్‌సిటీ ఆధ్వర్యంలో సైన్స్‌సమగ్ర మహోత్సవ్-2కె26 పేరున రాష్ట్రవ్యాప్తంగా ఎంపికచేసిన ఉత్తమ ప్రదర్శనలలో భాగంగా విజయవాడ గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్‌లో శుక్రవారం ఈ ప్రదర్శన ఆకట్టుకుంది.

- ఈనాడు, అమరావతి

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల (బిజినెస్) వ్యాపార వర్గాల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల (బిజినెస్) వ్యాపార వర్గాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, నేడు, రేపు అన్ని కులాల (బిజినెస్) వ్యాపార వర్గాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (28 ఫిబ్రవరి & 1 మార్చి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు: 95501 28306 & 92475 20500 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

సీఎం చంద్రబాబు వల్లే సామాజిక మండలికి జీవం



ఛైర్మన్ బాలకోటయ్యను సన్మానిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక మండలికి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి జీవం పోశారని మండలి ఛైర్మన్ పోతుల బాలకోటయ్య తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక మండలి బోర్డు నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్దన్, ఎన్టీఆర్ జిల్లా సహకార పరపతి సంఘం అధ్యక్షులు నెట్టెం రఘురాం, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఉత్తర అమెరికా ప్రభుత్వ అధికార ప్రతినిధి కోమటి జయరాం, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ సంయుక్తంగా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సామాజిక మండలిని మూసేసిందని, దీని అవసరాన్ని గుర్తించి చంద్రబాబు జీవో 284 ద్వారా నూతన విధివిధానాలతో తిరిగి అమల్లోకి తీసుకు వచ్చారన్నారు. సాంఘిక సంక్షేమ డైరెక్టర్ లావణ్య వేణి, ఛైర్మన్ బాలకోటయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్, తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్ డి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కలల వారధి నిలిచింది!

కీలక సమయంలో ముందుకు సాగని పనులు



మాదిపాడు వద్ద కృష్ణా నదిపై నిర్మిస్తున్న వంతెన

జగ్గయ్యపేట గ్రామీణం, వత్సవాయి, అచ్చంపేట, న్యూస్‌టుడే

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు-ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల మధ్య కృష్ణా నదిపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు గత మూడు నెలలుగా ముందుకు సాగడం లేదు. కొన్ని డిజైన్లలో మార్పులకు ఆమోదం, గుత్తేదారు బిల్లుల కోసం ఎదురుచూపులతో ఈ పరిస్థితి ఏర్పడింది. సరైన సమయంలో పనులు సాగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

✪ నాబార్డు నిధులు రూ.60.54 కోట్ల అంచనాతో 13 పిల్లర్లతో 460 మీటర్ల పొడవున వారధి నిర్మాణం చేపట్టారు. విజయవాడకు చెందిన వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ టెండరు దక్కించుకుంది. కూటమి ప్రభుత్వం చొరవతో 2024 డిసెంబరులో పనులు ప్రారంభించింది.

✪ ఇప్పటి వరకు మాదిపాడు వద్ద రెండు పిల్లర్లు నిర్మించారు. వాటికి అవసరమైన



ప్రస్తుతం పడవల్లోనే ప్రయాణాలు

గడ్డర్లు, బీములు తయారుచేసి యార్డులో ఉంచారు. సుమారు రూ.5కోట్ల విలువైన పది శాతం పని పూర్తయ్యింది. ఈ సీజన్‌లో 5 పిల్లర్ల వరకు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

మూడు జిల్లాలకు ప్రయోజనం

✪ వంతెన నిర్మాణంతో పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలు, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ఈ జిల్లాల మధ్య ప్రయాణ దూరం 60 కి.మీ వరకు తగ్గుతుంది. మాదిపాడు ఆవలి ఒడ్డున ఉన్న సిమెంట్ ఉత్పత్తులు రవాణా సులభతరం అవుతుంది. పుణ్యక్షేత్రాలు మాదిపాడు సత్తెమ్మ దేవాలయం, పులిచింతల ప్రాజెక్టు, అమరావతి, వేదాద్రి, ముక్త్యాల, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం, కోటిలింగాల క్షేత్రం సందర్శనకు దూరం తగ్గుతుంది. పడవ ప్రయాణాలు వల్ల ప్రమాదాలు తగ్గుతాయి. రవాణా, పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుంది.

పది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

కొన్ని డిజైన్ల మార్పులతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల వద్దకు ప్రతిపాదనలు వెళ్లాయని వాటి ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని రూ.5 కోట్ల పనులకు రూ.3 కోట్లు బిల్లు మంజూరైందని గుత్తేదారు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పది రోజుల్లో నిర్మాణాలను తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, సీపీ రాజశేఖరబాబు, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి, డీసీపీ సరిత తదితరులు

డ్రగ్స్‌తో భవిత చిత్తు చేసుకోవద్దు

కంచికచర్ల, న్యూస్‌టుడే : యువత భవితను చిత్తు చేస్తున్న డ్రగ్స్‌ను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహాయజ్ఞం చేస్తుందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు చేస్తున్న సైకిల్ ర్యాలీ కంచికచర్లకు చేరుకున్న సందర్భంగా స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, యువశక్తి దేశ నిర్మాణానికి ఉపయోగపడాలన్నారు. యువత చేతిలో ఉండాల్సింది డ్రగ్స్ కాదని, ఉద్యోగాల ఆఫర్ లెటర్లు అని అన్నారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ వద్దు..డ్రీమ్స్ ముద్దు అని నినదించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ..ప్రభుత్వం డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు కృతనిశ్చయంతో ఉందని, అందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ...యువశక్తి దేశానికి బలంగా మారాలని, తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేయాలని, డ్రగ్స్‌కు బలి కావొద్దని విద్యార్థులకు సూచించారు. సీపీ రాజశేఖరబాబు, డీసీపీ సరితలు మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసులతో విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయన్నారు. సైకిల్ యాత్రలో పాల్గొన్న మహిళా పోలీసులు రేవతి, హైమావతి, శైలజ, త్రివేణి, ఉషారాణిలను ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు ర్యాలీగా వచ్చిన మహిళా పోలీసులకు కంచికచర్ల పోలీసులు, కళాశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీపీ లక్ష్మీనారాయణ, నందిగామ ఏసీపీ బాలగంగాధర్‌తిలక్, గ్రామీణ సీఐ డి.చవాన్, ఎస్సైలు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్స్యకార వర్గాల ఐక్యతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, వేదికపై వెంకటరమణ, పెద్దిరాజు తదితరులు

రాఘవయ్య పార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్యకార వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఐక్యతతో పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ... మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లాల వారీగా మత్స్యకారుల వివరాలు సేకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యోగాలు.. రాజకీయాల్లో మన స్థానం ఏంటనే విషయాన్ని ప్రశ్నించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ.. అపారమైన అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ కేవలం వేటకే పరిమితమై.. వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రతిఒక్కరికీ వివరించి రాయితీలు అందేలా చూడాలని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని రవీంద్ర పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ... మత్స్యకార వర్గాలన్నీ రాజకీయ పార్టీలకు అతీతంగా ఐకమత్యంతో ఉంటూ సమస్యలపై చర్చించాలని అన్నారు. జిల్లా స్థాయిలో కొత్త కమిటీలు ఏర్పాటైనందున సభ్యులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడకుదిటి అర్జున, చింతకాయల ముత్యాలు, కాటా గోపి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు చిలకలపూడి పాపారావు, బొమ్మన శ్రీధర్, కొల్లు పెద్దిరాజు, సీఆర్ రాజన్, భాజపా నాయకుడు బొమ్మిడి గణేష్, కార్పొరేషన్ల డైరెక్టర్లు, రాష్ట్రంలోని ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ

చిట్టినగర్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల నిర్వహణలో అత్యంత పారదర్శకత, సమన్వయంతో లోపాలకు తావు లేకుండా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో మార్చిలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యాశాఖ జిల్లా అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తతతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల స్వీకరణ, భద్రత, పంపిణీ ప్రక్రియలో గోప్యత వంటివి పరీక్షా కేంద్రాల్లో తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మంచినీటి సౌకర్యం, కూర్చునేందుకు బల్లలు, సీటింగ్ ఏర్పాట్లు కల్పించాలని వివరించారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. ప్రతి చీఫ్ సూపరింటెండెంట్ తమ పరిధిలోని సిబ్బందితో ముందస్తు సమావేశాలు నిర్వహించి బాధ్యతలను స్పష్టంగా వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల డీవైఈవోలు, డీసీఈబీ కార్యదర్శి ఎస్‌కె ఉమర్ అలీ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.రాంబాబు, చీఫ్ సూపరింటెండెంట్లు, పలువురు అధికారులు, జిల్లా సమన్వయకర్తలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని మృతి కేసు విచారణాధికారిగా రఘునందన్

భవానీపురం: ఇటీవల విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన వైద్య విద్యార్థిని బి.దీపిక మృతిపై విచారణ చేసేందుకు విచారణాధికారిగా డీఎంఈ రఘునందన్‌ను నియమించారు. ఏపీ వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను.. విద్యార్థిని తండ్రి ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు సచివాలయంలో శుక్రవారం కలిసి దీపిక మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సౌరభ్‌గౌర్ విచారణాధికారిగా రఘునందన్‌ను నియమించారు. మార్చి 2న ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందిస్తామని కోదండరామిరెడ్డి తెలిపారు.

కాలువలకు 4,320 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి శుక్రవారం 4,320 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అందులో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 1,702, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 2,618 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.



101వ జయంతి
మా జీవితాలలో వెలుగులు నింపిన మహనీయులు, మహేశ్వరి ఫైనాన్స్ వ్యవస్థాపకులు మా తండ్రి గారు కీ॥శే॥ మాజేటి వెంకట్రావ్ గారి 101వ జయంతి సందర్భంగా మరచిపోలేని మధుర జ్ఞాపకాలను మననం చేసుకుంటూ..
కుమారులు: కీ॥శే॥ మాజేటి ప్రభాకరరావు, మాజేటి రామ్‌ప్రసాద్, మాజేటి కిషోర్
కుమార్తె: అద్దేపల్లి నిర్మల మరియు కుటుంబ సభ్యులు
కీ॥శే॥ మాజేటి వెంకట్రావ్ గారు 1925 - 2026
శివాలయం వీధి, విజయవాడ-1 ✆ 92471 04767

'ఉపాధ్యాయులపై యాప్‌ల భారం'



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాద్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు ఎక్కువగా ఉన్నాయని, యాప్‌ల భారం అధికంగా ఉందని చెప్పారు. నూతన ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు వేములపల్లి రాధిక మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యవస్థ మొత్తం పదో తరగతి పరీక్షలపైనే దృష్టి పెట్టిందని, మిగతా తరగతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమగ్ర లక్ష్యాలు సాధించడానికి మొత్తం విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలని కోరారు. 100 శాతం ఫలితాలు సాధించాలని పదో తరగతి విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన పీఆర్సీతో పాటు మధ్యంతర భృతి ఇస్తామని చెప్పి 20 నెలలు గడుస్తున్నా.. స్పందన లేకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే పీఆర్సీ వేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు నయీమ్ అహ్మద్, వెంకట దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి, పక్కన అధికారులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తిరువూరు ఆర్డీవో కె.మాధురి ఆదేశించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, తహసీల్దార్ వి.రాజకుమారి, జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, సర్పంచి డి.రామకృష్ణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు: నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడ గ్రామీణ డీసీపీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన నెమలి ఆలయాన్ని శుక్రవారం సందర్శించి ప్రాంగణంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, ట్రాఫిక్, సీసీ కెమెరాలు, భక్తుల రాకపోకల సమయంలో తొక్కిసలాట లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ కె.గిరిబాబు, ఎస్సై జి.అనిల్ పాల్గొన్నారు.

252 మంది విద్యార్థుల గైర్హాజరు

మాచవరం, న్యూస్‌టుడే: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంలో శుక్రవారం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షకు 252 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. మొత్తం 2,298 మంది విద్యార్థులకు గాను.. 2,046 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాలోని 41 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని ఆయన తెలిపారు.

నాణ్యమైన వ్యవసాయోత్పత్తులు అందించడమే ధ్యేయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఫుడ్ బాస్కెట్ ద్వారా స్థానికంగా ఉత్పత్తయ్యే నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందించడమే లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.శంకర్ నాయక్ అన్నారు. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అభ్యున్నతి కోసం రెడ్డిగూడెం, ఎ.కొండూరు, జి.కొండూరు మండలాల ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులతో వెంకటేశ్వరనగర్‌లోని రైతు నిలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అవుతున్న పంటల మార్కెటింగ్, ధరల స్థిరీకరణ, రైతులకు నేరుగా లాభాలు చేకూరే విధానాలపై చర్చించారు. కూరగాయలు, ధాన్యాలు, పండ్లను సమీకరించి సరైన ప్రణాళికతో మార్కెటింగ్ చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులను సమన్వయం చేసుకొని ఉత్పత్తుల సేకరణ, నిల్వ, రవాణా అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, న్యూట్రిషన్ అధికారులు మౌనిక, కుసుమ, వివిధ మండలాల కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -140 రిటైల్ ధర 167 చికెన్ విత్ స్కిన్ - 242 చికెన్ స్కిన్‌లెస్ - 276.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 8142292071

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువుపెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, విజయవాడ: శ్రీశరణంలాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

REAL ESTATE

FLAT FOR SALE

KANURU

100% బ్యాంక్ లోన్‌తో కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధంగా ఉన్న న్యూ 2BHK & 3BHK తూర్పు ఫేస్ Flats అమ్మకం. ✆ 81214 07585.

GENERAL

Paradise: 2/3BHK Flat at Paradise, Hayathanagr near LB Nagar. Gated Community with Club House & Amenities 2BHK from Rs.52 Lacs onwards. Modi Builders-7677120120.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

2BHK, 1015 Sft, North East Corner Flat at LIC Colony Gunadala Road, Vijayawada for Sale. Ph: 9491130821, 9440609745.

విజయవాడ క్రీస్తు Govt హాస్పిటల్ దగ్గర NTR కాలనీలో న్యూ 4BHK ప్రీమియం ఫ్లాట్, (3,200Sft) ఫ్లోర్‌కి 1ఫ్లాట్ అమ్మబడును. ✆ 79957 29464.

VJA, ప్రజాశక్తి నగర్ నారాయణస్కూల్ ప్రక్కన గ్రూప్‌హౌస్ నందు గ్రౌండ్‌ఫ్లోర్ 1035చ||అ|| 2BHK ఫ్లాట్ కార్‌పార్కింగ్‌తో అమ్మకం. ✆ 99854 60188.

HOUSE FOR SALE

కంకిపాడు లాక్‌విలేజ్ 25సెంట్ల స్థలం అప్‌స్టేర్ బిల్డింగ్ +12 కొబ్బరి + 5 మామిడిచెట్లు + ప్రహరీ + W-N-SE స్థలం అమ్మబడును. ✆ 96198 61798 / 99898 15888

LAND FOR SALE

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం, 15 ఎకరాల మంచి వ్యవసాయ పొలం, NSP మేజర్ కాల్వ ఆనుకొని పొలం అమ్మబడును. Ph: 7842599975.

PLOT FOR SALE

TADIGADAPA

తాడిగడప బందరురోడ్డుకి 1Km (లిఖ్యా కాలనీ) కిలారు శ్రీరాములు గారి కాలనీలో వెంటనే ఇంటినిర్మాణమునకు అనువైన 100 చ||గ||ల నుండి స్థలములు అమ్మకమునకు కలవు. 81210 01123

GENERAL

అమరావతి విజయవాడకి చేరువలో, మైలవరంకి దగ్గరగా వెంచర్‌లో ప్లాట్లు కలవు గజం 2500 /- మాత్రమే. ✆ 9966744545

1చ||గ|| రూ.3000/- నుండి కంచికచర్ల అమరావతి రింగు రోడ్డు రైల్వేస్టేషన్ హైవేకి దగ్గరలో (నో బ్రోకర్స్) సంప్ర: 78939 42229.

అమరావతి - ధరణికోట మెయిన్‌రోడ్ ఫేసింగ్‌లో CRDA అప్రూవ్డ్ ప్లాట్లు అతితక్కువ ధరలో స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. ✆ 81858 61578.

726గ|| (15సెంట్లు) 3లక్షల 50వేలకే దర్శి దగ్గరలో ఇళ్లకి, తారురోడ్డుకి, ఎయిర్‌పోర్ట్‌కి, రైల్వేస్టేషన్‌కి దగ్గరలో (నో బ్రోకర్స్). ✆ 78939 42229.

WANTED

కొనుగోలు చేయుటకు 1300 S.Ft టు 2000 S.Ft వరకు గ్రౌండ్ ఫ్లోరు-కానూరు, పోరంకి & తాడేపల్లి ఏరియాలలో ఆఫీస్ కొరకు కావలెను ✆ 99669 98000

JOBS

Required Support and Marketing Staff Qual: B.Sc.(Computers) Exp. Preferred. Contact: Kireeti Soft Technologies Ltd. ✆ 98497 11644.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

Wanted B.Com Graduate or a CA Drop out Preferably Male to Work in an Audit Office. Mail your Resume to kowthahr@gmail.com and inform Pavan on ✆ 99596 11004.

Wanted Office Assistant with Tally Computer Knowledge @ Office Vijayawada One Town. ✆ 98668 26111.

క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ VJA ఆటోనగర్ ఆఫీస్ నందు గుమస్తాలుగా పని చేయుటకు 10 ఆపై చదివి 30సం||లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: 81798 68999

అమరావతి, విజయవాడ ఏరియా, పోరంకి ఏరియాలలో గేటెడ్ కమ్యూనిటీ ఫ్లాట్స్ మరియు CRDA అప్రూవ్డ్ ప్లాట్స్ సేల్స్ చేయుటకు టీమ్స్ కావలెను. ✆ 99125 12356

ఒంగోలులోని ప్రముఖ రెస్టారెంట్‌నందు పనిచేయుటకు మేనేజర్, కెప్టెన్, స్టీవర్డ్స్, హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Cell: 99850 95888, 96427 77756.

ఏపీలో ప్రముఖ మద్యం పంపిణీ సంస్థకు జిల్లా వారీగా అనుభవజ్ఞులైన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ అవసరం. జీతం : 30వేలు, TA/DAతో సహా ✆ 92463 63624, jobsimfl@gmail.com

ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలో పనిచేయడానికి రిటైర్డ్ వ్యక్తులు, గృహిణులు, వ్యాపార వ్యక్తులు, VRS & టెలీకాలర్స్ పార్ట్‌టైం/ఫుల్‌టైం వెంటనే కావలెను. 75691 71738

అనుభవంగల క్వాలిఫైడ్ నర్సులు ANM/GNM కావలెను. పున్నమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్, జడగం వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ ✆ 98852 22525

ప్రముఖ నిర్మాణ సంస్థలో ఆఫీస్ స్టాఫ్, సైట్ స్టాఫ్, టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మీడియేటర్స్ మరియు రియల్‌ఎస్టేట్ ఏజెంట్స్ కావలెను. ✆ 77024 66003 / 89777 59919.

SECURITY GUARDS

అమరావతి పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను, మంచిజీతం, ESI, PF మరియు ఇతర లాభాలు. సంప్రదించండి: 6305960882.

ప్రముఖ బ్యాంకులలో పనిచేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21 to 45, అర్హత: 10th, PF, ESI కలదు. ✆ 9652240528, 9704964931, 9491884025

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గోపినేనిపాలెం గ్రామానికి చెందిన మాడుగుల పుల్లారావు వైద్య చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు అనుమతి పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ జగ్గయ్యపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. తీవ్రగాయాలతో విజయవాడలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పుల్లారావుకు ఎమ్మెల్యే చొరవతో రూ.2.75 లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేశారు. సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.


అనుమతిపత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ★ జుజ్జూరు దక్షిణ ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుడు నాగేశ్వరరావు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మీర్జావలి సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు. ★ జుజ్జూరు తులసమ్మ బాయి ఏరియాలో కొన్ని కుటుంబాలకు తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా కార్యదర్శి మీర్జావలి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి కుళాయికి మరమ్మతులు చేయించారు. **-న్యూస్‌టుడే, వీరులపాడు**

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

కంచికచర్ల, న్యూస్‌టుడే : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో కంచికచర్ల తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు యాప్స్ భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల ఏపీటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

పరిశోధనలు.. ప్రజోపయోగం

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే : ప్రజలు రోజువారీ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా వీరి పరిశోధనలు జరుగుతున్నాయి. ఇద్దరు విద్యార్థులు ఇలాంటి రెండు నమూనాలు తయారు చేసి శెభాష్ అనిపించుకున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వారి నేపథ్యం, కృషిపై కథనం.

సైనికులకు తోడ్పడే పరికరం రూపొందించి.. నందిగామకు చెందిన యువకుడు **దర్శి అభిషిక్త్** మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ ఫైనల్ చదువుతున్నాడు. దేశ సైనికులకు ఉపయోగపడే మినీయేచర్ స్టెల్త్‌రోవర్ ప్రాజెక్టు రూపొందించారు. ఇది బంకర్లలో రెండు కిలోమీటర్ల దూరంలో దాగి ఉన్న శత్రువులను గుర్తించి ఫొటో తీస్తుంది. దీని ద్వారా శత్రువులను తుదముట్టించడానికి వీలుపడుతుంది. బొగ్గుగనులు కూలిన సమయంలో అందులో ఎంతమంది కూరుకుపోయారనే సమాచారాన్ని తెలుసుకోవచ్చు. అగ్నిప్రమాదాల్లో చిక్కుకున్న వారిని గుర్తించడానికి ఈ రోవర్ ఉపకరిస్తుంది. ఈ పరికరం తయారీకి రూ.5 వేలు ఖర్చయ్యిందన్నారు. గత ఏడాది కళాశాలలో నిర్వహించిన ప్రదర్శనలో ఈరోవర్‌కు ప్రథమ బహుమతి వచ్చిందని అభిషిక్త్ తెలిపారు.




ప్రాజెక్టు నమూనా చూపుతున్న ప్రిన్సిపల్ ఎం.శశిధర్, విద్యార్థులు

బాధితులకు అండగా.. వర్చువల్ రియాలిటీ తోడుగా... విపత్తుల వేళ బాధితులకు సహాయం అందించడానికి చాలా ఆటంకాలు తలెత్తుతాయి. ముఖ్యంగా వరదలు వచ్చిన సమయంలో ఆయా ప్రాంతాలకు వెళ్లి సహాయం అందించడం కత్తి మీద సామే. అటువంటి సమస్యలకు పరిష్కారంగా వర్చువల్ రియాలిటీ(వీఆర్) సాంకేతికత ఆధారంగా పని చేసే పరికరాన్ని తయారు చేసి శెభాష్ అనిపించుకున్నారు పరిటాల సమీపంలోని అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ(మూడవ సంవత్సరం) విద్యార్థులు **నరేంద్రరెడ్డి, దేవి శ్రీజ, గాయత్రి, స్రవంతి.** అధ్యాపకుల ప్రోత్సాహంతో తయారు చేసిన ఈ పరికరం మానవ రహితంగా బాధితులకు కావాల్సిన ఆహారం, ఔషధాలు తదితరాలను అందించడంలో సహాయ పడుతుంది.

గ్రామీణ మహిళల ఉపాధి కల్పనకు కృషి.. కేవీకేలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ రాచూరి ప్రభావతి గ్రామీణ మహిళలకు పుట్టగొడుగుల పెంపకం, టైఅండ్‌డై వస్త్రాల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలి చెందిన ఆమె ఎమ్మెస్సీ అగ్రికల్చర్, హోంసైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి బంగారు పతకం అందుకున్నారు. రైతులు పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో విషప్రభావానికి గురికాకుండా ప్రత్యేక దుస్తులకు డిజైన్‌చేసి పేటెంట్ పొందారు. జిల్లాలో మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణకు 100కుపైగా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఎక్కువ శిక్షణ శిబిరాలు నిర్వహించినందుకు అవార్డు అందుకున్నారు. కిచెన్ గార్డెన్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రభావతి

సాగులో సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ.. కేవీకేలో ఉద్యాన శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ కొత్త కడప లక్ష్మీకళ రైతులకు శాస్త్రవిజ్ఞానం అందిస్తున్నారు. గిద్దలూరుకు చెందిన ఆమె ఉద్యాన విభాగంలో సబ్జెక్టు మ్యాటర్ స్పెషలిస్ట్ (ఎస్ఎంఎస్)గా తనదైన ముద్రవేస్తున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. గవర్నర్ చేతులమీదుగా బంగారు పతకం అందుకున్నారు. మిరప, మామిడి సాగులో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు సూచిస్తున్నారు. అధిక దిగుబడినిచ్చే పండ్ల మొక్కల సాగును ప్రోత్సహిస్తున్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులు అమలు చేసేలా కృషి చేస్తున్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న లక్ష్మీకళ

అరుదైన వ్యాధులపై అవగాహనకే రన్

సీతారాంపురం: ప్రపంచ అరుదైన వ్యాధుల దినం సందర్భంగా అమరావతి రేర్ డీసీజెస్ ఆర్గనైజేషన్ (ఏఆర్‌డీవో) ఆధ్వర్యంలో స్థానిక టీఆర్‌టీఎస్ రోడ్డులోని శారద కళాశాల వద్ద శుక్రవారం '3కే రన్ ఫర్ రేర్-2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్‌డీవో స్థాపకురాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభారాణి సుంకర మాట్లాడుతూ...అరుదైన వ్యాధులపై అవగాహనకే రన్ నిర్వహించామని తెలిపారు. కండర క్షీణత (మస్కులర్ డిస్ట్రోఫీ), స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) వంటి అరుదైన వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

ప్రవేశ పరీక్షల తేదీ మార్పు

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో జరగాల్సిన ప్రవేశ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు ప్రిన్సిపల్ [illegible]

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక


పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: తోటరావులపాడు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను సత్కరించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపించాలని డీవైఈవో యు.గురునాథం సూచించారు. సర్పంచి ఎం.లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, కమిటీ ఛైర్మన్ కె.రాజశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముళ్లపాడు రోడ్డు పునర్నిర్మాణానికి శ్రీకారం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలుకు వచ్చే ముళ్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ముళ్లపాడు అడ్డరోడ్డు వద్ద నుంచి పెనుగంచిప్రోలు మీదుగా మక్కపేట వరకు 14 కి.మీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ముళ్లపాడు అడ్డరోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు కనుమరుగై కంకర రాళ్లు పైకి లేచి, గుంటలు పడ్డాయి. దీనివల్ల ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని 'ఈనాడు'లో పలు కథనాలు ఇవ్వటంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. అమ్మవారి తిరునాళ్ల మార్చి 4 నుంచి ప్రారంభమౌతుండటంతో పనులు చేపట్టారు. ముళ్లపాడు అడ్డరోడ్డు సమీపంలోని 0.6 కి.మీ నుంచి 2.6 కి.మీ(ముళ్లపాడు) వరకు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. రెండు రోజుల్లో రోడ్డు నిర్మించనున్నారు. 2.6 కి.మీ నుంచి 14.7 కి.మీ వరకు రోడ్డు అత్యవసర మరమ్మతులకు రూ.39 లక్షలు మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బీ డీఈ పరుశురాముడు తెలిపారు.

లేగదూడల ప్రదర్శన

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. 52 దూడలు ప్రదర్శనకు రాగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడల యజమానులకు బహుమతులను సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ అందజేశారు. పాడి పశువులు, లేగ దూడల పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అధికారులు నాగభూషణం, మోషిన్, వెంగళరావు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ నాయక్, ప్రదీప్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రాఘవాపురం ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం హబ్ అంగన్‌వాడీ కేంద్రాలపై శిక్షణ నిర్వహించారు. ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వైవీ శైలజ చిన్నారుల్లో భాషాభివృద్ధి, శరీరాభివృద్ధి, సామాజిక భావోద్వేగాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి మూడు మాసాలకోసారి తల్లులకు వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు. మాగల్లు సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపరువైజరు తారాబీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శైలజ

మురుగు కాలువలో పూడికతీత

కంచికచర్ల, న్యూస్‌టుడే : స్థానిక విజయరాణి పాఠశాల సమీపంలో డ్రెయిన్‌లో వ్యర్థాలు చేరి మురుగు కదలక..రహదారిపై చేరుతుందని ఈనాడులో ఈనెల 26న 'వీధిలో మురుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం ఉదయం వీధిలోని కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించారు. రహదారిపై చేరిన మురుగును శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నందిగామ గ్రామీణం: మాగల్లు జడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాలసురక్ష(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక విలేజ్‌క్లినిక్ సీహెచ్‌వో వర్షిణి 105 మంది విద్యార్థులకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఎత్తు, బరువు తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కొలతలు నమోదు చేస్తున్న సీహెచ్‌వో వర్షిణి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వైభవంగా సీతారాముల కల్యాణం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో రామకోటి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని జయన రామగోవింద్, కవిత, నాగవెంకట సతీష్, జ్యోతిర్మయి దంపతులు కన్యాదాతలుగా చేయించారు. స్వామివారికి తలంబ్రాలు, నూతనవస్త్రాలు బహూకరించారు. భక్తులు కనులారా కల్యాణం వీక్షించారు. శ్రీరామపట్టాభిషేకం వేడుక నిర్వహించారు. నోరి నారాయణమూర్తి(తెనాలి) సుందరాకాండ కథాగానం వీనులవిందుచేసింది. కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. బాలాజీ గణపతి సచ్చిదానంద దత్తాత్రేయస్వామి భజన సమాజం సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. రామకోటి గ్రంథాలను పూజించారు. మహంకాళి వెంకన్న, మౌళి బృందం అయ్యప్ప భక్తిపాటలు ఆలపించింది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి వెంకట సత్యనారాయణగుప్తా, కోశాధికారి కొత్త నాగప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

జుజ్జూరులో యజ్ఞం

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే : జుజ్జూరులోని శ్రీయజ్ఞ తత్వ దేవాలయం ప్రాంగణంలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రథమాగ్నిష్టోమ యజ్ఞం నిర్వహిస్తున్నారు. లోకకల్యాణం కోసం మూర్తి వేంకట లక్ష్మీనరసింహ, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మూడోరోజు కార్యక్రమంలో భాగంగా వేద పండితులు మంత్రోచ్ఛారణతో యజ్ఞ క్రతువులు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వీరులపాడు, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను జుజ్జూరులోని జల్లి ఏసోబు సామాజిక భవనంలో శనివారం నిర్వహించనున్నట్లు ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. 2024-25 సంవత్సరంలో మండల పరిధిలోని 22 గ్రామాల్లో చేపట్టిన 1200 ఉపాధి హామీ పనులకు రూ.5.30 కోట్లు ఖర్చు చేశామన్నారు. మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల తీర్మానాలపై ఈ ప్రజా వేదికలో చర్చించనున్నారు.

వృద్ధులను ఆదరించాలి

నందిగామ గ్రామీణం: సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధులు, మానసిక దివ్యాంగులను ఆదుకోవాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ సూచించారు. [illegible]


మాట్లాడుతున్న న్యాయమూర్తి రియాజ్

తాగునీటి పథకం టెండర్ ఖరారు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు కృష్ణానది నుంచి తాగునీరందించే శాశ్వత మంచినీటి పథకం పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. నందిగామతోపాటు ఇతర పురపాలక సంఘాల పరిధిలో ఏఐఐబీ నిధుల ద్వారా మంచినీటి పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వంలో టెండర్లు పిలిచారు. దీనిలో మేఘా సంస్థకు అవకాశం దక్కింది. చందర్లపాడు మండలం కాసరబాదు నుంచి నందిగామకు తాగునీరందించే స్కీమ్ గత తెదేపా ప్రభుత్వంలో ఏఐఐబీ నిధులు మంజూరు చేశారు. టెండర్లు ఖరారు చేసి పనులకు 2019లో శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వంలో దీన్ని రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచి శంకుస్థాపన చేసినా పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.103 కోట్లతో తిరిగి అంచనాలు తయారు చేశారు. ఇందుకు ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య కృషి చేశారు. ఇప్పుడు టెండర్లు ఖరారు కావడంతో నిర్మాణానికి అవసరమైన స్థలాలను మున్సిపాలిటీ నుంచి అప్పగించాల్సి ఉంది. కృష్ణానది వద్ద ఇంటెక్ వెల్ నిర్మించనున్నారు. దీంతోపాటు అనాసాగరంలో స్టోరేజీ ట్యాంక్, పట్టణంలో మూడు చోట్ల రిజర్వాయర్లు నిర్మించనున్నారు. దీని కోసం మున్సిపాలిటీ అధికారులు స్థలాలను సిద్ధం చేశారు. పాలకవర్గం ఆమోదంతో స్థలాలను నిర్మాణసంస్థకు అప్పగించనున్నట్లు మున్సిపల్ ఏఈ ఫణిశ్రీనివాసరావు తెలిపారు. ఈపథకం పూర్తయితే 2050 సంవత్సరం వరకు పెరిగే జనాభాకు సైతం ఇబ్బంది లేకుండా పది ఎంఎల్‌డీల తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

భక్తిభావంతో పసుపు కుంకుమల సమర్పణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి పుట్టింటి పసుపు, కుంకుమలను రాజకీయాలకు అతీతంగా భక్తిభావంతో సమర్పించేందుకు సహకరించాలని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ కోరారు. అమ్మవారి పుట్టింటి గ్రామమైన అనిగండ్లపాడులో శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ మార్చి ఏడో తేదీన పుట్టిల్లు కొల్లా శ్రీనివాసరావు గృహం నుంచి అధికారికంగా పసుపు, కుంకుమలు సమర్పించనున్నారని చెప్పారు. గ్రామస్థులు తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఆలయానికి ఊరేగింపుగా వస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో అందరూ క్రమశిక్షణతో, భక్తితో కార్యక్రమం ఊరేగింపు విజయవంతంగా జరిపించాలని కోరారు. పార్టీల జెండాలు, పాటలు, నాయకుల డైలాగ్‌లు పెట్టడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ రోజు సాయంత్రం నిర్ణయించిన సమయానికే ఊరేగింపు బయలుదేరాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు గోపీబాబు, ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరావు, పొన్నం బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ

శివాలయ పనులు పరిశీలన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: [illegible]


ఆలయం వద్ద నాయకులతో మాజీ ఎంపీ లగడపాటి

7న అనిగండ్లపాడు బండ్లకే అనుమతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ తిరునాళ్లలో మార్చి 7న అమ్మవారి పుట్టింటి గ్రామమైన అనిగండ్లపాడు నుంచి వచ్చే పసుపు, కుంకుమ బండ్లు [illegible]


భూ యజమానులకు పరిహారం చెల్లించాలని తీర్మానం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో సీఎం రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా భూములిచ్చిన యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థానిక బాబుజగ్జీవన్‌రాం ఫంక్షన్ హాలులో శుక్రవారం ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. సీఎం రోడ్డు 35 అడుగుల వెడల్పు చేసేందుకు అంగీకరించి భూములిచ్చిన 55 మంది యజమానులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.38,60,355 నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. వీరిలో అన్ని పత్రాలు సమర్పించిన 8 మందికి రూ.6,91,601 పరిహారం చెల్లించడానికి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపాలిటీలో ఆప్కాస్ పరిధిలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పారిశుద్ధ్య విభాగంలో 17 ఉద్యోగాల భర్తీకి కొత్తవారిని నియమించడానికి పేర్లు ప్రతిపాదిస్తూ తీర్మానించారు. అదే విధంగా మున్సిపల్ పరిధిలో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ ఫణిశ్రీనివాసరావు, మేనేజర్ దేవి, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మున్సిపల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, కౌన్సిలర్లు

ద్విచక్ర వాహనం దగ్ధం

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం దగ్ధమైన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..అర్ధరాత్రి సమయంలో స్థానిక పాత భావనా థియేటర్ ఎదురుగా ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం మంటల్లో కాలుతుండడం గమనించిన రహదారిపై వెళ్లే వాహనదారులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను ఆర్పేశారు. అప్పటికే ద్విచక్ర వాహనం దాదాపుగా కాలిపోయింది. ఘటనా స్థలంలో అగ్గి పెట్టె లభించడంతో ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ద్విచక్ర వాహనం కాల్చారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిమాపక శాఖ అధికారులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనపై విచారణ నిర్వహిస్తున్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

స్వచ్ఛ రథం ప్రారంభం

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో పొడి చెత్తను సేకరించేందుకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని కూటమి నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, డిప్యూటీ ఎంపీడీవో వై.బసవ లింగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు నూతక్కి అపర్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతిచెందారు. శుక్రవారం చిల్లకల్లు గ్రామానికి చెందిన గంధం శివశంకర్ స్కూటీపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. శివశంకర్ కంచికచర్ల మండలం పరిటాలలో టీ స్టాల్ నిర్వహిస్తున్నారు.


మృతిచెందిన శివశంకర్

లాటరీ టిక్కెట్ల విక్రయాలపై పోలీసుల దాడులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లో నిషేధిత లాటరీ టిక్కెట్ల విక్రయాలపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో లాటరీ టిక్కెట్ల విక్రయాలపై ఈనెల 15న 'ఈనాడు'లో 'జోరుగా నిషేధిత లాటరీ టిక్కెట్ల విక్రయం' శీర్షికతో వచ్చిన కథనంపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పందించారు. గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కంచికచర్ల, నందిగామలో దాడులు చేశారు. నందిగామలో ముగ్గురు వ్యక్తులపై ఎస్సై సూర్యవంశీ కేసు నమోదు చేశారు. పోలీసులు దాడుల నేపథ్యంలో రెండు ప్రాంతాల్లో పలువురు విక్రయదారులు పరారైనట్లు సమాచారం.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో ... మీకు హృదయపూర్వక ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
శ్రీ P.V.S. స్వామి - ETVCK మణి గారు
GR II HM, ZPHS, కొల్లికుళ్ల
మిత్రులు
కందుల సుధాకర్
టి.వి. సుబ్రహ్మణ్యం

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
శ్రీ A.V.N.L. సుందర రామయ్య గారు
అసిస్టెంట్ ఇంజినీర్, పంచాయితీ రాజ్
పెనుగంచిప్రోలు, వత్సవాయి
మల్లెల పుల్లయ్యబాబు
దాములూరి మధుసూదనరావు
పంచుమర్తి కోటేశ్వరరావు
దాములూరి శ్రీనివాసచక్రవర్తి
నన్నపనేని దుర్గారావు
పసుపులేటి వెంకట పుల్లారావు

తూర్పు గోదావరి జిల్లాలో పరువు హత్య



- నవవరుడి ప్రాణాలుతీసిన బావమరుదులు
- వధువు డిప్యూటీ తహసీల్దార్

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం: వారిద్దరూ పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. తర్వాత ఎవరిదారిన వారు పయనించారు. కొన్నాళ్ల క్రితం మళ్లీ కలుసుకున్న సమయంలో స్నేహం పెరిగి ప్రేమగా చిగురించింది. అన్నవరం సత్యదేవుని దేవస్థానంలో వివాహం చేసుకొని ఒక్కటయ్యారు. కులాలు వేర్వేరు కావడం, తమ ఇష్టంలేకుండా సోదరిని పెళ్లి చేసుకున్నాడన్న కక్షతో వధువు అన్నదమ్ములిద్దరూ వరుడిని హతమార్చారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడిలోని వేములపల్లిలో జరిగిన ఈ దారుణంపై పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ద్వారపూడికి చెందిన వస్త్ర వ్యాపారి పోలిపల్లి వీరవెంకట సూర్యప్రకాశరావు (41), జడ్.మేడపాడుకు చెందిన అయినవిల్లి సంధ్య (40) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. సంధ్య ప్రస్తుతం రాయవరంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్. ఇరువురివీ వేర్వేరు కులాలు కావడం, ఆమె ప్రభుత్వ ఉద్యోగి కావడంతో మంచి సంబంధాలు తెస్తామంటూ సోదరులు అభ్యంతరం చెప్పి వివాహం చేసుకోవద్దని గతంలో హెచ్చరించారు. అయినా, వీరిద్దరూ గురువారం ఉదయం అన్నవరం సత్యదేవుని దేవస్థానంలో పెళ్లి చేసుకుని ద్వారపూడి చేరుకున్నారు. తమ పెళ్లి ఫొటోలను సంధ్య ఫైనాన్స్ వ్యాపారి అయిన తన అన్నయ్య చంద్రపాల్‌కు పంపించారు. అతను ఈ విషయాన్ని విజయనగరంలో ఉంటున్న మరో సోదరుడు, ఫార్మసిస్ట్ అయిన గిరిబాబుకు చెప్పాడు. తమ అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకున్నారనే కోపంతో సూర్యప్రకాశరావును హతమార్చాలని వధువు సోదరులిద్దరూ పథకం వేశారు. గురువారం రాత్రి 11.30 గంటలకు ద్వారపూడిలోని సూర్యప్రకాశరావు ఇంటికి వెళ్లారు. అమ్మకు ఆరోగ్యం బాగోలేదని చెల్లెలికి చెప్పి బయటకు వచ్చేలా చేశారు. ఆమె వెంట సూర్యప్రకాశ్ కూడా బయటకు రాగానే వాగ్వాదానికి దిగారు. పెనుగులాటలో అతను కింద పడిపోగా అప్పటికే సిద్ధం చేసుకున్న బండరాయితో ఐదారు దఫాలు అతని తలపై ఇరువురూ బలంగా మోదడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అక్కడి నుంచి సంధ్యను బలవంతంగా తీసుకొని వెళ్లిపోతుండగా మృతుడి తండ్రి సూర్యనారాయణ కేకలు వేశారు. స్థానికులు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలాన్ని అర్ధరాత్రి ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య పరిశీలించారు.

విషాదాంతమైన దశాబ్దాల స్నేహం

సూర్యప్రకాశరావు, సంధ్య పదో తరగతి వరకు ద్వారపూడి ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. అనంతరం ఆమె ప్రభుత్వ ఉద్యోగం సాధించి కపిలేశ్వరపురం ఆర్ఐగా పనిచేస్తూ, గతేడాది జూన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం రాయవరంలో పని చేస్తున్నారు. కొవిడ్ అనంతరం విశ్రాంత పోస్టుమాస్టర్ అయిన సంధ్య తండ్రి మరణించగా.. సూర్యప్రకాశరావు స్నేహితులతో కలిసి పరామర్శకు వెళ్లాడు. చాలా ఏళ్ల తర్వాత కలిసిన వీరి మధ్య స్నేహం పెరిగి, ప్రేమగా మారింది. సూర్యప్రకాశ్‌కు ఇటీవల కాలేయ శస్త్రచికిత్స కూడా జరిగింది. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు ఉండగా వారికి వివాహాలయ్యాయి. తమకు ఆదరువుగా ఉంటాడనుకున్న కుమారుడిని దారుణంగా పొట్టన పెట్టుకున్నారని మృతుడి తండ్రి సూర్యనారాయణ బోరున విలపించారు. పెళ్లి చేసుకున్న కొద్ది గంటలకే భర్తను తన అన్నదమ్ములే చంపేయడంతో సంధ్య షాక్‌కు గురయ్యారు.

మనఃశాంతిని కోరుకోవడం మిన్న



ఏదైనా అంశంపై సన్నిహితులతో వాగ్వాదం తలెత్తినప్పుడు మీ వాదన నిజమని నిరూపించుకునే బదులు నిశ్శబ్దం వహించడం, మనఃశాంతిని కోరుకోవడం మిన్న. వాదనలో మీరు గెలవచ్చు.. కానీ సంబంధాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. లేదా మీ మనఃశాంతికి విఘాతం కలగొచ్చు. వివేకంతో వ్యవహరించండి.

– అనుపమా సింగ్, ట్రావెలర్

నేటి నుంచి బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

రాష్ట్ర వ్యాప్తంగా 3.45 లక్షల మందికి పంపిణీకి చర్యలు

ఈనాడు, అమరావతి: మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా రాష్ట్రంలో 14 ఏళ్ల వయసు కలిగిన 3,45,377 మంది బాలికలకు ఉచితంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) నిరోధక టీకాలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో శనివారం జాతీయస్థాయి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. రాష్ట్రంలో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం రావివలస నుంచి సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు.

విశాఖ డెయిరీలో అన్నీ అక్రమాలే

- ఆర్థిక అవకతవకలు.. సహకార చట్టం ఉల్లంఘనలూ ఉన్నాయి
- మేం గుర్తించినవన్నీ నివేదిక రూపంలో ఇస్తాం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడికి తెలిపిన ప్రత్యేక సభా సంఘం

ఈనాడు, అమరావతి: విశాఖ డెయిరీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలిందని ఆ డెయిరీ అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక సభాసంఘం సభ్యులు స్పీకర్ అయ్యన్నపాత్రుడికి తెలిపారు. ఈ సంఘం గడువు ముగియడంతో.. స్పీకర్ శుక్రవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో ఈ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. '2024 జులైలో సభాసంఘాన్ని ఏర్పాటుచేశాం. అప్పట్లో రెండు నెలల్లో విచారించి నివేదిక ఇవ్వాలని స్పష్టంగా చెప్పాం. కానీ, అలా చేయలేదు. ఇప్పటికే రెండుసార్లు గడువు పెంచాం. ఇప్పుడు ఆ గడువూ ముగిసినా మీరు విచారణ నివేదికను ఎందుకు ఇవ్వట్లేదు? ఇప్పుడు మళ్లీ గడువు కోరుతున్నారు. సభా సంఘానికి చట్టబద్ధత లేకపోతే ఎలా?' అని స్పీకర్ సీరియస్‌గా ప్రశ్నించారు. 'నివేదిక ఇవ్వకపోవడానికి మీ మీపైనా ఏమైనా ఒత్తిడి ఉందా? అలాంటిదేమైనా ఉంటే సభాసంఘాన్ని రద్దు చేద్దాం. లేకపోతే ఇలా గడువు పెంచుకుంటూ పోతే పరువు తక్కువ కాదా' అని ప్రశ్నించారు. అందుకు సభ్యులు స్పందిస్తూ.. 'మాపైన ఒత్తిడేమీ లేదు. ఒకసారి విశాఖ డెయిరీ ప్లాంట్‌కు వెళ్లి పరిశీలించాం. విశాఖ కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, డెయిరీ షేర్ హోల్డర్లతో మాట్లాడాం. తర్వాత అధికారులను పిలిచి మాట్లాడాం. సహకార చట్టం ఉల్లంఘన, డెయిరీ ఆస్తులను ఆ సంస్థ యాజమాన్యం వారి సొంతానికి వాడుకోవడం వంటి అనేక అక్రమాలు, అవకతవకలు మా దృష్టికి వచ్చాయి' అని తెలిపారు. అలాగైతే నివేదిక ఎందుకు ఇవ్వట్లేదని స్పీకర్ ప్రశ్నించగా.. 'మా ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ తిరిగి బోర్డు సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఆయన రాగానే మేం సమావేశమై నివేదికకు తుదిరూపు ఇచ్చి మార్చి 5 లేదా 6న మీకు సమర్పిస్తాం' అని తెలిపారు. స్పీకర్‌ను కలిసినవారిలో సభాసంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, ఆదివిష్ణుకే రంగారావు, గౌతు శిరీష, దాట్ల సుబ్బరాజు ఉన్నారు.

సీఎస్‌గా సాయిప్రసాద్ నేడు బాధ్యతల స్వీకరణ



ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్ ఉద్యోగ విరమణ అనంతరం నూతన సీఎస్‌గా సాయిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం గతేడాది నవంబరు 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట గ్రామానికి చెందిన సాయిప్రసాద్.. శనివారం ఉదయం 11.33 గంటలకు నూతన సీఎస్‌గా సచివాలయంలో బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కీలక పదవులు నిర్వహించారు. 2024 జూన్ నుంచి జలవనరులశాఖ కార్యదర్శిగా, 2025 జనవరి నుంచి ముఖ్యమంత్రి ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా ప్రభుత్వం ఆయనకే అప్పగించింది. 2019-24 మధ్య కాలంలో ఆయన ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీ, ఇంధనశాఖ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏగా వ్యవహరించారు.

విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన విజయ్ భార్య



సంగీత, విజయ్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నుంచి విడాకులు కోరుతూ ఆయన భార్య సంగీత కోర్టును ఆశ్రయించారు. తమిళనాడులోని చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో ఈ నెల 24న ఆమె పిటిషన్ వేయగా, దాన్ని అక్కడి ఫ్యామిలీ కోర్టుకు మార్చారు. 2021లో ఓ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడినట్లు తనకు తెలిసిందని, ఆమెతో సంబంధాన్ని తెంచుకుంటానని విజయ్ తనకు హామీ ఇచ్చినా నెరవేర్చలేదని పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఇద్దరూ విడిపోయి జీవిస్తున్నామని, భార్యాభర్తల బంధానికి విజయ్ ద్రోహం చేశారని, విడాకులు ఇవ్వాలని సంగీత అందులో కోరారు. ఈ పిటిషన్ ఏప్రిల్ 20న విచారణకు రానుంది. ఆ రోజు విజయ్ కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆయనకు నోటీసు ఇచ్చింది. విజయ్, సంగీతలకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గేట్ లేని టోల్

- త్వరలో బారియర్‌లెస్ టోల్‌ప్లాజాలు
- వాహనం ఆపక్కర్లేకుండానే వెళ్లిపోవచ్చు
- విజయవాడ బైపాస్, కాజ ప్లాజాల్లో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: హైవేపై ఎంత వేగంగా వెళ్లినా. . టోల్‌ప్లాజా వద్ద మాత్రం కొన్ని సెకన్లు ఆగాల్సి వస్తుంది. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ.. అది రీడ్ అయ్యాక, ఆ టోల్ బూత్ ముందుండే గ్రీన్ లైట్ వెలిగి, అక్కడి బారియర్ పైకి లేస్తేనే వాహనం ముందుకెళ్లాల్సి ఉంటుంది. వారాంతాలు, పండగ సెలవులప్పుడు వాహనదారులు టోల్‌ప్లాజా దాటడానికి మరింత ఎక్కువ సమయం నిరీక్షించక తప్పడం లేదు. అయితే వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే దూసుకెళ్లిపోయేందుకు మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) విధానాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) త్వరలో అమలు చేయనుంది. ఈ కొత్త విధానాన్ని కోల్‌కతా- చెన్నై హైవేలో విజయవాడ- గుంటూరు మధ్య ఉన్న కాజ టోల్ ప్లాజా, విజయవాడ బైపాస్‌లో వెంకటపాలెం వద్ద ఉండే టోల్‌ప్లాజాల్లో అమలు చేయనున్నారు.

ఫాస్టాగ్ రీడర్, అధునాతన కెమెరాలు

- ఈ విధానం అమలు చేసే ప్లాజాలో టోల్‌బూత్స్, బారియర్స్ ఉండవు.
- టోల్‌ప్లాజాలో పైన శాటిలైట్ ఆధారిత జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ ఫాస్టాగ్ రీడర్, ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు అమరుస్తారు.
- వాహనం ప్లాజాలోకి వస్తుండగా, కొంత దూరం నుంచే దాని నంబరు ప్లేట్‌ను ఏఎన్‌పీఆర్ కెమెరా గుర్తిస్తుంది. ఆర్ఎఫ్ఐడీ ఫాస్టాగ్ రీడర్ ఆ వాహన ఫాస్టాగ్‌ను రీడ్ చేసి, టోల్‌ఫీజును వసూలు చేస్తుంది.
- ఇదంతా వాహనం టోల్‌ప్లాజా లోపలికి వచ్చేలోపే అయిపోతుంది. దీంతో వాహనం ఆగాల్సిన అవసరం ఉండదు.
- ఫాస్టాగ్ లేని వాహనాలు చివరి లైన్‌లో వెళ్లి, అక్కడ ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, యూపీఐ చెల్లింపు చేసి వెళ్లొచ్చు. దీనివల్ల టోల్‌ఫీజులో మరో 25 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.
- యూపీఐ చెల్లింపు కాకుండా, నగదు చెల్లించేందుకూ అక్కడ ఏర్పాటు ఉంటుంది. కానీ టోల్‌ఫీజుకు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది.

బూత్, బారియర్ లేకుండా..

కాజ టోల్‌ప్లాజాలో ప్రస్తుతం ప్రతి లైన్‌కు బూత్, బారియర్ ఉన్నాయి. ముందుందు వీటిని తీసేస్తారు. విజయవాడ బైపాస్ మార్చి ఆఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక టోల్ వసూలు చేయనున్నారు. ఇందులో వెంకటపాలెం సమీపంలో బూత్‌లెస్ ప్లాజా ఏర్పాటు చేశారు. కేవలం బారియర్స్ మాత్రమే ఉన్నాయి. ముందుందు అదీ తొలగిస్తారు.



టోల్‌గేట్‌లో మీరూ పెట్టుబడి పెట్టొచ్చు

- విజయవాడ- చిలకలూరిపేట హైవేలో అవకాశం

విజయవాడ నుంచి చిలకలూరిపేట వరకు 69.4 కి.మీ. మేరకు ఉన్న కోల్‌కతా- చెన్నై హైవేలో ప్రజలు పెట్టుబడి పెట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ అవకాశం కల్పిస్తోంది. పబ్లిక్ ఇన్విట్ పేరిట పెట్టుబడులు స్వీకరించనుంది. ప్రస్తుతం వివిధ హైవేల్లో టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) విధానం అమలు చేస్తోంది. ఓ టోల్‌ప్లాజా పరిధిలో 15 ఏళ్లకు ఎన్ని వాహనాలు వెళ్తాయో అంచనా వేసి, ఆ మొత్తాన్ని ముందే చెల్లించే సంస్థలకు ఆ సెక్షన్లు అప్పగిస్తారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరం - అనకాపల్లి మధ్య కొన్ని టోల్‌ప్లాజాల్లో టీఓటీ విధానం ఉంది. ఇలాంటివాటిలో ప్రజలే పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పించాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. అందులోని పబ్లిక్ ఇన్విట్ విభాగం.. ఓ హైవే సెక్షన్‌లో 15 ఏళ్లలో టోల్ ద్వారా వచ్చే మొత్తాన్ని అంచనా వేసి.. దానిని ప్రజల నుంచి పెట్టుబడులుగా స్వీకరించి, ఎన్‌హెచ్ఏఐకి ఇస్తుంది. పబ్లిక్ ఇన్విట్ విభాగమే అక్కడి టోల్ నిర్వహిస్తుంది. టోల్ వసూళ్లలో పెట్టుబడి కంటే అదనంగా వచ్చే మొత్తాన్ని ప్రజలకు లాభాల రూపంలో చెల్లిస్తుంది. దీనికి దేశ వ్యాప్తంగా ఐదు సెక్షన్లను ఎంపిక చేశారు. ఇందులో మన రాష్ట్రంలోని విజయవాడ- చిలకలూరిపేట సెక్షన్ ఉంది. ఇదే హైవేలో తమిళనాడు పరిధిలో తడ- చెన్నై సెక్షన్ 33 కి.మీ. కూడా ఎంపిక చేశారు. త్వరలో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెప్పారు.

ఐఆర్ఆర్ కేసులో అభ్యంతరాల దాఖలుకు గడువు

మార్చి 11వ తేదీకి తదుపరి విచారణ

ఈనాడు - అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో అభ్యంతరాలను ఫైల్ చేసేందుకు ఫిర్యాదికి కోర్టు గడువు ఇచ్చింది. వైకాపా హయాంలో సీఐడీ నమోదు చేసిన ఈ కేసు శుక్రవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. ఫిర్యాది అయిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతని తరపున న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. 2024లో సీఐడీ ఫైల్ చేసిన అభియోగపత్రం వివరాలు, 2026లో దాఖలు చేసిన కేసు ఉపసంహరణ పిటిషన్ కానీ తమకు ఇవ్వలేదన్నారు. పోలీసులు కోర్టులో ఫైల్ చేసిన ప్రతి ఉత్తర్వు నకలు ఫిర్యాదికి ఇవ్వాల్సి ఉన్నా.. అందజేయలేదన్నారు. తమకు గత రాత్రి మాత్రమే 450 పేజీల ఆర్‌సీఎస్ ప్రొసీడింగ్స్ ఇచ్చారనీ, అది చదివి అభ్యంతరాలు ఫైల్ చేసేందుకు గడువు కావాలని కోర్టును శ్రావణ్ కుమార్ కోరారు.

- సీఐడీ తరపున న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి వాదనలు వినిపించారు. ఈ కేసుకు సంబంధించి ప్రతి పత్రాన్ని ఫిర్యాదికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి భాస్కర్‌రావు జోక్యం చేసుకుంటూ. . మరోసారి పరిశీలించి, ఏ పత్రం ఇవ్వాలో అవి ఇస్తామన్నారు. ఫిర్యాది తన అభ్యంతరాలు దాఖలు చేసేందుకు విచారణను వచ్చే నెల 11వ తేదీకి వాయిదా వేశారు.
- ఆధారాలు ఉన్న ఐఆర్ఆర్ కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద మూసివేయాలని చూస్తున్నారని ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలోని కోర్టు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని ఆధారాలు ఉన్న పెద్ద కేసును మూసివేయాలని చూడడం అన్యాయమన్నారు. అధికారంలో ఉన్నామని ఏమైనా చేయొచ్చు అని అనుకోవడం తగదన్నారు.

మ్యూల్ ఎకౌంట్స్ కేసు నిందితుడి లొంగుబాటు వాయిదా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మ్యూల్ ఎకౌంట్స్ కేసులో నిందితుడు సుబ్రమణి రాజా వెంకట్ లొంగుబాటు వాయిదా పడింది. ఈ కేసులో ఏ5గా ఉన్న వెంకట్‌ను పట్టుకునేందుకు విజయవాడ నుంచి సైబర్ క్రైం ప్రత్యేక బృందం చెన్నైలోని తిరువొత్తియార్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. నిందితుడి కుటుంబ సభ్యులకు ఇప్పటికే పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో నిందితుడిని శుక్రవారం విజయవాడ తీసుకువస్తామని అతని తరపు న్యాయవాది పోలీసులకు తెలిపారు. అయితే శుక్రవారం ఆయన విజయవాడ రాలేదు. సోమవారం వచ్చి లొంగిపోతాడని న్యాయవాది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతను పట్టుబడితేనే మ్యూల్ ఎకౌంట్స్ కేసులో కీలక అంశాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు అంటున్నారు.

అంతర్ వర్సిటీ పురుషుల చెస్ పోటీలకు 'కేఆర్‌యూ' జట్టు



క్రీడాకారులతో రఘురామ్, వెంకటేశ్వరరావు, మన్మథరావు, తిలక్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులోని భారతీదాసన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల చెస్ పోటీలో తలపడే కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) జట్టును.. ఎంపిక కమిటీ ఛైర్మన్, సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రఘురామ్ శుక్రవారం వెల్లడించారు. పి.జ్యోతి కిరణ్, కె.వెంకట సాయి కుమార్‌రెడ్డి, వై.రాజేష్ (కేబీఎన్ కళాశాల), జి.హరిహర రుత్విక్‌రాజ్ (ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల), కోన వెంకట చరణ్ (ఆంధ్రా లయోల కళాశాల), ఎస్.మహేష్ (పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల) జట్టులో స్థానం సాధించారని పేర్కొన్నారు.

క్రీడాకారులకు టాటా అకాడమీల్లో శిక్షణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాప్ లీగ్-2026లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు అత్యుత్తమ స్థాయి శిక్షణ అందించేందుకు టాటా స్టీల్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చిందని శాప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫుట్‌బాల్, హాకీ, ఆర్చరీ బాలబాలికల విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి జెంషెడ్‌పూర్‌లోని టాటా అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు టాటా సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పేర్కొన్నారు.





ప్రతిభావంతులతో ప్రవీణ్ ఆదిత్య తదితరులు, ఏపీ సైన్స్ సిటీ సీఈవో వెంకటేశ్వర్లుకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి వర్షాలఖ్యాణి

శాస్త్రీయ ఆలోచనల వేదిక సైన్స్ సమగ్ర మహోత్సవ్

ఈనాడు, అమరావతి- ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఆవిష్కరణశక్తి, శాస్త్రీయ ఆలోచనలకు విజ్ఞాన ప్రదర్శన వేదికగా నిలిచింది. విజయవాడ గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్‌లో ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ సమగ్ర మహోత్సవ్-2కే26 ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, సైన్స్ సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. వాటిని రూపొందించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత ప్రవీణ్ ఆదిత్య జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదిత్య మాట్లాడుతూ.. చిన్న నాటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన విషయాలు తెలుసుకోవాలని, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. చిట్టూరి హైస్కూల్ సెక్రటరీ డి.సుజాత, ప్రిన్సిపల్ హారిక, స్టెమ్ వరల్డ్ ఎండీ సి.క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా.. ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2కే26'కు అరుదైన ఘనత లభించింది. ఫిబ్రవరి 23న.. రెండు గంటల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 'సైన్స్ సమగ్ర మహోత్సవ్' నిర్వహించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. రాష్ట్రంలోని 4,118 పాఠశాలల్లో ఏక కాలంలో 30 వేల మంది విద్యార్థులు ఈ ఘనతలో భాగస్వాములయ్యారు. విజయవాడలోని చిట్టూరి పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ముగింపు వేడుకలో నిర్వాహకులకు.. ఇండియా, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మహోత్సవ్‌లో విద్యార్థుల ప్రాజెక్టులను గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిపుణుల జ్యూరీ వడపోసింది. వేల ప్రాజెక్టుల్లో నుంచి జిల్లాకొకటి చొప్పున ఎంపిక చేసింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల ఆవిష్కరణ శక్తిని, శాస్త్రీయ ఆలోచనలను వెలికితీసేందుకు ఈ వేదిక తోడ్పడిందని.. ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు వెల్లడించారు. ముగింపు వేడుకల్లో పాల్గొన్న వారిద్దరూ.. విజేతలకు బహుమతులు అందించారు. రెండు అరుదైన రికార్డులు సాధించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. విజేతలకు ప్రతిభా పురస్కారాలు, ధ్రువీకరణ పత్రాలు, సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంప్‌లో ప్రవేశం.. లాంటి అవకాశాలు కల్పించారు.



విజ్ఞాన ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు

మద్యం కేసు నిందితులకు 13 వరకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. వీరి రిమాండ్ గడువు శుక్రవారం ముగియనుండడంతో సిట్ అధికారులు నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చారు. వీరికి రిమాండ్ పొడిగించాలని ప్రభుత్వం తరపు న్యాయవాది మెమో సమర్పించారు. దర్యాప్తు పురోగతి గురించి న్యాయాధికారి భాస్కర్‌రావు.. ఐవో శ్రీహరిని అడిగారు. రెండు ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశామని.. కొందరు సాక్షులను విచారించామని చెప్పారు. మార్చి 13 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. పార్లమెంటు సమావేశాల కోసం కోర్టు నుంచి అనుమతి తీసుకోవడంతో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి రాలేదు. కృష్ణమోహన్‌రెడ్డి రాలేదు.. అతని తరపున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. రిమాండ్ పొడిగింపు తర్వాత నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

- బెయిల్ మంజూరు చేసే సమయంలో ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా పాస్‌పోర్టు అప్పగించారా? అని నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డిని న్యాయాధికారి ప్రశ్నించారు. తన పాస్‌పోర్టు గడువు తీరిందన్నారు. అయినా కోర్టుకు అప్పగించాల్సిందేనని న్యాయాధికారి అన్నారు. వెంటనే అంజేస్తానని నిందితుడు చెప్పాడు. కారు ప్రమాదంలో తన కాలికి గాయమైందని, ఇబ్బందిగా ఉందని.. ప్రత్యేక వసతులు కావాలని నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి న్యాయాధికారికి విన్నవించారు. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉందన్నారు. దీనిపై పిటిషన్ వేసుకోవాలని, వైద్య రికార్డులు సమర్పించాలని సూచించారు.

ప్రోత్సహిస్తే పర్యాటక శోభే

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

మునేరు, కృష్ణానదీతీరంలో కొలువైన పురాతన పుణ్యక్షేత్రాలు, బౌద్ధక్షేత్రాలతో పర్యాటక ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ క్షేత్రాల్లో వసతులు కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.



కృష్ణానది తీరాన వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

ఈ ప్రాంతాల్లో అవకాశం..

జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది. ఇక్కడ నదీగర్భంలో శివాలయం వర్షాకాలం మూడు మాసాలపాటు నీటిలో ఉంటుంది. ఒడ్డున భవానీముక్తేశ్వరస్వామి క్షేత్రం ఉంది. ఇక్కడ కృష్ణానదిలో బోటు షికారు ఏర్పాటు చేస్తే పర్యాటకులు పెరుగుతారు.

★ కృష్ణానది ఒడ్డునే వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఉంది. ఇక్కడ బోటు షికారుకు అవకాశం ఉంది. అందుకు తగ్గట్లుగా వసతి, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి.

★ హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి సమీపంలోని తిరుమలగిరి కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. ఇక్కడ వల్మీకంలో(పుట్ట) స్వామివారు వెలిశారు. ఇక్కడ వసతులు సమకూరితే ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల భక్తులు వస్తారు.

★ మునేటితీరాన పెనుగంచిప్రోలు లక్ష్మీతిరుపతమ్మ దేవాలయం, చందర్లపాడు మండలం గుడిమెట్లవద్ద కృష్ణాతీరంలో కొండపై పురాతన ద్వారక వేంకటేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయాలు ఉన్నాయి. వీటిని అనుసంధానిస్తూ టెంపుల్ టూరిజం ఏర్పాటు చేయాలి.

★ **కంచికచర్ల మండలం** గొట్టుముక్కల సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండపై స్వయంభూగా వెలిసిన మద్దులమ్మ తల్లి ఆలయం అటు ఆధ్యాత్మిక క్షేత్రంగా, ఇటు పర్యాటక ప్రాంతంగానూ పేరొందింది. అటవీ ప్రాంతంలో కొండల నడుమ వెలిసిన ఈ క్షేత్రం వర్షాకాలంలో పర్యాటకులకు ఆహ్లాదంగా ఉంటుంది. కొండల పైనుంచి జాలువారే జలపాతాల్లో యువత కేరింతలు కొడుతుంటారు. జాతీయ రహదారికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి రవాణా సౌకర్యాలు కల్పించాలి.

★ ఈ విషయమై పర్యాటక శాఖ అధికారిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా జగ్గయ్యపేట, ముక్త్యాల వద్ద కృష్ణానదిలో బోటు షికారుకు కృషి చేయగా నదిలో లోతులేక తిప్పడానికి వీలు పడలేదని తెలిపారు. ముక్త్యాల వద్ద గతంలో పర్యాటకశాఖ రెస్టారెంట్ నిర్మించినా ప్రారంభానికి నోచలేదు. పీపీపీ విధానంలో దీని నిర్వహణ అప్పగించాలనే ప్రతిపాదన ఉందని వెల్లడించారు.

పురాతన బౌద్ధక్షేత్రాలు.. జగ్గయ్యపేటలోని ధనంబోడు, నందిగామ మండలం రామిరెడ్డిపల్లికొండపై (గుమ్మడిదుర్రు), వీరులపాడు మండలం అల్లూరులో బౌద్ధక్షేత్రాలు ఉన్నాయి. ఈ మూడు బౌద్ధక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థులు సందర్శించడానికి వీలుంది. విజ్ఞాన, విహార కేంద్రాలుగా మారతాయి.

దుర్గమ్మ ఆశీస్సులతో ఉభయ రాష్ట్రాల అభివృద్ధి



తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాలు దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రంగారావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేశారు.

పసిడితో మెరిసిన మణిరత్నం



విజయవాడ క్రీడలు: హరియాణా రాష్ట్రం సోనీపట్‌లో ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగిన జూనియర్ ఏషియా కప్ స్టేజ్-2 ఆర్చరీ పోటీల్లో రాష్ట్రానికి చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నారు. మొత్తం 14 పాయింట్లు స్కోర్ చేసి ప్రథమ స్థానంలో నిలిచారని రాష్ట్ర విలువిద్య సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఇరాక్‌లో జరిగే వరల్డ్ ర్యాంకింగ్ టోర్నీలో తలపడేందుకు ఆయన అర్హత సాధించారని తెలిపారు.

నాకు నేనే.. స్ఫూర్తిగా మారా



కొందరు సమస్య ఎదురైతే డీలాపడతారు. మరికొందరు దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటారు. నల్లూరి హిమబిందు మాత్రం తను ఎదుర్కోవడమే కాదు, తనలాంటి వాళ్లకోసమూ ఆలోచించారు. కాబట్టే, అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ ప్రయాణమేంటో... ఆమె మాటల్లోనే..!

మా స్వస్థలం ఒంగోలు. అమ్మ నాగేశ్వరమ్మ ఉపాధ్యాయినిగా చేసి, పదవీ విరమణ పొందారు. నాకో అక్క, అన్నయ్య. చిన్నప్పుడు పోలియో సోకి కాళ్లు సరిగా పని చేయలేదు. అమ్మ నన్ను తీసుకుని ఎంతమంది డాక్టర్ల చుట్టూ తిరిగిందో! అయినా ఫలితం లేకపోయింది. దీనికితోడు క్యాలిపర్స్ వేసుకోకపోవడం వల్ల కాళ్లు పూర్తిగా వంకర తిరిగాయి. దీంతో ఎక్కడికైనా వెళ్లాలంటే చేతుల మీదే వెళ్లాల్సి వచ్చేది. అమ్మ లేదంటే అన్నయ్య పాఠశాలకు ఎత్తుకుని తీసుకెళ్లేవారు, ఆడించేవారు. మొదట్నుంచీ మంచి విద్యార్థినినే. పదో తరగతిలో స్కూల్లో తొలి స్థానంలో నిలవడంతో ఇంటర్‌లో ఫీజు లేకుండా సీటిచ్చారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీ నుంచి వైద్య విద్యను పూర్తిచేశా. ఉస్మానియా యూనివర్సిటీలో అనాటమీలో ఎండీ పూర్తిచేసి గర్భస్థ శిశువుల ఎదుగుదలను తెలుసుకునే ఫీటల్ స్కానింగ్‌నీ నేర్చుకున్నాను.

చైనావి వద్దన్నారు

2015లో కింద పడిపోవడంతో భుజానికి ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి వీల్‌చైర్ తప్పనిసరి అయ్యింది. చాలావరకూ చేత్తో నెట్టాల్సినవే. పైగా ఎక్కడికైనా తీసుకెళ్లాలన్నా ఇబ్బంది. దీంతో విదేశాల నుంచి బ్యాటరీతో నడిచేదాన్ని తెప్పించుకున్నా. ఓరోజు పనిమీద దిల్లీ వెళితే అక్కడ వీల్‌చైర్ రిపేర్‌కి వచ్చింది. ఎంత ప్రయత్నించినా బాగుచేయడం సాధ్యం కాదన్నారు. ఎలాగోలా ఇంటికి చేరుకున్నా. బ్యాటరీ రిపేర్ చేయించుకుని తిరిగి వాడుకున్నా. దాన్ని ఓసారి ఛార్జింగ్ పెట్టి బయటికి వెళ్లా. ఇంటికి తిరిగొచ్చేసరికి బ్యాటరీ నుంచి మంటలు వచ్చి ఇల్లంతా కాలిపోయింది. మరొకటి విదేశాల నుంచి తెప్పించుకోవడం కష్టమైంది. ఇక, అప్పుడు నన్ను నేనే స్ఫూర్తిగా తీసుకుని 'ఈజీ లైఫ్ వీల్‌చైర్' ప్రారంభించా. తొలిరోజుల్లో ఓ ప్రైవేటు సంస్థతో కలిసి చైనా నుంచి కొన్ని వీల్‌చైర్‌లు డిజైన్ చేయించి తెప్పించా. కానీ అప్పుడే కొవిడ్ వచ్చింది. దీంతో చైనా నుంచి తెప్పించామని తెలిసి చాలామంది వాటిని తిరస్కరించారు. ఇదంతా చూశాక... నేనే వాటిని సొంతంగా ఎందుకు తయారుచేయకూడదు అనిపించింది. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులతో కలిసి 2021లో కొన్ని ఎలక్ట్రిక్ చైర్‌లు తయారుచేయించా.

ఎన్నో రకాలుగా..

వీల్‌చైర్ విషయంలోనూ అందరి అవసరాలూ ఒకేలా ఉండవు. కొందరికి చేతులకూ సమస్య ఉండొచ్చు. అందుకే అవసరాలకు తగ్గట్టుగా డిజైన్ చేయడం మొదలుపెట్టాం. ఇలా ఇప్పటివరకూ 16 రకాలవి తీసుకొచ్చాం. వీటిలో కొన్ని ఫోన్‌తోనూ ఆపరేట్ చేయొచ్చు. స్వదేశీ వస్తువులు, పరిజ్ఞానంతో చేస్తున్నాం కాబట్టి, మిగతా వాటితో పోలిస్తే సగం ధరకే ఇవ్వగలుగుతున్నాం. మాలోనూ చాలామందికి అందరిలాగే వాహనాలు నడపాలని ఉంటుంది. దానిమీదా దృష్టిపెట్టి వీల్‌చైర్‌నే బైకులా మార్చాం. దీన్ని రెండు రకాలుగా ఉపయోగించుకోవచ్చు. ఇందుకు దాదాపు ఆరునెలలు కష్టపడ్డాం. ఏడాదిలో 300కిపైగా వీల్‌చైర్లను అందిస్తున్నాం. నేనూ ఓ ఉద్యోగినిగానే అందరితో కలిసి కష్టపడతా. నా కాళ్ల మీద నిలబడి, మరికొందరికి ఉపాధిని ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. 'నీకెందుకు ఇవన్నీ? ఆడపిల్లవి... వదిలేయొచ్చు కదా' అని ఎంతమంది అన్నా పట్టించుకోలేదు. కాబట్టే, గెలుపు దిశగా సాగగలుగుతున్నా.

- చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్

వసుంధర

vasundhara@eenadu.in

పసిడి పూసలు... రష్మిక నగలు!



టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. తెలుగు-కొడగు ఆచారాల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకలో అందరి దృష్టినీ ఆకర్షించినవి నవ దంపతులు వేసుకున్న బంగారు నగలే. ముఖ్యంగా వధువు రష్మిక రస్టెడ్ ఆరెంజ్ కలర్ బనారస్ పట్టు చీరలో, ఒంటి నిండా బంగారు నగలతో కుందనపు బొమ్మలా మెరిసిపోయింది. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ నగల దుకాణం వాళ్లు దక్షిణ భారత వాస్తు శిల్పాల ప్రేరణతో ఈ నగల్ని రూపొందించారట. మహారాజుగా విజయ్, దేవకన్యలా రష్మిక కనిపించేలా వీటిని తీర్చిదిద్దారు. ఒక్క పెళ్లి కూతురు కోసమే 11 రకాల నగల్ని సిద్ధం చేశారట. రకరకాల ప్రయోగాలు, మార్పులు, చేర్పులతో తయారైన ఈ నగలకి సుమారు 10 నెలల సమయం పట్టిందట. నటిగా జాతీయ స్థాయిలో రష్మికకున్న ప్రత్యేకతను చాటుతూనే... తన మూలాల్ని కూడా ప్రతిబింబించేలా చేయాలనుకున్నారు. ఇందుకోసం నక్షీ, క్లిష్టమైన రవా గ్రాన్యులేషన్ పనితనాన్ని జోడించి గుండ్ల నగల్ని రూపొందించారు. ఒక్కటంటే ఒక్కటీ రాయి, రత్నం లేకుండానే పసిడితోనే వీటిని డిజైన్ చేశారు. స్టేట్‌మెంట్ జుంకాలు, చోకర్, వరుసల హారం, జడబిళ్ల, చెంపసరాలు, అరవంకీ, వడ్డాణం.... ఇలా అన్నింట్లోనూ పసిడి పూసల్ని మ్యాచ్ చేశారు. వాటిపై అక్కడక్కడా పూలు, మయూరాలు... ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. లేయర్డ్ హారానికి మామిడి పిందెల పెండెంట్లు అందంగా అమరిపోయాయి. చివరి వరుసల్లో లక్ష్మీదేవి పెండెంట్ కళతెచ్చింది. పైగా వీటిని భారంగా కాకుండా ఆమె సులువుగా మోయగలిగేలా చేశారు. ఈ ఆభరణాలు కేవలం అలంకరణ వస్తువుల్లా ఉండిపోకూడదు. శాశ్వతంగా, తరతరాలకీ వారసత్వంగా నిలిచిపోవాలని వీటిని రూపొందించారట. అందుకే, ఇవి ట్రెండ్‌ని సెట్ చేయడమే కాదు... ట్రెడిషన్‌నీ ప్రదర్శించాయి. మీకూ నచ్చాయా?

పనిలో 3-3-3 పద్ధతి తెలుసా?!



పరిస్థితులు ఎలా ఉన్నా... రోజులో ఎనిమిది గంటలు పనికి కేటాయించాల్సిందే. సీనియారిటీ పెరిగితేనో, పదోన్నతులు వస్తేనో ఈ సమయంలో వెసులుబాటు ఉంటుంది. అయితే వృత్తిగత జీవితానికి కేటాయించిన ఈ 8 గంటలు సరిపోవట్లేదని ఇంటికీ పని తెచ్చుకుని చేసేవారి సంఖ్య పెరుగుతోంది. కార్పొరేట్ సంస్థలు అయితే తమ ఉద్యోగినుల సమయంతో సంబంధం లేకుండా కంపెనీ కార్యకలాపాలకు అందుబాటులో ఉండాలని కోరుకుంటున్నాయి. రెండూ జీవనశైలిని దెబ్బతీసేవే. ఇక్కడ రెండు విషయాలు ఆలోచించాలి. 1.పనికి కేటాయిస్తున్న సమయం ఎందుకు సరిపోవడం లేదు. 2.ఈ ఎనిమిది గంటల్లో పని పూర్తి కాకపోవడానికి కారణం ఏంటి? ఈ రెండు ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగలిగితే సగం సమస్యకు చెక్ చెప్పేసినట్లే. మనం ఎనిమిది గంటలు కేటాయించే ఆఫీస్ పనిలో దాదాపు 3 గంటలు మాత్రమే సరైన ఉత్పాదకత ఇవ్వగలమట. మిగతా సమయమంతా పాత ప్రాజెక్టులను చర్చించడంలోనో, కొత్త వాటిని ఆలోచించడంలోనో, జయాపజయాల చర్చల్లోనో తేలిపోతుందని చెబుతున్నాయి అధ్యయనాలు. మరి పరిష్కారం ఏంటి అంటారా? పని విభజన తెలిస్తే ఏ సమస్యా ఉండదు. ఇప్పటికే చాలారకాలుగా పని విభజించుకుని, ఏ పద్ధతిని ఫాలో అయినా లాభం ఉండట్లేదని విసిగిపోతున్నారా? అయితే ఒక్కసారి ఈ 3-3-3ని ప్రయత్నించి చూడండి. దీనిలో మీరు పనిచేసే సమయాన్ని మూడు విభాగాలుగా విభజించుకోండి. అందులో మొదటి మూడుగంటలు అవసరమైన, ప్రత్యేకమైన కార్యకలాపాలకు కేటాయించుకోండి. అంటే ఆ రోజు పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, నివేదికలు, ప్రెజెంటేషన్లు వంటివి సిద్ధం చేసుకోండి. తర్వాత సమయంలో సగభాగం మూడు చిన్న టాస్కులు చేయడానికి వెచ్చించండి. సమావేశాలు, కాల్స్ మాట్లాడటం, నెట్‌వర్క్ డెవలప్‌మెంట్, పెండింగ్ ప్రాజెక్టులు వంటి వాటికి కేటాయించండి. దీనివల్ల మీరు రోజులో చేయాల్సిన పనుల జాబితా పూర్తవుతుంది. మిగిలిన సమయం... రివైజ్ చేసుకోవడానికి వెచ్చిస్తే సరి. ఏ తప్పులూ దొర్లకుండా జాగ్రత్తలు తీసుకున్న వారవుతారు. దీనివల్ల ఇంటికి వెళ్లాక ఏదైనా మరచిపోయామా? వదిలేశామా? పూర్తిచేశామా లేదా అన్న కంగారు ఉండదు. పాటిస్తారుగా మరి!

వ్యర్థాలతో ఉపాధి..!

మహిళల సంపాదన... తన కుటుంబంలోనే కాదు, సమాజంలోనూ సానుకూల మార్పులు తెస్తుంది. వాళ్లల్లో ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుందంటారు రూప్‌జ్యోతి సైకియా గొగోయ్. దానికోసం ఆమె 'విలేజ్ వీవ్స్' సంస్థను మొదలుపెట్టి ప్లాస్టిక్‌ని రీసైకిల్ చేస్తూ ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తున్నారు.



పర్యావరణ కాలుష్యానికి ముఖ్య కారణం మనం వాడే ప్లాస్టిక్. ఈ కాలుష్యాన్ని తగ్గించడానికి ఎన్ని నిబంధనలు వచ్చినా దీని వినియోగం మాత్రం ఆగడం లేదు. పర్యటక ప్రాంతాలైతే చెప్పనక్కర్లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుని ఉంటుంది. ఇవి మూగజీవాల ప్రాణాలను తీస్తున్నాయంటారు రూప్‌జ్యోతి. కాజీరంగా నేషనల్ పార్క్... ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిందీ పార్క్. నిత్యం పర్యటకుల తాకిడి ఎక్కువ. దాంతో ఈ ప్రాంతం పెద్దమొత్తంలో ప్లాస్టిక్ సంచులు, సీసాలు, ఆహార పదార్థాల కవర్లతో నిండిపోయేది. ఈ కాలుష్యాన్ని కట్టడి చేయాలనుకున్నారు రూప్‌జ్యోతి. ఇందుకు పార్క్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైకిల్ చేసి గృహోపకరణాలు తయారుచేస్తున్నారు. దీనికోసం 2004లో 'విలేజ్ వీవ్స్' ప్రారంభించి, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు.

'మొదట్లో ప్లాస్టిక్‌తోనే వస్తువులు చేయాలనుకున్నా. కానీ కుదర్లేదు. దాంతో ప్లాస్టిక్‌కి కాటన్ దారాలు కలిపి తయారుచేశా. పార్క్ సహా పలు ప్రాంతాల్లోని వ్యర్థాల్ని సేకరించడం మొదలుపెట్టా. చుట్టుపక్కల ప్రాంతాల్లోని మహిళలకూ దీన్ని నేర్పించా. ఇక్కడి మహిళలు చిన్నప్పటి నుంచీ చేతివృత్తుల్ని నేర్చుకుంటారు. దాదాపు అందరి ఇళ్లల్లోనూ మగ్గం ఉంటుంది. వెదురుతో అలంకరణ వస్తువులు, చేనేత వస్త్రాలు తయారుచేస్తారు. దాంతో తొందరగానే ఈ పనిని నేర్చుకున్నారు. ప్రస్తుతం సుమారు 35గ్రామాల్లో 2వేల మందికి పైగా వీటిని తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో దారాన్ని ప్లాస్టిక్‌తో కలిపి అల్లుతాం. కాబట్టి ఎక్కువ రోజులు మన్నుతాయి. కానీ, మా వాళ్లకి విదేశీ పర్యటకులతో మాట్లాడటం వచ్చేది కాదు. దాంతో అమ్మకాలు తక్కువగా జరిగేవి. అందుకే 'కాజీరంగా హాత్' అనే ఆన్‌లైన్ యాప్ మొదలుపెట్టాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో మా ఉత్పత్తుల్ని అమ్ముతాం. పార్క్‌కి పర్యటకుల తాకిడి ఎక్కువ ఉన్నప్పుడు మేము నెలకు రూ.25వేలు వరకూ సంపాదిస్తాం. ప్రస్తుతం విదేశాల్లోనూ మా వస్తువులకి డిమాండ్ పెరిగింది. మా విలేజ్ వీవ్స్ సంస్థని మరింత విస్తరించి ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అదే నా లక్ష్యం'అంటారు రూప్‌జ్యోతి.

జ్ఞాపకశక్తికి శశాంకాసనం

ఇది పరీక్షల సమయం. విద్యార్థులు ప్రశాంతంగా ఉండడానికీ, వారిలో జ్ఞాపకశక్తి మెరుగుకీ ఉపయోగపడే ఆసనం ఇది.

చేసే విధానం: యోగా మ్యాట్‌పైన వజ్రాసనంలో కూర్చోవాలి. ఇప్పుడు గాలిని తీసుకుంటూ, వదిలిపెడుతూ ముందుకు వంగి తలను మోకాళ్లకు తాకేలా లేదంటే మోకాళ్ల ముందుకి అయినా నేలపైన ఆన్చి పెట్టండి.



ఆపై తల, మోకాళ్ల ఊతంతో రెండు చేతుల్నీ పాదాలవైపు చాచి మడమల్ని పట్టుకోండి. తర్వాత బ్యాలెన్స్ చేసుకుంటూ నడుమును సాధ్యమైనంత పైకి ఎత్తే ప్రయత్నం చేయండి. పాదాలు, మోకాళ్లను దగ్గరగా ఉంచేలా చూసుకోండి. శ్వాస తీసుకుంటూ ఈ స్థితిలో 10-12 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత నిదానంగా పైకి లేచి, కాళ్లను చాచి విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: మోకాళ్లు, మడమల సర్జరీలు అయినవాళ్లు చెయ్యొద్దు.

ఉపయోగాలు: జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. తలకి రక్తప్రసరణ బాగా జరిగి ఒత్తిడి తగ్గుతుంది. కంఠం, ఛాతీ భాగాలు ఉత్తేజితం అవుతాయి.

ఆహారం: బాదం, వాల్‌నట్స్, ఆకుకూరలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. వీటితో మెదడు కణాలు చురుగ్గా పనిచేస్తాయి.

- శిరీష, యోగ గురు

బంగారం - వెండి



27న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,000	1,48,500	2,77,657
విజయవాడ	1,59,100	1,48,100	2,77,500
ప్రొద్దుటూరు	1,57,300	1,44,620	2,72,000
రాజమహేంద్రవరం	1,61,570	1,48,100	2,95,000
విశాఖపట్నం	1,61,570	1,48,100	2,77,000
తమిళనాడు			

టొమాటోలు ఎలా శుభ్రం చేస్తున్నారు?



రసం, సాంబార్, పప్పు... ఇలా ఏది వండాలన్నా మనకి ముందు గుర్తొచ్చేవి టొమాటోలే కదా! ఇది వంటకి రుచినే కాదు, మనకి ఆరోగ్యాన్నీ అందిస్తాయి. వీటిలో ఫోలేట్, పొటాషియం, విటమిన్ సి, కె వంటి సూక్ష్మ పోషకాలు ఎక్కువ. దీన్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు మేలు చేస్తాయి. అంతేకాదు, కణాలు దెబ్బతినకుండా కాపాడి, క్యాన్సర్ ముప్పుని తగ్గిస్తాయి. టైప్-2 డయాబెటీస్‌ను తగ్గించి, రక్తపోటుని అదుపులో ఉంచుతాయని అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి ఇన్ని ప్రయోజనాలున్న ఈ టొమాటోలను పిల్లలకు లంచ్ బాక్స్ ఆలస్యం అవుతుందనో, ఆఫీస్‌కి లేట్ అవుతుందనో కంగారుగా కడిగి వండేస్తాం. కానీ, ఇలా చేయకూడదు అంటున్నారు నిపుణులు. మిగిలిన కాయగూరలతో పోలిస్తే టొమాటోపై ఉండే తొక్క పలుచగా సున్నితంగా ఉంటుంది. దీనివల్ల సాగు సమయంలో తెగులు నివారణకు చల్లే రసాయనాలు దానిమీద అతుక్కుంటాయి. సరిగ్గా శుభ్రం చేయకపోతే మన కడుపులోకి వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే వండటానికి ముందు ఉప్పు లేదా బేకింగ్ సోడా, వినెగర్ కలిపిన నీటిలో ఓ పావుగంట ఉంచి ఆపై మంచినీటితో శుభ్రంగా కడగాలి. అప్పుడే వాటిపై పేరుకున్న దుమ్మూ ధూళి, పురుగుమందుల అవశేషాలు తొలగిపోతాయి.

పర్వత ప్రాంతంలో పుట్టి, పెరిగినా ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని కలలు కందామె. వాటి సాధనే లక్ష్యంగా శ్రమించింది. దిల్లీ మారథాన్‌లో రజతం గెలుచుకుని తన లక్ష్యంవైపు మొదటి అడుగు వేసిన భాగీరథీ బిష్ట్ గురించి తెలియాలంటే...

ఆసియా క్రీడలే లక్ష్యంగా..!

ఉత్తరాఖండ్‌లోని వాణ్ గ్రామంలో పుట్టిపెరిగింది భాగీరథీ. తండ్రి రైతు. మూడేళ్ల వయసులోనే అనారోగ్యంతో మరణించారు. పిల్లల పోషణ కష్టమైనా... తల్లి పట్టుదలగా వాళ్లకి కావాల్సిన వసతులన్నీ సమకూర్చింది. తల్లి కష్టాన్ని చూస్తూ పెరిగిన భాగీరథీ చిన్నప్పట్నుంచీ చదువులో చురుకుగా ఉండేది. హైస్కూల్ చదువుతున్నప్పుడే తనకు క్రీడలు పరిచయం అయ్యాయి. పాఠశాల, స్థానిక ఆటల్లో పాల్గొనేది. తర్వాత ఉన్నత విద్యకోసం హిమాచల్‌ప్రదేశ్‌కు మకాం మార్చింది భాగీరథీ. అక్కడే ఆమెకు కోచ్ సునీల్ శర్మతో పరిచయం ఏర్పడింది. ఆయన తన క్రీడా ప్రయాణానికి ఊతం ఇచ్చారు.



అలా అథ్లెటిక్స్‌లో...: పరుగులో ఆమెకున్న ఇష్టాన్ని గమనించిన కోచ్ ఆ దిశగా ప్రోత్సహించడం మొదలుపెట్టారు. మారథాన్ రన్నర్‌గా మంచి పేరు సంపాదించుకోవాలన్న గమ్యాన్నీ సూచించారు. భాగీరథీ కూడా అందుకు అనుగుణంగానే అడుగులు వేసింది. రోజూ తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకూ సాధన చేసేదామె. తర్వాత కళాశాలకు వెళ్లేది. మళ్లీ సాయంత్రం మరో నాలుగు గంటలపాటు శిక్షణ తీసుకునేది. ఈ శ్రమకు ఫలితంగానే జిల్లా, రాష్ట్ర, అంతరరాష్ట్ర మారథాన్ విజయాలెన్నో ఆమెను వరించాయి. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన మారథాన్‌లోనూ పాల్గొని విజయం దక్కించుకుంది భాగీరథీ. అదే సంవత్సరం జాతీయ మారథాన్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇటీవల రాజధాని నగరంలో జరిగిన ప్రతిష్ఠాత్మక దిల్లీ 11వ మారథాన్‌లో పాల్గొని 42.195కి.మీ దూరాన్ని 2గం.43 నిమిషాల్లో పూర్తిచేసి రజతం దక్కించుకుంది. ఈ ఏడాది జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో రాణించడమే లక్ష్యంగా సాగిపోతోందీమె.

ఈటీవీ భారత్

ఆహ్వానం

ప్రతి మగవాడి విజయం వెనకా ఓ మహిళ ఉంటుందంటారు. కానీ ప్రతి ఆడపిల్ల జీవితంలోనూ అమ్మ, స్నేహితురాలు, ఉపాధ్యాయురాలు, రచయిత్రి... ఇలా ఎన్నో రూపాల్లో మరో స్త్రీ తోడుంటుంది. మిమ్మల్ని నడిపించిన అలాంటి వాళ్లెవరైనా ఉన్నారా? ఒక సలహా, హెచ్చరిక, ఓదార్పు... ఇలా ఏదో ఒక తీరులో మీ మార్గం మార్చినా, మీ జీవితాన్ని తీర్చిదిద్దినా వాళ్లనో సారి తలచుకోండి. వాళ్లు మీకు అండగా నిలిచిన విధానాన్ని మాతో పంచుకోండి. 'వసుంధర'లో ప్రచురిస్తాం. మీ పేరు, ఊరు, ఫొటోతోసహా క్లుప్తంగా వాళ్ల గురించి పంపండి.



మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512

మెయిల్: vasundhara@eenadu.in

వాట్సప్ నం: 9154091911

అమ్మాయిలూ ముడి పెట్టేస్తున్నారు...



ఒకప్పుడు అమ్మమ్మలు, తాతమ్మల హెయిర్ స్టయిల్ ముడి. అందుకే, ఎవరైనా అలా జడను పైకి చుడితే... ఏంటి ముసలమ్మలా అనేసేవారు. కానీ, ఇప్పటి అమ్మాయిలు మాత్రం ఈ స్టైల్‌ని తెగ ఇష్టపడుతున్నారు. సెలబ్రిటీలు సైతం ఇదే ఫ్యాషన్ అంటూ ఫాలో అయిపోతున్నారు. దాని పేరే... స్లీక్ హెయిర్ బన్. ఈ ఏడాది మేజర్ మినిమలిస్ట్ స్టైల్‌గా గుర్తింపు దక్కించుకుంది. సన్నగా దువ్వి, టైట్‌గా వెనక్కి లాగి ఓ క్రమ పద్ధతిలో ముడి వేయడమే. పోమేడ్(గ్రీజీ వ్యాక్స్)ని వాడితే మీరు కోరుకున్నట్లు జుట్టుని మెలితిప్పొచ్చు. ఆపై షైన్ సీరమ్‌తో గ్లాసీ ఫినిష్ తీసుకవస్తే సెలబ్రిటీ స్టైల్ వచ్చేస్తుంది. ఇది రెడ్ కార్పెట్‌ల మీద, పెళ్లిళ్లు, వర్క్ ఈవెంట్లకు అనువైన ఈజీ లుక్ కూడా. ఇది ఫేస్ ఫీచర్స్‌తో పాటు జాలైన్, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్‌ని హైలైట్ చేస్తుంది. చుట్టూ గాజ్రా(పూలమాల)ను చుట్టేస్తే ట్రెడిషనల్ లుక్ వచ్చినట్లే.



టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

చాంపియన్

2/2...58/4, 117/6.. చివరి 3 ఓవర్లలో విజయానికి 43 పరుగులు చేయాలి. ఇలాంటి పరిస్థితిలో బ్యాటింగ్ జట్టు గెలిచే అవకాశాలు తక్కువే. కానీ ఇంగ్లాండ్ అదరగొట్టింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమించిన ఆ జట్టు గ్రూప్-2, సూపర్-8 పోరులో న్యూజిలాండ్‌పై అద్భుత విజయాన్ని సాధించింది. మూడు విజయాలతో గ్రూప్-2లో అగ్రస్థానంతో సూపర్-8ను ముగించింది.

ఇంగ్లాండ్ లాగేసింది

- కివీస్‌కు అనూహ్య ఓటమి
- సెమీస్ అవకాశాలు క్లిష్టం
- మెరిసిన జాక్స్, రెహాన్, బాంటన్



జాక్స్ 32 నాటౌట్
రషీద్ 2/28

కొలంబో: న్యూజిలాండ్‌కు నిరాశ. ఇంగ్లాండ్‌ను ఓడించి సెమీస్ చేరే అవకాశాన్ని ఆ జట్టు చేజేతులా వదులుకుంది. శుక్రవారం ఆ జట్టు 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ చేతిలో ఓడింది. మొదట న్యూజిలాండ్ 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఫిలిప్స్ (39; 28 బంతుల్లో 4×4, 1×6), సీఫర్ట్ (35; 25 బంతుల్లో 3×4, 2×6), అలెన్ (29; 19 బంతుల్లో 3×6) రాణించారు. రషీద్ (2/28), జాక్స్ (2/23), రెహాన్ అహ్మద్ (2/28) ప్రత్యర్థిని కట్టడి చేశారు. టామ్ బాంటన్ (33; 24 బంతుల్లో 3×4, 1×6), విల్ జాక్స్ (32 నాటౌట్; 18 బంతుల్లో 4×4, 1×6) మెరుపులతో ఇంగ్లాండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రచిన్ (3/19) శ్రమ వృథా అయింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ఉంటే కివీస్ గ్రూప్‌లో అగ్రస్థానంతో ముందంజ వేసేది. కానీ ఇప్పుడు న్యూజిలాండ్ (3 పాయింట్లు, ఒక మ్యాచ్ రద్దు) సెమీస్ భవితవ్యం.. శనివారం పాకిస్థాన్, శ్రీలంక మ్యాచ్‌పై ఆధారపడింది.

ఆఖర్లో బాదేశారు: అసలే స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్.. ఆపై సవాల్ చేసే లక్ష్యం. ఇలాంటి స్థితిలో ఇంగ్లాండ్‌కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్లోనే సాల్ట్ (2) వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. ఆ తర్వాత బట్లర్ (0) వికెట్‌ను చేజార్చుకుని 2 ఓవర్లకు 8/2తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో బ్రూక్ (26).. హెన్రీ వేసిన మూడో ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి స్కోరు కదిలించాడు. బెతెల్ కూడా కొన్ని షాట్లు ఆడడంతో ఇంగ్లాండ్ 6 ఓవర్లకు 47/2తో కోలుకుంది. బ్రూక్, బెతెల్ (21) స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఇంగ్లాండ్ ఎదురుదెబ్బ తగిలింది. అయినా బాంటన్, సామ్ కరన్ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టి సాధించాల్సిన రన్‌రేట్ మరీ పెరిగిపోకుండా చూశారు. సామ్ కరన్ (24), బాంటన్ ఔట్ కావడం.. స్కోరు కదలకపోవడంతో ఇంగ్లాండ్ చివరి 3 ఓవర్లలో 43 పరుగులు చేయాల్సి వచ్చింది. ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో జాక్స్, రెహాన్ అహ్మద్ (19 నాటౌట్) రెచ్చిపోయారు. జాక్స్ సిక్స్, 2 ఫోర్లు కొట్టగా.. రెహాన్ ఓ సిక్స్ అందుకున్నాడు. ఆ ఓవర్లో 22 పరుగులు రావడంతో ఇంగ్లాండ్ రేసులోకి వచ్చేసింది. సమీకరణం (12 బంతుల్లో 21) కాస్త అందుబాటులోకి వచ్చింది. ఈ జంట అదే జోరు కొనసాగించడంతో 19వ ఓవర్లో 16 పరుగులు వచ్చాయి. హెన్రీ వేసిన ఆఖరి ఓవర్లో ఇంగ్లాండ్ 5 పరుగులు చేయాల్సి రాగా.. తొలి రెండు బంతులకు రెండే పరుగులు వచ్చాయి.. మూడో బంతి బౌండరీ వెళ్లడంతో ఇంగ్లాండ్ విజయాన్ని అందుకుంది.

కివీస్ కట్టడి: ఆరంభంలో న్యూజిలాండ్‌కు మెరుపు ఆరంభమే లభించింది. ఓపెనర్లు సీఫర్ట్, అలెన్ దూకుడుగా ఆడి స్కోరు పెంచారు. ఆర్చర్ వేసిన అయిదో ఓవర్లో సీఫర్ట్ రెండు ఫోర్లు, సిక్స్ బాదగా.. ఆ తర్వాత ఓవర్లో అలెన్ 2 సిక్స్‌లు, ఫోర్ అందుకున్నాడు. పవర్ ప్లే ఆఖరికి 54/0తో న్యూజిలాండ్ మెరుగైన స్థితిలో నిలిచింది. అప్పుడు నుంచి కివీస్ ఇన్నింగ్స్ కుదుపునకు గురైంది. ఏడో ఓవర్లో సీఫర్ట్‌ను ఔట్ చేయడం ద్వారా రషీద్.. ఇంగ్లాండ్‌కు బ్రేక్ ఇచ్చాడు. అలెన్ కూడా తర్వాతి ఓవర్లోనే పెవిలియన్ చేరడంతో కివీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సీఫర్ట్-అలెన్ తొలి వికెట్‌కు 64 పరుగులు జత చేశారు. ఆ తర్వాత ఫిలిప్స్, రచిన్ (11) ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. 11 ఓవర్లకు 97/2తో కివీస్ కోలుకుంది. స్పిన్నర్లు రషీద్, రెహాన్ అహ్మద్, విల్ జాక్స్ విజృంభించడంతో న్యూజిలాండ్ మళ్లీ తడబడింది. 38 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు పడిపోయాయి. రచిన్, చాప్‌మన్ (15), మిచెల్ (3)తో పాటు కుదురుకున్న ఫిలిప్స్ సైతం ఔటైపోయాడు. దీంతో కివీస్ 17.1 ఓవర్లకు 135/6తో ఇబ్బందుల్లో నిలిచింది. చివర్లో మెకాంకీ (14), శాంట్నర్ (9 నాటౌట్) పోరాడడంతో న్యూజిలాండ్ స్కోరు 150 దాటింది. 14-17 ఓవర్ల మధ్య న్యూజిలాండ్ ఒక్క బౌండరీ కూడా కొట్టలేక పోయింది.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 35; అలెన్ (సి) బెతెల్ (బి) జాక్స్ 29; రచిన్ (సి) బెతెల్ (బి) రెహాన్ 11; ఫిలిప్స్ (బి) జాక్స్ 39; చాప్‌మన్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 15; మిచెల్ (సి) జాక్స్ (బి) డాసన్ 3; శాంట్నర్ నాటౌట్ 9; మెకాంకీ (బి) రెహాన్ 14; హెన్రీ నాటౌట్ 1; **ఎక్స్‌ట్రాలు** 3; **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **159**

వికెట్ల పతనం: 1-64, 2-66, 3-97, 4-123, 5-133, 6-135, 7-152

బౌలింగ్: ఆర్చర్ 3-1-24-0, డాసన్ 4-0-32-1, కరన్ 1-0-10-0, రషీద్ 4-0-28-2, జాక్స్ 4-0-23-2, బెతెల్ 1-0-13-0, రెహాన్ 3-0-28-2

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) సీఫర్ట్ (బి) హెన్రీ 2; బట్లర్ (సి) సీఫర్ట్ (బి) ఫెర్గూసన్ 0; బ్రూక్ (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 26; బెతెల్ (సి) ఫిలిప్స్ (బి) రచిన్ 21; బాంటన్ (సి) చాప్‌మన్ (బి) రచిన్ 33; కరన్ (సి) ఫిలిప్స్ (బి) రచిన్ 24; జాక్స్ నాటౌట్ 32; రెహాన్ నాటౌట్ 19; **ఎక్స్‌ట్రాలు** 4, **మొత్తం:** (19.3 ఓవర్లలో 6 వికెట్లకు) **161**

వికెట్ల పతనం: 1-2, 2-2, 3-50, 4-58, 5-100, 6-117

బౌలింగ్: హెన్రీ 2.3-0-19-1, ఫెర్గూసన్ 2-0-14-1, శాంట్నర్ 4-0-29-0, మెకాంకీ 1-0-13-0, ఫిలిప్స్ 4-0-43-1, రచిన్ 4-0-19-3, సోధి 2-0-21-0

పాకిస్థాన్‌కో అవకాశం..

నేడు శ్రీలంకతో ఢీ
రాత్రి 7 నుంచి

పల్లెకెలె: ఇంగ్లాండ్ చేతిలో న్యూజిలాండ్ ఓటమి పాకిస్థాన్‌కు మేలు చేసింది. సెమీఫైనల్ చేరేందుకు ఓ అవకాశం లభించింది. శనివారం శ్రీలంకతో తన చివరి సూపర్-8 మ్యాచ్‌లో మంచి విజయం సాధిస్తే పాక్ రెండో స్థానంతో గ్రూప్-2 నుంచి సెమీస్ చేరుతుంది. మూడు విజయాలు సాధించిన ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీస్ చేరగా.. రెండు మ్యాచ్‌ల్లో ఒక పాయింటుతో ప్రస్తుతం పాక్ మూడో స్థానంలో ఉంది. కివీస్‌తో ఆ జట్టు మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోగా.. ఇంగ్లాండ్ చేతిలో పాక్ ఓడిపోయింది. మరోవైపు శ్రీలంకను ఓడించిన కివీస్.. ఇంగ్లాండ్ చేతిలో పరాజయంపాలై 3 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శ్రీలంకను ఓడిస్తే పాక్ పాయింట్లలో న్యూజిలాండ్‌తో సమమవుతుంది. అప్పుడు రన్‌రేట్ కీలకంగా మారుతుంది. తనకంటే మెరుగైన రన్‌రేట్ కలిగిన న్యూజిలాండ్ (1.390)ను దాటి సెమీస్ చేరాలంటే పాక్ (-0.461) 64 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించాలి. లేదంటే 13.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించాలి. స్వదేశంలో జరుగుతున్న ప్రపంచకప్‌లో ఇప్పటికే సెమీస్ రేసు నుంచి నిష్క్రమించిన శ్రీలంక.. చివరి మ్యాచ్‌లోనైనా గెలవాలని పట్టుదలగా ఉంది. మరి పాక్ ఈ సవాల్‌కు ఎలా నిలుస్తుందో చూడాలి. శ్రీలంక గెలిస్తే నెట్ రన్‌రేట్‌తో సంబంధం లేకుండా కివీస్ సెమీస్ చేరుతుంది.

పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ఇంగ్లాండ్	3	3	0	0	6	1.096
న్యూజిలాండ్	3	1	1	1	3	1.390
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	2	0	2	0	0	-2.800

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

చరిత్రకు అడుగు దూరంలో..

రంజీ ట్రోఫీ టైటిల్‌కు చేరువైన జమ్మూకశ్మీర్

హుబ్బళి: రంజీ ట్రోఫీలో కొత్త చాంపియన్ రాబోతోంది. జమ్మూకశ్మీర్ చరిత్ర సృష్టించేందుకు రంగం సిద్ధమైంది. 2025-26 సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న జమ్మూకశ్మీర్.. కర్ణాటకతో ఫైనల్లోనూ సత్తాచాటుతూ విజయానికి చేరువైంది. భారీ ఆధిక్యంతో కర్ణాటకకు అందనంత దూరంలో ఉన్న ఆ జట్టు శనివారం టైటిల్ అందుకోవడం లాంఛనమే. ఓవర్‌నైట్ స్కోరు 220/5తో శుక్రవారం ఆట తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 293 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (160; 266 బంతుల్లో 21×4) ఒంటరి పోరాటం చేశాడు. అకిబ్ నబి (5/54), సునీల్‌కుమార్ (2/51), యుధ్‌వీర్ సింగ్ (2/55) విజృంభించడంతో జమ్మూకశ్మీర్‌కు 291 పరుగుల ఆధిక్యం లభించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి జమ్మూకశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 186 పరుగులు సాధించింది. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (2/30), విజయ్‌కుమార్ వైశాక్ (1/30), శ్రేయస్ గోపాల్ (1/24) రాణించారు. శనివారం మ్యాచ్‌కు చివరి రోజు కాగా.. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ 477 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (94 బ్యాటింగ్), సాహిల్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జమ్మూకశ్మీర్ విజేతగా నిలవడం దాదాపుగా ఖాయం. 1959-1960లో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన జమ్మూకశ్మీర్.. తన 67 ఏళ్ల దేశవాళీ చరిత్రలో ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. చరిత్రాత్మక క్షణాల్ని ప్రత్యక్షంగా చూసేందుకు జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం హుబ్బళి చేరుకున్నారు. జమ్మూకశ్మీర్ క్రికెట్ మాజీ డైరెక్టర్, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ మొదటి రోజు నుంచి ఇక్కడే ఉన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8 మ్యాచ్ చూసేందుకు చెన్నై వెళ్లిన మిథున్ తిరిగి హుబ్బళికి వచ్చేశాడు.


సాహిల్ ఇక్బాల్


అకిబ్ నబి 5/54

బారాముల్లా ఎక్స్‌ప్రెస్

బారాముల్లా.. ఈ పేరు చెప్పగానే తుపాకుల శబ్దాలు, సైనికుల కవాతులు, కర్ఫ్యూలు, ఉగ్రవాదుల దాడులే గుర్తుకొస్తాయి. అలాంటి చోటు నుంచి ఓ బౌలర్ దూసుకొచ్చాడు. అద్భుతమైన ప్రదర్శనతో జమ్మూకశ్మీర్ తొలిసారి రంజీ ఛాంపియన్ అయ్యేందుకు బాటలు వేసిన అతడే అకిబ్ నబి. ఈ రంజీ సీజన్లో 10 మ్యాచ్‌ల్లోనే 60 వికెట్లు తీశాడీ పేసర్. తాజా ప్రదర్శనతో 29 ఏళ్ల అకిబ్.. సెలక్టర్లను తనవైపు చూసేలా చేశాడు.

సౌకర్యాలు లేకపోయినా..: సున్నిత ప్రాంతమైన బారాముల్లాలోని షెరీ నుంచి వచ్చిన నబికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. కానీ అతడి ఊరు ఆటలకు అనువైన ప్రదేశమే కాదు. అయినా నబి.. ఆశలు వదులుకోలేదు. సీనియర్ పర్వేజ్ రసూల్ బాటలో నడిచి క్రికెటర్ అయ్యాడు. రోజూ 60 కిలోమీటర్లు ప్రయాణించి శ్రీనగర్‌కు వెళ్లి శిక్షణ పొందేవాడు. వయసు విభాగాల టోర్నీల్లో రాణించడం ద్వారా నబి 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర జట్టులోకి చోటు దక్కించుకున్నాడు. అయితే ఆరంభంలో అతడు చాలా తక్కువ వేగంతో బంతులు వేసేవాడు. లైన్ అండ్ లెంగ్త్ సరిగా ఉండేది కాదు. స్వింగ్ సరిగా చేయలేకపోయేవాడు. జమ్మూ బౌలింగ్ కోచ్ కృష్ణ కుమార్.. నబి బౌలింగ్‌ను మార్చాడు. లైన్ అండ్ లెంగ్త్‌ను సరిదిద్ది.. పేస్‌లో పదును పెంచాడు. దీనికి తోడు బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడం నేర్చుకున్న నబి.. బ్యాటర్లకు సవాల్‌గా మారాడు. "సుదీర్ఘంగా బౌలింగ్ చేసే సత్తా నబికి ఉంది. ఈ రంజీ ట్రోఫీ సెమీస్‌లో ఒక ఇన్నింగ్స్‌లో వరుసగా పది ఓవర్లు వేశాడు. ఇది అతడి ఫిట్‌నెస్‌కు నిదర్శనం. సరళమైన బౌలింగ్ శైలి వల్లే అతడు శరీరంపై ఒత్తిడి పడకుండా ఎక్కువ ఓవర్లు వేసి.. ఫలితాలు సాధిస్తున్నాడు. అతడు ముమ్ముందు మరింత రాణించడం ఖాయం" అని కోచ్ కృష్ణ కుమార్ అన్నాడు.

రంజీల్లో అదిరేలా..: తొలి రంజీ సీజన్లోనే ఈ పేసర్ తన ముద్ర వేశాడు. 2024-25 టోర్నీలో 9 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు పడగొట్టాడు. ఈసారి రంజీ ట్రోఫీలో అతడి జోరు మరింత పెరిగింది. ఇప్పటిదాకా 60 వికెట్లు పడగొట్టాడు. మధ్యప్రదేశ్‌తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 40 పరుగులకే 7 వికెట్లు తీసిన నబి.. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి ఒంటి చేత్తో జమ్మూకశ్మీర్‌ను గెలిపించాడు. బెంగాల్‌తో సెమీఫైనల్లో నబి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో అయిదు, రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన ఈ పేసర్.. బ్యాట్‌తోనూ విలువైన (42) పరుగులు చేశాడు. కర్ణాటకతో ఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో నబి అయిదు వికెట్ల ప్రదర్శనతో జట్టు విజయానికి పునాది వేశాడు. దక్షిణాఫ్రికా దిగ్గజ బౌలర్ డేల్ స్టెయిన్‌ను ఆరాధించే నబి.. అతడి మాదిరే కచ్చితత్వంతో బౌలింగ్ చేస్తాడు. బ్యాటర్లకు షాట్లు కొట్టే వీడ్ ఇవ్వకుండా పరీక్షించి వికెట్లు సాధిస్తాడు. సుదీర్ఘమైన స్పెల్స్ వేయగల సామర్థ్యం, కీలక సమయాల్లో వికెట్లు తీసే నైపుణ్యం నబిని మిగిలిన బౌలర్లకు భిన్నంగా నిలబెడుతున్నాయి. బంతితోనే కాదు బ్యాట్‌తోనూ రాణించగలగడం ఈ బారాముల్లా క్రికెటర్ ప్రత్యేకం. ఈ ఏడాది రంజీ ట్రోఫీకి ముందు విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్‌పై అజేయంగా సెంచరీ (114 నాటౌట్) చేసి జట్టును గెలిపించాడు. అదే మ్యాచ్‌లో అతడు 3 వికెట్లు కూడా పడగొట్టాడు. ఇప్పటిదాకా 40 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 151 వికెట్లు తీసిన నబి.. 967 పరుగులు సాధించాడు. 36 లిస్ట్-ఎ మ్యాచ్‌ల్లో 56 వికెట్లు తీసి, 572 పరుగులు చేశాడు. 34 టీ20ల్లో 43 వికెట్లు పడగొట్టాడు. తాజా ఐపీఎల్ వేలంలో దిల్లీ క్యాపిటల్స్ ఏకంగా రూ.8.40 కోట్లు పెట్టి నబిని సొంతం చేసుకుంది. ఐపీఎల్‌లోనూ అదరగొడితే అతడు భారత జట్టు తలుపు తట్టడం ఖాయం.

– ఈనాడు క్రీడావిభాగం

> "పేసర్ అకిబ్ నబి భారత జట్టు దిశగా దూసుకెళ్తున్నాడు. ఈ ఏడాది మధ్యలో జరిగే ఇంగ్లాండ్ పర్యటనే అతడికి మంచి అవకాశం. తపన ఉంటే ఏదైనా సాధించొచ్చని జమ్మూకశ్మీర్ నిరూపించింది"
> – మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ

వన్డే సిరీస్ కంగారూలకు

రెండో మ్యాచ్‌లోనూ భారత్ ఓటమి


జార్జియా వోల్ (101)

హోబర్ట్: ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన తొలి వన్డే సిరీస్‌లో భారత మహిళలకు చుక్కెదురైంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 0-2తో చేజార్చుకుంది. జార్జియా వోల్ (101; 82 బంతుల్లో 13×4, 1×6) సెంచరీతో సత్తాచాటడంతో శుక్రవారం రెండో వన్డేలో ఆసీస్ 5 వికెట్ల తేడాతో హర్మన్‌ప్రీత్ సేనను ఓడించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 251 పరుగులు సాధించింది. ప్రతీక రావల్ (52; 81 బంతుల్లో 6×4), స్మృతి మంధాన (31; 37 బంతుల్లో 4×4), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (54; 70 బంతుల్లో 2×4, 1×6) రాణించడంతో భారత్ పోరాడగలిగే స్కోరు నమోదు చేసింది. ఆసీస్ 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (80; 62 బంతుల్లో 11×4, 1×6), వోల్ రెండో వికెట్‌కు 119 పరుగులు జోడించి ఆసీస్‌ను గెలుపు బాటలో నడిపించారు. ఆ తర్వాత వోల్, బెత్ మూనీ (31; 34 బంతుల్లో 5×4) మూడో వికెట్‌కు 82 పరుగులు జతచేసి విజయాన్ని ఖాయం చేశారు. భారత ఫీల్డర్ల వైఫల్యం వోల్‌కు కలిసొచ్చింది. 19 పరుగుల వద్ద ఉన్నప్పుడు క్రాంతి గౌడ్ ఆమె క్యాచ్‌ను వదిలేసింది. స్మృతి కూడా సులువైన అవకాశాన్ని చేజార్చింది. వికెట్ కీపర్ రిచా ఘోష్ రనౌట్ అవకాశాన్ని వదిలిపెట్టడంతో వోల్ తన వన్డే కెరీర్‌లో రెండో శతకాన్ని పూర్తిచేసుకుంది. భారత బౌలర్లలో కశ్వీ గౌతమ్ (2/47), క్రాంతి గౌడ్ (1/54), దీప్తిశర్మ (2/32) సఫలమయ్యారు. ఆదివారం మూడో వన్డే జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 251/9 (ప్రతీక 52, స్మృతి 31, హర్మన్‌ప్రీత్ 54, ఆష్లీ గార్డ్‌నర్ 2/39, అనాబెల్ సదర్లాండ్ 2/37, అలానా కింగ్ 2/41), **ఆస్ట్రేలియా:** 36.1 ఓవర్లలో 252/5 (లిచ్‌ఫీల్డ్ 80, వోల్ 101, మూనీ 31, కశ్వీ 2/47, దీప్తిశర్మ 2/32)

వాంఖడేలో రవిశాస్త్రి స్టాండ్

ముంబయి: భారత్ మాజీ కెప్టెన్, కోచ్ రవిశాస్త్రి గౌరవార్థం ముంబయిలోని వాంఖడే స్టేడియంలో ఓ స్టాండుకు అతడి పేరును పెట్టబోతున్నారు. భారత క్రికెట్‌కు రవిశాస్త్రి అందించిన సేవలకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) అధ్యక్షుడు అజింక్య నాయక్ తెలిపాడు. రవిశాస్త్రి దేశవాళీల్లో ముంబయికి కూడా సారథ్యం వహించాడు. వాంఖడేలోని లెవెల్-1 స్టాండ్‌కు రవి పేరు పెట్టాలని అపెక్స్ మండలి ప్రతిపాదించింది. 3, 5, 6 నంబరు గేట్లకు దిలీప్ సర్దేశాయ్, డయానా ఎడుల్జీ, ఏక్‌నాథ్ సోల్కర్‌ల పేర్లు పెట్టనున్నట్లు ఎంసీఏ వెల్లడించింది.

ఈడెన్‌లో పరుగుల వరదే

కోల్‌కతా: చెన్నై పిచ్‌పై టీమ్‌ఇండియా అభిమానులకు పరుగుల విందు అందించింది. కోల్‌కతాలోనూ బ్యాటర్లు పండగ చేసుకునే అవకాశముంది. పరుగుల పిచ్‌పై ఆదివారం భారత్, వెస్టిండీస్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ ప్రపంచకప్‌లో తొలి 200 స్కోరు నమోదైన ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ పిచ్‌ను నిశితంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసినట్లు పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ తెలిపాడు. టోర్నీ ఆరంభ దశలో ఇదే మైదానంలో స్కాట్లాండ్.. ఇటలీపై 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే ఈ పిచ్ బౌలర్లకు కూడా సహకరిస్తుంది. స్పిన్నర్లకు టర్న్, పేసర్లకు మంచి బౌన్స్ లభిస్తుంది. మంచు ప్రభావం కూడా ఉంటుంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో లక్ష్యఛేదనలో ఇటలీ 134 పరుగులకే ఆలౌటైంది. ఈ ప్రపంచకప్‌లో భారత్ ఈడెన్ గార్డెన్స్‌లో ఆడనుండటం ఇదే మొదటిసారి కాగా.. విండీస్ గ్రూప్ దశలో రెండు మ్యాచ్‌లు (స్కాట్లాండ్, ఇటలీలపై) ఆడింది. ఆ అనుభవాన్ని అనుకూలంగా మార్చుకోవాలని షై హోప్ బృందం భావిస్తోంది. ఈ మ్యాచ్ భారత్, వెస్టిండీస్‌లకు క్వార్టర్‌ఫైనల్ లాంటిదే. గెలిచిన జట్టు సెమీస్ చేరుతుంది.


కోల్‌కతా చేరుకున్న టీమ్‌ఇండియా ఆటగాళ్లు

రింకూ తండ్రి కన్నుమూత


తండ్రితో రింకూ

అలీగఢ్: భారత క్రికెటర్ రింకూ సింగ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. రింకూ తండ్రి ఖాన్‌చంద్ సింగ్ (60) తుదిశ్వాస విడిచారు. చాలా కాలంగా కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున గ్రేటర్ నోయిడాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. "రింకూ తండ్రి గత మూడు, నాలుగు రోజులుగా కృత్రిమ శ్వాస మీద ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆయన మరణ వార్త తెలిసింది" అని రింకూ మాజీ కోచ్ మసూద్ అమిని తెలిపారు. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ జట్టులో రింకూ సభ్యుడిగా ఉన్నాడు. తన తండ్రి ఆరోగ్యం విషమంగా ఉందని తెలియడంతో టోర్నీ మధ్యలోనే నోయిడాకు చేరుకున్నాడు. తండ్రిని పరామర్శించిన అనంతరం.. గురువారం జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు తిరిగి జట్టుతో చేరాడు. ఆ మ్యాచ్‌లో రింకూకు తుది జట్టులో చోటు లభించలేదు. తండ్రి మరణవార్త తెలియగానే అతడు అలీగఢ్ వెళ్లాడు. శుక్రవారం ఖాన్‌చంద్ అంత్యక్రియలు ముగిశాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాకు చెందిన ఖాన్‌చంద్ ఒకప్పుడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్మికుడిగా పనిచేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కుమారుడి క్రికెట్ స్వప్నాన్ని ఎప్పుడూ అడ్డుకోలేదు. తన ఎదుగుదలలో తండ్రి పాత్ర ఎంతో ఉందని రింకూ పలు సందర్భాల్లో చెప్పాడు. నిరుడు జూన్‌లో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో రింకూ నిశ్చితార్థం జరగ్గా.. అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఖాన్‌చంద్ ఆ వేడుకకు హాజరయ్యారు.

అభిషేక్ డిఫెన్స్ ఆడటం ఆశ్చర్యం


సునీల్ గావస్కర్

దిల్లీ: అభిషేక్ డిఫెన్స్ ఆడటం ఆశ్చర్యం కలిగించిందని భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. జింబాబ్వేపై అభిషేక్ ఇన్నింగ్స్‌ను గావస్కర్ మెచ్చుకున్నాడు. అప్పటికి అభిషేక్ నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌటై.. ఫామ్‌తో సతమతమవుతున్న నేపథ్యంలో జింబాబ్వేపై 30 బంతుల్లో 55 పరుగులు చేసి విమర్శకులకు చెక్ పెట్టాడని అన్నాడు. "అభిషేక్ సామర్థ్యం గురించి అందరికి తెలుసు. జింబాబ్వేపై ఆరంభంలో అతడు సమయం తీసుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్‌ను గౌరవించాడు. అభి డిఫెన్స్ ఆడడం ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే అతడు అలా ఆడడం తరచూ చూడం. వరుస వైఫల్యాల నుంచి అభిషేక్ ఎంతో నేర్చుకున్నాడనిపిస్తోంది. వెస్టిండీస్‌తో కీలక పోరుకు ముందు అతడు పుంజుకోవడం భారత్‌కు కలిసొచ్చే అంశం. టాప్ ఆర్డర్‌లో కుడిచేతివాటం బ్యాటర్ ఉండాలని దక్షిణాఫ్రికాతో ఓటమి అనంతరం టీమ్‌ఇండియా గ్రహించింది. జింబాబ్వేపై శాంసన్‌ను ఓపెనర్‌గా పంపడం భారత్‌కు లాభించింది. హిట్టర్లతో కూడిన విండీస్ బ్యాటింగ్ లైనప్‌ను అడ్డుకునేందుకు టీమ్‌ఇండియా ప్రణాళిక ప్రకారం బౌలింగ్ చేయాలి" అని సూచించాడు.

గుకేశ్‌కు వరుసగా రెండో డ్రా

ప్రేగ్: ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ విభాగంలో చెస్ ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ వరుసగా రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. రెండో రౌండ్లో నొదిర్బెక్ యాకుబొవ్ (ఉజ్బెకిస్థాన్)తో అతడు పాయింట్ పంచుకున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం టోర్నీలో పాయింట్ల ఖాతా తెరిచాడు. హ్యాన్స్ నీమన్ (అమెరికా)పై నెగ్గాడు. గుకేశ్, అరవింద్ చెరో పాయింట్‌తో వరుసగా నాలుగు, ఆరో స్థానాల్లో కొనసాగుతున్నారు. దివ్య దేశ్‌ముఖ్ ఛాలెంజర్స్ విభాగంలో డ్యానిల్ యుఫా (స్పెయిన్)తో గేమ్‌ను డ్రాతో సరిపెట్టుకుంది. దివ్య (1 పాయింట్) నాలుగో స్థానంలో ఉంది.

(c) eenadu

బండెనక బండి కట్టి..
బయలెల్లె బారాత్



నేటి రోజుల్లో పెళ్లి ఊరేగింపు అనగానే కార్ల బారులు, చెవుల తుప్పు వదిలించేలా డీజే శబ్దాలు తప్పనిసరి. ఇందుకు పూర్తిగా భిన్నమైన పెళ్లి వేడుక ఒకటి బిహార్‌లో అందరి దృష్టిని ఆకట్టుకుంది. జిల్లా కేంద్రమైన సమస్తీపుర్‌లోని ఓ హోటలు యజమాని ప్రదీప్ సేర్ కుమారుడు అలోక్ పెళ్లి ఫిబ్రవరి 25న జరిగింది. బారాత్‌లో వరుడు కూర్చొన్న గుర్రం ముందు నడుస్తుండగా, వెనుక 35 జోడెడ్ల బండ్లలో బంధుమిత్రులు బయలుదేరారు. అలంకరించిన ఎడ్ల బండ్లపై కొలువుదీరిన వాయిద్యకారులు శ్రావ్యమైన జానపద సంగీతం వినిపిస్తూ వచ్చారు. నగరంలో దాదాపు 2 కి.మీ.ల మేర కన్నులపండువగా కొనసాగిన ఈ ఊరేగింపు గజరాజ్ ప్యాలెస్‌కు చేరుకొంది. 50 ఏళ్ల వెనక్కు వెళ్లినట్టుగా ఉందని పలువురు పెద్దలు వ్యాఖ్యానించారు. "ఈతరానికి ఎడ్లబండ్ల ప్రయాణాలు తెలియవు. పాత సంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి, కాలుష్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈ ప్రయత్నం చేశాం" అని అలోక్ బాబాయి మహేంద్ర ప్రధాన్ తెలిపారు.

ఈటీవీ భారత్

స్టవ్ మెకానిక్‌కు
రూ.3 కోట్ల లాటరీ

అదృష్టం ఎప్పుడు ఎవరి తలుపు తడుతుందో చెప్పలేమని అంటారు. పంజాబ్‌లోని మోగా జిల్లా నిహాల్‌సింగ్ వాలా పట్టణానికి చెందిన మహేంద్రసింగ్‌నూ ఇలాగే అనూహ్యంగా అదృష్టలక్ష్మి వరించింది. గురుగ్రామ్ ఆలయంలో పూజలు చేసి తిరిగి వస్తూ పత్రాన్ మార్కెట్‌లో కనిపించిన ఓ లాటరీ దుకాణంలో ఆయన టికెటు కొన్నారు. అది నాగాలాండ్ రాష్ట్ర 'డియర్ మహా శివరాత్రి బంపర్ 2026' లాటరీ. మహేంద్రసింగ్ కొన్న టికెటుకు మొదటి బహుమతి తగలడంతో ఆయన రూ.3 కోట్లు గెలుచుకున్నారు. జీవనోపాధి కోసం స్టవ్ రిపేర్ దుకాణం నడుపుతున్న మహేంద్రసింగ్‌కు లాటరీ తగిలిందన్న విషయం పట్టణమంతా పొక్కగానే ఆయన కుటుంబసభ్యులు స్థానికులతో కలిసి ఈ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ లాటరీ బంపర్ డ్రా ఫిబ్రవరి 21న జరిగింది. ఏజెంట్ కమిషను, ఇతర మినహాయింపులు పోగా రూ.1.80 కోట్లకు పైగా మహేంద్రసింగ్ చేతికి అందనుంది.



గగనతల రక్షణ క్షిపణి పరీక్షలు విజయవంతం

దిల్లీ: అత్యంత స్వల్పశ్రేణి గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థను (వీఎస్‌హెచ్‌ఓఆర్‌ఏడీఎస్) భారత్ విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఒడిశా తీరానికి చేరువలోని చాందీపుర్‌లో ఈ పరీక్షలు జరిగాయి. వరుసగా మూడుసార్లు ఈ ప్రయోగాలను నిర్వహించారు. భిన్న వేగాలు, పరిధి, ఎత్తుల్లో లక్ష్యాలను నేలకూల్చడంలో క్షిపణి సత్తాను ఈ సందర్భంగా పరీక్షించారు.



ఈ ఆయుధ వ్యవస్థను సైనికులు భుజంపై తరలించుకెళ్లవచ్చు. దీన్ని హైదరాబాద్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసింది. ఇతర డీఆర్‌డీవో ల్యాబ్‌లు, పరిశ్రమలు ఇందులో పాలుపంచుకున్నాయి. తాజా పరీక్షల్లో.. ఈ క్షిపణులు గాల్లో లక్ష్యంగా నిర్దేశించిన డ్రోన్లను నేలకూల్చాయి. ఈ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో, సైనిక దళాలు, పరిశ్రమలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ అభినందించారు.



గుప్పెడు పిస్తాలతో గాఢ నిద్ర

నిద్రలేమి సమస్యతో బాధపడేవారు రోజూ గుప్పెడు పిస్తాలు తీసుకుంటే ఆ ఇబ్బంది నుంచి బయటపడొచ్చు. మరే ఇతర పండ్లు, కూరగాయల్లో లభించనంత అధికశాతంలో మెలటోనిన్ పిస్తాల నుంచి లభిస్తుంది. మెదడును ప్రశాంత పరచి, గాఢ నిద్ర పట్టేందుకు పిస్తాల్లోని మెలటోనిన్ దోహదపడుతుంది.

– క్రిస్టీన్ జాకోబిట్జ్, పౌష్టికాహార నిపుణురాలు

ప్రచండ్‌లో రాష్ట్రపతి గగన విహారం

జైపుర్: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి పోరాట హెలికాప్టర్ 'ప్రచండ్'లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం గగనవిహారం చేశారు. ఫ్లయింగ్ సూట్ ధరించిన ఆమె.. 25 నిమిషాలపాటు కో పైలట్‌గా వ్యవహరించారు. తద్వారా పోరాట హెలికాప్టర్‌లో ఆకాశయానం చేసిన తొలి రాష్ట్రపతిగా ఆమె చరిత్ర సృష్టించారు. భారత్-పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని జైసల్మేర్ వైమానిక స్థావరం నుంచి రాష్ట్రపతి హెలికాప్టర్ టేకాఫ్ అయింది. అనంతరం కాక్‌పిట్ నుంచి ముర్ము దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు. "దేశ స్వావలంబనకు ప్రచండ్ ఒక శక్తిమంతమైన నిదర్శనం. మన వీర సైనికులకు వందనం. జైహింద్! జై భారత్!!" అని ముర్ము పేర్కొన్నారు. ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి పోరాట హెలికాప్టర్. అధునాతన ఏవియానిక్స్, శత్రువులను ఏమార్చే స్టెల్త్ సామర్థ్యం, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సత్తా దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్‌ల వంటి ఆయుధాలను ఇది ప్రయోగించగలదు.



'ప్రచండ్'లో గగన విహారం చేస్తూ రాష్ట్రపతి అభివాదం

ఆపరేషన్ సిందూర్‌ను కళ్లకు కట్టిన 'వాయుశక్తి'

భారత్-పాకిస్థాన్ సరిహద్దుకు చేరువలోని పోఖ్రాన్ రేంజ్‌లో శుక్రవారం భారత వైమానిక దళం 'వాయుశక్తి' విన్యాసాలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు హాజరయ్యారు. ఇందులో వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్‌లు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా.. గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడులను వాయుసేన అనుకరించింది. శత్రు రన్‌వేలు, పెట్రోలియం నిల్వ కేంద్రాలు, బంకర్లు, రాడార్ శిబిరాలు, యుద్ధ ట్యాంకులు, కమ్యూనికేషన్ కేంద్రాలు, ఉగ్రవాద శిబిరాలు, మందుగుండు నిల్వ కేంద్రాల నమూనాలను యుద్ధవిమానాలు ధ్వంసం చేశాయి. ఫైటర్ జెట్‌లు, పోరాట హెలికాప్టర్లు సమన్వయంతో దాడులు చేస్తూ తమ సత్తాను చాటాయి. రాత్రివేళ చిమ్మచీకట్లోనూ ఈ విన్యాసాలు కొనసాగాయి. బందీలను విడిపించే ఆపరేషన్‌ను వాయుసేన, ఆర్మీ కమాండోలు ప్రదర్శించారు. డ్రోన్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



ముంబయి విమానాశ్రయంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ, ఆయన సతీమణి డయానా

ముంబయి చేరుకున్న కెనడా ప్రధాని

ముంబయి: కెనడా ప్రధాని మార్క్ కార్నీ నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా శుక్రవారం ముంబయికి చేరుకున్నారు. భారత్‌తో వివిధ రంగాల్లో, ముఖ్యంగా వాణిజ్య, విద్యుత్, సాంకేతిక, కృత్రిమ మేధ రంగాల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ పర్యటన లక్ష్యంగా పేర్కొన్నారు. కెనడా ప్రధానితో పాటు ఆ దేశానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సైతం భారత్‌కు వచ్చింది. 'భారత్ ప్రపంచంలో అతి వేగంగా పురోగతి సాగిస్తున్న ఆర్థిక వ్యవస్థ. ఇక్కడి వాణిజ్య రంగానికి చెందిన ప్రముఖులతో సంప్రదింపులు జరిపేందుకు ముంబయికి చేరుకున్నాం. మా కార్మికులకు, వ్యాపారాలకు కొత్త అవకాశాలు అందివచ్చేలా సహకారం పెంపొందించుకునేందుకు వచ్చాం" అని కార్నీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఆయన మార్చి 1న దిల్లీకి చేరుకుని ప్రధాని మోదీతో సమావేశమవుతారు. స్వదేశానికి తిరిగి వెళ్లే ముందు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌తోనూ కార్నీ చర్చలు జరుపుతారు.

కేంద్రం హామీకి
పార్లమెంటు బాధ్యత వహించదు

- సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: చట్టాన్ని సమీక్షించడంపై కేంద్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చినా.. అందుకు పార్లమెంటు బాధ్యత వహించదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంటుకు చట్టాన్ని రూపొందించే "సంపూర్ణ స్వతంత్ర అధికారం" ఉందని స్పష్టం చేసింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 152 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సెక్షన్ 152 దేశ సార్వభౌమత్వం, ఏకత్వం, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు సంబంధించినది. గతంలో రద్దు చేసిన ఐపీసీలోని సెక్షన్ 124ఏ (దేశద్రోహం)ను కేంద్రం సెక్షన్ 152 ద్వారా తిరిగి ప్రవేశపెడుతోందని పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరు వాదించారు. "ఈ చట్టాన్ని ప్రభుత్వం సమీక్షించేవరకు అమలు చేయొద్దని, దీన్ని ఉపయోగిస్తూ కొత్త ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 2022 మే నెలలో పేర్కొంది. ఆ సమయంలో కేంద్రం ఆ చట్టాన్ని పునఃసమీక్షిస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది" అని న్యాయవాది వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'కేంద్రం హామీ ఇచ్చి ఉండవచ్చు. కానీ, పార్లమెంటు దానికి బాధ్యత వహించదు' అని తెలిపింది. చట్టాన్ని రూపొందించే విషయంలో పార్లమెంటుకు సంపూర్ణ అధికారం ఉందని వ్యాఖ్యానించింది.

ఇరాన్‌తో చర్చల ఫలితంపై సంతృప్తిగా లేను

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగిస్తున్న చర్చల ఫలితంపై తాను సంతృప్తిగా లేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. తమ మాటల్ని ఇరాన్ పట్టించుకోవడం లేదని, అయితే తదుపరి దఫా చర్చల ఫలితం కోసం చూస్తున్నానని శుక్రవారం నాడిక్కడ వ్యాఖ్యానించారు. కాగా ఇరాన్‌పై గగనతల దాడులకు దిగుతామంటూ ట్రంప్ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అమెరికా కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇజ్రాయెల్‌ను వీడాలనుకునే తమ రాయబార కార్యాలయ సిబ్బంది వెంటనే వెళ్లిపోవచ్చని పేర్కొంది. ఈ మేరకు అధికారికంగా అనుమతి ఇస్తున్నట్లు టెల్‌అవీవ్‌లోని అమెరికా రాయబారి మైక్ హుకబీ తమ సిబ్బందికి ఈ-మెయిల్ పంపారు. సిబ్బంది స్వదేశానికి వెళ్లడానికి అయ్యే ఖర్చులను అమెరికా ప్రభుత్వమే భరిస్తుందని అందులో తెలిపారు.

★ వచ్చే నెల 2, 3 తేదీల్లో ఇజ్రాయెల్‌లో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో పర్యటించనున్నారు. ఇరాన్ చుట్టూ అమెరికా సేనలు మోహరించిన వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ సహా పశ్చిమాసియాలో పరిస్థితులపై ఇజ్రాయెల్‌తో రూబియో చర్చించే అవకాశం ఉంది.

ఇరాన్ 'యురేనియం' గురించి మాకు తెలియదు: ఐఏఈఏ

ఇరాన్ ప్రస్తుతం యురేనియాన్ని శుద్ధి చేయడం ఆపేసిందా లేదా అన్న విషయం తమకు తెలియదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. గతేడాది జూన్‌లో జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత తాము ఇరాన్‌లోని అణు కేంద్రాలను తనిఖీ చేయలేదని పేర్కొంది. ఈ మేరకు తమకు టెహ్రాన్ అనుమతులు ఇవ్వలేదని ఐఏఈఏ పేర్కొన్నట్లు ఏపీ వార్తా సంస్థ తెలిపింది.

సిమ్ లేకపోతే వాట్సప్ బంద్



ఇంటర్నెట్ డెస్క్: వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్స్‌నకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. వీటి ప్రకారం ఇకపై సిమ్ లేకుండా ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయవు. గతేడాది నవంబరులో ఈ నిబంధనలను ప్రకటించగా.. అమలు కోసం ఆయా సంస్థలకు ఇచ్చిన గడువు ఈ నెల 28(శనివారం)తో ముగియనుంది. వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్రం ఈ నిబంధన తీసుకొచ్చింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఆయా యాప్‌లను వెబ్‌బ్రౌజర్‌లో ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛకు ముప్పు ప్రభుత్వ నియంత్రణల వల్లే..



- జస్టిస్ బి.వి.నాగరత్న

దిల్లీ: నిర్బంధాలు, బెదిరింపులు, ఒత్తిడుల నీడలో మీడియా తన కార్యకలాపాలు సాగించలేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న పేర్కొన్నారు. పత్రికా స్వాతంత్ర్యానికి ఎదురవుతున్న ముప్పు ప్రత్యక్ష సెన్సార్‌షిప్ నుంచి కాక.. ప్రభుత్వ నియంత్రణలు, యాజమాన్య నిబంధనలు, లైసెన్సింగ్ చట్టాలు, ఆర్థిక విధానాల నుంచి తలెత్తుతోందని ఆమె "ఐపీఐ ఇండియా అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం" అవార్డు ప్రదానోత్సవంలో పేర్కొన్నారు. పత్రికా రంగాన్ని కబళించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పర్యవసానాలు ఆర్థికంగానే కాక రాజకీయంగానూ ఉంటున్నాయని జస్టిస్ నాగరత్న అన్నారు. "ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ప్రతి మీడియా సంస్థకు చట్ట ప్రకారం స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభుత్వం విధించగల ఆర్థిక పరిమితుల నేపథ్యంలో అలా విమర్శిస్తే మీడియా సంస్థ మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితులు ఉన్నాయి" అని న్యాయమూర్తి అన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకుర్, పీటీఐ వార్తా సంస్థ ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషిలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.

అవి వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమే..

- పాస్‌పోర్టు, విదేశీ ప్రయాణాల హక్కుపై దిల్లీ హైకోర్టు వ్యాఖ్య



దిల్లీ: పాస్‌పోర్టును కలిగి ఉండటం, విదేశాలకు ప్రయాణించడం అనేవి భారత రాజ్యాంగంలోని అధికరణం 21 కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛా హక్కులో అంతర్భాగమేనని దిల్లీ హైకోర్టు శుక్రవారం స్పష్టంచేసింది. ఈ హక్కుకు భంగం కలిగేలా అధికారులు చర్యలు తీసుకుంటే...వాటికి ఓ కారణం ఉండాలని, న్యాయ సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలని తేల్చిచెప్పింది. రహేజా డెవలపర్స్ మాజీ డైరెక్టర్ యోగేశ్ రహేజా పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర నిర్ణయాన్ని పక్కనబెడుతూ.. జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాస్‌పోర్టు పునరుద్ధరణ చేసే ప్రక్రియలో తనపై పెండింగులో ఉన్న ఎఫ్‌ఐఆర్ వివరాలను అందించడంలో యోగేశ్ విఫలమయ్యారని, ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని గత ఏడాది జనవరి 17న అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి వ్యతిరేకంగా ఆయన చేసిన అప్పీల్‌ను 2025 మార్చి 25న అప్పిలేట్ అధికారి తిరస్కరించారు. యోగేశ్ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చెప్పిన కారణాలు న్యాయసూత్రాలకు అనుగుణంగా లేవంటూ కేంద్ర నిర్ణయాన్ని పక్కనబెట్టారు.

అగ్నివీర్‌లు, ఆర్మీ సిబ్బందికి రిటైరయ్యాక రైల్వేలో ఉద్యోగాలు

- 'ఫ్రేమ్ వర్క్' రూపొందించిన రైల్వే శాఖ, భారత సైన్యం

దిల్లీ: సైన్యం నుంచి అగ్నివీర్‌లు రిటైరయ్యాక వారికి ఉద్యోగావకాశాలను కల్పించే దిశగా కేంద్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం రైల్వే శాఖ, సైన్యం కలిసి సహకార ముసాయిదా (ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ కోఆపరేషన్)ను అమల్లోకి తెచ్చాయి. దీంతో రిటైర్డ్ అగ్నివీర్‌లు, ఆర్మీ సిబ్బందికి రైల్వేశాఖలో ఉద్యోగాల కల్పన జరగనుంది. దీనిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రత్యేక హెల్ప్‌లైన్ వ్యవస్థనూ అందుబాటులోకి తేనున్నారు. ఈమేరకు రైల్వేశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ మాజీ సిబ్బందికి రైల్వేశాఖలోని లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో 10శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారు. లెవల్-1 పోస్టుల్లో సైనిక మాజీ సిబ్బందికి 20 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. రిటైర్డ్ అగ్నివీర్‌లకు లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో అదనంగా 5 శాతం, లెవల్-1 పోస్టుల్లో అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని రైల్వేశాఖ వెల్లడించింది. సాధారణ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తయ్యేవరకు వేగవంతమైన భర్తీలు చేపట్టేందుకుగానూ ఆర్మీ మాజీ సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన పాయింట్స్‌మెన్‌గా నియమించుకుంటామని రైల్వేశాఖ వెల్లడించింది. ఇందుకోసం సంబంధిత ఆర్మీ సంస్థలతో 9 రైల్వే డివిజన్లు అవగాహన ఒప్పందాలు(ఎంఓయూ) కుదుర్చుకున్నాయని తెలిపింది.



పదో తరగతి పరీక్ష రాస్తూ విద్యార్థిని ప్రసవం!

వెలుగులోకి వచ్చిన లైంగిక దాడి

ధార్: పదో తరగతి పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని పాఠశాల శౌచాలయంలో ప్రసవించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో వెలుగు చూసింది. పీథంపుర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని పరీక్ష రాస్తుండగా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో శౌచాలయానికి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో మహిళా సిబ్బంది లోపలికి వెళ్లి చూడగా, శిశువు ఏడుపు వినిపించింది. వెంటనే పాఠశాల సిబ్బంది అంబులెన్స్‌లో బాలిక, శిశువును ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. విద్యార్థిని 8 నెలల గర్భిణి అని, నెలలు నిండకుండానే ప్రసవించిందని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. నృత్య కార్యక్రమంలో పరిచయమైన ఓ బాలుడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు బాలిక విచారణలో తెలిపింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఆ పుస్తకం తిరిగి ఇచ్చేయండి

ఎన్‌సీఈఆర్‌టీ

దిల్లీ: న్యాయ వ్యవస్థలో అవినీతి అనే పాఠంతో కూడుకున్న వివాదాస్పద ఎనిమిదో తరగతి పాఠ్య పుస్తకం ఎవరిదగ్గరైనా ఉంటే దాన్ని తమకు తిరిగి ఇచ్చేయాలని కోరుతూ జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) శుక్రవారం ఒక ప్రకటన జారీచేసింది. ఆ పాఠాన్ని కలిగివున్న సామాజిక మాధ్యమాల్లోని పోస్టులన్నిటినీ తొలగించాలని పేర్కొంది. ఆ ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాన్ని డిజిటల్ వేదికల నుంచి, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి తొలగించాలని కేంద్ర విద్యాశాఖ సైతం గురువారం సమాచార ప్రసారాల శాఖను, ఎలక్ట్రానిక్స్ శాఖను కోరింది. పుస్తకంపై సుప్రీంకోర్టు సంపూర్ణ నిషేధాన్ని విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రైతుల నిరసనపై నివేదిక కోరిన సుప్రీం



దిల్లీ: పంజాబ్, హరియాణాల సరిహద్దులోని శంభు సరిహద్దు ప్రాంతంలో 2024లో నిరసనోద్యమం నిర్వహించిన రైతుల సమస్యలపై ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ నాటి రైతు ఉద్యమంపై నివేదికను, సిఫార్సులను అందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అప్పట్లో రైతులు ఉద్యమం నిర్వహించారు. శంభు సరిహద్దులో రహదారుల దిగ్బంధం సమస్య తొలగిపోయి ఆ ప్రాంతంలో ఇప్పుడు వాహన రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "ఈ కేసును మూసివేసేందుకు సమయం ఆసన్నమైందని భావిస్తున్నాం. ఉన్నతస్థాయి కమిటీ నుంచి నివేదిక పొందాక కేసును మూసివేయవచ్చు. కమిటీ తన సలహా సూచనల్ని సంక్షిప్తంగా అందిస్తే వాటిని సంబంధిత అధికారులకు అందిస్తాం" అని ధర్మాసనం పేర్కొంది. కమిటీ తన సిఫార్సుల్ని సీల్డు కవరులో అందించాలని, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ నివేదికలోని వివరాలను బహిర్గతం చేయరాదని స్పష్టంచేసింది. పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తి నవాబ్ సింగ్ ఈ ఐదుగురు సభ్యుల ఉన్నత స్థాయి కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. రైతు సమస్యల్ని రాజకీయం చేయరాదని పేర్కొంటూ సుప్రీంకోర్టు 2024లో సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. కమిటీ రైతు సమస్యల్ని దశలవారీగా పరిష్కరించాలని కోర్టు ఆదేశించింది.

బంగ్లాదేశ్‌లో భూకంపం

- కోల్‌కతాలోనూ ప్రకంపనలు

కోల్‌కతా: బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రత నమోదైంది. దీని ప్రభావంతో సరిహద్దులోని పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాతో పాటు సమీప జిల్లాల్లో భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న కొందరు ఎమ్మెల్యేలు భూప్రకంపనల కారణంగా వీధుల్లోకి పరిగెత్తారు. మధ్యాహ్నం 1.22 గంటలకు ఈ భూకంపం సంభవించిందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) తెలిపింది. భూమి ఉపరితలం నుంచి 10 కి.మీల లోతులో ఇది సంభవించిందని పేర్కొంది. బంగ్లాదేశ్‌లోని నయాబజార్ అనే ప్రాంతంలో ఈ భూకంప కేంద్రం ఉందని, ఇది కోల్‌కతాకు 100 కి.మీల దూరంలో ఉందని తెలిపింది.



కోల్‌కతాలో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం

అంతరిక్ష ప్రయోగాల్లో అవలంబించే పద్ధతులు
ఈశాన్య రాష్ట్రాలకు పాఠాలు: శుభాంశు



షిల్లాంగ్: అంతరిక్ష ప్రయోగాల్లో అవలంబించే స్థిరమైన పద్ధతులు మేఘాలయ వంటి ఈశాన్య రాష్ట్రాలకు పాఠాలు నేర్పుతాయని, మారుమూల ప్రాంతాలకు పునరుత్పాదక శక్తిని విస్తరించేందుకు ఉపయోగపడతాయని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా వ్యాఖ్యానించారు. ఉమియమ్‌లోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎన్‌ఈఎస్‌ఏసీ)లో గురువారం నిర్వహించిన 23వ జాతీయ అంతరిక్ష విజ్ఞాన సదస్సుకు హాజరై, పరిశోధకులు, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. "అంతరిక్షంలో జీవనం దాదాపు సౌరశక్తిపై ఆధారపడి ఉంటుంది. వ్యోమగాములు పరిమిత వాతావరణంలో కీలక వనరులను తిరిగి వినియోగిస్తారు. ఆ క్రమశిక్షణ, స్థిరమైన పద్ధతులు మనం కూడా ఆచరించదగినవి" అని శుభాంశు పేర్కొన్నారు. సంప్రదాయ విద్యుత్తు సరఫరా సవాలుగా ఉన్న గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో సౌర విద్యుత్తును ప్రోత్సహించడానికి మేఘాలయ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన కొనియాడారు.

19 మంది చైనా చట్టసభ సభ్యుల తొలగింపు

వారిలో 9 మంది సైనికాధికారులు

బీజింగ్: తొమ్మిది మంది సైనికాధికారులు సహా 19 మంది చట్టసభ సభ్యులను చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ తొలగించింది. చట్టసభ వార్షిక సమావేశానికి వారం రోజుల ముందు ఈ చర్య చేపట్టింది. అయితే ఇందుకు కారణాలేంటో తెలపలేదు. ఈ తొలగింపులకు అవినీతి ఆరోపణలు కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. తాజా తొలగింపుల తర్వాత చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 2,878కి చేరింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దశాబ్ద కాలంగా అవినీతికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఇటీవలి సంవత్సరాలలో పలువురు సైనికాధికారులపై వేటు పడింది. సాయుధ దళాలను సంస్కరించడానికి, ఆధునికీకరించడానికి జిన్‌పింగ్ ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే గత నెల సైన్యంలోని ఉన్నతస్థాయి జనరల్‌ను తొలగించారు. 14 ఏళ్లుగా అధికారంలో కొనసాగుతున్న జిన్‌పింగ్ తన రాజకీయ ప్రత్యర్థులను అడ్డుతప్పించి, తన కింది అధికారుల్లో విధేయతను పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రతినెలా 260 కి.మీ. సైకిలు తొక్కి..
పూరీ జగన్నాథుడికి తులసి మొక్కు



ఈటీవీ భారత్: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా ముల్లేశ్వర్ గ్రామానికి చెందిన బృందావన్ మాలిక్ (40) ప్రతినెలా బాలేశ్వర్ నుంచి పూరీకి 260 కి.మీ. సైకిల్ యాత్ర చేస్తున్నారు. చుట్టుపక్కల పది గ్రామాల భక్తుల నుంచి సేకరించిన తులసి కొమ్మలను ఈయన పూరీ జగన్నాథుడి సేవకు తీసుకువెళ్తున్నారు. చాట్ భండార్ వ్యాపారం చేసే మాలిక్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. జగన్నాథుడి భక్తుడైన ఈయన ప్రతి నెలా 20వ తేదీన బాలేశ్వర్ నుంచి సైకిలుపై బయలుదేరుతారు. సేకరించిన తులసి కొమ్మలను బుట్టల్లో నింపి కొబ్బరి కాయలు, పూలను వెంట తీసుకువెళతారు. రెండు రోజుల ప్రయాణంలో మార్గమధ్యంలోని దేవాలయాలు, మఠాల్లో రాత్రి బస చేస్తారు. 'సమాజ శ్రేయస్సు కోసం నేను ఈ యాత్ర చేస్తున్నాను. పూరీకి వెళ్లలేనివారు నా ద్వారా తులసి, ఇతర వస్తువులను పంపుతారు" అని మాలిక్ తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో ఇప్పుడు తన్మయ్ ప్రధాన్ (20) అనే మరో యువకుడు జత కలిశారు.

(c) eenadu

ఈనాడు

రెడ్‌బుక్‌లో జగన్ పేరుందో, లేదో త్వరలో తెలుస్తుంది

- పవన్ నాకు జీవితాంతం పెద్దన్నే
- పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఏపీకి రాకపోతే తర్వాత బాధపడతారు
- ఐడియాస్ ఆఫ్ ఇండియా-2026 సదస్సులో మంత్రి నారా లోకేశ్



'ఐడియాస్ ఆఫ్ ఇండియా-2026' సదస్సులో వ్యాఖ్యాత మేఘాప్రసాద్‌తో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రెడ్‌బుక్‌లో జగన్ పేరు ఉందో లేదో త్వరలో తెలుస్తుందని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో తెదేపా కార్యకర్తలు, ప్రజలపై తప్పుడు కేసులు పెట్టి వేధించిన వారి పేర్లు, చట్టాలను ఉల్లంఘించినవారు, అందుకు ప్రేరేపించిన రాజకీయ నేతలు, చిత్రహింసలు పెట్టినవారి పేర్లు కూడా అందులో ఉంటాయని తెలిపారు. ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'ఐడియాస్ ఆఫ్ ఇండియా-2026' పేరిట నిర్వహించిన సదస్సులో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2019-24 మధ్య తిరుమల లడ్డూలో పెద్దఎత్తున కల్తీ జరిగిందని, రసాయనాలతో తయారుచేసిన నెయ్యిని వాడారని చెప్పారు. జగన్ హయాంలో జరిగిన ఈ అపచారానికి.. రాష్ట్ర మంత్రిగా తాను హిందూ సమాజానికి క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు. సిట్ నివేదిక ప్రకారం తితిదే మాజీ ఛైర్మన్ సహా ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరని, రేపు ఎవరైనా ఇలాంటి నేరానికి పాల్పడాలంటే వెయ్యిసార్లు ఆలోచించేలా చేస్తామని హెచ్చరించారు. 'కష్టకాలంలో వెన్నంటి నిలిచిన పవన్ కల్యాణ్ నా బిగ్ బ్రదర్. జీవితాంతం ఆయన నాకు పెద్దన్నే' అని మోడరేటర్ అడిగిన ప్రశ్నకు లోకేశ్ బదులిచ్చారు. ఆయన ప్రసంగంలో కీలకాంశాలివీ..

చంద్రబాబు 75 ఏళ్ల యువకుడు

అభివృద్ధి చెందిన రాష్ట్రాలు దేశాన్ని బలంగా తయారు చేస్తాయి. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని మా లక్ష్యం. చంద్రబాబు మాటిస్తే జరిగి తీరుతుంది. ఆయన టఫ్ టాస్క్ మాస్టర్. 10 కేజీలు ఎత్తితే, 14 కేజీల లక్ష్యాన్ని ఇస్తారు. 14 కేజీలు ఎత్తితే, 18 కేజీలు ఇస్తారు. దీనికి అంతం ఉండదు. ఆయన ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయడమే మా పని. చంద్రబాబు వయసు 75 ఏళ్లయినా పాతికేళ్ల కుర్రాడిలా పనిచేస్తారు. క్వాంటమ్ వ్యాలీపై తొలిసారి నన్ను మీటింగ్‌కు పిలిచి, దాని గురించి అడిగారు. నేను టేబుల్ కింద సెల్‌ఫోన్ పెట్టి చాట్ జీపీటీని దాని గురించి అడుగుతున్నాను. స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చదివిన నాకు దానిపై అవగాహన లేదు. కానీ చంద్రబాబుకు ఉంది. ఆయన ఆలోచనలను అందుకోవడం చాలా కష్టం.

నాయుడు- మోదీలది బుల్లెట్ రైల్ సర్కార్

పారిశ్రామికవేత్తలు ఏపీని ఎంచుకోవడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అద్భుతమైన ట్రాక్ రికార్డు, అనుభవమున్న సీఎం ఉండటం. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. కేవలం 17 నెలల్లోనే దేశంలో అతి పెద్దదైన ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని అనుమతులూ ఇచ్చాం. మార్చి మూడో వారంలో శంకుస్థాపన చేయబోతున్నాం. మూడోది డబులింజన్ బుల్లెట్ రైల్ సర్కార్. దిల్లీలో మోదీ, ఏపీలో నాయుడు నమో (నాయుడు- మోదీ) కాంబినేషన్‌తో మేం దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం రాష్ట్రానికి తెచ్చుకోగలిగాం. ✦ డేటా సెంటర్ పాలసీ కోసం తీవ్రంగా ప్రయత్నించి సఫలీకృతులయ్యాం. దేశానికి ప్రయోజనం చేకూర్చే ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాం. ✦ ఎన్నికల్లో మాటిచ్చినట్లుగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాం. రూ.16 వేల కోట్ల కేంద్ర సాయంతో స్టీల్‌ప్లాంట్ ఇప్పుడు లాభాల్లో పయనిస్తోంది.

భూమి విలువ కాదు.. కంపెనీలతో ప్రయోజనాలు చూడాలి

కాంపిటేటివ్ ఎడ్వాంటేజ్‌లో మేం 99 పైసలకే ప్రధాన కంపెనీలకు భూములిస్తున్నాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలను రప్పించేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాం. మేం ఇచ్చే భూమి కంటే ఆ కంపెనీలు సృష్టించే ఎకోసిస్టమ్ ఎన్నో రెట్లు పెద్దది. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌ను దావోస్‌లో కలిసి మాట్లాడాను. రెండోసారి దావోస్‌కు వెళ్లేసరికి, విశాఖలో ఆ కంపెనీ భూమి పూజ చేసింది. వచ్చే ఏడాది దావోస్ వెళ్లేసరికి ఇక్కడ భవనాలు పూర్తవుతాయి. దీనివల్ల విశాఖలో యువతకు 25 వేల ఉద్యోగాలొస్తాయి. ఏటా రూ.1,500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి.

ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు సరికాదు

✦ దిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశ ఇమేజ్‌ను మసకబార్చేలా ఉంది. 21 దేశాల అధినేతలు ఉన్నచోట రాజకీయాలు చేయడం చాలా తప్పు. ✦ ఏపీలో గత ప్రభుత్వాల హయాంలో పెట్టుబడులు వస్తే, మేం వ్యతిరేకించలేదు. ఎప్పుడూ పరిశ్రమలను స్వాగతించాం. ✦ ప్రపంచంలో అతి పెద్ద ఆక్వా ఎగుమతిదారుగా ఉన్న మేము యూఎస్ ట్రేడ్ వార్ సమయంలో రష్యా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా మార్కెట్లకు ద్వారాలు తెరిచాం. తర్వాత ట్రేడ్ డీల్ వచ్చి, అది మొత్తం ఎకోసిస్టమ్ వేగంగా పెరగడానికి దోహదపడింది. ✦ 11 ఏళ్లలోపు చిన్నారులకు సోషల్ మీడియా అందుబాటులో ఉండకూడదు. 16 ఏళ్లలోపు వారి వయసుకు సరిపడా కంటెంట్ మాత్రమే లభించాలి. ఉదాహరణకు మా అబ్బాయి నా ఫేస్‌బుక్ ఎకౌంట్ తీసుకొని బ్రౌజ్ చేయకూడని విధంగా ఏర్పాట్లుండాలి. సరైన ఫ్రేమ్‌వర్క్ లేకపోవడంతో దీనిని అమలు చేసేందుకు సవాళ్లు ఎదురవుతున్నాయి.

ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ

అమరావతికి ఎంతో భవిష్యత్ ఉంది. పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఏపీకి రాకపోతే, తర్వాత బాధపడతారు. 100 రోజులకోసారి అమరావతిని సందర్శించండి. రాజధాని నిర్మాణం ఎంత వేగంగా జరుగుతుందో చూడండి. మేం రాజధాని పేరిట ఒక నగరాన్ని మాత్రమే నిర్మించడం లేదు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లు నిర్మాణం చేపడుతున్నాం. వీటిలో పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. అందులో ఏదో ఒక రంగాన్ని మాత్రమే కాకుండా, దాని అనుబంధ పరిశ్రమలన్నీ తీసుకొచ్చేలా చూస్తున్నాం. ఒక రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం.


పుష్కరిణిలో తెప్పోత్సవ సందడి

తెప్పపై రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామివారి విహారం


రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి అభయం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆసీనులై పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. కార్యక్రమంలో తితిదే ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో (విద్యా, ఆరోగ్యం) డా.ఎ.శరత్, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, భానుప్రకాష్‌రెడ్డి, సీవీఎస్‌వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

జగన్, సజ్జల నాయకత్వంలో చంద్రబాబుపై అసభ్యకర పోస్టులు

- సజ్జల భార్గవ్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా సోషల్ మీడియా విభాగం పనే
- డీప్‌ఫేక్‌తో పెద్ద ఎత్తున దుష్ప్రచారం
- సీఐడీ విభాగాధిపతికి తెదేపా నేతల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా కుట్రపూరితంగా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అశ్లీల పోస్టులు వ్యాప్తి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్‌కు తెదేపా నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలదోయాలని, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే కుట్రతో.. వైకాపా అధినేత జగన్, ఆయనకు సన్నిహితుడైన సజ్జల రామకృష్ణారెడ్డి నాయకత్వంలో వ్యవస్థీకృతంగా ఈ అసభ్యకర పోస్టుల వ్యాప్తి జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో రవిశంకర్ అయ్యన్నార్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరామ్‌ప్రసాద్ తదితరులు శుక్రవారం కలిశారు. 'డీప్‌ఫేక్ ద్వారా ఎపిస్టైన్ ఫైల్స్ తరహాలో ఒక తప్పుడు పోస్టు సృష్టించి, అందులో చంద్రబాబు ప్రమేయం ఉందంటూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. సజ్జల భార్గవ్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా సామాజిక మాధ్యమ విభాగం దీని వెనక ఉంది. సజ్జల భార్గవ్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన దామోదర్‌రెడ్డి....తన ఫేస్‌బుక్ ఖాతాలో ఇలాంటి అసభ్యకర పోస్టులు పెట్టి వ్యాప్తి చేస్తున్నారు' అని ఫిర్యాదులో ప్రస్తావించారు. అనంతరం వర్ల రామయ్య తదితరులు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు....

'జగన్ మరలా అధికారం దక్కించుకోవాలనే దురుద్దేశంతో అడ్డదారులు తొక్కుతూ చంద్రబాబుపై నేరపూరిత కుట్రకు తెరలేపారు. అసలు ఉనికిలో లేని ఓ తప్పుడు కేసు నంబర్ సృష్టించి చంద్రబాబును హైప్రొఫైల్ అనుమానితుడిగా చూపించే ప్రయత్నం చేశారు. సమాజంలో కులమత ఘర్షణలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు. చంద్రబాబుపై ఇలాంటి ఆరోపణలు చేయడమంటే ఆకాశం మీద ఉమ్మడం లాంటిదే. జగన్ ఇప్పటికైనా తన పంథా మార్చుకోవాలి' అని వర్ల రామయ్య పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు పనులు చేస్తున్న వైకాపా వారు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంతర్జాతీయంగా జరిగిన ఏదో అంశాన్ని మార్ఫింగ్ చేసి చంద్రబాబుకు ఆపాదించాలని చూడటం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మహ్మద్ నజీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసులో మళ్లీ సీబీఐ విచారణ

- కాల్‌డేటా ఆధారంగా ఇద్దరిని ప్రశ్నించిన అధికారులు


కిరణ్‌కుమార్ యాదవ్


మహేంద్ర యాదవ్

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, పులివెందుల: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండేళ్ల తర్వాత సీబీఐ మరోసారి విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్, సాక్షిగా ఉన్న భరత్‌కుమార్ యాదవ్ సోదరులు కిరణ్‌కుమార్ యాదవ్, మహేంద్ర యాదవ్‌లను పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో సీబీఐ అధికారులు శుక్రవారం విచారించారు.

విచారణకు తొలుత మహేంద్ర హాజరయ్యారు. కిరణ్ సాయంత్రం వచ్చారు. వివేకా హత్య చోటుచేసుకున్న రోజు తెల్లవారుజామున 1.42 గంటలకు అర్జున్‌రెడ్డి అనే వ్యక్తికి కిరణ్‌కుమార్ వాట్సప్ కాల్ చేశారు. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అలాగే కిరణ్, మహేంద్ర మధ్య సాగిన ఫోన్ సంభాషణలపై కూడా విచారించారు. కిరణ్ బంధువు కావడంతో గతంలో ఫోన్లో మాట్లాడుకున్నట్లు మహేంద్ర సమాధానం ఇచ్చారు. కిరణ్ తన సోదరుడు సునీల్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వీరిని రెండు గంటల పాటు సీబీఐ అధికారి రోహిత్ యాదవ్ విచారించారు. కాల్‌డేటా ఆధారంగా అనుమానితులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు.

మమ్మల్ని హతమార్చే ప్రయత్నాలు: విచారణ అనంతరం కిరణ్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. సీబీఐ విచారణకు పూర్తిగా సహకరిస్తానని, వారడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చానని చెప్పారు. వివేకా కుమార్తె సునీత కోరినట్లే మా సోదరుడు సునీల్‌యాదవ్ కూడా ఏడాది కిందట కోర్టుకు వెళ్లి సమగ్ర విచారణకు అభ్యర్థించినట్లు తెలిపారు. మమ్మల్ని హత్య చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇదే విషయాన్ని సీబీఐకు చెప్పామన్నారు. అర్జున్‌రెడ్డితో ఉన్న సంబంధాలపై ఏమీ చెప్పలేనన్నారు. రాత్రి 7.30 గంటలకు పులివెందుల నుంచి కడపకు బయలుదేరిన సీబీఐ అధికారులు అక్కడ బస చేశారు. శనివారం మరికొందరిని విచారించే అవకాశాలున్నాయి.

బొత్సకు అస్వస్థత.. హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు

ఈనాడు - అమరావతి, విజయనగరం: శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం సాయంత్రం కొంచెం నీరసంతోపాటు ఎడమ చేయి లాగినట్లుగా కొంత ఇబ్బంది రావడంతో ఆయన హైదరాబాద్‌లోని న్యూరాలజీ వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడి ఆయన సూచన మేరకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుఝామున 2 గంటల సమయంలో ఆసుపత్రికి చేరుకున్నారు. వెంటనే వైద్యులు ఆయనకు పలు పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం బొత్స శాసనమండలికి రాకపోవడంతో ఆయన ఆరోగ్యం గురించి పలువురు సభ్యులు అసెంబ్లీ లాబీల్లో చర్చించుకున్నారు.


● మీడియాలో వస్తున్న వార్తలపై బొత్స స్పందించారు. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరూ కంగారు పడవద్దని అన్నారు. ఆయన గుండెకు 2012లో శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నా గతేడాది జూన్ 4న చీపురుపల్లిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. హైదరాబాద్ వెళ్లి మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకున్నారు. తాజాగా మరోసారి ఆసుపత్రిలో చేరడంతో బొత్స మేనల్లుడు, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు శుక్రవారం హైదరాబాద్ వెళ్లి పరామర్శించారు. ఆయన కోలుకుంటున్నారని, ఆందోళన అవసరం లేదని చెప్పారు.

బొత్స వేగంగా కోలుకోవాలి: లోకేశ్

ఈనాడు, అమరావతి: వైకాపా నేత బొత్స సత్యనారాయణ వేగంగా కోలుకోవాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యం, పూర్తి శక్తితో ఆయన మళ్లీ తిరిగి రావాలని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

చంద్రబాబును కలిసిన భట్టి విక్రమార్క

● కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానం


తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కలిశారు. తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి సీఎంను ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. భట్టి విక్రమార్క వెంట తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. వీరిద్దర్ని చంద్రబాబు శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమలు అందజేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఇతర ఉన్నతాధికారుల్ని భట్టి విక్రమార్క కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజుకు శుభలేఖ అందజేశారు.

● విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

సంజయ్‌దత్‌తో లోకేశ్ భేటీ

ఏపీలో కొత్త ఫిల్మ్‌సిటీ ఏర్పాటు తదితర అంశాలపై చర్చ

ఈనాడు, అమరావతి: బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్‌ను ముంబయిలో కలిసినట్లు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీలో ఫిల్మ్‌సిటీ నిర్మాణం, సినిమా షూటింగ్‌ల కోసం ఇస్తున్న సింగిల్ విండో అనుమతులు తదితర అంశాల్ని వివరించినట్లు చెప్పారు.

న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు

- ఆయేషా మీరా కేసులో అన్యాయం చేసింది సీబీఐ, సిట్, విచారణాధికారులే
- అంత్యక్రియల అనంతరం ఆమె తండ్రి ఇక్బాల్ బాషా
- హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్






విజయవాడ సీబీఐ కోర్టు వద్ద ఆయేషా మీరా అవశేషాల పెట్టెతో కన్నీరుమున్నీరవుతున్న ఆయేషా మీరా తల్లిదండ్రులు ఇక్బాల్ బాషా, శంషాద్‌బేగం, ✦ తెనాలిలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈనాడు, అమరావతి, విజయవాడ నేరవార్తలు, తెనాలి టౌన్, న్యూస్‌టుడే: 'నా కుమార్తె ఆయేషా మీరాకు ఈ రోజు వరకు న్యాయం జరగలేదు. కేసు ముగిసిందంటున్నారు. కానీ, మేం ఉండగా ముగియదు. ఆయేషా మీరాకు అన్యాయం చేసింది సీబీఐ, సిట్, అప్పటి విచారణాధికారులే' అని ఆమె తండ్రి ఇక్బాల్ బాషా ఆరోపించారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని చెంచుపేట ఖబరస్థాన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఆయేషా మీరా శరీర అవశేషాలకు అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సీబీఐ, సిట్, అప్పటి విచారణాధికారులు వాస్తవాలను తొక్కిపెట్టి, అన్యాయం చేశారు. మా బిడ్డకు న్యాయం జరగాలి. మరెవ్వరికీ ఇలాంటి పరిస్థితి రాకూడదనే నేను, నా భార్య 18 ఏళ్లుగా పోరాడుతున్నాం. సీబీఐ ఆధారాలు లేవని చెప్పింది.. కానీ, అవన్నీ ఉన్నాయి. వసతిగృహం వార్డెన్ కుటుంబం, నా కుమార్తెతో పాటు ఉన్న పిల్లలందరూ సాక్షులే. వారిని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాకు, నా బిడ్డకు న్యాయం చేస్తానని చెప్పారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత సిట్ వేస్తే చేతులు ఎత్తేసింది. ప్రస్తుతం హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించండి. అప్పట్లో కేసును నీరుగార్చిన పోలీసు అధికారులు, సత్యంబాబును విడుదల చేస్తూ కోర్టు ఎవరి పేర్లను ఉటంకించిందో వారందరినీ విచారించాలి. ఆ రోజు రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఏం జరిగిందో బయటకు రావాలి' అని ఇక్బాల్ బాషా పేర్కొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

ముస్లిం సంప్రదాయం ప్రకారం ఆయేషా మీరా శరీర అవశేషాలకు అంత్యక్రియలు ముగిశాయి. ఖబరస్థాన్ వద్దకు ర్యాలీగా అంబులెన్స్‌లో శరీర అవశేషాలు తీసుకొచ్చారు. దువా తర్వాత ఏఎస్పీ సీఆర్‌దాస్ ఆధ్వర్యంలో సీబీఐ అధికారులు, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు, ముస్లిం మతపెద్దల సమక్షంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. సీబీఐ షేమ్.. షేమ్.. వుయ్ వాంట్ జస్టిస్, ఆయేషా మీరా జోహార్.. అంటూ ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, మైనారిటీల ప్రతినిధులు నినాదాలు చేశారు. అంతకుముందు ఆయేషా మీరా శరీర అవశేషాలున్న పెట్టెలను ఆమె తల్లిదండ్రులు శంషాద్ బేగం, ఇక్బాల్ బాషాలకు విజయవాడలోని సీబీఐ కోర్టు అప్పగించింది. వస్త్రంతో చుట్టిన పెట్టెలను చూసి గుండెలవిసేలా రోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'ఇంత పెద్ద న్యాయ వ్యవస్థ ఉన్నా.. మాకు న్యాయం జరగలేదు. సాక్ష్యాలున్నా.. కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు పట్టించుకోలేదు. కేసు దర్యాప్తులో సీబీఐ విఫలమైంది. నిందితులందరూ బయట దర్జాగా తిరుగుతున్నారు' అని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆయేషా మీరా తల్లిదండ్రులు, న్యాయవాదులు, మహిళా సంఘాల ప్రతినిధులు సీబీఐ కోర్టు నుంచి సమీపంలోని అంబేడ్కర్ స్మృతివనం వరకు నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదు. తన బిడ్డకు న్యాయం చేయాలని.. అంబేడ్కర్ విగ్రహానికి శంషాద్ బేగం దండం పెట్టి వేడుకున్నారు. తరువాత పోలీసులు అంబులెన్స్‌లో శరీర అవశేషాలను తెనాలికి పంపారు.

ప్రశ్నపత్రాలు తీసుకొస్తున్న కారును అడ్డుకున్న విద్యార్థులు

- డీవో అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ


ప్రశ్నపత్రాలు ఉన్న కారును చుట్టుముట్టి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పరీక్షలు రాస్తున్న సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్తొస్తామని అడిగితే డిపార్ట్‌మెంట్ అధికారి(డీవో) అనుచితంగా వ్యవహరిస్తున్నారని పల్నాడు జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను తీసుకొస్తున్న కారును విద్యార్థులు అడ్డుకుని డీవో తీరును నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ ఘటన సత్తెనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వచ్చారు. అదే సమయంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మ, డిపార్ట్‌మెంటల్ అధికారి ఆదయ్య, మరో ఇద్దరు కారులో ప్రశ్నపత్రాల్ని తీసుకుని వస్తుండగా.. గమనించిన విద్యార్థులు కారును చుట్టుముట్టి లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అంతకు ముందు రోజు జరిగిన పరీక్షల సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్తొస్తామని విద్యార్థినులు అడిగితే డీవో అనుచితంగా, అసభ్యంగా మాట్లాడుతున్నారని, కేకలు వేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. కారులో ప్రశ్నపత్రాలు ఉన్నందున లోపలకు వెళ్లేందుకు అనుమతించాలని గెస్ట్ ఫ్యాకల్టీ కోరారు. దీంతో గెస్ఫ్యాకల్టీ, డీవో. . విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసింది. బందోబస్తుకు వచ్చిన పోలీసులు విద్యార్థులు, అధ్యాపకులను వారించి కారును లోపలకు పంపించారు. గొడవతో పది నిమిషాలు ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైంది.

అతిసారానికి 'ఈ-కోలి' బ్యాక్టీరియానే కారణం

- శ్రీకాకుళంలో 11 ప్రాంతాల్లో సేకరించిన నమూనాల్లో గుర్తింపు


శ్రీకాకుళంలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వీరపాండియన్. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: శ్రీకాకుళంలో అతిసారం ప్రబలడానికి తాగునీటిలో ప్రమాదకరమైన 'ఈ-కోలి' బ్యాక్టీరియా కలవడమే కారణమని అధికారులు నిర్ధారించారు. 11 ప్రాంతాల్లో సేకరించిన నీటి నమూనాల్లో దీన్ని గుర్తించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. డ్రైనేజీ కాలువల మీదుగా అక్రమ కుళాయి కనెక్షన్లు తీసుకొని మోటార్లతో నీటిని లాగడంతో మురుగునీరు మంచినీటిలో కలిసిందని తేల్చారు. పశువుల వ్యర్థాలు నీటిలో కలవడంతోనూ ఈ బ్యాక్టీరియా ప్రబలి ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 162 అతిసారం కేసులు నమోదయ్యాయి. వీటిలో 112 మంది చికిత్స పొందుతున్నారు. తొలుత ప్రబలిన ప్రాంతాల్లో కాకుండా ఇతర వీధుల్లోనూ కేసులు నమోదయ్యాయి.

కమిషనర్ పర్యటన: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శ్రీకాకుళంలో శుక్రవారం పర్యటించారు. తాగునీటి పైపులైన్లు పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న వైద్యసేవలు, ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. అక్రమ కుళాయి కనెక్షన్లు, మోటార్లను తొలగించాలని ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విశాఖ జీవీఎంసీలో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.రాముని డిప్యుటేషన్‌పై సహాయ కమిషనర్‌గా నియమించారు.

విద్యార్థుల అస్వస్థతపై మంత్రి ఆరా

శ్రీకాకుళం రెల్లివీధిలో ఉన్న బీసీ బాలుర వసతిగృహంలో బుధ, గురువారాల్లో నాలుగు అతిసారం కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. ఒకరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్సపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లా వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆర్-1 జోన్‌లో పరిహారంగా స్థలానికి.. స్థలం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లో భాగంగా ఆర్-1 జోన్(రాజధాని ప్రకటించే నాటికే ఉన్న గ్రామాలు, గ్రామ కంఠాలు)లో భవనాలు, స్థలాలు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేందుకు, పరిహారం చెల్లించేందుకు ఉద్దేశించిన 'నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీ'లో ప్రభుత్వం సవరణలు చేసింది. ఇంతకు ముందు.. ఇళ్లు/భవనాలతో సహా స్థలాలు కోల్పోయిన వారికి... కట్టడం విలువకు రెట్టింపు పరిహారంతో పాటు స్థలానికి బదులు దాని విస్తీర్ణానికి దగ్గరగా ఉన్న (నియరెస్ట్ స్టాండర్డ్ ప్లాట్) స్థలాన్ని ఎల్‌పీఎస్ లేఔట్‌లో సీఆర్‌డీఏ కేటాయించేది. దాని వల్ల స్థలం కోల్పోతున్నవారికి నష్టం జరుగుతోంది. అందుకే.. ఇకపై కోల్పోతున్న స్థలానికి సమాన విస్తీర్ణంలో స్థలం (ల్యాండ్ టు ల్యాండ్) కేటాయించేలా నిబంధనలు సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోల్పోతున్న స్థలం మరీ చిన్నగా ఉండి, ఎల్‌పీఎస్ లేఔట్లలో అంత చిన్న స్థలాలు ఇవ్వలేనప్పుడు... ఇద్దరు ముగ్గురికి కలిపి స్థలాన్ని కేటాయించేలా వెసులుబాటు కల్పించింది. స్థలాలు కోల్పోతున్నవారు... 'స్థలానికి సమానమైన స్థలం' విధానంలో గరిష్ఠంగా 3 ప్లాట్ల వరకు పొందే అవకాశముంటుంది. స్థలం వద్దనుకుంటే టీడీఆర్ బాండ్‌లూ తీసుకోవచ్చు. వాణిజ్య, పారిశ్రామిక భవనాలు కోల్పోతున్నవారికి కట్టడం విలువకు రెట్టింపు చెల్లించడంతో పాటు, రిహాబిలిటేషన్ కేంద్రంలో స్థలానికి సమానమైన స్థలాన్ని కేటాయిస్తారు.

డీఎంకేలో చేరిన మాజీ సీఎం పన్నీర్ సెల్వం

- తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామం


పన్నీర్ సెల్వాన్ని ఆలింగనం చేసుకున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో దివంగత ముఖ్యమంత్రి జయలలితకు నమ్మినబంటు, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం తన మద్దతుదారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో శుక్రవారం డీఎంకేలో చేరారు. జయలలిత మరణానంతరం ఎడప్పాడి పళనిసామితో ఏర్పడిన ఆధిపత్య పోరు కారణంగా 2022లో పార్టీ నుంచి పన్నీర్ సెల్వం బహిష్కరణకు గురయ్యారు. ఆయన్ను మళ్లీ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదని పళనిసామి తెగేసి చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డీఎంకే ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఒ.పన్నీర్ సెల్వం, ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్రనాథ్ కుమార్, ఎమ్మెల్యే అయ్యప్పన్, ఇతర మద్దతుదారులు డీఎంకేలో చేరారు. తర్వాత తమ ఎమ్మెల్యే పదవులకు ఒ.పన్నీర్ సెల్వం, అయ్యప్పన్ రాజీనామా చేస్తూ శాసనసభ కార్యదర్శికి లేఖలు అందించారు. జయలలిత ముఖ్యమంత్రిగా కొనసాగలేని రెండు సందర్భాల్లో (2001, 2014), ఆమె మరణానంతరం మరోసారి మొత్తం మూడుసార్లు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. జయలలిత మరణానంతరం పార్టీ సమన్వయకర్తగానూ వ్యవహరించారు.

EENADU Vol: 52, Issue: 199 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈతరం

youthpage@eenadu.in

అన్‌రొమాంటిక్

స్వాతి : బేబీ ఈ లైన్ చూడు ఎంత బాగుందో..
'నా వెన్నెలా వసంతమూ నీవే'
స్వాతిముత్యం : ఏంటది.. విషాదమూ వైరాగ్యము అన్నట్టుంది!
స్వాతి : ????????

ఇట్లు నీ ప్రిన్స్



వెరైటీ ప్రేమలేఖ

మొదటిసారి నిన్ను చూడగానే నా మనసు దొంగిలించిన 'టక్కరి దొంగ'వు నీవే అనిపించింది. నిజం చెప్పాలంటే నేను నీకు పడిపోయింది నీ కాటుక కళ్ల కొంటె చూపులకే. మా ఫ్రెండ్ 'అర్జున్'గాడిని నీ గురించి వాకబు చేయమన్నా. 'అతడు' చెప్పినదాన్ని బట్టి నీ పేరు సత్యభామ అని తెలిసింది. అప్పుడే ఫిక్స్ అయ్యా.. నీ లైఫ్‌లోకి వచ్చే 'మురారి' నేనే కావాలని! ఇంతకీ నేనెవరో తెలియదు కదూ.. పుట్టగానే 'రాజకుమారుడు'లా ఉన్నానని రాజు అని పేరు పెట్టారు. అందరూ ముద్దుగా 'నాని' అంటారు. నీకూ నేనంటే ఇష్టం ఉందో లేదో తెలుసుకుందాం అని ఓరోజు మీ ఇంటికి 'అతిథి'లా వచ్చా. అప్పుడు తెలిసింది మీ నాన్న పేరున్న 'బిజినెస్‌మేన్' అని. నీకు 'శ్రీమంతుడు'లాంటి కుర్రాడితో పెళ్లి కూడా ఫిక్స్ చేశాడని!

నీ చుట్టూ 'స్పైడర్'లా తిరుగుతున్న ఆ అబ్బాయిని చూస్తే నాకు 'గుంటూరు కారం' తిన్నంత కోపం వచ్చింది. మీ ఇంట్లో వాళ్లని ఎదిరించే 'ఖలేజా' నాకు ఉన్నా, నీకోసం ఆ 'దూకుడు' తగ్గించుకున్నా. నా ప్రేమ కోసం.. ఆఖరికి 'సర్కారు వారి పాట' అయినా పాడేస్తా. అందుకే ముందు నీ అభిప్రాయం చెప్పు.

నువ్వు ఎలా అయినా నా ప్రేమను ఒప్పుకుంటే.. మన పెళ్లిని 'బ్రహ్మోత్సవం'లా 'వారణాసి'లో చేసుకుందాం. లేదంటే చివరి వరకూ 'మహర్షి'లా మిగిలిపోతా.

నీ జవాబు కోసం వేచిచూసే 'యువరాజు..'

– రాజు, అమలాపురం

కొంటె కొటేషన్




1. చింపాంజీకి ఉబలాటం..
కుందేలుకు ఇరకాటం.
–హరిశంకర్

2. మంచులో ముచ్చట..
ఇదేం వింత జంట!
–రామకృష్ణ, మహబూబ్‌నగర్

3. ఎలుగుబంటి రమ్మంది డేటింగ్‌కి..
కుందేలు వెళ్దామంది స్కేటింగ్‌కి..
– అశోక్ కుమార్

4. ఐస్ స్కేటింగ్..
కూల్ డేటింగ్. – వెన్నెల

5. ఎక్కాం కదా ఎవరెస్ట్..
ఇక పోదాం పద ఫారెస్ట్.
– శ్రీధర్ గోపిశెట్టి



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

'అందమైన' ప్రయాణం



యువత సరదాగా ఎంజాయ్ చేయడం కోసం, విశ్రాంతి కోసం అనేక రకాల ట్రిప్‌లకు వెళ్లడం మామూలే. తిరిగొచ్చేటప్పుడు అలసిపోయి, నీరసంగా కనిపిస్తుంటారు. కానీ ఇప్పుడు అలా కాకుండా కొత్తగా 'గ్లోకేషన్ ట్రావెల్ ట్రెండ్' అంటూ పరుగులు పెడుతున్నారు. ఇది కేవలం పర్యాటకం మాత్రమే కాదు. అందాన్ని పెంచుకునే ట్రిప్‌గా కూడా చెప్పొచ్చు. అంటే కేవలం సరదా కోసం కాకుండా, ప్రయాణం చేస్తూనే అందంగా, ఆరోగ్యంగా మారడాన్ని లక్ష్యంగా పెట్టుకునే టూర్ ఇది. గ్లో(మెరుపు), వెకేషన్(విహారం) అనే పదాల కలయిక ద్వారా గ్లోకేషన్ అనే పేరొచ్చింది. ఈ టూర్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు యోగా, ధ్యానం, చక్కని ఆహారపు అలవాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది ప్రయాణం, స్వీయ సంరక్షణ అనే అనుభవాల మేలుకలయిక. యువత ప్రత్యేకంగా అందం, చర్మ సంరక్షణ ప్రయోజనాల కోసం ఈ ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

చాట్‌లో వేట



క్యాట్ ఫిషింగ్ అంటే మనకు తెలుసు.. అవతలి వారిని వలలో వేసుకునేందుకు ఉన్నవీ లేనివీ చెప్పి మోసం చేయడం. ఇప్పుడు ఇలా కొత్తగా చాట్‌ఫిషింగ్ కూడా మొదలైంది తెలుసా! అంటే చాటింగ్ స్థాయిలోనే తమ గురించి ఉన్నవీ లేనివీ చెప్పడం.. ఇందుకోసం కొందరు ఏకంగా ఏఐని ఉపయోగిస్తున్నారు! అంటే వీరు చెప్పే మాటలు, సరదా సంభాషణలు.. ఏవీ తమ సొంతం కాదు. అవతలి వారిని ఇంప్రెస్ చేయడం కోసం ప్రతిదీ నెట్‌లో వెతకడం, ఏఐ అసిస్టెంట్ల సాయం తీసుకోవడం చేస్తున్నారు. తమ లవ్ లైఫ్‌ను మెరుగుపరుచుకోవడానికి 26శాతం మంది ఇలా చేస్తున్నారని గతేడాది మ్యాచ్ గ్రూప్, కిన్సే ఇన్‌స్టిట్యూట్‌లు చేసిన సర్వేలో తేలింది.

'నీవల్ల ఏమవుతుంది' అన్న మాటలు దరిచేరనివ్వలేదు. 'ఏదో ఒక పనిచేసుకోవచ్చు కదా' అన్న ఈసడింపులూ తన సంకల్పాన్ని చెక్కుచెదరనివ్వలేదు. మైక్రో ఇంజినీరింగ్‌లో అతడి ఆలోచనలు అద్భుతం.. మినియేచర్ క్రియేషన్‌లో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు, ఒక ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్ అతడి సొంతం! ఎంతో కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని చేరి చూపించాడు కాకినాడ జిల్లా తునికి చెందిన తిరుమలనీడి సాయి. సూక్ష్మ వస్తువుల తయారీలో దూసుకెళ్తున్న తన గురించి ఇంకొంచెం తెలుసుకుందాం.

అతిచిన్న వాషింగ్ మెషీన్!





నేడు నేషనల్ సైన్స్ డే

"మా నాన్న జ్ఞానేశ్వరరావు పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వంటలు చేస్తుంటారు, అమ్మ కుమారి గృహిణి. పదో తరగతి 8.5 జీపీఏతో పాసయ్యాను, డిప్లొమా మెకానికల్ 2024లో పూర్తయ్యింది. ప్రస్తుతం దూరవిద్య ద్వారా బీఎస్సీ కెమిస్ట్రీ చదువుతూ ఓ ప్రైవేటు ఫార్మా కంపెనీలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాను.

చిన్నప్పుడు ఎదురింటి పిల్లలతో కలిసి ఆడుకునేటప్పుడు ఓ విషయం గమనించా. వారు ఎంత ఖరీదైన బొమ్మ అయినా సరే, రెండు రోజులు వాడి విరగ్గొట్టేసేవారు. నాకు అంత మంచి బొమ్మలు అలా పాడై మూలకు చేరడం చూసి బాధనిపించేది. వాటిని సేకరించి తిరిగి బాగు చేసేవాడిని. కొన్నాళ్లకు సైకిల్ రిపేర్ షాప్‌కి వెళ్లి పాడైన విడిభాగాలు తెచ్చుకుని ఏదో ఒక వస్తువులా తయారుచేసేవాడిని. అలా అలా తయారీపై ఆసక్తి పెరిగింది. కొంచెం పెద్దయ్యాక సైన్స్ ప్రాజెక్టులు తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. అప్పుడే 'మైక్రో ఇంజినీరింగ్' అనే అంశం నాకు పరిచయమైంది. 'పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువులకు అతి చిన్న నమూనాలు ఎందుకు చేయకూడదు' అనే ఆలోచన వచ్చాక చిన్నచిన్నగా ప్రయోగాలు మొదలుపెట్టాను. కొన్నాళ్లకు ప్రపంచంలోనే అతిచిన్న (12.4 మి.మీ వెడల్పు, 17 మి.మీ ఎత్తు) కూలర్‌ను రూపొందించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించుకున్నాను. 2023లో 33 గ్రాముల బరువుతో అతి చిన్న వాషింగ్‌మిషన్ తయారు చేశాను. ఇది గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. ఆపైన 67 మిల్లీమీటర్ల పొడవు, 50 మి.మీ వెడల్పు, 47 మి.మీ ఎత్తు, 91 గ్రాముల బరువుతో అతి చిన్న మోటారుతో నడిచే కుమ్మరి చక్రం తయారుచేస్తే.. ఇదీ గిన్నిస్ బుక్ రికార్డులకు ఎంపికైంది. అయితే ఇదేమంత సులువుగా జరిగిపోలేదు. ఎన్నో గంటలు కదలకుండా కూర్చుని శ్రమపడ్డాను. చుట్టుపక్కల వాళ్లు 'ఎందుకు ఇవన్నీ, చదువు పాడవుతుంది' అన్నా మా అమ్మానాన్నలు ప్రోత్సహించారు. అనేక వ్యయ ప్రయాసలకోరిస్తేనే.. ఈ మినియేచర్ వస్తువులు తయారయ్యాయి. ఇవి అచ్చం పెద్దవాటిలాగే పనిచేస్తాయి.

ఇవేకాదు నీటి నుంచి ఆక్సిజన్‌ను వేరు చేసే పరికరం, విద్యుత్తు తయారీకి మరో మెషీన్, రైతులకు ఉపయోగపడేలా మరెన్నో వస్తువులను తయారుచేశాను. వీటికి పేటెంట్ తీసుకోవాలని కూడా ప్రయత్నించాను. కానీ ఆర్థిక స్థోమత సరిపోలేదు. ప్రస్తుతం చదువుతున్న డిగ్రీకి ఫీజు కూడా మా పాత స్కూల్ మాస్టారు త్రినాథ్ సార్ కట్టారు. ఇలా సైన్స్ ప్రాజెక్టుల తయారీలో ఉంటుంటే.. నాన్న కష్టపడుతూనే ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఇవి ఆపి, చిన్న ఉద్యోగం చేస్తున్నాను. సరైన సహకారం, ప్రోత్సాహం లభిస్తే.. థర్మల్, విండ్, సోలార్ ఎనర్జీలా.. 'హ్యూమన్ మూవ్‌మెంట్ ఎనర్జీ' తయారుచేయాలనే ప్రాజెక్ట్ నా మదిలో ఉంది!'

– పి.వెంకటరాజు, న్యూస్‌టుడే – తుని పట్టణం

పంచుకుందాం



నచ్చట్లేదు

నువ్వు లేని ఏకాంతం
నువ్వు లేని సాయంత్రం
నువ్వు లేని సంగీతం
నువ్వు లేని సంతోషం
నువ్వు లేని నేను..
ఏదీ నచ్చట్లేదు!

- వి.సంతోష్, కర్నూలు

చదవడానికి ఎంత బాగుందో



కొంత మంది కుర్రాళ్లుంటారు.. మెసేజ్ చేసేటప్పుడు ఎమోజీలు పెట్టేస్తుంటారు. కానీ కొందరు మాత్రం.. తమ ప్రతి భావాన్ని రాతలో అందంగా చెబుతుంటారు. ఎమోజీల కంటే ఇలాంటి చక్కని టెక్స్ట్‌లకే అమ్మాయిలు ఓటేస్తున్నారట. నచ్చిన అబ్బాయి పంపే చిలిపి రాతలను మళ్లీ మళ్లీ చదువుకుని మురిసిపోతున్నారట. వాలంటైన్ వీక్ తర్వాత ఐల్ అనే డేటింగ్ యాప్ చేసిన సర్వేలో ఈ విషయం తెలిసింది. 5,868 మందిని మీకు రెండింటిలో ఏది ఇష్టం అని అడిగితే.. 50 శాతం మందికిపైగా రాత మెసేజ్‌లకే ఓటేశారు. మిగతావారు ఏదైనా పర్లేదు అన్నట్టు చెప్పారు. కానీ మొత్తంలో 80 శాతం మంది టెక్స్ట్ ద్వారా సాన్నిహిత్యం మరింత పెరుగుతున్నట్టు ఫీలవుతున్నామని చెప్పారు. మరి అబ్బాయిలూ.. అందమైన ప్రేమ కవితలు అల్లేయండి!

నగలే అన్నట్టు..





బ్లూటూత్ ఇయర్‌బడ్స్ వాడటం మనకు తెలిసిందే. చెవి లోపలికి ఉండటం వల్ల కొంతసేపటి తర్వాత నొప్పెడుతుంది. అలా లేకుండా సౌకర్యంగా ఉండేలా వచ్చినవే ఇయర్‌బడ్ క్లిప్స్. చెవి బయటవైపు బ్లూటూత్‌తో ఉంటూ కంఫర్ట్‌గా ఉండటమే కాదు.. రకరకాల డిజైన్స్‌లో ఆకట్టుకుంటున్నాయివి. ముఖ్యంగా అమ్మాయిలకు నచ్చేలా.. స్టోన్స్‌తో రకరకాల అందమైన ఆకృతుల్లో తయారుచేస్తున్నారు డిజైనర్లు. సాంకేతికతతో సౌందర్యాన్ని మిళితం చేస్తున్నారు. వీటిని ధరించడం, ఎక్కువసేపు ఉండటం కూడా తేలికే. ఫింగర్ టిప్ టచ్‌తో పనిచేస్తాయి. కాల్స్ మాట్లాడటం, మ్యూజిక్ వినడం.. అంతా సాధారణ బ్లూటూత్ మాదిరే ఉంటుంది. కావాలి అనుకుంటే ఆ జ్యూవెలరీ పీస్‌ను తీసి కూడా వాడుకోవచ్చు. బాగున్నాయి కదూ!







ఓ తోడు


వైరల్ పాఠం

ఆ కోతి పేరు పంచ్. పుట్టగానే అమ్మ వదిలేసింది. ఒంటరిగా, దీనంగా తిరిగే ఆ పంచ్‌కి.. జపాన్‌లోని ఆ జూ సిబ్బంది ఓ కోతి బొమ్మను ఇచ్చారు. అప్పటినుంచి దాన్నే తోడుగా భావించింది పంచ్. మిగతా కోతులు తనను ఇబ్బంది పెట్టినా, ఎప్పుడైనా బాధ కలిగినా.. మౌనంగా వెళ్లి ఆ బొమ్మనే హత్తుకునేది. అలా కొన్నాళ్లకు తను మానసికంగా బలంగా తయారైంది. ఇప్పుడు ఇతర కోతులు కూడా పంచ్‌ను చేరదీస్తున్నాయి. సోషల్ మీడియాలో పదే పదే షేర్ అవుతున్న ఈ కథ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అయితే దీనికో కారణం ఉంది.

ఉరుకులు పరుగుల జీవితాలు, నా అంటూ నమ్మడానికి మనుషులే లేని పరిస్థితులు, ఒత్తిడి - ఒంటరితనం.. ఇలా ఎటెళ్తున్నాయో తెలియని రోజులు వెళ్లదీసే ఈ కాలం యువతకు పంచ్ కథ ఓ పాఠంలా తోస్తోంది. ఎంత సంపాదించినా, ఎంత ఎత్తుకి ఎదిగినా.. మనకంటూ కనీసం ఓ తోడు ఉండాలని భావిస్తున్నారు. కన్నవాళ్లో, తోబుట్టువులో, స్నేహితులో, ప్రేమించేవారో.. పక్కనే ఉంటే బాగుంటుందని ఫీలవుతున్నారు. అందుకే పంచ్ స్టోరీ బాగా వైరల్ అవుతోంది. నిజమే కదా, మనం గెలిచినప్పుడు చప్పట్లు కొట్టేవారు, ఓడిపోయినప్పుడు భుజం తట్టేవారు లేకపోతే ఎలా?



ఉదయించే ప్రేమలు



అభిమానులకు అమితమైన సంతోషాన్ని కలిగిస్తూ.. విజయ్-రష్మికలు ఒక్కటయ్యారు. సన్నిహితుల మధ్య వైభవంగా ఉదయ్‌పుర్‌లో జరిగిందీ వివాహం. అయితే వీరే కాదు.. ఎందరో సెలబ్రిటీలు ఇక్కడ పెళ్లిపీటలెక్కారు. దీంతో ఈ వెడ్డింగ్ డెస్టినేషన్ మీద కుర్రకారు కన్నుపడింది. 'ఉదయ్‌పుర్ ఎందుకంత స్పెషల్' అంటూ నెట్టింట వెతికేస్తున్నారు. మరి ఎందుకో మనమూ చూద్దామా!

- 'సిటీ ఆఫ్ లేక్స్' అని పేరున్న ఉదయ్‌పుర్‌లో.. ప్రకృతి అందాలకు కొదవలేదు. ఆరావళి పర్వతాల సోయగాల నడుమ, కళ్లుచెదిరే రాజభవనాలతో, కట్టిపడేసే లగ్జరీ స్టేలతో వివాహాలకు రాయల్ లుక్ తీసుకొస్తుందీ ప్రాంతం.
- ఇక్కడి సీనరీలు, చారిత్రక ప్రాంతాలు.. మోస్ట్ రొమాంటిక్ స్పాట్స్‌గా గుర్తింపు పొందాయి. ఫొటోలు తీసుకుంటే అదిరిపోతాయనే పేరుంది.
- లగ్జరీ హోటల్‌లో కావాలన్నా, ప్రైవేట్ ఐలాండ్‌లో పెళ్లాడాలన్నా.. సదుపాయాలకు కొదవలేదు. సెక్యూరిటీ చాలా ఎక్కువ. అనుమతి లేనివారు ప్రవేశించడం కష్టం.
- ప్రశాంతతకు మారుపేరు ఈ ప్రాంతం. అందుకే సెలబ్రిటీలు కుటుంబ సభ్యుల మధ్య చేసుకోవాలనుకునే ఈవెంట్లకు దీన్ని ఎంపిక చేసుకుంటూ ఉంటారు. తాజాగా విజయ్-రష్మికలతోపాటు.. గతంలో కత్రినాకైఫ్ - విక్కీకౌశల్, పరిణీతీ చోప్రా - రాఘవ్ చద్దా, శ్రియ - ఆండ్రీ.. వంటి చాలామంది ఇక్కడే వివాహం చేసుకున్నారు.
- పెళ్లిని కలకాలం గుర్తుంచుకునేలా, డ్రీమీగా నిర్వహించాలి అనుకున్న వారికి ఇక్కడ బోలెడన్ని ఆప్షన్లు. హల్దీ, సంగీత్, బారాత్.. ప్రతిదీ వినూత్నంగా చేస్తూ తమ కలల భాగస్వామిని సంతోషంగా జీవితంలోకి ఆహ్వానించేందుకు ఇదో చక్కని వేదికగా భావిస్తున్నారు.
- చాలా వెడ్డింగ్ వెన్యూలు సరస్సుల దరిదాపుల్లోనో, నీటిలో తేలుతూనో ఉంటాయి. నిర్వాహకులు ప్రైవేట్ బోట్ల ద్వారా గెస్టులను వెన్యూలకు తరలిస్తుంటారు. నీటి మధ్య ఈ ప్రయాణం అతిథులకు కొత్త అనుభూతినిస్తుంది.



- 14, 17వ శతాబ్దాల నాటి ప్యాలెస్‌లతో రాజసాన్ని ఒలికిస్తూనే, నేటి ఆధునిక శైలి సౌకర్యాలూ ఉన్నాయి. ఆ భవంతులను అలా మార్చారు.
- ఇక్కడ ఓ రెండు రోజుల ఈవెంట్‌కు 200 మంది వరకూ అతిథులు ఉన్నారనుకుంటే.. సరాసరి రూ.75 లక్షల నుంచి రూ.6 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా. దేశవిదేశీ వంటలతోపాటు లైవ్ మ్యూజిక్, స్పా, యోగా సెషన్స్ వంటి మరెన్నో సౌకర్యాలుంటాయి.

ఏది పడితే అది వద్దు

మీకు తెలుసా?

మొహం మీద చిన్న మొటిమ వస్తే చాలు, నచ్చిన ఇన్‌ఫ్లుయెన్సర్ ఏ స్కిన్ కేర్ వాడుతున్నారో చూసేయడం. కొంచెం టాన్ అయితే చాలు.. ఏంచేయాలో ఏఐని అడిగేయడం. అది ఏదేదో చెప్పేస్తే ఎడాపెడా వాడేయడం.. మనలో చాలామంది చేస్తున్నది ఇదే.

- కానీ దీని వల్ల యువతలో చర్మ సంబంధిత సమస్యలు 52శాతం పెరిగాయట! తాజా అధ్యయనాల ప్రకారం, 71 శాతం మంది జెన్‌జీలు ఇన్‌ఫ్లుయెన్సర్లు సిఫార్సు చేసిన టిప్స్, ప్రాడక్ట్స్‌ను వాడుతున్నారట. 58శాతం మంది సాధారణ బ్యూటీ సూచనల కోసం కూడా ఏఐనే ఉపయోగిస్తున్నారట.
- చర్మానికి నప్పని ప్రాడక్ట్స్ కూడా తెలిసీ తెలియక వాడటం, పూర్తి పరిస్థితి తెలియకుండా ఇచ్చే చిట్కాలను పాటించడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. సందేహాలకు ప్రొఫెషనల్స్ సాయం తీసుకోవాలే తప్ప.. ఇలా ఏఐ మీద ఆధారపడటం తగ్గించాలని సూచిస్తున్నారు.



బొట్టు పెట్టుకోను అంటుంది

యువ బంధాలు

రెండు భిన్నమైన సంస్కృతుల నుంచి వచ్చినా.. వారిని ప్రేమ ఒక్కటి చేసింది. ఆరేళ్లపాటు డేట్ చేసి, పెద్దలను అతి కష్టం మీద ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. తీరా పెళ్లయ్యాక.. ఆ వ్యత్యాసమే పెద్ద అగాథంలా కనిపిస్తోంది. అసలు ఏం జరిగిందంటే..

మహేష్ : తను చీర కట్టుకోదు, బొట్టు పెట్టుకోదు. ఎప్పుడూ వెస్ట్రన్ డ్రెస్‌లోనే ఉంటుంది. మా అమ్మ తనను అలా చూసి కొంచెం ఇబ్బంది పడుతోంది. బోనం ఎత్తుకోమంటే కూడా.. 'ఇది మా కల్చర్ కాదు, నాకు తెలియదు' అంటుంది. అమ్మను 'ఆంటీ' అనే పిలుస్తుంది తప్ప 'అత్తయ్య' అనదు. తనను పూర్తిగా మార్చేయడం నా ఉద్దేశం కాదు. కానీ పెళ్లంటే చిన్నచిన్న అడ్జస్ట్‌మెంట్‌లు ఉంటాయి కదా. అమ్మానాన్నలతో ఉన్నప్పుడు అయినా.. వారికి నచ్చినట్టు ఉంటే, నలుగురిలోనూ వారికి మర్యాదగా ఉంటుంది, సంతోషపడతారు కదా! నాకోసం ఆమాత్రం చేయలేదా?

పూనమ్ : తనకు నేను ముందు నుంచి ఎలా ఉంటానో తెలుసు, అలాగే ప్రేమించాడు, కొత్తగా మారిందేమీ లేదు. ఇప్పుడు నా పద్ధతులు నచ్చడం లేదంటే నన్ను అవమానించడం కాదా? నాకు వారి పద్ధతులు పాటించడంలో ఏ ఇబ్బందీ లేదు. కానీ అది బలవంతంగా జరగకూడదు, ప్రేమగా ఉండాలని కోరుకుంటున్నా. చీర రెగ్యులర్‌గా క్యారీ చేయడం నా వల్ల కాదు. అసలు బొట్టు పెట్టుకోవడమే నాకు తెలియదు. మా ఇంట్లో ఆంటీ అంటే అమర్యాద ఏం కాదు. నాలో వారికి కావాల్సిన మార్పులు చేస్తేనే.. నన్ను యాక్సెప్ట్ చేస్తామన్నట్టు ప్రవర్తించడం, నాకు అంతగా నచ్చడం లేదు.




నిపుణులు: ఒక్క క్షణం ఆగండి.. ఇదంతా బొట్టు గురించో బోనం గురించో కాదు. పెళ్లిలో ఒకరికోసం ఒకరు చిన్న చిన్న మార్పులు చేసుకోవడం గురించి. పెళ్లికి ముందు మీరు ఇద్దరు వేరు వేరు వ్యక్తులు. కానీ వివాహం తర్వాత ఒక సమూహంగా మారాలి. మహేష్ ఉద్దేశం పూనమ్‌ను అదుపు చేయడం కాదు.. 'బహుశా తను వారికి దగ్గరయ్యే పనులు చేస్తే, కుటుంబం ఇంకా సంతోషంగా ఉంటుంది కదా' అని కావొచ్చు. పూనమ్ ఉద్దేశం అత్తవారి కుటుంబాన్ని దూరం పెట్టడం కాదు.. 'పెళ్లికి ముందు నన్ను అంగీకరించిన వ్యక్తి, ఇప్పుడు ఎందుకు మార్పులు చెబుతున్నాడు' అని కావొచ్చు. ఇద్దరూ ఎమోషనల్‌గా ఉన్నారే తప్ప, ఈగోతో మాట్లాడటం లేదు. విభిన్న ఆచారాల నుంచి పెళ్లిళ్లు జరిగినప్పుడు ఇది చాలా సహజం. ఇవేవీ కూడా పెద్ద పెద్ద సమస్యలు కావు. సందర్భాన్ని బట్టి ఎవరు అడ్జస్ట్ అయినా సరిపోతుంది. ప్రేమలో.. 'ఇది నేనెందుకు చేయాలి?' అని ప్రశ్నించడం కంటే, 'నీకోసం నేనిది చేస్తా' అని ఇద్దరూ అనుకున్నప్పుడు.. ఇక సమస్య ఏం ఉంటుంది? – అర్చన నండూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్




(యువతీ యువకుల పేర్లు మార్చాం)

మెయిల్ పంపండి



ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

ఎదుటివారి కోసమా..



కాలేజ్‌లో కొందరు ఉంటారు.. ఎప్పుడూ ఇతర ఫ్రెండ్స్‌ను మెప్పించాలని ట్రై చేస్తుంటారు. అసలు వారికంటూ ఒక ఆలోచన, ఆచరణ ఉంటాయా లేదా అనిపిస్తూ ఉంటుంది వాళ్లను చూస్తే. తమ ప్రాజెక్టులు వెనక్కి పెట్టి పక్కవారి అసైన్‌మెంట్లకు సాయం చేయడం, తమకంటూ గర్ల్ ఫ్రెండ్ లేకపోయినా.. ఫ్రెండ్ లవ్‌కి హెల్ప్ చేయడం.. ఇలా అన్నింటిలోనూ ఇతరుల అవసరాలనే ముందు ఉంచుతుంటారు. ఇలాంటి వారిని 'ఎకోయిస్ట్' అంటారట. గ్రూప్‌లో ఇతర ఫ్రెండ్స్ ఎక్కడ తమ గురించి చెడుగా అనుకుంటారో, దేనికి ఫీల్ అయిపోతారోనని వీళ్లే ముందు అన్నీ అవతలి వారికి అనుకూలంగా చేసేస్తూ ఉంటారు. ఇలాంటి వారి గురించి ఇతర దేశాల సోషల్ మీడియా యాప్స్‌లో చర్చ జరుగుతూ ఉండటంతో ప్రస్తుతం ఈ పేరు మన వద్దా ట్రెండింగ్‌లో ఉంది. ఈ సందర్భంగా ఇతరులకు హెల్ప్ చేయడం మంచిదేకానీ, అది మరీ మనల్ని ముంచేసేలా ఉండకూడదు అని అభిప్రాయపడుతున్నారు నెటిజన్లు.

(c) eenadu

ఈనాడు సినిమా

గ్లింప్స్‌తో వస్తున్న ఉస్తాద్


పవన్ కల్యాణ్

'ఉస్తాద్ భగత్ సింగ్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది చిత్ర బృందం. దీనిలో భాగంగా త్వరలో 40 సెకన్ల నిడివితో ఓ పవర్‌ప్యాక్డ్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌తో ఆ విషయాన్ని ప్రకటించారు. ఈ చిత్ర స్థాయి, తీవ్రత, మాస్ అంశాల్ని ఈ ప్రచార చిత్రంతో ప్రేక్షకులకు చూపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పవన్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

'స్పిరిట్'లో విలన్ వివేక్ ఒబెరాయ్


వివేక్ ఒబెరాయ్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'స్పిరిట్'. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. శుక్రవారం ఆయన ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. అందులో వివేక్ చలువ కళ్లద్దాలు పెట్టుకుని.. చేతిలో తల్వార్‌తో స్టైలిష్ లుక్‌లో కనిపించారు. తన పక్కనే ఐశ్వర్య దేశాయ్ ఉండటం.. ఈ కథలో ఆమె పాత్రకీ ప్రాధాన్యత ఉన్నట్లు అర్థమవుతోంది. పవర్‌ఫుల్ పోలీసు యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా అలరించనున్నారు. ఆయనిందులో మూడు భిన్న లుక్స్‌లో కనిపించనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న థియేటర్లలోకి రానుంది. దీనికి హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తున్నారు.

మైసూర్‌లో నాగార్జున యాక్షన్



కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రా.కార్తీక్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ముస్తాబవుతున్న ఈ సినిమాని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా మైసూర్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుందని సమాచారం. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో నాగ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారని తెలిసింది. యాక్షన్ ప్రధానంగా సాగే ఆసక్తికర కథతో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో నాగ్ కనిపించే తీరు చాలా కొత్తగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇది ఈ ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

అనుకుందామా.. ఓ మాట!


సుహాసిని

సుహాసిని, వినోద్ కుమార్, ఇంద్రజ ప్రధాన పాత్రధారులుగా బీమ్‌జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓ మాట అనుకుందామా!'. పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రా నాయకానాయికలు. ఈ చిత్ర గ్లింప్స్‌ను సుహాసిని, వినోద్ కుమార్ ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బీమ్‌జీ మాట్లాడుతూ.. "ఓ సరికొత్త ప్రేమకథతో రూపొందుతున్న చిత్రమిది. కుటుంబమంతా కలిసి చూడగలిగేలా ఉంటుంది. సుహాసిని, వినోద్ పాత్రలు కీలకంగా ఉంటాయి. శ్రీనివాస్, మోనికా పాత్రలు కట్టిపడేస్తాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు.

మళ్లీ మళ్లీ నిన్నే చూడాలని!


మృణాల్ ఠాకూర్, అడివి శేష్

'మోసం అంటే ఏమిటో తెలియని వయసులో నిన్ను ప్రేమించినాను. నన్ను మోసం చేస్తావని తెలియదు కదా.. జూలియట్. ఎందుకు నమ్మించినావే" అని తన ప్రేయసిని ప్రశ్నిస్తున్నారు అడివి శేష్. మరి ఈ ఇద్దరి ప్రేమ కథేంటి? విడిపోవడానికి కారణమేంటి? తెలియాలంటే 'డెకాయిట్' చూడాల్సిందే. శేష్.. మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ సినిమాని షానియల్ డియో తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "మళ్లీ మళ్లీ నిన్నే.. చూడాలని అంటుందే మనసే.." అంటూ సాగిన ఈ ప్రేమ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చడమే గాక చిన్మయి శ్రీపాదతో కలిసి ఆలపించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యమందించారు. ఈ పాటలో హీరో ప్రేమను.. దాని తర్వాత జరిగిన ద్రోహంతో అతని జీవితంలో వచ్చిన మార్పును ఆసక్తికరంగా చూపించారు. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉంది. దీంట్లో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

దీ కేరళ స్టోరీ 2 విడుదలకు మార్గం సుగమం



'దీ కేరళ స్టోరీ 2' సినిమా విడుదలపై కేరళ హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో కోర్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) తీరును తప్పుగా పేర్కొంటూ సినిమాను మళ్లీ పరిశీలించాల్సిందిగా ఆదేశించింది. దీంతో చిత్రబృందం సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర స్టేను ఎత్తివేసినట్లు తెలిసింది. దీంతో ఈ సినిమా విడుదలకు మార్గం సుగమం అయినట్లు సమాచారం. 2023లో వివాదాల నడుమ విడుదలై విమర్శకుల ప్రశంసలు పొందిన 'దీ కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని కామాఖ్య నారాయణ్ సింగ్ తెరకెక్కించారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ఈ సినిమాలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రేమించిన వ్యక్తుల చేతిలో మోసపోయి.. మానసికంగా క్షోభకు గురవుతున్న ముగ్గురు అమ్మాయిల కథాంశంతో ఈ చిత్రం రూపొందినట్లు ట్రైలర్‌తో స్పష్టంచేసింది చిత్రబృందం.

మన మట్టి కథలకూ ప్రోత్సాహం దక్కాలి

"మన కథలు వినాల్సింది, మన సినిమాని చూడాల్సింది మనుషులే. ఓ కథకుడిగా మనుషుల్ని భావోద్వేగాలతో స్పందింపజేసే సినిమాలు చేయడమే నాకు ఇష్టం" అన్నారు దర్శకుడు వినయ్‌రత్నం. 'శ్రీచిదంబరంగారు' సినిమాతో పరిచయమైన యువ దర్శకుడీయన. లఘు చిత్రాలతో ప్రయాణం మొదలుపెట్టి, వాటితోనే అనుభవాన్ని సంపాదించి తొలి ప్రయత్నంలోనే ఓ మంచి సినిమాని చేశారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా 'శ్రీచిదంబరం గారు' శుక్రవారం నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వినయ్ రత్నం 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు.


వినయ్ రత్నం

'శ్రీచిదంబరం గారు' ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది కదా. ఎలాంటి స్పందన వస్తోంది?

ఉదయం నుంచే ఫోన్ కాల్స్ మొదలయ్యాయి. అమెరికా నుంచి కూడా కాల్స్ వస్తున్నాయి. ఒకే నెలలోనే రెండుసార్లు సినిమా విడుదలైన అనుభూతి కలుగుతోంది. ఫిబ్రవరి 6న మా సినిమా థియేటర్లలో విడుదలైంది. ఎవరి నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే ఉత్సుకతతో ఆ రోజు ఫోన్ కాల్స్ మాట్లాడా. ఈ రోజు అంతకంటే ఎక్కువ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. దాంతో ఎక్కువమంది మా సినిమాని చూస్తున్నారని అర్థమవుతోంది. థియేటర్లలో సినిమాని ఎక్కువమది చూడలేదు. మంచి సమీక్షలే వచ్చినా, ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులు థియేటర్లకు రాకపోవడంతో నోటి మాట ఆశించిన స్థాయిలో వెళ్లలేదు. ఈటీవీ విన్‌లో సినిమా అందుబాటులోకి వచ్చాక ప్రతి ఇంటికీ 'శ్రీచిదంబరం గారు' చేరువవుతుందనే నమ్మకం కలిగింది. అదే నిజమవుతోంది.

థియేటర్లలో సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోవడానికి కారణమేమిటని భావిస్తున్నారు?

ఆ రోజు మొత్తం 12 సినిమాలు విడుదలయ్యాయి. అన్ని సినిమాల ప్రచారం ఒకేసారి సాగడంతో ప్రేక్షకులూ గందరగోళానికి గురయ్యారు. దానికి తోడు ఫిబ్రవరి నెల సరైన సీజన్ కాదని అంటారు. ఇలా చాలా కారణాలే ఉన్నాయని నా అభిప్రాయం. ఇప్పుడైనా ఎక్కువ మంది ప్రేక్షకులకు, అదీ తెలుగువాళ్లకు నా సినిమా చేరువవుతోందన్న సంతృప్తి కలుగుతోంది. ఏ కథకుడైనా కోరుకునేది ఇదే కదా.

థియేటర్లలో సినిమా విడుదలైన తర్వాత పరిశ్రమ వర్గాల నుంచి ఎలాంటి స్పందన లభించింది?

ఐదు నిర్మాణ సంస్థల నుంచి అవకాశాలు వచ్చాయంటే అర్థం చేసుకోండి. చాలా మంది నిర్మాతలు, దర్శకులు ఫోన్ చేసి మాట్లాడారు. వివేక్ ఆత్రేయ, వెంకటేశ్ మహా, నందినీరెడ్డి, ప్రియాంక దత్... వీళ్లంతా చాలా మెచ్చుకున్నారు. తొలి సినిమాకే అలాంటి స్పందన రావడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈ సినిమాకి ముందు నేను హైదరాబాద్‌కి వచ్చింది కూడా తక్కువ. నా ప్రయాణమంతా రాజమండ్రిలోనే. 25 లఘు చిత్రాలూ అక్కడే చేశా. ఏ నేపథ్యం లేకుండా వచ్చినా పరిశ్రమ నుంచి ఈ స్థాయిలో ప్రోత్సాహం లభించడం మామూలు విషయం కాదు.

మలయాళం సినిమాలా ఉందనే అభిప్రాయాలు వినిపించాయి. మీరు విన్నారా?

ఆ ప్రశంసని ఎలా తీసుకోవాలో నాకు అర్థం కాలేదు (నవ్వుతూ). నేను తీసింది అచ్చమైన తెలుగు సినిమా. మలయాళం సినిమాల్ని మనం ఇష్టపడటంలో తప్పు లేదు కానీ, మన మూలాల్లోనూ గొప్ప గొప్ప కథలున్నాయి. మలయాళం సినిమాల గురించి ఎలా మాట్లాడుకుంటున్నామో, మనం తీస్తున్న భారీ చిత్రాల గురించి ఇప్పుడు పొరుగు భాషలన్నీ ఎలా మాట్లాడుకుంటున్నాయో, మన మట్టి కథలకూ అలాంటి ఓ రోజు రావాలి. నిజానికి అప్పుడప్పుడూ మనం కూడా అలాంటి మంచి చిత్రాల్ని తీస్తున్నాం. వాటికి సరైన ప్రోత్సాహమే దక్కాలి.

యువ దర్శకుడు మీరు. తొలి ప్రయత్నంగా మన మూలాల్లోని కథని స్పృశించాలని ఎందుకనిపించింది?

నేను పుట్టి పెరిగిందంతా రాజమండ్రిలో. మా చుట్టాలంతా పల్లెటూళ్లలోనే ఉంటారు. నా పండగలు, జాతర్లు అన్నీ అక్కడే. ఆ ప్రభావంతోనే చిన్నప్పటి నుంచీ మన మనుషుల కథలు, మన మట్టి కథలు చెప్పాలని ఉండేది. మనవైన మట్టి కథల్ని మనం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారనేది నా ఉద్దేశం.

మీ నుంచి రానున్న తదుపరి సినిమా ఎలా ఉంటుంది?

అది కూడా గ్రామీణ నేపథ్యంలో మంచి డ్రామాతో రూపొందుతుంది. అందులో భావోద్వేగాలు, ఆ సినిమా స్థాయి పరిధి మరింత విస్తృతంగా ఉంటుంది. ఓ పెద్ద నిర్మాణ సంస్థలోనే రూపొందుతుంది. ప్రస్తుతం ఆ కథని రాసే పనిలోనే ఉన్నా.

అభిషేక్- బాబీ డేఓల్ కాంబోలో కొత్త చిత్రం?


అభిషేక్ బచ్చన్, బాబీ డేఓల్

'రాజా శివాజీ', 'కింగ్' చిత్రాలతో ఈ ఏడాది ప్రేక్షకులను అలరించేందుకు సన్నద్ధమవుతున్నారు బాలీవుడ్ కథానాయకుడు అభిషేక్ బచ్చన్. ఇప్పుడాయన బాబీ డేఓల్ కాంబోలో హిందీ చిత్రనిర్మాత దీపక్ ముకుత్ ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిచాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. 'గోల్‌మాల్ 5' సినిమాని 'దో ఔర్ దో పాంచ్' చిత్ర రీమేక్ అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో స్పందిస్తూ.. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి పంచుకున్నారు. "ఇతరులెవరో 'దో ఔర్ దో పాంచ్' సినిమా రీమేక్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవి ఎక్కడి నుంచి వస్తున్నాయో నాకు తెలీదు. అందుకే ఈ రీమేక్ హక్కులను సొంతం చేసుకున్నట్లు పబ్లిక్ నోటీసు జారీ చేయాల్సి వచ్చింది. ఈ సినిమాని రీమేక్ చేయాలని నేను గత పదేళ్లుగా ప్రణాళిక చేస్తున్నాను. బాబీ డేఓల్, అభిషేక్ బచ్చన్‌లతో కలిసి ఈ సినిమాని చేయాలనుకుంటున్నాన"ని నిర్మాత చెప్పినట్లు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి. 1980లో విడుదలైన 'దో ఔర్ దో పాంచ్' చిత్రాన్ని రాకేశ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో అమితాబ్ బచ్చన్, శశి కపూర్, హేమా మాలిని ప్రధాన పాత్రల్లో నటించారు.

హిందీ అగ్ర హీరో సరసన మీనాక్షి?


మీనాక్షి చౌదరి

తెలుగులో అగ్రకథానాయకులతోపాటు యువ హీరోల సరసన నటిస్తూ వరుస విజయాలతో జోరుమీదుంది హీరోయిన్ మీనాక్షి చౌదరి. ముగ్గుల పండక్కి 'అనగనగా ఒక రాజు' సినిమాలో చారులతగా కనిపించి.. ఈ ఏడాదిని మంచి విజయంతో ఆరంభించిందీ భామ. తాజాగా ఆమె బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్‌తో జంట కట్టనుందట. ప్రియదర్శన్ దర్శకత్వంలో 2006లో విడుదలైన కామెడీ థ్రిల్లర్ 'భాగమ్ భాగ్' సినిమా సీక్వెల్‌లో ఆమె కనిపించనుందని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. "ప్రియదర్శన్ ప్రస్తుతం అక్షయ్‌కి సంబంధించిన మూడు చిత్రాలను తెరకెక్కించే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పుడాయన రూపొందిచాలనుకున్న 'భాగమ్ భాగ్' సీక్వెల్ బాధ్యతల్ని రాజ్ శాండిల్యకు అప్పగించారు. అక్షయ్ హీరోగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో మీనాక్షి చౌదరి, 'ధురంధర్' సినిమాలో ప్రత్యేక గీతంలో అలరించిన ఆయేషా ఖాన్‌ను కథానాయికలుగా నటించనున్నార"ని హిందీ చిత్రవర్గాల సమాచారం. మీనాక్షి ప్రస్తుతం హీరో నాగచైతన్య నటిస్తున్న 'వృషకర్మ' సినిమాతో బిజీగా ఉంది.

సోలో ట్రిప్.... మీరేంటో చెబుతుంది


షాలిని పాండే

జీవితంలో మీరు ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయకపోతే.. నిజంగా మీకేది ఇష్టమో అనేది తెలియదంటోంది నటి షాలినీ పాండే. 'అర్జున్‌రెడ్డి' చిత్రంతో అందర్నీ ఆకర్షించిన ఈమె గతేడాది ఓటీటీలో 'డబ్బా కార్టెల్' సిరీస్‌తో ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'బంద్‌వాలే' సిరీస్‌తో అమెజాన్ ప్రైమ్ వేదికగా సందడి చేస్తోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. "నటిగా నా పని ఒక పాత్రను పోషించి దానిని వాస్తవంగా చూపిస్తూ తెరపై అలరించడం. కానీ, నిజజీవితం గురించి నేను చాలా విషయాలను తెలుసుకోవాలనుకుంటాను. దాని కోసం చిన్న చిన్న గ్రామాలకు సోలో ట్రిప్పులు వెళుతుంటాను. జీవితంలో ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయాలి. అలా చేయకపోతే.. నిజంగా మీ ఇష్టాలు ఏంటనేది మీకు తెలియవు. మీరు ఎవరితోనైనా ఉన్నప్పుడు ప్రతిదాని గురించి అభిప్రాయాలను పంచుకుంటూ ఉంటారు. కానీ, ఎవరులేని సందర్భాల్లో మీతో మీరు ఉండగలరా? మీకు మీరంటే ఇష్టమేనా? అనేది కూడా తెలుసుకోవాలి. అలాంటప్పుడు ఆ ఒక్క ఒంటరి ప్రయాణం చేసినప్పుడు మిమ్మల్ని మీరు గ్రహిస్తారు. ప్రయాణం జీవితంలో మార్పులు తెస్తుంది. అపరిచితులను కలవడం.. వెళ్లిన ప్రదేశాల గురించి తెలుసుకుని స్థానికుల దృష్టితో వాటిని చూడటం. అలా మనమెవరో తెలియకపోయినా అక్కడి వాళ్లు పంచే ఆత్మీయత చాలా మంచి అనుభూతినిస్తుంది. వ్యక్తులతో సంభాషించడం, నగరాలను అన్వేషిస్తూ సంస్కృతిని అర్థంచేసుకోవడం భిన్నమైన ప్రయాణం. అందరికీ ఇలా అనిపిస్తుందో లేదో కానీ, నాకు మాత్రం ట్రిప్ తర్వాత నన్ను నేను బాగా తెలుసుకున్నాననే భావనకలుగుతుంద"ని చెప్పుకొచ్చింది.

(c) eenadu



పబ్లిక్ ఇష్యూకు భారత్ బయోటెక్!

● రూ.4500 కోట్ల ఐపీఓకు అవకాశం
● చర్చలు ప్రాథమిక దశలోనే: బ్లూమ్‌బర్గ్

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే వ్యాక్సిన్ తయారీ కంపెనీ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4500 కోట్లు) మేర నిధులను సమీకరించాలన్నది సంస్థ యోచనగా, ఈ అంశాలతో దగ్గరి సంబంధమున్న వ్యక్తులు చెప్పారని వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇదే జరిగితే దేశీయ బయోటెక్నాలజీ రంగంలో వచ్చిన అతిపెద్ద ఐపీఓల్లో ఇది ఒకటి అవుతుంది. ఐపీఓపై అంతర్గత చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, ఆ కథనం వెల్లడించింది. ఈ విషయంపై కంపెనీ ప్రతినిధి స్పందించలేదు.

100కు పైగా దేశాల్లో..: కొవిడ్-19 పరిణామాల్లో సొంతంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి, ప్రపంచానికి అందించిన భారత్ బయోటెక్, భారీ పరిమాణంలో ఐపీఓకు వస్తే అది ఒక మైలురాయి కానుంది. 1996లో స్థాపించిన ఈ కంపెనీ హెపటైటిస్ బి, టైఫాయిడ్, రోటావైరస్, ఇన్‌ఫ్లుయెంజా వంటి వివిధ వ్యాధుల నిరోధానికి భారీ స్థాయిలో వ్యాక్సిన్లు, బయోథెరప్యూటిక్స్‌ను అందిస్తోంది. కొన్నేళ్లుగా తన తయారీ, పరిశోధన సామర్థ్యాలను విస్తరిస్తూ వస్తోంది. వందకు పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయడం ద్వారా అంతర్జాతీయ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్స్‌లో కీలక సంస్థగా అవతరించింది.

అదానీ గ్రూప్ నుంచి వైదొలిగిన నార్వే బ్యాంక్

ఆర్థిక మోసాలతో సంబంధాలు ఉన్నాయన్న ఆందోళనల నేపథ్యంలో, తమ పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌ను తొలగించాలని నార్వే సార్వభౌమ నిధి సంస్థ నార్జెస్ బ్యాంక్ నిర్ణయించింది. 2024 మేలో తమ పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ పోర్ట్స్‌ను తొలగించిన సంస్థ, తాజాగా అదానీ గ్రీన్‌ను నిషేధిత కంపెనీల జాబితాలో చేర్చింది. ఈ నిర్ణయానికి తీవ్రమైన అవినీతి లేదా ఇతర ఆర్థిక నేరాలను ప్రాతిపదికగా పేర్కొన్నప్పటికీ, పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. 2020 జులైలో నార్జెస్ బ్యాంక్ మొదటిసారిగా అదానీ గ్రీన్ షేర్లను కొనుగోలు చేసినప్పుడు వాటి ధర రూ.341గా ఉంది. ప్రస్తుతం ఈ షేరు ధర రూ.944కు చేరింది.

ఆస్ట్రా మైక్రోవేవ్ వ్యాపార విభజన!



హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రోడక్ట్స్, తన అంతరిక్ష, మెటియరాలజీ, హైడ్రాలజీ వ్యాపారాలను కలిపి విడిగా ఒక కంపెనీ కిందకు తీసుకురానుంది. ఆ మేరకు వ్యాపార విభజనకు కంపెనీ బోర్డు శుక్రవారం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఇందువల్ల 2 స్వతంత్ర నమోదిత సంస్థలు ఏర్పాటవుతాయి. ఎప్పటిలానే ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ సంస్థ డిఫెన్స్, ఏరోస్పేస్ మార్కెట్లపై దృష్టి కేంద్రీకరిస్తుంది. కొత్తగా ఏర్పడే ఆస్ట్రా స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్.. స్పేస్, మెటియరాలజీ, హైడ్రాలజీ వ్యాపారాలను నిర్వహిస్తుంది. ఈ సంస్థ షేరునూ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు చేయాలన్నది ప్రతిపాదన.

✦ కొత్త స్వతంత్ర కంపెనీని సృష్టించడం ద్వారా, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడంపై యాజమాన్యం దృష్టి సారించొచ్చని పేర్కొంది. కొత్త తరం వ్యాపారాలను విడదీయడం ద్వారా, వాటాదార్లకు సైతం విలువ అందించిన ట్లవుతుందని వెల్లడించింది. ✦ ప్రతిపాదిత విభజనకు షేర్ల మార్పిడి నిష్పత్తిని కనుగొనేందుకు ఒక రిజిస్టర్డ్ వాల్యువర్‌ను ఆడిట్ కమిటీ నియమిస్తుంది. వ్యాపార విభజనకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, కాంట్రాక్టులు, ఉద్యోగుల గుర్తింపునూ చేపడుతుంది. ✦ గత 12 నెలల్లో 61%, గత అయిదేళ్లలో 800% మేర పెరిగిన ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రోడక్ట్స్ షేరు శుక్రవారం బీఎస్ఈలో 2.38% నష్టంతో రూ.968.45 వద్ద స్థిరపడింది.

జీడీపీ గణాంకాలు మారాయ్

● 2025-26కు వృద్ధి అంచనా 7.6%
● అక్టోబరు-డిసెంబరులో వృద్ధి 7.8 శాతానికి ● కొత్త సిరీస్ అమలు నేపథ్యం



మనదేశం అమల్లోకి తెచ్చిన కొత్త జీడీపీ సిరీస్ కారణంగా వృద్ధిరేటు అంచనాలు, వృద్ధి గణాంకాల్లో మార్పులొచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను అంతక్రితం అంచనా అయిన 7.4% నుంచి 7.6 శాతానికి సవరించారు. లెక్కింపు పద్ధతులను ప్రభుత్వం సవరించడం ఇందుకు నేపథ్యం. ప్రాతిపదిక ఏడాదిని 2011-12 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్చారు. దీంతో పాటు జీఎస్టీ, ఇ-వాహన్ పోర్టల్ నుంచి అదనపు గణాంకాలను జత చేయడం ద్వారా, ఆర్థిక కార్యకలాపాలను మెరుగ్గా ప్రతిబింబించేలా కొత్త సిరీస్ తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

మారిన సిరీస్ ప్రకారం వృద్ధి (%లో)

ఆర్థిక సంవత్సరం	వాస్తవ జీడీపీ	నామినల్ జీడీపీ
2023–24	7.2	11.0
2024–25	7.1	9.7
2025–26(అంచనా)	7.6	8.6

శుక్రవారం గణాంక, పథకాల అమలు శాఖ (మోస్పి) 'న్యూ సిరీస్ ఆఫ్ యాన్యువల్ అండ్ క్వార్టర్లీ నేషనల్ అకౌంట్స్ ఎస్టిమేట్స్'ను విడుదల చేసింది. అంతక్రితం ఉన్న పాత సిరీస్‌ను ఇది భర్తీ చేసింది. జీడీపీ సిరీస్‌కు ఇది తొమ్మిదో ప్రాతిపదిక సవరణ. దీని ప్రకారం..

✦ 2025-26 మూడో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతానికి చేరింది. 2024-25 ఇదే సమయంలో ఇది 7.4%. తయారీ, సేవల రంగాలు రాణించడం ఇందుకు కలిసొచ్చింది.

✦ రెండో త్రైమాసిక (జులై-సెప్టెంబరు) వృద్ధి రేటు పాత సిరీస్‌లోని 8.2% నుంచి 8.4 శాతానికి చేరింది. తొలి త్రైమాసికంలో మాత్రం 7.8% నుంచి 6.7 శాతానికి తగ్గింది.

✦ ఈ మార్పుల కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ (స్థిర ధరల వద్ద) రూ.322.58 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. 2024-25లో తొలి సవరించిన అంచనా(ఎఫ్ఆర్ఈ) రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. దీంతో 2025-26లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.6% అవుతుందని అంచనా. 2024-25లో ఇది 7.1%. 2025-26 నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 8.6 శాతానికి చేరొచ్చు.

2026-27కు వృద్ధి అంచనా పెంపు

సీఈఏ నాగేశ్వరన్ వెల్లడి

జీడీపీ కొత్త సిరీస్ నేపథ్యంలో, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) వృద్ధి రేటు అంచనాలను 20 బేసిస్ పాయింట్లు పెంచి 7-7.4% చేసినట్లు ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. పార్లమెంటుకు జనవరిలో సమర్పించిన ఆర్థిక సర్వే ప్రకారం ఇది 6.8-7.2%. నామినల్ జీడీపీ వృద్ధి రేటు 11 శాతానికి చేరువవుతుందని, ఆర్థిక వ్యవస్థ అపుడు సౌకర్యవంతంగా 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.360 లక్షల కోట్లు) స్థాయిని అధిగమించగలదని అంచనా వేశారు.

ద్రవ్యలోటు రూ.9.8 లక్షల కోట్లు

జనవరి చివరకు కేంద్ర ద్రవ్యలోటు రూ.9.8 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 వార్షిక బడ్జెట్ లక్ష్యంలో 63 శాతానికి ఇది సమానం. 2024-25 ఇదే సమయానికి బడ్జెట్ లక్ష్యంలో 74.5 శాతంగా నమోదైంది. 2025-26లో ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతం (రూ.15.58 లక్షల కోట్లు)గా కేంద్రం అంచనా వేసింది.

పసిడి భవిష్య పరుగుకు ఫండ్ గిరాకీ కీలకం

డబ్ల్యూజీసీ సీఈఓ డేవిడ్ టెయిట్



భౌగోళిక - రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా వివిధ దేశాలకు పెరుగుతున్న రుణభారంపై ఆందోళనలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్ల కారణంగా పసిడి ధర పెరుగుతోందని అంతర్జాతీయ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) డేవిడ్ టెయిట్ పేర్కొన్నారు. భవిష్యత్తులో పెన్షన్, బీమా ఫండ్‌ల వంటి సంస్థల నుంచి గిరాకీ పెరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లలో కేంద్ర బ్యాంకులు ఏటా దాదాపు 1000 టన్నుల పసిడిని కొనుగోలు చేశాయని, భవిష్యత్తులోనూ ఈ కొనుగోళ్లు కొనసాగొచ్చని టెయిట్ అంచనా వేశారు.

భారత్ వెనకబడే ఉంది: పసిడి కొనుగోళ్ల విషయంలో, పశ్చిమ దేశాల కేంద్ర బ్యాంకులతో పోలిస్తే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల కేంద్ర బ్యాంకులు వెనకబడి ఉన్నాయని, అందుకే అవి కూడా నిల్వలను పెంచుకుంటున్నాయని టెయిట్ తెలిపారు. గిరాకీ ధోరణుల గురించి మాట్లాడుతూ, గతేడాది ప్రపంచవ్యాప్తంగా పసిడికి డిమాండ్ రికార్డు గరిష్ఠాలకు చేరిందని టెయిట్ అన్నారు. ధరలు పెరగడం వల్ల ఆభరణాలకు గిరాకీ తగ్గినప్పటికీ.. పెట్టుబడుల రూపంలో బిస్కెట్లు, నాణేలకు డిమాండ్ 17% పెరిగినట్లు వివరించారు. పసిడి ధరలు గణనీయంగా తగ్గాలంటే, అమెరికా 6-7% వృద్ధిరేటు సాధించాలి. దీంతో పాటు ద్రవ్యోల్బణం, ప్రభుత్వ రుణాలు తగ్గాలి. ఇలా జరిగే అవకాశం 'చాలా తక్కువ' అని ఆయన స్పష్టం చేశారు.

9 నెలల్లో అమెరికా నుంచి రెట్టింపు ఎఫ్‌డీఐ

దిల్లీ: మనదేశంలోకి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో 47.87 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.31 లక్షల కోట్ల)కు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వచ్చిన 40.67 బి.డా. (సుమారు రూ.3.66 లక్షల కోట్ల) కంటే ఇవి 18% అధికం. 2025-26 తొలి 9 నెలల్లో అమెరికా నుంచి 7.80 బి.డా. (సుమారు రూ.70,200 కోట్ల) ఎఫ్‌డీఐ వచ్చింది. ఏడాది క్రితం ఇదే సమయంలో వచ్చిన 3.73 బిలియన్ డాలర్ల కంటే, ఈసారి రెట్టింపు కావడం గమనార్హం. మొత్తం ఎఫ్‌డీఐలో ఈక్విటీల్లోకి వచ్చిన పెట్టుబడులు, రీఇన్వెస్ట్‌మెంట్ చేసిన ప్రతిఫలాలు, ఇతర మూలధనం వంటివి కలిసే ఉన్నాయి.

✦ ఎఫ్‌డీఐ పరంగా వరుస క్రమంలో సింగపూర్ (17.65 బి.డా.), అమెరికా (7.80 బి.డా.), మారిషస్ (4.83 బి.డా.), జపాన్ (3.2 బి.డా.), యూఏఈ (2.45 బి.డా.), నెదర్లాండ్స్ (2.29 బి.డా.), కేమన్ ఐల్యాండ్స్ (1.97 బి.డా.), సైప్రస్ (1.4 బి.డా.) ఉన్నాయి.

మహీంద్రా కొత్త రొటావేటర్ సిరీస్ ఆవిష్కరణ

ముంబయి: దేశంలో అన్ని పంట కాలాలకు అనువైన కొత్త ఉత్పత్తులు తీసుకురావడానికి కట్టుబడి ఉన్నట్లు కొత్త రొటావేటర్ సిరీస్ ఆవిష్కరణ సందర్భంగా మహీంద్రా గ్రూప్ పేర్కొంది. 4-9 అడుగులు ఉండే ఈ హెవీ డ్యూటీ రొటావేటర్‌ను సాధారణంగా ట్రాక్టర్ వెనక భాగానికి అనుసంధానిస్తారు. కొత్తగా డిజైన్ చేసిన ఈ రొటావేటర్ ప్రస్తుత రొటావేటర్ మోడళ్లను భర్తీ చేయనుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అనూష కోదండరామన్ పేర్కొన్నారు. తెలంగాణ (జహీరాబాద్), పంజాబ్‌లలో ఉన్న ప్లాంట్లలో ఈ రొటావేటర్లను తయారు చేశారు.

కోడి గుడ్లు
28న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	470
వరంగల్	472
విజయవాడ	500
తూ/ప గోదావరి	480
విశాఖపట్నం	485
చిత్తూరు	513

ఫండ్ విలువకు ఇన్ఫోసిస్ షేరు సెగ

● ఈనెలలో 20% పతనం
● గత 13 ఏళ్లలో ఇదే పేలవ ప్రదర్శన
● ఏఐ ఆందోళనలు నేపథ్యం



దేశీయ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు, దశాబ్దకాలంలోనే అత్యంత పేలవ ప్రదర్శనను ఈ నెలలో కనబర్చింది. ఫిబ్రవరిలో ఈ షేరు విలువ 20.75% క్షీణించింది. 2013 ఏప్రిల్‌లో షేరు విలువ 22.75% పతనమయ్యాక.. ఒక నెలలో ఇన్ఫీ షేరు మళ్లీ ఇంతగా నష్టపోవడం ఇప్పుడే. 52 వారాల గరిష్ఠమైన రూ.1,776 (2025 ఫిబ్రవరి 27)తో పోల్చితే, ప్రస్తుతం షేరు ధర 26.8% క్షీణించింది. ఈ ఏడాది జనవరి 30న బీఎస్ఈలో ఇన్ఫీ షేరు రూ.1640.45 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 27న రూ.1299.95 వద్ద ముగిసింది. ఈ నెలలో లార్జ్ క్యాప్ కంపెనీల విభాగంలో అత్యధిక నష్టాన్ని చవిచూసిన కంపెనీల షేర్లలో ఇదీ ఒకటి.

✦ ఫిబ్రవరిలో ఇన్ఫీ షేరు భారీగా నష్టపోవడంతో, ఈ నెలలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,33,824 కోట్ల మేర తగ్గి, రూ.5,27,087 కోట్లకు పరిమితమైంది.

ఫండ్‌లకూ నష్టాల సెగ: దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రాధాన్యమిచ్చే షేర్లలో ఇన్ఫోసిస్ కూడా ఒకటి. అందుకే ఈ కంపెనీ షేర్లలో ఇవి పెట్టుబడులు కూడా అధికంగా పెడుతూ వచ్చాయి. ఇప్పుడు ఇన్ఫీ షేరు నష్టాలబాట పట్టడంతో ఆ సెగ దేశీయ మ్యూచువల్ ఫండ్‌లకూ తాకింది. డిసెంబరు చివరికి 45 మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కలిపి, ఇన్ఫోసిస్‌లో మొత్తంగా 22.12% వాటా ఉంది. 52 వారాల గరిష్ఠమైన రూ.1,776 నుంచి షేరు 26.8 శాతం పడటంతో దేశీయ మ్యూచువల్ ఫండ్‌ల వాటాల విలువ రూ.1,59,223 కోట్ల నుంచి రూ.1,17,331 కోట్లకు దిగివచ్చింది. అంటే రూ.41,892 కోట్ల నష్టం (నోషనల్ లాస్) వాటిల్లింది.

✦ ఫిబ్రవరిలో నిఫ్టీ ఐటీ సూచీ కూడా 19.13% కుదేలైంది. 2023 నవంబరు తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి.

ఎఫ్‌పీఐలూ వెనకడుగు..: మన మార్కెట్లపై విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) ఇప్పుడిప్పుడే సానుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. ఐటీ షేర్లలో మాత్రం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఫిబ్రవరి తొలి అర్ధభాగంలో ఐటీ కంపెనీల షేర్ల నుంచి రూ.11,000 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐటీ రంగ షేర్లలో ఎఫ్‌పీఐల మొత్తం పెట్టుబడుల విలువ 2026 ఫిబ్రవరి 15 నాటికి రూ.4,48,938 కోట్లకు పరిమితమైంది. ఈ ఏడాది జనవరి చివరికి దేశీయ టెక్ కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడుల విలువ రూ.5,33,953 కోట్లుగా ఉంది.

బొగ్గు దిగుమతులు 30% తగ్గించుకోండి

విద్యుత్ ప్లాంట్లకు కేంద్రం సూచన



బొగ్గు దిగుమతులను కనీసం 30% తగ్గించుకోవాలని విద్యుత్‌ప్లాంట్లకు కేంద్రం సూచించింది. దేశీయ బొగ్గు కలిపి వాడడాన్ని (బ్లెండింగ్) పెంచడం ద్వారా, ఈ ఏడాది కనీసం 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిలువరించవచ్చని భావిస్తోంది. ఈ ప్రణాళికతో దగ్గరి సంబంధాలున్న ప్రభుత్వ, పరిశ్రమ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా మనదేశం ఉంది. 2025లో ఇండొనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి వచ్చిన 50 మిలియన్ టన్నుల బొగ్గును మనదేశంలోని విద్యుత్ ప్లాంట్లు వినియోగించాయి. ఈ ఏడాది 15 మి. టన్నుల మేర బొగ్గు దిగుమతుల్లో కోత వేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. దేశంలో నాలుగింట మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గుపైనే జరుగుతోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు లభిస్తున్నందున, ఇబ్బందులేమీ ఉండవని విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం వివరిస్తున్నట్లు సమాచారం.

వేసవి కోసం బొగ్గు సరఫరా పెంపు..కోల్ ఇండియా: వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది కాబట్టి, అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచే పనిలో ఉన్నట్లు కోల్ ఇండియా తెలిపింది. ఈనెల 25 నాటికి కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. మార్చి 31 నాటికి ఇది మరింత పెరగనుంది. విద్యుత్ ప్లాంట్ల వద్ద 55 మి. టన్నుల బొగ్గు సహా ఇతరత్రా గూడ్స్ షెడ్లు, వాషరీలు, పోర్టులతో కలిపి మొత్తం 175.5 మి.టన్నుల నిల్వలున్నాయి. విద్యుత్ ప్లాంట్లకు వేసవి నెలల్లో అధిక పరిమాణంలో బొగ్గు అవసరం ఉంటుంది.

ఈడీ విచారణకు అనిల్ అంబానీ గైర్హాజరు



దిల్లీ: మనీలాండరింగ్ కేసు వ్యవహారంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు రిలయన్స్ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీ గైర్హాజరు అయ్యారని అధికారులు తెలిపారు. యెస్ బ్యాంక్‌లో మోసానికి సంబంధించిన కేసులో అనిల్ వివరణను ఈడీ రికార్డు చేయాలని అనుకుంది. విచారణ కోసం అనిల్ అంబానీకి మళ్లీ కొత్త తేదీని ఈడీ ఇచ్చిందా? అనే విషయం ఇంకా తెలియలేదు. అనిల్ అంబానీ సతీమణి టీనా అంబానీని కూడా విచారణకు హాజరు కావాలని పిలవగా.. ఆమె వాయిదా కోరారని అధికారులు వెల్లడించారు.

అరబిందో ఫార్మా అనుబంధ యూనిట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా ఫార్మా స్పెషాలిటీస్‌కు చెందిన తెలంగాణ ప్లాంట్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ 4 అభ్యంతరాలను జారీ చేసింది. ఈనెల 16 - 27 తేదీల్లో ఈ కేంద్రాన్ని యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీ చేసింది. సదరు అభ్యంతరాలపై నిర్దేశించిన సమయంలోగా యూఎస్ఎఫ్‌డీకు సమాధానం ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు అరబిందో ఫార్మా తెలిపింది.

700 నెక్సా స్టూడియో ఔట్‌లెట్‌లు: మారుతీ సుజుకీ

దేశంలోని గ్రామీణ, చిన్న పట్టణాల నుంచి లభిస్తున్న గిరాకీని అందిపుచ్చుకోవడానికి, చిన్న ప్రీమియం రిటెయిల్ చెయిన్ 'నెక్సా స్టూడియో'ను విస్తరించడానికి మారుతీ సుజుకీ సన్నాహాలు చేస్తోంది. 2030-31 నాటికి 700 నెక్సా స్టూడియో ఔట్‌లెట్‌లు ఏర్పాటు చేయాలని సంస్థ భావిస్తోంది. హరియాణాలోని ఖార్‌ఖోడాలో 200 నెక్సా స్టూడియోను కంపెనీ ప్రారంభించింది. మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, అమ్మకాలు) పార్థో బెనర్జీ మాట్లాడుతూ.. మొత్తం విక్రయాల్లో 25-30% నెక్సా స్టూడియో ఔట్‌లెట్ల నుంచే వస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు. గత 18 నెలల్లో ప్రతి మూడు రోజులకు ఒక నెక్సా స్టూడియోను ప్రారంభించామని అన్నారు.

పెట్టుబడులు పెట్టండి.. బడ్జెట్ ప్రయోజనాలు పొందండి




పారిశ్రామిక వేత్తలకు ప్రధాని పిలుపు

దిల్లీ: ప్రభుత్వం మూలధన వ్యయాలు పెంచుతున్న తరుణంలో, అంతర్జాతీయంగా పోటీ పడేందుకు ప్రైవేటు రంగమూ వినూత్న ఉత్పత్తుల కోసం పెట్టుబడులు అధికం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు. 'సాంకేతికత, సంస్కరణలు, వికసిత్ భారత్ కోసం ఆర్థిక లక్ష్యాల' పేరిట, బడ్జెట్ తరవాత శుక్రవారం నిర్వహించిన తొలి వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. 11 ఏళ్ల క్రితం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకు పెరిగాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రైవేటు రంగం కూడా దేశ వృద్ధి కోసం తాజా పెట్టుబడులు పెట్టాలని, ఆవిష్కరణలు తేవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సంస్థలు, విశ్లేషకులు ఆచరణాత్మక పరిష్కారాలు సూచించి, మార్కెట్‌లో విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమ, నిపుణులు కలిసినప్పుడే సంస్కరణలు చక్కని ఫలితాన్నిస్తాయని మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక పథకాల్లో వినూత్నతకు అధిక ప్రాధాన్యమివ్వాలని వివరించారు. ప్రాజెక్టుల మంజూరు పద్ధతులను బలోపేతం చేసి, నాణ్యతకు పెద్దపీట వేయాలని తెలిపారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, డిజిటల్ మౌలిక వసతులు, ఇంధన నెట్‌వర్క్ అభివృద్ధిని ప్రధాని ప్రస్తావించారు. కృత్రిమమేధ (ఏఐ), బ్లాక్‌చెయిన్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతికతల వినియోగం ద్వారా పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెంచాలని ప్రధాని ఉద్బోధించారు. అప్పుడే బడ్జెట్‌లోని అంశాలు కార్యరూపం దాలుస్తాయని పేర్కొన్నారు. 'రుణ లభ్యతను సరళతరం చేసి, సులభతర వాణిజ్య వాతావరణాన్ని మెరుగుపరచాలి. ప్రజల జీవనం మరింత నాణ్యంగా ఉండాల'ని ప్రధాని తెలిపారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. అందరి సమష్టికృషితోనే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని సాకారం అవుతుందని చెప్పారు.

అమెరికా పరిణామాలను గమనిస్తున్నాం

కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



దిల్లీ: టారిఫ్‌లపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం, అగ్రరాజ్య పరిణామాలను గమనిస్తున్నట్లు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. తీర్పు తర్వాత వాణిజ్య ఒప్పందం చర్చల విషయంలో భారత ధోరణి మారుతుందా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ 'అమెరికాతో కలిసి తుదిరూపునిచ్చిన సంయుక్త ప్రకటనను మీరు చూసే ఉంటారు. ఏవైనా పరిస్థితుల్లో మార్పులు ఉంటే, ఒప్పందం కూడా అందుకు తగ్గట్లే మారుతుందని అందులో ఉంది. ఇరు వర్గాలూ ఒప్పంద సమతౌల్యం కోసమే చూస్తాయ'ని అన్నారు. సంయుక్త ప్రకటన రెండు దేశాలకూ ప్రయోజనాన్నే అందించగలదని వివరించారు. 150 రోజుల వ్యవధికి ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 10% టారిఫ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 24న ప్రకటించి, తదుపరి ఆమొత్తాన్ని 15 శాతానికి పెంచుతున్నట్లు తెలిపారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత వస్తువులపై సుంకాన్ని 50% నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అంతక్రితం ప్రకటించింది. డెయిరీ, సోయామీల్, పౌల్ట్రీ, జీఎమ్ ఆహారం, బియ్యం, గోధుమలు, మొక్కజొన్న వంటి అంశాల్లో మన రైతులకు పూర్తి రక్షణ ఉందని గోయల్ పేర్కొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
రూ.10,000 కోట్ల సమీకరణ 4న

మార్చి 4న గ్రీన్ ఇన్‌ఫ్రా బాండ్ల జారీ ద్వారా రూ.10,000 కోట్ల వరకు సమీకరించనున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. ప్రాథమిక ఇష్యూ పరిమాణం రూ.5000 కోట్లు కాగా, గ్రీన్ షూ ఆప్షన్ కింద మరో రూ.5000 కోట్లను ఉంచారు. 4న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఈ బాండ్ల కోసం ఎన్ఎస్ఈలోని ఎలక్ట్రానిక్ బుక్ ప్రొవైడర్ ప్లాట్‌ఫామ్‌పై దరఖాస్తు చేయాలి. కనీసం రూ.లక్షతో దరఖాస్తు చేయాలి. ఏడేళ్ల కాలవ్యవధి కలిగిన ఈ బాండ్లు 2033 మార్చి 5న మెచ్యూర్ అవుతాయి.

ఏఐ ముప్పు లేని ఉద్యోగాలున్నాయ్

● డబ్బు కంటే అభిరుచే ముఖ్యం ● జోహో సీఈఓ శ్రీధర్ వెంబు



కృత్రిమ మేధ (ఏఐ) వల్ల, పలు రంగాల్లో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే ఏఐ ముప్పు దరిచేరని ఉద్యోగాలూ చాలానే ఉన్న విషయాన్ని గుర్తించాలని జోహో వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీధర్ వెంబు తెలిపారు. డబ్బు కంటే అభిరుచి ప్రాధాన్యంగా అవి ఉండటం వల్ల, ఏఐ ముప్పు వాటిని తాకలేదని 'ఎక్స్' పోస్ట్‌లో ఆయన తెలిపారు.

✦ పిల్లలు-వృద్ధుల సంరక్షణ, బోధన, నచ్చిన విభాగంలో వ్యవసాయం, అడవుల సంరక్షణ, దేవాలయాల ఆచారాలు, శాస్త్రీయ సంగీతం లాంటి వాటిని ఏఐ తాకలేదని ఆయన చెప్పారు. మానవత్వం అనే అంశమే ఈ పనుల ఉద్దేశాలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని వెల్లడించారు.

భిన్నాభిప్రాయాలు: వెంబు చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నచ్చిన - అభిరుచి ఉన్న పనిలో నిలదొక్కుకోవడంతో పాటు బతికేందుకు నిధులూ అవసరమని ఒకరు బదులిచ్చారు. తగినంత సంపద ఉంటేనే కళ అయినా, సంస్కృతి అయినా అభివృద్ధి చెందుతుందని వాదించారు. దీనిపై వెంబు స్పందిస్తూ డబ్బు కోణంలో నుంచి బయటికి రావాలని విమర్శకులను కోరారు. 'ఏఐ, దాని సంబంధిత సాంకేతికతలతో వస్తువులు, సేవల ఉత్పాదకత పెరుగుతుంది. అయితే తగినంత ఉద్యోగాలు, ఆదాయాలు సృష్టించకపోతే.. ఆ వస్తువులు, సేవలను ప్రజలు వినియోగించుకోగలరా? అన్నదే అసలైన సవాలు' అని ఆయన వివరించారు.

✦ పూర్వకాలంలో దేవాలయాలపై శిల్పాలు చెక్కే కళాకారులకు, వాళ్ల జీవనం గడిపేందుకు అవసరమైన ధాన్యం, వస్తువులను మాత్రమే ఇచ్చేవాళ్లని.. ఇప్పుడులా వేతనాలు ఇచ్చేవాళ్లు కాదని గుర్తు చేశారు. తగిన ఉపాధి లేకుండా, సాంకేతికత ద్వారా ఉత్పాదకతను పెంచితే.. ఆ మిగులు ఉత్పాదకతను సమాజానికి పంచేందుకు రాజకీయ, ఆర్థిక పరిష్కారాలు అవసరం అవుతాయని వెంబు అన్నారు. నగరాల పునర్నిర్మాణం దగ్గర నుంచి, జీవన నాణ్యత మెరుగుపర్చడం వరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వీలు కల్పించడం ద్వారా కొత్త రకాల ఉద్యోగాలను ఏఐ సృష్టిస్తుందని వెంబు పోస్ట్‌పై మరొకరు వ్యాఖ్య చేశారు.

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ ▼ 961 **81287** | నిఫ్టీ ▼ 318 **25179**

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.7,536 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.12,293 కోట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు పోటెత్తాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా స్టాక్‌మార్కెట్లను ఏఐ, ద్రవ్యోల్బణ భయాలు నష్టపరచిన నేపథ్యంలో, అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా మారడం ఇందుకు నేపథ్యం. విదేశీ మదుపర్ల అమ్మకాలూ తోడయ్యాయి. ఫలితంగా మన సూచీలు అధికంగా నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గి 91.08 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.26% లాభంతో 71.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.4.98 లక్షల కోట్లు తగ్గి రూ.463.50 లక్షల కోట్ల (5.10 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 28 పాయింట్ల (క్రితం ముగింపు 82,248.61) నష్టంతో 82,220.48 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజంతా నష్టాల్లోనే ట్రేడైన సూచీ, ఒకదశలో 81,159.15 పాయింట్లకు చేరింది. చివరకు 961.42 పాయింట్ల నష్టంతో 81,287.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,141.30- 25,476.40 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 25 కుదేలయ్యాయి. సన్‌ఫార్మా 2.61%, భారతీ ఎయిర్‌టెల్ 2.53%, ఎం అండ్ ఎం 2.42%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.38%, ఇండిగో 2.32%, మారుతీ 2.26%, కోటక్ బ్యాంక్ 2.18%, అల్ట్రాటెక్ 1.96%, అదానీ పోర్ట్స్ 1.92%, హెచ్‌యూఎల్ 1.90%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.85%, బజాజ్ ఫైనాన్స్ 1.60% నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ 1.22% వరకు లాభపడ్డాయి.

✦ **గాడియం ఐవీఎఫ్ షేరుకు లాభాలు:** గాడియం ఐవీఎఫ్ అండ్ ఉమెన్ హెల్త్ షేరు ఇష్యూ ధర రూ.79తో పోలిస్తే, బీఎస్ఈలో 5% లాభంతో రూ.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.87.15 వద్ద గరిష్ఠాన్ని తాకి, 1.87% లాభంతో రూ.80.48 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.585.79 కోట్లుగా నమోదైంది.

✦ విశాల్ మెగా మార్ట్‌లో 13.96% వాటాను రూ.7,635 కోట్లకు ప్రమోటరు అయిన సమయాత్ సర్వీసెస్ విక్రయించింది. ఈ లావాదేవీ అనంతరం విశాల్ మెగా మార్ట్‌లో సమయాత్ సర్వీసెస్ వాటా 54.09% శాతం నుంచి 40.13 శాతానికి తగ్గింది.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు ఫిబ్రవరి 20తో ముగిసిన వారానికి 2.119 బి.డాలర్లు (దాదాపు రూ.19,000 కోట్లు) తగ్గి 723.608 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.65.10 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 8.663 బి.డాలర్లు అధికమై జీవనకాల గరిష్ఠమైన 725.727 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.039 బి.డాలర్లు తగ్గి 572.564 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 977 మి.డాలర్లు క్షీణించి 127.489 బి.డాలర్లుగా ఉన్నాయి.

(c) eenadu

కోర్టు తీర్పు.. భాజపాకు ఎదురుదెబ్బ: విపక్షాలు

దిల్లీ: మద్యం కుంభకోణంపై కోర్టు తీర్పు.. భాజపాకు ఎదురుదెబ్బ అని విపక్షాలు పేర్కొన్నాయి. విచారణ సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేసుకుంటుందన్న విషయం ఈ తీర్పుతో నిరూపితమైందని అన్నాయి. కాంగ్రెస్ భిన్నంగా స్పందించింది. ఆతిశీ భాజపా దుష్ప్రచారాన్ని హరించిందని పేర్కొంది. భాజపా స్పందిస్తూ.. ఈ అంశంలో ఇప్పటికే దిల్లీ ప్రజలు ఆతిశీ వ్యతిరేకంగా రాజకీయ తీర్పు ఇచ్చేశారని తెలిపింది.

భాజపాకు నైతిక సమాధి

"నిజం, న్యాయం కేజ్రీవాల్‌కు అండగా నిలిచింది. ఈ రోజు దేశంలో నిజాయతీపరులైన ప్రతి వ్యక్తి హాయిగా ఊపిరి పీల్చుకుంటారు. భాజపాకు ఇది నైతిక సమాధి కింద లెక్క." – అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత

ఆప్ భాజపాకు అనుకూల మిత్రుడు

"గుజరాత్‌కు, పంజాబ్‌కు ఎన్నికలొస్తున్నాయి. అందుకే భాజపా 'అనుకూలురైన రహస్య మిత్రుల'పై కేసులు అంతర్ధానమవుతాయి. కాంగ్రెస్‌ను ఓడించడానికి ఆ పార్టీ ఎంతటికైనా దిగజారుతుంది. భాజపా కామ రూపి నాది. ఏ రూపంలోకి అయినా మారగలదు" – పవన్ ఖేడా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

మేం నిజాయతీపరులమని నిరూపితమైంది

"మమ్మల్ని అవినీతిపరులుగా చిత్రీకరించేందుకు భాజపా, దాని విచారణ సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా నిజాయతీపరులని ఈ రోజు నిరూపితమైంది" – మనీశ్ సిసోదియా, ఆప్ నేత

రాజకీయ తీర్పు ప్రజలిచ్చేశారు

"కేజ్రీవాల్‌కు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చినా.. దిల్లీ ప్రజలు మాత్రం ఆయనపై తమ రాజకీయ తీర్పును ఇప్పటికే ఇచ్చేశారు. ఈ కేసులో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై విచారణ సంస్థలు నిర్ణయం తీసుకుంటాయి. తీర్పును అధ్యయనం చేశాక దానిపై నిర్మాణాత్మక రీతిలో స్పందిస్తాం" – సుధాంశు త్రివేది, భాజపా అధికార ప్రతినిధి

దిల్లీలో మళ్లీ ఎన్నికలు జరపాలి

"విపక్ష నేతలపై అబద్ధపు దావాలు వేస్తున్నారు. ఈ కేసు కారణంగా కేజ్రీవాల్ చాలా ఇబ్బంది పడ్డారు. దిల్లీలో మళ్లీ ఎన్నికలు జరపాలని మేం డిమాండ్ చేస్తున్నాం" – తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత

దేశం కోసం కేజ్రీవాల్ పనిచేయాలి

"న్యాయవ్యవస్థ అత్యున్నతమైంది. కోర్టు తీర్పును అందరూ అంగీకరించాలి. సొంతం లేదా పార్టీ గురించి ఆలోచించకుండా.. కేజ్రీవాల్ ఇక సమాజం, దేశం కోసం పనిచేయాలి" – అన్నా హజారే



అమెరికా వర్సిటీల్లో తగ్గిన భారతీయ విద్యార్థుల చేరికలు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా యూనివర్సిటీల్లో భారతీయ విద్యార్థుల నమోదు ఇటీవల తగ్గుతూ వస్తోందని తాజా నివేదిక పేర్కొంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2025 ఆగస్టులో ఈ సంఖ్య 45శాతం తగ్గినట్లు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ (జీమ్యాక్-2025) శ్వేతపత్రంలో తెలిపింది. అంతర్జాతీయ విద్యార్థుల దరఖాస్తులు ఐరోపా, ఆసియా దేశాల్లో పెరుగుతుండగా.. అమెరికా, కెనడా, యూకేల్లో తగ్గినట్లు ఈ నివేదిక పేర్కొంది. భారతీయ విద్యార్థుల నమోదు తగ్గడానికి వీసా నిబంధనలు కఠినతరం చేయడం ప్రధాన కారణమని తాజా నివేదిక వెల్లడించింది. ట్రంప్ ప్రభుత్వ తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి వంటి అంశాలు ఇందుకు కారణాలని పేర్కొంది. ఆర్థిక స్తోమత కూడా ఓ ప్రతికూల అంశమని, రుణాలు ఆర్థికంగా భారం కావడం వంటివి ప్రభావం చూపిస్తున్నట్లు తెలిపింది. గతేడాది మేలో వీసా ఇంటర్వ్యూలు తాత్కాలికంగా నిలిపివేయడం, సోషల్ మీడియా వెట్టింగ్‌పై కొత్త మార్గదర్శకాలు కూడా విద్యార్థుల నమోదుపై ప్రభావం చూపినట్లు నివేదిక వెల్లడించింది. అక్టోబరు నాటికి కూడా వీసా ఆలస్యం కారణంగా కొందరు విద్యార్థులు క్యాంపస్‌లో చేరలేకపోయారని అభిప్రాయపడింది.

మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లతో మహిళలకు వల..

- లైంగిక దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ఠాణె: ఇస్రో సైంటిస్టు, ప్రభుత్వ అధికారినని చెప్పుకొంటూ.. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా మహిళలను ఆకర్షించి వారిపై లైంగిక దోపిడీకి పాల్పడిన మోసగాణ్ని నవీ ముంబయి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంజినీర్లు, డాక్టర్ల వంటి ఉన్నత విద్యావంతులైన యువతులను వివాహం చేసుకుంటానని నమ్మించి అతడు ఆ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. అలీబాగ్ నివాసి అయిన ఆదర్శ్ ప్రశాంత్ మాత్రే(34) మూడు పెళ్లి పోర్టళ్లు షాదీ డాట్ కామ్, భారత్ మ్యాట్రిమోనీ, జీవన్ సాథీ వెబ్‌సైట్ల ద్వారా ఈ మోసాలు చేస్తున్నాడన్నారు. అతను మహిళల నుంచి దాదాపు రూ.89 లక్షలు కాజేసినట్లు సమాచారం. ఇతనిపై ఇంతకు ముందు కూడా పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

జేఎన్‌యూ ఘర్షణ కేసులో 14 మంది అరెస్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో విద్యార్థులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి 14 మంది అరెస్టయ్యారు. వీరిలో జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు అదితి మిశ్ర, ఉపాధ్యక్షుడు గోపికా బాబు, మాజీ అధ్యక్షుడు నీతీశ్ కుమార్, సంయుక్త కార్యదర్శి దానిశ్ అలీ తదితరులు ఉన్నారని పోలీసులు శుక్రవారం తెలిపారు. ఘర్షణ సమయంలో మొత్తం 51 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకోగా, వారిలో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. యూజీసీ నిబంధనల అమలుకు సంబంధించి ఓ పాడ్‌కాస్ట్‌లో విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిత్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గత కొన్ని రోజులుగా విద్యార్థులు నిరసన చేస్తున్న విషయం తెలిసిందే.

కాంగ్రెస్ ఎన్ని చొక్కాలు చించుకున్నా..

మేం దేశ ప్రగతికి కృషిచేస్తూనే ఉంటాం

- 'న్యూస్18 రైజింగ్ భారత్ సమిట్'లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



దిల్లీ: ఇటీవల దిల్లీ వేదికగా జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ వద్ద యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో- కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. ఆ చర్య ద్వారా హస్తం పార్టీ మేధోపరమైన దివాలాకోరుతనాన్ని బయటపెట్టుకుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్ని చొక్కాలు చించుకున్నా.. దేశ ప్రగతి కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుందని ఉద్ఘాటించారు. దిల్లీలో 'న్యూస్18 రైజింగ్ భారత్ సమిట్'ను ఉద్దేశించి మోదీ శుక్రవారం ప్రసంగించారు. కాంగ్రెస్‌కు మిలీనియల్స్ ఇప్పటికే గుణపాఠం నేర్పారని, ప్రస్తుతం జెన్-జడ్ కూడా అందుకు సిద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు. ఏఐ సమిట్ వద్ద నిర్భయంగా నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ 'బబ్బర్ షేర్'ల పట్ల తనకు గర్వంగా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యపై ప్రధాని స్పందించారు. "కొత్త పార్లమెంటు భవనంపై ఉన్న బబ్బర్ షేర్ల (సింహాల) విగ్రహాలను విపక్ష పార్టీ ఇష్టపడటం లేదు. కానీ వాళ్ల బబ్బర్ షేర్లు ప్రజలు విసిరే చెప్పుల నుంచి తప్పించుకునేందుకు పరుగు తీస్తున్నారు" అంటూ చురకలంటించారు. ఏఐ సమిట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలను కొంతమంది వెక్కిరించడాన్ని ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. హస్తం పార్టీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ మహాత్మాగాంధీ పేరును వాడుకుంటుంటుందని ఆయన ఆరోపించారు. ఏదైనా మంచి జరిగినప్పుడు మాత్రం ఒకే కుటుంబానికి ఆ ఘనతను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు.

సంస్కరణల ఎజెండాను సిద్ధం చేయండి

సంస్కరణలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రిత్వశాఖలకు ప్రధాని నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రానున్న రోజుల్లో తమ శాఖల్లో తీసుకురానున్న సంస్కరణలపై సవివర నివేదికలు ఇవ్వాలని మంత్రి మండలి సహచరులను ఆయన కోరినట్లు సమాచారం. విధానాల సరళీకరణ, సులభతర వ్యాపారాన్ని మెరుగుపరచడం, సాంకేతిక ఆధారిత పాలనను విస్తరించడం.. తదితర అంశాలు ప్రాతిపదికగా ఈ సంస్కరణలు ఉండాలని మోదీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నివేదికలను మంత్రులే స్వయంగా రూపొందించాలని, మంత్రిమండలి సమావేశాల్లో వారే వివరించాలని మోదీ కోరినట్లు కూడా అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం ఓ నిర్దిష్ట నమూనా పత్రాన్ని క్యాబినెట్ సెక్రటరీ ఇప్పటికే మంత్రులకు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో తమ శాఖల్లో చేపట్టనున్న సంస్కరణల గురించి ఈ పత్రంలో మంత్రులు రాయాలి. అవి ఎప్పటి నుంచి అమల్లోకి రానున్నాయో, వాటి నుంచి ఎలాంటి ఫలితాలను ఆశిస్తున్నారో కూడా వివరించాలి. శుక్రవారం ప్రధాని బడ్జెట్ వెబినార్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిస్తే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని అన్నారు. సంస్కరణల భాగస్వామ్య చార్టర్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యం సాధించడానికి ఈ పత్రం చాలా కీలకమని మోదీ చెప్పారు.

విదేశీ శక్తులతో ఇందిర రాజీపడ్డారు

- భాజపా ఆరోపణ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ఒత్తిడి కారణంగా రాజీపడి ఆ దేశంతో వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో భాజపా ప్రతి విమర్శలకు దిగింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విదేశీ శక్తుల ఒత్తిడితో పలు విషయాలపై రాజీ పడిపోయారని పలు పుస్తకాలు తెలియజేస్తున్నాయని ఆ పార్టీ శుక్రవారం వెల్లడించింది. గతంలో జరిగిన ఇలాంటి మరికొన్ని ఘటనలను తాము ప్రజల దృష్టికి తెస్తే కాంగ్రెస్, రాహుల్‌గాంధీల పరువు పోతుందని పేర్కొంది. ఇందిర అధికారంలో ఉండగా కాంగ్రెస్ అమెరికా గూఢచార సంస్థ సీఐఏ నుంచి, సోవియట్ యూనియన్‌కు చెందిన కేజీబీ నుంచి నిధులు స్వీకరించిందని భాజపా అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కాంగ్రెస్, రాహుల్‌గాంధీ పదేపదే మోదీ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించడాన్ని త్రివేది ఖండించారు. ఇది పద్ధతి ప్రకారం సాగుతున్న ప్రాయోజిత ప్రచారమని అన్నారు. "మాజీ ప్రధాని ఇందిరా గాంధీని కాంగ్రెస్ ఇప్పటివరకూ వచ్చిన నేతలందరిలోకీ అత్యంత శక్తిమంతురాలైన నాయకురాలిగా పరిగణిస్తుంది. ఆమె అంతర్జాతీయ ఒత్తిడికి లొంగిపోయిన, రాజీపడిపోయిన సందర్భాన్ని గురించిన కథను సంక్షిప్తంగా చెప్పదలిచాం" అని సుధాంశు త్రివేది అన్నారు. ఇందిరాగాంధీ అప్పటి సోవియట్ గూఢచర్య సంస్థ కేజీబీ ఒత్తిడికి తలొగ్గి రష్యన్ రూబుల్ మారకపు విలువను రూ.8.33 నుంచి రూ.10కి పెంచారని, దీని కారణంగా సోవియట్ నుంచి భారత్ దిగుమతి చేసుకున్న వస్తువులకు మరింత మూల్యం చెల్లించాల్సి వచ్చిందని, ఇది భారత ప్రజలకు నష్టం కలిగించిందని తెలిపారు. పాకిస్థాన్ అణు పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఆ దేశం స్థాపించుకున్న కహూతా రియాక్టర్‌ను ధ్వంసం చేసే ప్రతిపాదన వచ్చినా, ఈ చర్యకు సహాయం అందిస్తానని ఇజ్రాయెల్ ముందుకు వచ్చినా ఇందిర అందుకు అంగీకరించలేదని కొన్ని పుస్తకాలను ఉటంకిస్తూ భాజపా అధికార ప్రతినిధి పేర్కొన్నారు.



బాబుల్ సుప్రియో, రాజీవ్‌కుమార్, మేనకా గురుస్వామి, కోయల్ మల్లిక్

రాజ్యసభ స్థానాలకు టీఎంసీ అభ్యర్థులు వీరే

కోల్‌కతా: రాజ్యసభ ఎన్నికల్లో నాలుగు స్థానాలకు తమ అభ్యర్థులను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ప్రకటించింది. రాష్ట్ర మంత్రి బాబుల్ సుప్రియో, బెంగాల్ మాజీ డీజీపీ రాజీవ్‌కుమార్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, నటి కోయల్ మల్లిక్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు టీఎంసీ 'ఎక్స్' ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో అయిదు స్థానాలు ఖాళీ అవుతుండగా.. నాలుగు టీఎంసీ, మరొకటి భాజపా ఖాతాలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

మానసిక ఆరోగ్యంలో భారత యువత వెనుకబాటు

- 84 దేశాల్లో 60వ స్థానానికే పరిమితం

దిల్లీ: మానసిక ఆరోగ్య విషయంలో మన దేశ యువత వెనుకబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 18-34 ఏళ్ల మధ్య వయసున్న, 55 ఏళ్లు పైబడిన వారిలో మానసిక ఆరోగ్యంపై అమెరికాకు చెందిన 'సేపియన్ ల్యాబ్స్' ఆన్‌లైన్ వేదికగా అధ్యయనం చేసింది. 2024, 2025 సంవత్సరాల్లో కలిపి సుమారు 10 లక్షల మందిని ఈ అధ్యయనంలో భాగస్వామ్యం చేసింది. మొత్తం 84 దేశాల్లో 33 సగటు స్కోర్ (ఎంహెచ్‌క్యూ)తో భారత యువత 60వ స్థానానికే పరిమితమైంది. అలాగే భారత్‌లోని 55 ఏళ్లు పైబడిన వారి మానసిక ఆరోగ్యంతో పోల్చినా ఇక్కడి యువత వెనుకబడ్డారు. భారత్‌లో 55 ఏళ్లు పైబడిన వారు దాదాపు సగటున 100 స్కోర్‌తో 49వ స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో కూడా 18-34 ఏళ్ల మధ్య వయసున్న వారు వృద్ధులతో పోలిస్తే మానసిక ఆరోగ్యం విషయంలో వెనుకబడ్డారని ఈ అధ్యయనం వెల్లడించింది. సబ్-సహారన్ ఆఫ్రికా దేశాలైన ఘనా, నైజీరియా, జింబాబ్వే, కెన్యా, టాంజానియా వంటి దేశాలు మానసిక ఆరోగ్య ర్యాంకుల్లో మెరుగ్గా ఉండగా.. జపాన్, తైవాన్, హాంగ్‌కాంగ్, బ్రిటన్, చైనా వంటి దేశాలు చివరన నిలిచినట్లు తెలిపింది. ప్రపంచ సంతోష సూచీలో తరచూ తొలి స్థానంలో నిలుస్తున్న ఫిన్లాండ్ ఈ ఎంహెచ్‌క్యూ ర్యాంకుల్లో 55 ఏళ్లు పైబడిన కేటగిరీలో 28వ స్థానంలో, 18-34 ఏళ్ల కేటగిరీలో 40వ స్థానంలో నిలవడం గమనార్హం.

చండీగఢ్‌లో పాఠశాలలకు బాంబు బెదిరింపులు

చండీగఢ్: చండీగఢ్‌లోని రెండు ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దీంతో అధికారులు అగ్నిమాపక దళం, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతోపాటు అంబులెన్స్‌ను పాఠశాలలకు తరలించి తనిఖీలు నిర్వహించారు. చండీగఢ్, అమృత్‌సర్, జలంధర్, పటియాలా, హరియాణా పాఠశాలల్లో గత కొన్ని వారాలుగా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. కొన్ని రోజుల క్రితం పంజాబ్ సివిల్ సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. కానీ ఎటువంటి అనుమానాస్పద, పేలుడు పదార్థాలు లభించలేదు.

ఏఐ 'ఉద్యోగ్ యంత్ర'తో ఆహార నాణ్యత గుర్తింపు..

పోషకాహార లోపం కట్టడి


'ఉద్యోగ్ యంత్ర' అనే భారతీయ స్టార్టప్ కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఆహార నాణ్యతను గుర్తించడంతోపాటు పోషకాహార లోపాన్ని కట్టడి చేయనుంది. ఇటీవల జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026'లో దీన్ని ప్రదర్శించారు. ఏఐ కెమెరాలు, సెన్సర్ల సాయంతో ఇది ప్లేటులోని ఆహార నాణ్యతను అంచనా వేసి, కచ్చితమైన గణాంకాలను తెరపై చూపిస్తుంది. ఈ సాంకేతికత ఆహార ప్రాసెసింగ్ ప్రక్రియను మెరుగుపరుస్తుందని స్టార్టప్ వ్యవస్థాపకుడైన అంకుర్ జైన్ తెలిపారు. భౌగోళికంగా ఆహార ఉత్పత్తిలో ద్వితీయస్థానంలో ఉన్న భారత్ ప్రపంచ ఆకలిసూచీలో ఆందోళనకర పరిస్థితిలో ఉందన్నారు. ఆహార ప్రాసెసింగ్ చాలా తక్కువ స్థాయిలో ఉన్నందున పోషకాహార లోపం కీలక సమస్యగా మారిందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు 50 - 60 శాతం ఆహార ప్రాసెసింగు చేస్తుండగా.. ఇందులో భారత వాటా 2 - 4 శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. ఈ అంతరాయాన్ని తగ్గించేందుకే ఏఐ ఆధారిత ఆహార నిర్వహణ విధానాన్ని తాము అభివృద్ధి చేసినట్లు అంకుర్ జైన్ వివరించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో 'పిల్లల పోషణ కార్యక్రమం'లో దీన్ని ప్రయోగాత్మకంగా ఉపయోగించి, పోషకాహార లోపం రేటును 25 నుంచి 9 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. తమ చొరవకు నీతి ఆయోగ్ ప్రశంసలు కూడా లభించాయన్నారు.



ఈటీవీ భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

అప్పు తీర్చాలంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి నోటీసు!

సాధారణంగా ప్రభుత్వం, బ్యాంకుల నుంచి ప్రజలు అప్పులు తీసుకుంటారు. వాటిని తీర్చాలంటూ అవి నోటీసులు జారీ చేస్తుంటాయి. కానీ విచిత్రంగా బ్రిటిష్ ప్రభుత్వానికే అప్పిచ్చిన 109 ఏళ్లకు ఆ అప్పు తీర్చాలంటూ నోటీసు ఇవ్వనున్నారు మధ్యప్రదేశ్‌లోని సెహోర్‌కు చెందిన వివేక్ రుథియా. 1917లో బ్రిటిష్ ప్రభుత్వానికి ఆయన తాత సేఠ్ జుమ్మా లాల్.. రూ.35,000 అప్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన పత్రం ప్రస్తుతం వివేక్ వద్ద ఉంది. ఆర్థిక సంక్షోభం సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం ఈ అప్పు తీసుకున్నట్లు ఆయన చెబుతున్నారు. అప్పుపై గెజిట్ నోటిఫికేషన్ పత్రం ఆయనవద్ద ఉంది. అప్పట్లో రూ.35,000 ఇప్పుడు రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకూ ఉంటుందని వివేక్ తనయుడు గౌతమ్ అంటున్నారు.





BHOPAL AGENCY.

Seth Jumma Lal subscribed Rs. 35,000/- (Rupees Thirty five thousand only) to the Indian War Loan and thereby showed his loyalty to the Government and Empire.

Sehore 1917. June 4th

Political Agent in Bhopal.

దానికి వడ్డీని కలిపితే మరింత ఎక్కువవుతుందని తెలిపారు. 1937లో జుమ్మా లాల్ మరణించారు. అయినా ఆ పత్రాన్ని ఆయన కుమారుడు మానక్ చంద్ రుథియా భద్రపరిచారు. 2013లో ఆయనా మరణించారు. ఆ తర్వాత ఆ పత్రం వివేక్ వద్దకు చేరింది.

నేను ఏ తప్పూ చేయలేదు

- ఎప్‌స్టీన్ వ్యవహారంపై క్లింటన్ వాంగ్మూలం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఎట్టకేలకు లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌పై వాంగ్మూలం ఇచ్చారు. శుక్రవారం అమెరికన్ కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుల సమక్షంలో ఆయన సాక్ష్యంచెబుతూ "నేను ఏ తప్పూ చేయలేదు. ఎప్‌స్టీన్ చేసిన నేరాల ఆనవాళ్లు నాకు కనిపించలేదు" అని అన్నారు. ఒక మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ సభ్యుల సమక్షంలో సాక్ష్యం చెప్పక తప్పని పరిస్థితులు తలెత్తడం ఇదే మొదటిసారి. న్యూయార్క్‌లోని చప్పాక్వాలో క్లింటన్- కాంగ్రెస్ సభ్యుల సమక్షంలో తన వాంగ్మూలం ఇచ్చారు. ఆయన భార్య, అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్ గురువారం కాంగ్రెస్ కమిటీ సమక్షంలో వాంగ్మూలం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎప్‌స్టీన్ యుక్త వయసుకు చేరని బాలికలపై ఏ విధంగా లైంగిక దురాగతానికి పాల్పడ్డాడో తనకు తెలియదని హిల్లరీ కాంగ్రెస్ కమిటీ ముందు పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఉదంతంపై బిల్ క్లింటన్‌ను ప్రశ్నించాలని రిపబ్లికన్ సభ్యులు చాలా కాలంగా కోరుతున్నారు. ఎప్‌స్టీన్ 2019లో జైలులో ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో వారి వాదనకు మరింత బలం చేకూరింది. ఇటీవల విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ క్లింటన్‌కు చెందిన పలు చిత్రాలు బయటపడ్డాయి. క్లింటన్ ఒక మహిళ నడుం చుట్టూ చేతులు వేసిన చిత్రం, ఆయన తన సహచరునితో కలిసి ఒక స్విమ్మింగ్ పూల్‌లో ఉండగా మరో మహిళ వారితో కలిసి ఉన్న చిత్రం ఇందులో ఉన్నాయి. క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో ఎప్‌స్టీన్ పలుమార్లు శ్వేత సౌధానికి వచ్చాడు. బిల్ క్లింటన్‌ను విచారణకు పిలవడం ఒక కొత్త ఒరవడిని సృష్టించిందని, ఇది డొనాల్డ్ ట్రంప్‌నకు కూడా వర్తించాలని డెమోక్రాట్లు కోరుతున్నారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం..

మాండెల్సన్‌పై విచారణకు ఈయూ ఆదేశం

బ్రసెల్స్: ప్రపంచవ్యాప్తంగా ఎందరో ప్రముఖులకు బాలికలను ఎరగా వేసిన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సాన్నిహిత్యం కారణంగా అపఖ్యాతి పాలైన బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్‌పై విచారణకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆదేశించింది. బ్రసెల్స్ వాణిజ్య ప్రతినిధిగా పనిచేసిన రోజుల్లో ఆయన ఎప్‌స్టీన్‌తో ఎలాంటి సంబంధాలు కలిగి ఉన్నారో విచారించాల్సిందిగా ఈయూ తన యాంటీ ఫ్రాడ్ కార్యాలయాన్ని కోరింది. "ఎప్‌స్టీన్‌కు సంబంధించి గణనీయ సంఖ్యలో పత్రాలు విడుదలైన నేపథ్యంలో ఆ విషయంపై విచారణ జరపాల్సిందిగా యూరోపియన్ కమిషన్ యాంటీ ఫ్రాడ్ కార్యాలయాన్ని ఈ నెల 18న కోరింది" అని కమిషన్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయని ఎందరు హెచ్చరించినా ఆయనకు దౌత్యపదవిని అప్పగించినందుకు బ్రిటిష్ ప్రధాని స్టార్మర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు.



హోలీ పండుగను పురస్కరించుకొని బిహార్ రాజధాని పట్నా నుంచి శుక్రవారం రైలులో ప్రమాదకరంగా సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులు

జ్యుడీషియల్ అధికారులు ఎటువంటి ప్రలోభాలకు లొంగరు

- పశ్చిమ బెంగాల్‌లో సర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను పర్యవేక్షించే జ్యుడీషియల్ అధికారులకు ఎన్నికల సంఘం(ఈసీ) జారీ చేసిన శిక్షణ మాడ్యూల్‌పై మమతా బెనర్జీ ప్రభుత్వ అభ్యంతరాలను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. జ్యుడీషియల్ అధికారులు దేనికీ ప్రభావితం కారని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం స్పష్టంచేసింది. జ్యుడీషియల్ అధికారుల విధివిధానాలను కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు కమిటీ నిర్ణయిస్తుందన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. "జ్యుడీషియల్ అధికారులే దీనిపై నిర్ణయం తీసుకుంటారు. ఈ విషయంపై అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయి. విధి విధానాలు అంటే ఈ ప్రక్రియకు కావాల్సిన మొత్తం ఏర్పాట్లని అర్థం. చిన్న చిన్న సాకులు చెప్పి సర్‌ను నిలిపివేసేందుకు యత్నించకండి. జ్యుడీషియల్ అధికారులు ఏ పత్రాలను పరిశీలించాలో సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది" అని ధర్మాసనం వెల్లడించింది. కోల్‌కతాలోని జ్యుడీషియల్ అధికారులకు ఈసీ శిక్షణ ఇస్తోందన్న వాదనపై స్పందిస్తూ.."సర్ ప్రక్రియపై ఈసీ కాకుండా మరెవరు శిక్షణ ఇస్తారు? ఈసీ లేదా రాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అతిక్రమించవు. పరిశీలించాల్సిన పత్రాలపై మేం ఇచ్చిన ఉత్తర్వులు జ్యుడీషియల్ అధికారులకు స్పష్టంగా అర్థమవుతాయి" అని ధర్మాసనం తెలిపింది.

అణు నష్టపరిహార చట్టంపై సుప్రీంలో వాదనలు

దిల్లీ: అణు విద్యుత్ కర్మాగారాలలో ప్రమాదం సంభవిస్తే చెల్లించాల్సిన నష్ట పరిహారం గురించి శాంతి చట్టం (సస్టెనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా చట్టం)లో పేర్కొన్న నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. ఇక్కడ వివాదం ఏదైనా ప్రమాదం జరిగితే సంభవించగల నష్ట అంచనాకూ, వాస్తవిక జాతీయ ప్రయోజనాలకూ మధ్యనేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై హోలీ పండుగ సెలవుల తరవాత విచారణ చేపడతామని ప్రకటించింది. ఆలోగా ఇతర దేశాల్లోని నియంత్రణ ఏర్పాట్లకూ మన దేశంలోని ఏర్పాట్లకూ మధ్య తేడాలు, పోలికల గురించి తనకు నివేదిక సమర్పించాలని పిటిషన్‌దారులను కోరింది. మాజీ ప్రభుత్వాధికారి ఈఏఎస్ శర్మ సారథ్యంలో పలువురు ప్రొఫెసర్లు, శాస్త్రజ్ఞులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున ప్రశాంత్ భూషణ్, నేహా రాఠీలు వాదిస్తున్నారు. అణు ప్రమాదాల వల్ల పౌరులకు జరిగే నష్టానికి పరిహార చెల్లింపు చట్టం-2010 రద్దయ్యి శాంతి చట్టం వచ్చింది. ఈ కొత్త చట్టం ప్రైవేటు కంపెనీలకు అణు విద్యుత్కేంద్రాలను స్థాపించడానికి వీలు కల్పిస్తున్నా, ప్రమాదం సంభవిస్తే బాధిత పౌరులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని రూ.3,000 కోట్లకు పరిమితం చేస్తోంది. ఇది ఏ మూలకూ చాలదని ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు.

సంక్షేమ పథకాల బియ్యం ఫోర్టిఫికేషన్ తాత్కాలిక నిలిపివేత

దిల్లీ: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన(పీఎంజీకేఏవై)తో పాటు అనుబంధ సంక్షేమ పథకాల కోసం సరఫరా చేసే బియ్యంలో బలవర్ధక పోషకాలను కలిపే ప్రక్రియను (ఫోర్టిఫికేషన్) కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. దీర్ఘకాలంగా నిల్వ చేయడం వల్ల బియ్యంలోని పోషకాలు క్షీణిస్తాయంటూ ఓ అధ్యయనంలో తేలిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. వివిధ వాతావరణ పరిస్థితులు, స్టోరేజీ విధానాల వల్ల ఫోర్టిఫైడ్ బియ్యం మన్నిక(షెల్ఫ్ లైఫ్)పై పడే ప్రభావాన్ని అధ్యయనం చేసే బాధ్యతను గతంలో ఐఐటీ ఖరగ్‌పుర్‌కు అప్పగించారు. దీర్ఘకాల నిల్వ, ప్రతికూల వాతావరణం వల్ల బియ్యంలో సూక్ష్మపోషకాలు క్షీణిస్తాయని, వాటి మన్నిక కూడా తగ్గిపోతుందని అధ్యయనంలో తేలడంతో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. తదుపరి మరింత పటిష్ఠమైన ప్రక్రియను చేపట్టేవరకూ తాత్కాలికంగా ఫోర్టిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు ఆహార మంత్రిత్వ శాఖ తెలిపింది.

పంచాయతీ కార్యాలయాల్లో వందేమాతరం తప్పనిసరి

- రాజస్థాన్ మంత్రి మదన్ దిలావర్ ఆదేశం

జైపుర్: రాజస్థాన్‌లోని అన్ని పంచాయతీరాజ్ కార్యాలయాల్లో ఇకపై ఉదయం వందేమాతరం పాడాలని, సాయంత్రం జనగణమన ఆలపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మదన్ దిలావర్ ఆదేశించారు. అలాగే అన్ని కార్యాలయాల్లో స్వదేశీ వస్తువులే వినియోగించాలని, ఒకవేళ విదేశాల్లో తయారైన వస్తువులు కనిపిస్తే.. ఆ ఖర్చును సంబంధిత అధికారి నుంచి వసూలు చేస్తామన్నారు. అనివార్య పరిస్థితుల్లో మాత్రమే దీనికి మినహాయింపు లభిస్తుందన్నారు.

బ్రిటన్‌లో లేబర్ పార్టీకి ఎదురుదెబ్బ

- గోర్టన్ అండ్ డెంటన్ ఉప ఎన్నికలో మూడో స్థానానికి పరిమితం

లండన్: ఇంగ్లాండ్‌లో మాంచెస్టర్ సమీపంలోని గోర్టన్ అండ్ డెంటన్ పార్లమెంటరీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రధానమంత్రి కీర స్టార్మర్ నేతృత్వంలోని అధికార లేబర్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రీన్ పార్టీ అభ్యర్థి హన్నా స్పెన్సర్ ఈ ఎన్నికలో విజయం సాధించారు. రీఫార్మ్ యూకే పార్టీ ద్వితీయ స్థానంలో నిలవగా.. లేబర్ పార్టీ మూడో స్థానానికి పరిమితమైంది. లేబర్ పార్టీకి చెందిన ఆండ్రూ గ్విన్ అనారోగ్య కారణాల రీత్యా పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరిగింది. బ్రిటిష్ పాకిస్థానీలు, ముస్లింలు ఎక్కువగా ఉండే ఈ నియోజకవర్గంలో గ్రీన్ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడిందని లేబర్ పార్టీ ఆరోపించింది.

మాదకద్రవ్య మాఫియాల అంతానికి అమెరికా పట్టు

శాన్ డియేగో: మాదక ద్రవ్య ముఠా నేత ఎల్ మెంచోను అగ్రరాజ్య ప్రోద్బలంతో మెక్సికో సైన్యం హతమార్చిన నాలుగు రోజులకే అతడి ప్రత్యర్థులపై అమెరికా విదేశాంగ శాఖ గురి ఎక్కుపెట్టింది. సినలోవా మాదక ద్రవ్య ముఠా నాయకులైన రెనె అర్జాటే గార్సియా (42), అతడి అన్న ఆల్ఫాన్సో అర్జాటే గార్సియా (52)లను పట్టుకోవడానికి తోడ్పడే సమాచారం ఇచ్చేవారికి కోటి డాలర్ల పారితోషికం ఇస్తామని అమెరికా ప్రకటించింది. సినలోవా కార్టెల్ నేతలకూ, ఎల్ మెంచోకూ మధ్య చిరకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రానికి మెక్సికో సరిహద్దు పట్టణమైన టిహువానా నుంచి మాదక ద్రవ్యాలను అక్రమ రవాణా చేసేది ప్రధానంగా సినలోవా ముఠానే. టిహువానా ప్రాంతాన్ని కైవసం చేసుకోవడానికి గార్సియా సోదరులతో ఎల్ మెంచో ఘర్షణ పడుతున్నాడు. ఎల్ మెంచో ఖతం కావడంతో ఇక గార్సియాల పని పట్టాలని అమెరికా నిశ్చయించింది.

(c) eenadu



క్రీ.శ.19వ శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో సామాజిక, మత సంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి. దీన్నే 'సాంస్కృతిక పునరుజ్జీవనం' అంటారు. వీటి కారణంగా సమాజంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తరతరాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలు, మతం పేరుతో జరుగుతోన్న అరాచకాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఇవి సాగాయి. ప్రజలను చైతన్యవంతులను చేయడమే వీటి ముఖ్య ఉద్దేశం. నాటి ఉద్యమాలను ముందుండి నడిపిన ప్రముఖ వ్యక్తులు, సంస్థలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



సామాజిక - మత సంస్కరణోద్యమాలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

మూఢనమ్మకాలను ఎదిరిస్తూ.. చైతన్య దీపికలు రగిలిస్తూ!

రాజా రామ్మోహన్‌రాయ్ - బ్రహ్మసమాజం

◆ మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలకు ఆద్యుడు, ఆధునిక భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పితామహుడిగా రాజా రామ్మోహన్‌రాయ్‌ను పేర్కొంటారు. ఈయన 1772లో బెంగాల్‌లోని రాధానగర్‌లో జన్మించారు.

◆ ఈస్ట్ ఇండియా కంపెనీలో కొంతకాలం చేశారు. మొగల్ చక్రవర్తి రెండో అక్బర్ ఈయనకు 'రాజా' అనే బిరుదును ప్రదానం చేశాడు. క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధ, జైన మత గ్రంథాలు చదివి వాటి సారాంశాలను అర్థం చేసుకున్నారు.

◆ 1811లో సోదరుడైన జగ్‌మోహన్‌రాయ్ మరణించడంతో సతీసహగమనం పేరుతో ఆయన భార్యను సజీవ దహనం చేశారు. ఈ చర్యతో ఆయన సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు.

◆ రామ్మోహన్ రాయ్ ఉపనిషత్తుల్లోని ఏకేశ్వర వాదాన్ని (దేవుడు ఒక్కడే) ప్రచారం చేయడానికి 1815లో ఆత్మీయ సభను స్థాపించారు. 1828లో బ్రహ్మసమాజాన్ని నెలకొల్పారు. ఈ సమాజ్ సర్వ ప్రపంచానికి మూలదేవుడు ఒక్కడే అని తెలిపింది.

◆ 1825లో వేదాంత కళాశాలను, 1830లో బ్రహ్మ మందిరాన్ని స్థాపించారు.

◆ సామాజిక దురాచారాలను అంతం చేయడానికి జీవితాంతం పోరాటాన్ని సాగించారు. ఈయన కృషి వల్ల 1829, డిసెంబర్ 4న విలియం బెంటింక్ సతీ సహగమనాన్ని నిషేధిస్తూ చట్టం చేశారు.

రాయ్ మరణం - బ్రహ్మసమాజంలో చీలిక

నాటి మొఘల్ చక్రవర్తి అక్బర్-2కు ప్రతినిధిగా రాయ్ 1832లో ఇంగ్లండ్ వెళ్లారు. 1833లో బ్రిస్టల్ నగరంలో మరణించారు. ఈయన మరణానంతరం బ్రహ్మసమాజ్‌లో రెండు చీలికలు సంభవించాయి.

నెలకొల్పిన పత్రికలు: తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి రాజా రామ్మోహన్‌రాయ్ అనేక పత్రికలు స్థాపించారు. వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే..

◆ 1821లో సంవాదకౌముది అనే బెంగాలీ పత్రికను ప్రారంభించారు. ఇది భారతీయ వ్యక్తి స్థాపించిన తొలిపత్రికగా గుర్తింపు పొందింది. సాంఘిక దురాచారాలు, సతీసహగమనం, విగ్రహారాధనకు వ్యతిరేకంగా ఈ పత్రిక పోరాటం చేసింది.

◆ 1822లో బంగదూత అనే వారపత్రికను ప్రచురించారు. ఇది బెంగాలీ, హిందీ, పర్షియన్, ఇంగ్లిష్ భాషల్లో వెలువడింది.

◆ 1822లో పర్షియన్ భాషలో మిరాత్-వుల్-అక్బర్ పత్రికను స్థాపించారు.

◆ ది ప్రెసెప్ట్స్ ఆఫ్ జీసస్ - 1820 (ఇంగ్లిష్), ది గైడ్ టు పీస్ అండ్ హ్యాపీనెస్ - 1820 (ఇంగ్లిష్)లను సంకలనం చేశారు. తౌఫీద్-ఉల్-మువాహిద్దీన్ (ఏకేశ్వరోపాసకులకు ఒక కానుక) అనే గ్రంథాన్ని పర్షియన్ భాషలో రాశారు. తన రచనలు, పత్రికల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు.

మొదటి చీలిక: 1886లో సంభవించింది. ఆది బ్రహ్మసమాజ్, భారతీయ బ్రహ్మసమాజ్ అనే రెండు శాఖలు ఏర్పడ్డాయి.

◆ ఆది బ్రహ్మసమాజ్‌ను దేవేంద్రనాథ్ ఠాగూర్ స్థాపించారు. ఈయన రవీంద్రనాథ్ ఠాగూర్ తండ్రి. 1839లో తత్వబోధిని సభ అనే సంస్థను స్థాపించి దాన్ని బ్రహ్మసమాజ్‌లో విలీనం చేశారు. దీంతోపాటు తత్వబోధిని పేరుతో పత్రికను, పాఠశాలను నెలకొల్పారు.

◆ భారతీయ బ్రహ్మసమాజ్ స్థాపకులు కేశవచంద్రసేన్. ఈయన 'ఇండియన్ మిర్రర్' పత్రికను ప్రచురించారు. ఇది దేశంలోనే మొదటి ఆంగ్ల దినపత్రిక. సంగత్ సభ, ఇండియన్ రిఫార్మ్ అసోసియేషన్ అనే సంస్థలను స్థాపించారు.

రెండో చీలిక: 1878లో బ్రహ్మసమాజ్ రెండోసారి చీలింది. కేశవచంద్రసేన్ తన మైనర్ కూతురికి బాల్యవివాహం చేయడంతో ఆయన అనుచరులంతా భారత బ్రహ్మసమాజ్‌ను వీడి 1878లో సాధారణ బ్రహ్మసమాజ్‌ను స్థాపించారు. శివనాథ్ శాస్త్రి, ఆనంద్ మోహన్ బోస్, ద్వారకానాథ గంగూలీ వీరిలో ముఖ్యులు.

ఆర్యసమాజ్

దీన్ని 1875, ఏప్రిల్ 10న బొంబాయిలో స్వామి దయానంద సరస్వతి స్థాపించారు.

❖ దయానంద అసలు పేరు మూల్ శంకర్. 1824లో గుజరాత్‌లోని మొర్వి ప్రాంతంలో జన్మించారు. శృంగేరి మఠానికి చెందిన పరమానంద సరస్వతి వద్ద సన్యాస దీక్ష స్వీకరించి, దయానంద సరస్వతిగా పేరు మార్చుకున్నారు.

❖ బహుదేవతారాధన, విగ్రహారాధన, సామాజిక దురాచారాలను దయానంద సరస్వతి ఖండించారు. వేదాలు మాత్రమే హిందూ మతానికి మూలం అని భావించారు.

❖ ఆర్యసమాజ్ తరఫున 10 సూత్రాలను హిందీ భాషలో ప్రచారం చేశారు.

❖ సత్యార్థ ప్రకాశిక, రుగ్వేద భాష్య భూమిక అనే గ్రంథాలు రాశారు.

❖ 1882లో గోరక్షక సభను స్థాపించారు. వేదాలకు మరలండి (Go Back To Vedas) అనే నినాదాన్ని ఇచ్చారు. భారతదేశం భారతీయులకే అని ప్రకటించారు.

❖ ఇతర మతాల్లోకి చేరిన హిందువులను తిరిగి హిందూ మతంలోకి తెచ్చేందుకు శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించారు.

రచనలు: దయానంద సరస్వతి అనేక గ్రంథాలను రచించారు. వాటిలో ముఖ్యమైనవి.

❖ సత్యార్థ ప్రకాశిక - హిందీలో రాశారు.

❖ వేదభాష్య - సంస్కృతంలో రాశారు. ఇది రుగ్వేదం, యజుర్వేదంపై భాష్యం.

❖ వేదభాష్య భూమిక: హిందీ, సంస్కృత భాషల్లో రచించారు.

ఆర్యసమాజ్ చీలిక:

❖ దయానంద సరస్వతి 1883లో అజ్మీర్‌లో మరణించారు. తదనంతరం 1892లో ఆర్యసమాజ్‌లో చీలిక వచ్చి గురుకుల, కళాశాల శాఖలు ఆవిర్భవించాయి.

❖ గురుకుల ఆర్యసమాజ్‌ను స్వామి శ్రద్ధానంద స్థాపించారు. గురుకులాల ద్వారా వేద విద్యను అందించాలనేది దీని లక్ష్యం. శ్రద్ధానంద హరిద్వార్ కేంద్రంగా కాంగ్రీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు.

❖ కళాశాల ఆర్యసమాజ్ శాఖను లాలా హన్స్‌రాజ్ ప్రారంభించారు. కళాశాలల ద్వారా ఆధునిక విద్యను అందించాలనేది దీని ఉద్దేశం. హన్స్‌రాజ్ లాహోర్‌లో దయానంద ఆంగ్లో కాలేజ్ (DAV)ను స్థాపించారు.

దివ్య జ్ఞాన సమాజం

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో బ్లావెట్‌స్కీ, కల్నల్ ఆల్కాట్ 1875లో దివ్యజ్ఞాన సమాజాన్ని (థియోసోఫికల్ సొసైటీ) స్థాపించారు. థియోస్ అంటే దైవం, సోఫియా అంటే జ్ఞానం. ప్రాచీన సంస్కృతులు, నాగరికతలు, మతాలను అధ్యయనం చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

❒ ఈ సమాజ ప్రధాన కేంద్రాన్ని 1879లో బొంబాయికి, 1882లో మద్రాస్ వద్ద ఉన్న అడయార్‌కు మార్చారు.

❒ బ్లావెట్‌స్కీ 'రహస్య సిద్ధాంతం' అనే గ్రంథాన్ని రాశారు. ఆమె మరణానంతరం కల్నల్ ఆల్కాట్ ఈ సమాజానికి నాయకత్వం వహించారు.

❒ 1907లో కల్నల్ ఆల్కాట్ మరణానంతరం అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలయ్యారు. ఈ సమాజం సాంఘిక, మత సంస్కరణతోపాటు రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేసింది.

❒ ఆంధ్రదేశంలోని రాజమండ్రిలో దివ్యజ్ఞాన సమాజ శాఖను నెలకొల్పారు.

❒ అనిబిసెంట్ 1888లోనే ఇంగ్లండ్‌లో దివ్యజ్ఞాన సమాజంలో చేరారు. ఈమె మేడం బ్లావెట్‌స్కీ రచించిన 'Secret Doctrine' అనే గ్రంథాన్ని చదివి దివ్యజ్ఞాన సమాజం పట్ల ఆకర్షితులయ్యారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

935 Word of the Day

Protean

Telugu meaning: మార్పు చెందే, చంచలమైన

English Meaning: The word protean (ప్రోటియన్) is an adjective that describes something or someone that is able to change easily and frequently, or that can take many different forms.

Synonyms: Adaptable, Variable; *Antonyms:* Rigid, Fixed

Usage: 1. His protean talent allowed him to excel in acting, singing, and directing, making him a valuable asset to the entertainment industry.

2. The company survived market fluctuations because of its protean business strategies, which adapted quickly to changing economic conditions.

కరెంట్ అఫైర్స్



ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం 2026, ఫిబ్రవరి 25న ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ (కనెసెట్)లో మోదీ చరిత్రాత్మక ప్రసంగం చేశారు. భారత ప్రధాని ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. తమ అత్యున్నత పురస్కారమైన 'స్పీకర్ ఆఫ్ ది కనెసెట్ మెడల్'తో ఆయన్ను కనెసెట్ గౌరవించింది. భారత్-ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతానికి మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేసినట్లు పార్లమెంట్ తెలిపింది. ఈ మెడల్‌ను అందుకున్న తొలి నేత మోదీయే. కనెసెట్ స్పీకర్ అమిర్ ఒహానా దీన్ని ప్రదానం చేశారు.



భారత్ నుంచి 2025లో 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.7 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 2026, ఫిబ్రవరి 25న పేర్కొన్నారు. గతేడాది మనదేశం నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యింది కూడా స్మార్ట్‌ఫోన్లేనని తెలిపారు. 2025లో మన దేశంలో రూ.5.5 లక్షల కోట్ల (60 బి.డాలర్లు) విలువైన మొబైల్ ఫోన్లు ఉత్పత్తి అయ్యాయి.

బ్రిటన్‌లో పర్యాటకులు ఎలక్ట్రానిక్ వీసా (ఇ-వీసా)లను కలిగి ఉండటాన్ని అక్కడి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నిబంధనను 2026, ఫిబ్రవరి 25 నుంచి అమల్లోకి తెచ్చింది. భారతీయులకు కూడా ఇది వర్తిస్తుంది. వీసా అవసరం లేనివారు ఎలక్ట్రానిక్ ప్రయాణ ధ్రువీకరణ (ఇ.టి.ఏ.) పొందాలి.

సూర్యగోళంలో సంభవిస్తున్న పరిణామాల పరిశీలనకు ఐఐటీ - కాన్పూర్‌కు చెందిన పరిశోధకులు ప్రపంచంలో మొట్టమొదటిసారిగా డేటా ఆధారిత త్రీడీ నమూనాను రూపొందించారు. ఈ నమూనా ఖగోళ వాతావరణ అధ్యయనానికి ఎంతో కీలకం కానుంది. సూర్యుడిపై నిరంతరం సౌర తుపానుల లాంటి పరిణామాలు సంభవిస్తూనే ఉంటాయి. ఈ పరిణామాలు కొన్నిసార్లు తీవ్రంగా, మరికొన్నిసార్లు తేలికగా ఒక నిరంతర వృత్తంలా సాగుతుంటాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ సైన్స్ దినోత్సవం

ఫిబ్రవరి 28
చరిత్రలో ఈనాడు

శాస్త్రీయ విజ్ఞానం మానవుడి జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చింది. రాతి పనిముట్ల నుంచి కృత్రిమ మేధ వినియోగం వరకు సైన్స్ అనేక అద్భుతాలకు కారణమైంది. ప్రాచీన కాలం నుంచే మనదేశంలో విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి జరిగింది. ఎందరో శాస్త్రవేత్తలు తమ మార్గదర్శకత్వంతో భారత్‌లో శాస్త్రీయ పురోగతికి కృషి చేశారు. వారిలో సి.వి.రామన్ ఒకరు. ఆయన ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ భౌతికశాస్త్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టినందుకు గుర్తుగా ఏటా మన దేశంలో ఫిబ్రవరి 28న 'జాతీయ సైన్స్ దినోత్సవం'గా (National Science Day) నిర్వహిస్తారు. సైన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు సమాజ శ్రేయస్సులో దీని పాత్ర, విజయాలను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

రామన్ ఎఫెక్ట్


☛ రామన్ ఎఫెక్ట్ అనేది స్పెక్ట్రోస్కోపీలో ఒక దృగ్విషయం. అధిక స్థాయిల్లో ఉత్తేజిత అణువుల ద్వారా ఫోటాన్ల పరిక్షేపణంగా (Dispersion) దీన్ని నిర్వచిస్తారు. అంటే ఒక కాంతి పుంజం అణువుల ద్వారా విక్షేపణం చెందినప్పుడు సంభవించే కాంతి తరంగదైర్ఘ్యంలో మార్పు.

☛ కాంతి తరంగం ఒక పదార్థం (వాయువు, ద్రవం, ఘనం) మీదుగా ప్రయాణించినప్పుడు, ఆ పదార్థ పరమాణు నిర్మాణంతో సంబంధం కారణంగా దిశ, తరంగదైర్ఘ్యాన్ని మారుస్తుంది. సముద్రపు నీటి రంగు నీలంలో కనిపించడానికి ఇదే కారణం.

☛ వివిధ పదార్థాల పరమాణు నిర్మాణం ఆధారంగా కాంతి ఎలా మారుతుందో అర్థం చేసుకోవడానికి రామన్ ఎఫెక్ట్ సహాయపడుతోంది.

సీవీ రామన్

ఈయన 1888 నవంబరు 7న నాటి మద్రాసు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జన్మించారు. పూర్తి పేరు చంద్రశేఖర వెంకట రామన్.



☛ 1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా చేరారు.

☛ 1926లో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిజిక్స్‌ను స్థాపించారు. దానికి మొదటి సంపాదకుడిగా వ్యవహరించారు. 1933, ఏప్రిల్‌లో రామన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) మొదటి భారతీయ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1934లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌ను ఏర్పాటు చేశారు.

☛ 'రామన్ ఎఫెక్ట్'ను కనుక్కున్నందుకుగానూ 1930లో భౌతికశాస్త్రంలో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది.


రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణకు దారితీసిన పరిణామాలు, రామన్ భారతరత్న పొందిన సంవత్సరం, చారిత్రక నేపథ్యం, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వైవిధ్యం - పరిరక్షణ

భూగోళంపై ఉండే అన్ని జీవులు - వాటి జన్యువులు, అవి నివసించే పర్యావరణ వ్యవస్థలను కలిపి జీవవైవిధ్యం అంటారు. ఇది వివిధ ఆవరణ వ్యవస్థల్లో నివసించే జాతుల మధ్య లేదా జాతుల్లో ఉన్న వైవిధ్యాన్ని పేర్కొంటుంది. ముఖ్యంగా అతి చిన్న సూక్ష్మజీవుల నుంచి అతిపెద్ద క్షీరదాల వరకు జీవం గొప్పతనం, సంక్లిష్టత; ప్రాణులు - పర్యావరణం మధ్య పరస్పర చర్యలను సూచిస్తుంది

☛ భూమిపై ఉన్న మొత్తం వృక్ష జంతు జాతుల సంఖ్య సుమారు 8.7 మిలియన్లని అంచనా. వాటిలో 6.5 మిలియన్ల జీవులు భూమిపై, 2.2 మిలియన్ల జీవులు సముద్రాల్లో ఉన్నాయి. అయితే వీటిలో ఇప్పటివరకు అధికారికంగా గుర్తించినవి 1.2 మిలియన్లే.



జీవ వైవిధ్యం – ప్రాముఖ్యత: భూమి, దానిపై నివసించే జీవుల ఆరోగ్యానికి జీవవైవిధ్యం చాలా ముఖ్యం. ఇది ప్రాణులకు కావాల్సిన ఆహారం, పరిశుభ్రమైన నీరు, ఔషధాలు, నియంత్రిత వాతావరణం లాంటి ముఖ్యమైన పర్యావరణ వ్యవస్థ సేవలను అందిస్తుంది.

జీవ వైవిధ్యం – రకాలు, పరిరక్షణకు తీసుకున్న చర్యలు, దేశంలో ఏర్పాటు చేసిన జాతీయ ఉద్యానవనాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ - హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 40. దరఖాస్తు ఫీజు రూ.1000. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

నాన్ - ఫ్యాకల్టీ పోస్టులు

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 26. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 3, 4, 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

భువనేశ్వర్‌లోని సీఎస్ఐఆర్ - ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్ అండ్ మెటీరియల్ టెక్నాలజీ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 13. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 8 మార్చి 2026.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 28) చివరి తేదీ

☛ ఐఏఆర్ఐలో ప్రాజెక్ట్ అసోసియేట్-2 ఉద్యోగాలు. ఎంఎస్సీ/ఎంటెక్/ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ తెలంగాణ హైకోర్టులో 43 ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ ఉద్యోగాలు. 7వ తరగతి, టెన్త్‌లో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

LCM & HCF

1. If the five-digit number 462xy is divisible by 3, 9 and 11, then what is the value of (2x − 3y) ?
A) −3 B) 6 C) −9 D) 12

2. What is the least number of soldiers that can be arranged in groups of 8, 12, 18 and 24 soldiers, and can also be arranged in the form of a perfect square?
A) 576 B) 900
C) 144 D) 360


3. The sum of the digits of the least number which, when divided by 24, 36, 48 and 60, leaves the remainders 6, 18, 30 and 42, respectively, is:
A) 9 B) 12 C) 15 D) 18

4. How many numbers are there between 100 and 300 that are divisible by both 8 and 6?
A) 6 B) 7 C) 8 D) 9

5. Which is the largest number that will divide 1758 and 2418, leaving remainders 6 and 18, respectively?
A) 18 B) 24 C) 30 D) 36

6. If the seven-digit number 83x52y4 is divisible by 72, then what is the value of (3x + 2y), given that x ≠ y?
A) 13 B) 15 C) 18 D) 21

7. Let x be the greatest number by which when 512, 782 and 1052 are divided, the remainder in each case is 8. When 200 is divided by x, what will be the remainder?
A) 2 B) 8 C) 6 D) 5



8. Let x be the greatest number by which when 365, 545 and 725 are divided, the remainder in each case is 5. When 200 is divided by x, what will be the remainder?
A) 5 B) 10 C) 15 D) 20

9. Which is the largest number that will divide 1626 and 2536, leaving remainders 6 and 16, respectively?
A) 170 B) 180
C) 190 D) 200

10. Let x be the least number between 50,000 and 60,000 which on being divided by 180, 210 and 240 leaves a remainder of 30 in each case. The sum of the digits of x is:
A) 9 B) 12 C) 15 D) 18

11. Find the sum of the squares of the greatest and smallest value of k in the number 76341k, such that the number is divisible by 3.
A) 45 B) 72 C) 81 D) 90

12. The least number that should be added to 15,000 so that it is exactly divisible by 289 is:
A) 28 B) 14 C) 73 D) 27

13. The greatest four-digit number which is divisible by 16, 20 and 24 is:
A) 9600 B) 9840
C) 9920 D) 9960

14. The L.C.M. of two numbers is 180. The numbers are in the ratio 4 : 5. What is the sum of the two numbers?
A) 72 B) 90
C) 81 D) 144

15. If the sum of two numbers is 84 and their H.C.F. and L.C.M. are 6 and 180, respectively, then the sum of the reciprocals of the numbers is:
A) $\frac{1}{9}$ B) $\frac{7}{90}$
C) $\frac{2}{15}$ D) $\frac{1}{12}$

16. Three numbers which are co-prime to each other are such that the product of the first two is 391 and that of the last two is 713. What is the sum of the three numbers?
A) 39 B) 71 C) 43 D) 45

17. The least number, which when divided by 18, 24, 30 and 45 leaves in each case a remainder of 6, is:
A) 360 B) 366
C) 540 D) 546

18. The H.C.F. of two numbers is 14 and their L.C.M. is 5880. If one of the numbers is 294, then the other number is:
A) 280 B) 308
C) 420 D) 392

19. Three numbers are in the ratio 2 : 3 : 4 and their L.C.M. is 1440. What is their H.C.F.?
A) 40 B) 60
C) 80 D) 120

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

(c) eenadu

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ ఉగాండా అధ్యక్షుడిగా ఇటీవలి ఎన్నికల్లో 71.65 శాతం ఓట్లతో ఎవరు గెలుపొందినట్లు ఆ దేశ ఎన్నికల సంఘం ప్రకటించింది? (ప్రతిపక్ష నాయకుడు బోబివైన్ ఫలితాలను తిరస్కరించారు. ఉగాండా అధ్యక్షుడిగా ఈయన ఏడో సారి గెలుపొందారు. 1986లో ఈయన పాలన ప్రారంభమైంది.)
జ: యోవేరి ముసేవేని

◆ 2026 గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో డ్రామా విభాగంలో ఉత్తమ చిత్రంగా ఏది పురస్కారం గెలుచుకుంది?
జ: హామ్నెట్

◆ ఐక్యరాజ్య సమితి హై సీస్ ట్రీటీ ఏ రోజు నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది?
జ: 2026, జనవరి 17 (హై సీస్ ఒప్పందాన్ని జాతీయ అధికార పరిధికి మించిన ప్రాంతాల్లో సముద్ర జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి ఐరాస రూపొందించింది. ఈ ఒప్పందం అంతర్జాతీయ జలాల్లో సముద్ర రక్షిత ప్రాంతాలను ఏర్పాటు చేయడానికి చట్టపరమైన చట్టాన్ని సృష్టిస్తుంది.)

◆ భారతదేశ మొదటి స్లీపర్ వందే భారత్ రైలును ఏ రెండు నగరాలను కలుపుతూ ఏర్పాటు చేశారు? జ: హౌరా(హావ్‌డా)-కామాఖ్య (2026, జనవరి 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ తొలి స్లీపర్ వందే భారత్ రైలును ప్రారంభించారు. వందే భారత్ సెమీ హైస్పీడ్ రైళ్లను 2019లో దేశంలో ప్రవేశపెట్టారు. వీటిని 'మేక్ ఇన్ ఇండియా' కింద భారతదేశంలో తయారుచేస్తున్నారు.)

మరింత సమాచారం




దరఖాస్తు చేశారా?

☛ రైల్వేలో 22,195 గ్రూప్-డి పోస్టులు
చివరి తేదీ: 02.03.2026

☛ యంత్ర ఇండియా లిమిటెడ్‌లో 3,979 ఖాళీలు
చివరి తేదీ: 03.03.2026

సరైన నిర్ణయ సామర్థ్యానికి పరీక్ష!



ప్రజల జీవితాల్లో అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. వాటిని చూసే కోణంలో సామాన్యుడికి, సమర్థ అధికారికి తేడా ఉంటుంది. పరిష్కారానికి చేసే ఆలోచన సమస్యకు విరుగుడుగా ఉండాలి. చిక్కుముడిని విప్పేటప్పుడు భావోద్వేగాలు ఉండకూడదు. తార్కికతతో కూడినదై ఉండాలి. సమస్యను తొలగించాలి లేదా తీవ్రతను తగ్గించాలి. అంతేకానీ కొత్త సమస్యలకు దారి తీయకూడదు. సమస్యను విశ్లేషించడం ఒక ఎత్తయితే, దానిని పరిష్కరించే దిశగా అడుగు వేయడం మరో ఎత్తు. ఇలాంటి సమయాల్లో అభ్యర్థుల్లో తగిన నిర్ణయం తీసుకోగలిగిన శక్తిని అంచనా వేయడానికి రీజనింగ్‌లో భాగంగా పోటీ పరీక్షల్లో 'తీసుకోవాల్సిన చర్యలు' అనే అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. వాటికి సమాధానాలను సరిగా గుర్తించాలంటే నిష్పాక్షికతను, వాస్తవికతను అలవరుచుకోవాలి. దూరదృష్టితో వ్యవహరించడం నేర్చుకోవాలి.

జనరల్ స్టడీస్
రీజనింగ్

తీసుకోవాల్సిన చర్యలు

ఒక ప్రభుత్వ ఉద్యోగి పరిపాలనా దక్షతను అంచనా వేయడానికి 'తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశం చాలా బాగా ఉపయోగపడుతుంది. వివిధ రకాల ఒత్తిళ్లను చాకచక్యంగా తట్టుకుని ప్రభుత్వ ఫలాలను ప్రజలకు సమర్థంగా అందించగలిగే శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారా? లేదా? అని పరీక్షించడం ఈ అంశం ముఖ్య ఉద్దేశం.

మాదిరి ప్రశ్నలు

ప్రశ్నలో భాగంగా 'ఒక ప్రకటన', దానికి అనుగుణంగా 'రెండు తీసుకోవాల్సిన చర్యలు' ఇస్తారు. ప్రకటన నిజమని భావించి, తదనుగుణంగా ఏ రకమైన చర్యలను తీసుకుంటారో తెలపాల్సి ఉంటుంది.

1) I సరైంది 2) II సరైంది
3) I, II సరైనవి 4) I, II సరికావు

1 ప్రకటన: x అనే పట్టణంలో 8వ వార్డులోని ప్రజలు మలేరియాతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు:

I) పట్టణ మున్సిపల్ అధికారులు వెంటనే ఆరోగ్య విభాగం సహాయంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

II) వార్డులోని ప్రజలను ముందస్తు చర్యల్లో భాగంగా వెంటనే దోమ తెరలు లాంటివి ఉపయోగించమని సలహా ఇవ్వడం. జ: 3

2 ప్రకటన: కలుషితమైన నీటిని తాగడం వల్ల ఏటా చాలా మరణాలు సంభవిస్తున్నాయి.

తీసుకోవాల్సిన చర్యలు:


I) ప్రభుత్వం వెంటనే సురక్షితమైన తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలి.

II) కలుషితమైన నీటిని తాగడం వల్ల కలిగే నష్టాలకు ప్రజలకు వివరించాలి. జ: 3



3 ప్రకటన: దేశంలో ఐఐటీ/ఐఐఎం లాంటి ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుతున్న అభ్యర్థులు మెరుగైన ప్రయోజనాల కోసం అభివృద్ధి చెందిన దేశాల వైపు వెళుతున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు:



I) ఐఐటీ/ఐఐఎం లాంటి సంస్థల్లో ప్రవేశం పొందే సమయంలో చదువు పూర్తయ్యాక కనీసం పదేళ్లు మాతృదేశంలో పని చేయాలనే నిబంధనను పెట్టాలి.

II) అభివృద్ధి చెందిన దేశాల్లో పని చేయడానికి ఇష్టపడుతున్న విద్యార్థులను, వారి చదువులపై వెచ్చించిన సబ్సిడీలను తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించాలనే నిబంధనను ప్రభుత్వం కఠినతరం చేయాలి. జ: 2

4 ప్రకటన: విశ్వ విద్యాలయంలో పదవీవిరమణ పొందిన ప్రొఫెసర్‌లను, వారి సేవలను వినియోగించుకోవడానికి తిరిగి కొన్ని పరిమిత నియమాలతో క్రమబద్ధీకరించాలి.

తీసుకోవాల్సిన చర్యలు:

I) పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి, విశ్వవిద్యాలయం ప్రస్తుత ఉద్యోగుల సలహాలను స్వీకరించాలి.

II) సంస్థలో అనుభవజ్ఞుల అవసరం ఎంతైనా ఉంటుంది. కాబట్టి విశ్వవిద్యాలయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. జ: 2

5 ప్రకటన: ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇండియాలో ప్రదాన్ అండ్ కో నిర్మిస్తున్న వివిధ పోర్టులకు 285 మిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేసింది.

తీసుకోవాల్సిన చర్యలు:

I) ఇండియాలో పోర్టుల అభివృద్ధికి పొందిన రుణాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి.

II) వివిధ రుణ సంస్థల నుంచి రుణాలను పొంది అభివృద్ధి చేయడం సరైన పద్ధతి కాదు. జ: 1

6 ప్రకటన: P అనే జిల్లాలో గత మూడు సంవత్సరాల నుంచి వివిధ రకాల కీటకాల వల్ల 50 శాతానికి మించి ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటను ఉత్పత్తి చేయలేకపోతున్నారు.



తీసుకోవాల్సిన చర్యలు:

I) రైతులు వచ్చే ఖరీఫ్ సీజన్ పంటను రక్షించుకోవడానికి మరిన్ని కొత్త మార్గాలను అన్వేషించాలి.

II) రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడానికి, ఖరీఫ్ పంటలకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించాలి. జ: 3

7 ప్రకటన: ఒక కారు షోరూంలో xyz మోడల్ కారుకు అధిక ప్రజాదరణ లభించింది. దానివల్ల గంటల తరబడి బుకింగ్ కోసం ఎదురుచూడాల్సి వస్తుండటంతో, వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు.



తీసుకోవాల్సిన చర్యలు:

I) అధిక సమయం షోరూంలో గడపాల్సి వస్తుంది. కాబట్టి తదనుగుణంగా వినియోగదారులకు భోజన ఏర్పాట్లు చేయాలి.

II) xyz కారు మోడల్‌కు అధిక ప్రజాదరణ ఉంది కాబట్టి, డీలర్ మరిన్ని బుకింగ్ డెస్క్‌లను తెరచి షోరూమ్ సమయాన్ని పెంచాలి. జ: 2



8 ప్రకటన: దేశంలో నూతన విద్యా విధానాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికల్లో మరిన్ని మార్పులు, చేర్పులు అవసరం.

తీసుకోవాల్సిన చర్యలు:

I) విద్యార్థులు పరీక్షల్లో సులువుగా ఉత్తీర్ణత సాధించేందుకు ఓపెన్ బుక్ పాలసీ విధానాన్ని తీసుకోవాలి.

II) వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ విద్యార్థులు ప్రాంతేతర భాషలు నేర్చుకునేలా ప్రోత్సహించాలి. జ: 4



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

TENTH Physical science — Metals and Non-metals



Final Exams-2026
IMPORTANT Q & A

2 Marks

1. **Name one metal which is generally in liquid state.**
A: Mercury
2. **Compose a real-life case study where the property ductility of metals useful?**
A: Electrical wires, Jewellry making.
3. **What would happen if sodium and potassium were not stored in kerosene?**
A: They can burnt and create explosion.
4. **Propose a method to extract a highly reactive metal from its ore?**
A: Electrolysis
5. **Why oxides of high reactive metals cannot be reduced by carbon**
A: These metals have more affinity for Oxygen than Carbon.
6. **What is meant by galvanization?**
A: Galvanization is a method of protecting steel and Iron from rusting by coating them with a layer of Zinc.
7. **Propose any one method which can improve the properties of metals?** A: Alloying
8. **Why boiled distilled water is poured in test tube in which iron nails are dipped in corrosion activity?**
A: Boiled distilled water is used to remove any dissolved air.
9. **Why solder is used for welding electrical wires?**
A: Solder, an alloy of lead and tin, has a low melting point and is used for welding wires.
10. **Why Silver articles become black after some time when exposed to air?**
A: Silver reacts with sulphur in air to form a coating of Silver sulphide.
11. **Food cans are coated with tin and not with zinc because........** A: Zinc is more reactive than tin
12. **An element reacts with oxygen to give compound with a high melting point - This compound is also soluble in water. The element is likely to be........**
A: Calcium

More Imp Q & A



Writer: D.V. Subba Naidu

నిర్మాణం.. నిర్వహణ.. నిరంతర శక్తి!



ఎంత పెద్ద గాయమైనప్పటికీ చర్మం చక్కగా పూర్వస్థితికి చేరుకుంటుంది. శరీరం అనే అద్భుత భవనానికి ప్రొటీన్లు ఇటుకల లాంటివైతే, ఆ భవనానికి రక్షణ ఇస్తూ, శక్తిని దాచి ఉంచే గోడలు, విద్యుత్తు నిల్వలు లాంటివి లిపిడ్లు. తినే పప్పులు, మాంసంలోని ప్రొటీన్లు కండరాలను నిర్మిస్తాయి. నూనెలు, నెయ్యి రూపంలోని లిపిడ్లు అవసరమైనప్పుడు అపారశక్తిని అందిస్తాయి. కంటికి కనిపించని కణత్వచం నుంచి కదలాడే కండరాల వరకు జరిగే జీవక్రియలకు ఆ పోషకాలే సూత్రధారులు. ఈ నేపథ్యంలో తినే ఆహారంలో తప్పనిసరిగా ఉండాల్సిన పదార్థాలు, వాటి ప్రాధాన్యం గురించి పోటీపరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. వివిధ ఆహార పదార్థాల్లో ఉండే మంచి, చెడు కొవ్వుల సమాచారంతోపాటు ఆహారంలో అమైనో ఆమ్లాలు, పలు పోషకాలు లోపిస్తే వచ్చే వ్యాధుల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

లిపిడ్లు, ప్రొటీన్లు

1. లిపిడ్లకు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) ఇవి స్థూల పోషక పదార్థాలు.
బి) లిపిడ్లు ద్రవ రూపంలో నూనెలా, ఘనరూపంలో కొవ్వులా ఉంటాయి.
సి) ఇవి నిల్వ శక్తి జనకాలుగా ఉంటాయి.
డి) కార్బోహైడ్రేట్‌ల తర్వాత శరీరానికి శక్తిజనకాలుగా ఉపయోగపడతాయి.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) సి, డి 4) బి, సి, డి

2. కొవ్వులకు సంబంధించి సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) ఇవి సూక్ష్మపోషకాలకు ఉదాహరణ.
బి) శ్వాసక్రియలో ఉపయోగపడి శక్తినిస్తాయి.
సి) మన శరీరంలో తయారుకావు.
డి) మన శరీరంలో నిల్వ ఉండవు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, డి 4) ఎ, బి

3. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.



ఎ) పాలు, గుడ్డు, మాంసం లాంటి జంతు సంబంధ ఆహార పదార్థాల నుంచి కొవ్వులు లభిస్తాయి.
బి) వేరుశనగ, నువ్వులు, కొబ్బరి, పొద్దుతిరుగుడు లాంటి వాటి నుంచి నూనెలు లభిస్తాయి.
1) ఎ సరైంది, బి సరికాదు.
2) ఎ సరికాదు, బి సరైంది.
3) ఎ, బి సరైనవి 4) ఎ, బి సరికావు

4. సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను గుర్తించండి.
ఎ) వనస్పతి బి) కొబ్బరినూనె
సి) పామాలిన్ డి) సోయా
ఇ) ఆలివ్‌నూనె ఎఫ్) జంతువుల కొవ్వు
1) ఎ, డి, ఇ 2) ఎ, బి, సి, ఎఫ్
3) సి, డి, ఎఫ్ 4) ఇ, ఎఫ్

5. కింది వాటిని జతపరచండి.

ఎ) వనస్పతి	1) శరీరంలో నిల్వ ఉంటుంది
బి) ఇకోసా పెంటోయినోయిక్ ఆమ్లం	2) సంతృప్త కొవ్వు
సి) కొబ్బరినూనె	3) ఒమేగా-3 కొవ్వు ఆమ్లం
డి) ఆలివ్ నూనె	4) అసంతృప్త కొవ్వు
ఇ) అడిపోజ్ కణజాలం	5) హైడ్రోజినేటెడ్ కొవ్వు

1) ఎ-2, బి-3, సి-1, డి-4, ఇ-5
2) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
3) ఎ-1, బి-5, సి-3, డి-2, ఇ-4
4) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1

6. కింది వాటిలో అసంతృప్త కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉన్న వాటిని గుర్తించండి.
ఎ) కుసుమ నూనె బి) అవిసె నూనె సి) నెయ్యి
డి) చేప నూనె ఇ) వనస్పతి
1) ఎ, బి, డి 2) ఎ, డి, ఇ
3) బి, సి, డి 4) ఎ, ఇ


7. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ట్రైగ్లిజరైడ్స్‌ను తటస్థ కొవ్వులు అంటారు.
బి) లినోలెనిక్ ఆమ్లం ఒమేగా-3 కొవ్వు ఆమ్లానికి ఉదాహరణ.
సి) కొవ్వు, నూనె సరళ లిపిడ్లకు ఉదాహరణ.
డి) ఫాస్ఫోలిపిడ్లు సంక్లిష్ట లిపిడ్లకు ఉదాహరణ.
1) ఎ, డి 2) బి, సి, డి
3) ఎ, బి, సి, డి 4) బి, డి

8. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) చెడు కొలెస్ట్రాల్	1) ధమనులు గట్టిపడటం
బి) మంచి కొలెస్ట్రాల్	2) హైడ్రోజినేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడుతుంది
సి) చియా విత్తనాలు	3) ఒమేగా-3 కొవ్వు ఆమ్లం
డి) అథిరోస్క్లిరోసిస్	4) తక్కువ సాంద్రత ఉన్న లిపో ప్రొటీన్
ఇ) వనస్పతి	5) అధిక సాంద్రత ఉన్న లిపో ప్రొటీన్

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-4, బి-5, సి-3, డి-1, ఇ-2
3) ఎ-3, బి-2, సి-4, డి-1, ఇ-5
4) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5

9. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.



ఎ) చెడు కొలెస్ట్రాల్ ఉన్న ఆహారం అధికంగా తీసుకోవడం వల్ల గుండెపోటు కలిగే అవకాశం ఉంది.
బి) సోయా, చియా విత్తనాలు, వాల్‌నట్, అవిసె గింజల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి.
సి) క్యాప్రిక్ ఆమ్లం, బ్యుటరిక్ ఆమ్లం అనేవి సంతృప్త కొవ్వు ఆమ్లాలు.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

10. ప్రొటీన్లకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ప్రొటీన్లు శరీర నిర్మాణానికి, మరమ్మతుకు అవసరం.
బి) పాలు, గుడ్లు, మాంసం, పప్పుల ద్వారా ప్రొటీన్లు లభిస్తాయి.
సి) ప్రొటీన్ల నిర్మాణాత్మక ప్రమాణాలు... అమైనో ఆమ్లాలు.
డి) స్థూల పోషక పదార్థాలకు ఒక ఉదాహరణ ప్రొటీన్లు.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, డి 4) ఎ, బి, సి, డి

11. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) పాలి అసంతృప్త కొవ్వు ఆమ్లాలు అధికంగా తీసుకోవడం వల్ల శరీరానికి మేలు కలుగుతుంది.
బి) హైడెన్సిటీ లిపో ప్రొటీన్ అధికంగా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు రావు.
సి) రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువ కావడంతో గుండెపోటు తగ్గుతుంది.
డి) పామోలిన్, కొబ్బరినూనెల్లో మంచి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది.
1) సి, డి 2) ఎ, బి 3) ఎ, డి 4) బి, డి

12. కింది వాటిని జతపరచండి.

ఎ) కెరాటిన్	1) పట్టు
బి) గ్లూటినిన్	2) వరి
సి) మయోసిన్	3) వెంట్రుకలు
డి) ఒరైజినిన్	4) గోధుమ
ఇ) ఫైబ్రోయిన్	5) కండరాలు

1) ఎ-3, బి-4, సి-5, డి-2, ఇ-1
2) ఎ-3, బి-2, సి-1, డి-4, ఇ-5
3) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
4) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5

13. కింది వాటిలో సరైన జతలు గుర్తించండి.
ఎ) పాలు - కేసిన్ ప్రొటీన్
బి) రక్తం - హిమోగ్లోబిన్
సి) పత్తి విత్తనాలు - గాసిపిన్
డి) చర్మం - కొల్లాజెన్
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి, డి 4) ఎ, డి

14. ప్రొటీన్ల గురించి కింది వాక్యాల్లో సరికాని వాటిని గుర్తించండి.




ఎ) మొక్కల ప్రొటీన్లను 'జీవశాస్త్ర పరిపూర్ణ ప్రొటీన్లు' అంటారు.
బి) మొక్కల ప్రొటీన్లలో అన్ని ఆవశ్యక అమైనో ఆమ్లాలు ఉంటాయి.
సి) హిమోగ్లోబిన్ ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ రవాణాకు అవసరం.
డి) శరీరానికి ప్రొటీన్ల లోపం వల్ల ఎలాంటి వ్యాధి రాదు.
1) ఎ, బి, డి 2) సి, డి 3) బి, డి 4) ఎ, డి

15. కింది వాటిని జతపరచండి.

లోపించే పోషకం	వచ్చే వ్యాధి/సమస్య
ఎ) ప్రొటీన్	1) ఆస్టియోపోరోసిస్
బి) ప్రొటీన్, కెలోరీ	2) సరళ గాయిటర్
సి) ఇనుము	3) క్వాషియార్కర్
డి) అయోడిన్	4) మెరాస్మస్
ఇ) క్యాల్షియం	5) రక్తహీనత

1) ఎ-3, బి-4, సి-5, డి-2, ఇ-1
2) ఎ-2, బి-3, సి-4, డి-5, ఇ-1
3) ఎ-2, బి-1, సి-3, డి-4, ఇ-5
4) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4

16. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.



ల్యూసిన్


ఎ) ఆవశ్యక అమైనో ఆమ్లాలు మన శరీరంలో తయారుకావు.
బి) అనావశ్యక అమైనో ఆమ్లాలు మన శరీరంలో తయారవుతాయి.
సి) ఆవశ్యక అమైనో ఆమ్లాలు వ్యాధినిరోధక శక్తికి, పెరుగుదలకు అవసరం.
డి) ల్యూసిన్, లైసిన్, ఐసోల్యూసిన్, ఆవశ్యక అమైనో ఆమ్లాలకు ఉదాహరణ.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

17. కింది వాటిని జతపరచండి.

ఎ) శరీరంలో ఎక్కువగా ఉండే ప్రొటీన్	1) ఓవో గ్లోబ్యులిన్
బి) రంగు ఉన్న ప్రొటీన్, రవాణా ప్రొటీన్	2) ఎముకలో ఉంటుంది
సి) ఆస్సీన్ ప్రొటీన్	3) హిమోగ్లోబిన్
డి) రక్తంలో ఉండే ప్రొటీన్	4) హెపారిన్, ప్రోత్రాంబిన్
ఇ) గుడ్డు	5) కొల్లాజెన్

1) ఎ-4, బి-2, సి-1, డి-5, ఇ-3
2) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1
3) ఎ-5, బి-1, సి-2, డి-4, ఇ-3
4) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5

18. కింది వాటిని పరిశీలించి, సరైన వాక్యాలను గుర్తించండి.



ఎ) చిన్నపిల్లలకు అవసరమయ్యే ఆవశ్యక అమైనోఆమ్లం-హిస్టడిన్.
బి) ఆహారంలో ప్రొటీన్ల లోపం వల్ల కలిగే వ్యాధి క్వాషియార్కర్.
సి) ఆల్బుమిన్ అనే ప్రొటీన్ గుడ్డు, రక్తంలో ఉంటుంది.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి

19. కింది వాక్యాలను పరిశీలించి, సరైన వాటిని గుర్తించండి.
ఎ) సోయాలో కార్బోహైడ్రేట్‌లు, ప్రొటీన్లు, నూనెలు ఉంటాయి.
బి) రక్తం గడ్డ కట్టడానికి అవసరమయ్యే ప్రొటీన్ ప్రోత్రాంబిన్.
1) ఎ, బి సరైనవి
2) ఎ సరైంది, బి సరికాదు
3) ఎ, బి సరికావు
4) ఎ సరికాదు, బి సరైంది

20. కింది వాటిని జతపరచండి.

ఎ) హెపారిన్	1) గోధుమలో ఉండే ప్రొటీన్
బి) హార్డియిన్	2) రక్తంలో ఉండే ప్రొటీన్
సి) కెరాటిన్	3) బార్లీలో ఉండే ప్రొటీన్
డి) గ్లియడిన్	4) గోర్లు, గిట్టల్లో ఉండే ప్రొటీన్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-2, బి-3, సి-4, డి-1
3) ఎ-1, బి-3, సి-4, డి-2 4) ఎ-1, బి-2, సి-3, డి-4

21. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) కొవ్వుల నిర్మాణాత్మక ప్రమాణాలు కొవ్వు ఆమ్లాలు.
బి) ప్రొటీన్ల నిర్మాణాత్మక ప్రమాణాలు అమైనో ఆమ్లాలు.
సి) కార్బోహైడ్రేట్‌ల నిర్మాణాత్మక ప్రమాణాలు చక్కెరలు.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) ఎ, సి

సమాధానాలు

1-1, 2-2, 3-3, 4-2, 5-4, 6-1, 7-3, 8-2, 9-3, 10-4, 11-1, 12-1, 13-3, 14-1, 15-1, 16-4, 17-2, 18-4, 19-1, 20-2, 21-3.

(c) eenadu



సభా సమయం

వ్యవసాయ శాఖను తిరిగి గాడినపెట్టాం

- కేంద్ర పథకాలు అమల్లోకి తెచ్చాం
- సూక్ష్మ సేద్యం అమలు చేశాం
- వ్యవసాయ, అనుబంధ శాఖలపై చర్చల్లో కూటమి ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: బడ్జెట్లో వ్యవసాయ, అనుబంధ శాఖలకు నిధుల అభ్యర్థనపై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో పలువురు కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడారు. వైకాపా హయాంలో వ్యవసాయ శాఖ మూతపడిందని, కూటమి ప్రభుత్వం దాన్ని తిరిగి పునరుద్ధరించిందని వ్యాఖ్యానించారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్యాన్ని విస్తరించాలని, ఆక్వారంగాన్ని ఆదుకోవాలని, ఒంగోలు జాతి ఆవుల సంతతిని కాపాడుకోవాలని కోరారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు ఎవరేమన్నారంటే..

వ్యవసాయ శాఖకు పునర్వైభవం

–సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి (తెదేపా), సర్వేపల్లి

వైకాపా ప్రభుత్వ హయాంలో మూతపడిన వ్యవసాయ శాఖను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది, పలు కేంద్ర పథకాలను అమల్లోకి తెచ్చింది. సూక్ష్మ సేద్యం, యాంత్రీకరణ, సూక్ష్మపోషకాలు తదితర పథకాలను అమలు చేస్తోంది. నవరత్నాలు మినహా మరేమీ అడగొద్దని అప్పట్లో సీఎం జగన్ చెప్పారు, ఈ ప్రభుత్వం అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యమిస్తోంది. 2014-19 మధ్య సూక్ష్మ సేద్యానికి రాయలసీమలో 90% రాయితీతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇచ్చాం. ఇప్పుడు తోటలకు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరిచ్చాం. ట్యాంకర్లకు 80% రాయితీ ఇచ్చి ఆదుకున్నాం.

ధరలు పడిపోగా, కూటమి ప్రభుత్వం ఆదుకుంది

–ఏలూరి సాంబశివరావు (తెదేపా), పర్చూరు

వైకాపా ప్రభుత్వ హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3 వేల కోట్లు కేటాయించినా, ఐదేళ్లలో అందులో పదో వంతు కూడా ఖర్చు పెట్టలేదు. నాడు ఉద్యాన రైతులను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం గతేడాది ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు కేటాయించి, వాస్తవంగా రూ.600 కోట్లకు పైగా వెచ్చించింది. పంటలకు ధరలు తగ్గిన సమయంలో ప్రభుత్వమే జోక్యం చేసుకుని నల్లబర్లీ, కోకో, మామిడి, ఉల్లి, టమాటా పంటలను కొని, రైతులను ఆదుకుంది. ఉద్యానశాఖలో సిబ్బంది కొరత తీర్చాలి. స్వర్ణగ్రామ సచివాలయాల్లో ఉద్యాన సహాయకులను నియమించాలి. కేంద్ర పథకాలను మరింతగా ఉపయోగించుకోవాలి.

మన ప్రకృతిసేద్య విధానం.. దేశానికే నమూనా

–కొలికపూడి శ్రీనివాసరావు (తెదేపా), తిరువూరు

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ ప్రభుత్వం ప్రారంభించిన ప్రకృతిసేద్య విధానం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది. సాగునీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఆహారశుద్ధి, ప్రభుత్వ మద్దతు అనే అంశాలకు ప్రాధాన్యమిస్తోంది. మారుతున్న ప్రజల ఆహార అలవాట్లకు అనుగుణంగా సాగులో రైతులు అనుసరించాల్సిన మార్పులపై అవగాహన కల్పిస్తోంది. ఇజ్రాయెల్ సాంకేతికతను కుప్పంలో ప్రత్యేక ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బిందుసేద్యం ద్వారా మొక్కకు స్థిరమైన నీరు అందిస్తూ ఉత్పత్తులు పెంచేందుకు దోహదపడుతోంది.

ఆ దేశాల నుంచి బ్రూడ్ దిగుమతిని అడ్డుకోండి

–కామినేని శ్రీనివాస్ (భాజపా), కైకలూరు

వ్యాధి ప్రభావిత దేశాల నుంచి రొయ్య బ్రూడ్ దిగుమతి వల్ల రాష్ట్రంలో ఆక్వా రైతులు, దానిపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయి. భారత్ గతంలో నిషేధం విధించిన ఆగ్నేయాసియా దేశాల నుంచి బ్రూడ్ దిగుమతికి కొందరు లాబీయింగ్ చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవాలి. కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అక్కడ మఖానా ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో మఖానా బోర్డు ఏర్పాటుచేయాలి. చేపల ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలి. కేంద్ర పరిశోధన సంస్థలు రాష్ట్రంలో మరిన్ని ఏర్పాటయ్యేలా చొరవ చూపాలి.

ఒంగోలు జాతి పశువుల్ని కాపాడుకోవాలి

–యార్లగడ్డ వెంకట్రావు (తెదేపా), గన్నవరం

రాష్ట్రంలో నాణ్యమైన ఒంగోలు జాతి సంతతి తగ్గిపోతోంది. ఒంగోలు జాతితో పాటు దేశీయ ఆవుల్ని సంరక్షించేలా తితిదే ఆధ్వర్యంలోని గోసంరక్షణ ట్రస్టుకు బాధ్యతలు అప్పగించాలి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కామధేను బ్రీడింగ్ సెంటర్, ప్రకాశం జిల్లా చదలవాడ, పల్నాడు జిల్లా నకరికల్లులో కేంద్రాలున్నా, అక్కడ నాణ్యమైన ఒంగోలు జాతి సంతతి లేదు. రాష్ట్రంలో ఈ జాతి ఆవుల జనాభా 3వేల లోపే ఉంది. భవిష్యత్తులో ఈ జాతి అంతరించిపోయే ప్రమాదముంది.

ఉద్యానశాఖలో ఉద్యోగాలు నింపాలి

–జీవీ ఆంజనేయులు (తెదేపా), వినుకొండ

ఉద్యానశాఖలో సిబ్బంది నియామకాలు చేపట్టాలి. గ్రామ వ్యవసాయ సహాయకులకు ఉద్యానశాఖలో శిక్షణ ఇవ్వాలి. రైతు పొలాలకు లింకు రోడ్లు నిర్మించాలి. ట్రాక్టర్లను, పవర్‌స్ప్రేయర్లు అందించాలి. వైకాపా హయాంలో రైతును చెప్పుతో కొట్టిన ఎమ్మెల్యేపై నాడు సీఎం జగన్ ఏ చర్యా తీసుకోలేదు. 2019-24 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 2,552 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా, కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే ఏపీ రెండో స్థానానికి చేరినా పట్టించుకోలేదు. రైతులకు ధాన్యం డబ్బులు సరిగ్గా ఇవ్వలేదు. పంటల బీమా ప్రీమియం చెల్లించలేదు. పావలా వడ్డీ రాయితీ ఎగ్గొట్టారు. దెబ్బ తిన్న సేద్యాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది.

పీఏసీఎస్‌లలో అక్రమాలపై విచారించాలి

–నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (భాజపా), అనపర్తి

వైకాపా పాలనలో పీఏసీఎస్‌లలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం చేశారు. అక్రమాలకు పాల్పడ్డ ఉద్యోగులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. వాటిపై రిజిస్ట్రార్ నేరుగా చర్య తీసుకునేలా చట్టసవరణ చేయాలి. నాడు పీఏసీఎస్‌లలో రాజకీయ నియామకాలు చేపట్టడం వల్లే నిధుల దుర్వినియోగం జరిగింది. సహకార సంఘాల్లో సంఘం వారీగా సమీక్షించాలి. నాబార్డ్ నిధులతో నిర్మించిన గోదాములు వృథాగా మారాయి. వాటిని వాడకంలోకి తేవాలి. పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు ఇవ్వాలి. రాష్ట్రం యూనిట్‌గా ధాన్యం సేకరణ చేస్తే రైతుకు మంచి ధర లభిస్తుంది.

చెరకుపై టన్నుకు రూ.300 ప్రోత్సాహకమివ్వాలి

–బగ్గు రమణమూర్తి (తెదేపా), నరసన్నపేట

చెరకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా టన్నుకు రూ.300 చొప్పున ప్రోత్సాహకం ఏపీలోనూ అందివ్వాలి. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వైకాపా పాలనలో కాలువల్లో పూడిక తీయక, నీరు అందక రైతులు ఇబ్బంది పడ్డారు. కాలువలకు మరమ్మతులు చేపట్టాలి. ఈ ప్రభుత్వం ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపే డబ్బు వేయడం అభినందనీయం.

అమెరికాలో ఏఐ ఆధారిత కౌ నెస్టింగ్

–బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు

వ్యవసాయంలో ఏఐని అమలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అమెరికాలో ఏఐ ఆధారిత కౌ నెస్టింగ్ అమలు చేస్తున్నారు. ఒక్కపశువు జ్వరం వచ్చినా, పోషకాలు తగ్గినా, ఇతర జబ్బులు వచ్చినా వెంటనే గుర్తిస్తుంది. పాల దిగుబడికి దోహదపడుతుంది. రాష్ట్రంలోనూ అమలు చేయాలి. ఒకప్పుడు డ్రోన్ ద్వారా పురుగుమందు చల్లుతామంటే కొందరు హేళన చేశారు. రెండేళ్ల కిందట మా 22 ఎకరాల చెరకు తోటలో పురుగుమందు పిచికారికి మూడు గంటలే పట్టింది. రైతులకు డ్రోన్ల సరఫరాకు కేటాయింపులు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. చంద్రబాబు కుప్పంలో ప్రయోగాత్మకంగా బిందుసేద్యం చేపట్టారు. ఇప్పుడు దేశానికే దిక్సూచిగా అది తయారైంది. ఉత్తరాంధ్రలో ప్రాధాన్య పంటగా మొక్కజొన్న తయారైంది. లక్షల ఎకరాల్లో వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

రూ.120 కోట్ల కేంద్రం నిధులు మళ్లించిన వైకాపా సర్కారు

- చేనేత సంఘాలకు రూ.7 కోట్ల బకాయిలు చెల్లించాం: మంత్రి సవిత



ఈనాడు, అమరావతి: చేనేత కార్మికుల ఇబ్బందులకు వైకాపా ప్రభుత్వ నిర్వాకమే కారణమని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. ఆప్కో పేరుతో కేంద్రం నుంచి తెచ్చిన రూ.120 కోట్లు జగన్ గద్ద ఎత్తుకుపోయినట్లుందని ఆమె విమర్శించారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా రూ.7 కోట్ల మేర చేనేత సంఘాలకు బకాయిలు చెల్లించామని మంత్రి వివరించారు. రాబోయే ఉగాది పండగకు మరో విడత బకాయిలు చెల్లిస్తామని అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వి.జోగేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. త్రిఫ్ట్ ఫండ్ కింద ప్రస్తుత బడ్జెట్‌లో రూ.5 కోట్లు కేటాయించాం. 50 ఏళ్లు నిండిన 93 వేల మంది చేనేత కార్మికులకు రూ.4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నాం. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించాం. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఏప్రిల్ 1 నుంచి అందజేస్తున్నాం. స్మాల్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద పది చిన్న క్లస్టర్లు మంజూరు చేశాం. 15% రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నాం. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.23 కోట్లు అందజేశాం. టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం' అని మంత్రి సవిత వివరించారు.

తిరుపతిలో పూర్తిస్థాయి యూజీడీ వ్యవస్థ ఏర్పాటుకు యత్నం

- శాసనసభలో పురపాలకశాఖ మంత్రి నారాయణ



ఈనాడు-అమరావతి: తిరుపతిలో కేంద్ర ప్రభుత్వ సాయంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ(యూజీడీ)ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. నగరంలో 408.40 కిలో మీటర్ల మేర యూజీడీ ఏర్పాటు అవసరం ఉందని ఆయన వివరించారు. జనాభా, నగర పరంగా విస్తరిస్తున్న తిరుపతిలో యూజీడీ వ్యవస్థ ఏర్పాటుపై శాసనసభలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. '4.5 లక్షల జనాభా గల తిరుపతి నగరానికి ఇతర ప్రాంతాల నుంచి రోజూ 75 వేల నుంచి లక్ష వరకు వస్తుంటారు. 54.5 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు రోజూ వస్తున్నాయి. నగరంలో 284.3 కిలో మీటర్ల మేర యూజీడీ వ్యవస్థ ప్రస్తుతం అందుబాటులో ఉంది. మరో 125 కిలో మీటర్లలో పనులు చేయాలి. పాత నెట్‌వర్క్‌లో 60 కిలో మీటర్ల మేర మార్చాలి. పాతవి మార్చడంతోపాటు కొత్త పైపు లైన్లు వేయాలంటే రూ.152.45 కోట్లు అవసరమని ఇంజినీర్లు అంచనాలు వేశారు. పాత వాటిలో 7.5 కిలో మీటర్ల మేర పైపులైన్లు మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలవనున్నాం. మిగతా ప్రాంతాల్లో పనులకు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో యూజీడీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.24 వేల కోట్లు అవసరమవుతాయి' అని మంత్రి నారాయణ వివరించారు.

వైకాపా ప్రభుత్వంలో 913 కంపెనీలు రాష్ట్రం నుంచి తరలిపోయాయి

- ఆర్బీఐ నివేదికతో వాస్తవాలు వెలుగులోకి..
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి 913 కంపెనీలు వెళ్లిపోయాయని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆర్బీఐ ఇటీవల ఇచ్చిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొందని వెల్లడించారు. ఈ నివేదికను వక్రీకరిస్తూ 2019-24 మధ్య రాష్ట్రం బ్రహ్మాండంగా ఉందంటూ వైకాపా వారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "2019-20లో రాష్ట్రంలో 16,924 పరిశ్రమలు ఉండగా.....2023-24 నాటికి అవి 16,011కి తగ్గిపోయాయి. అదే కాలంలో గుజరాత్‌లో 4,832, కర్ణాటకలో 815, మహారాష్ట్రలో 1,266, తమిళనాడులో 5,836 పరిశ్రమలు ఏర్పడ్డాయి. దీన్ని బట్టే వైకాపా ప్రభుత్వంలో ఎంత అరాచకం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అదే సందర్భంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత 2025 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబరు వరకూ ఏపీ 25.3శాతంతో దేశంలో అగ్రస్థానంలో ఉంది. ఫోర్బ్స్ డేటా ఈ విషయాన్ని స్పష్టం చేసింది' అని టీజీ భరత్ పేర్కొన్నారు.

సోదరిగా చెబుతున్నా.. సమ్మె విరమించండి

- జీతాల పెంపుపై త్వరలో మంచి నిర్ణయం
- అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు గుమ్మిడి సంధ్యారాణి వినతి

ఈనాడు, అమరావతి : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల జీతాల పెంపు నిర్ణయం సీఎం చంద్రబాబు పరిశీలనలో ఉందని..త్వరలోనే మంచి నిర్ణయం రానుందని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె విరమించాలని కోరారు. ఇప్పటికే వారి పది డిమాండ్లలో తొమ్మిదిని నెరవేర్చినట్లు వెల్లడించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'సమ్మె విరమించాల్సిందిగా అంగన్‌వాడీ కార్యకర్తల్ని మంత్రిగా కాదు..ఓ సోదరిగా కోరుతున్నాను. జీతాలు మూడు సార్లు పెంచిన ఘనత చంద్రబాబుది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి. అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది' అని సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 76 గ్రామ పంచాయతీలను 'సుపోషిత్ గ్రామ పంచాయతీలు'గా గుర్తించినట్టు వివరించారు. ప్రతి పంచాయతీకి రూ.లక్ష ప్రోత్సాహకం అందించనున్నట్టు వివరించారు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి 11 పంచాయతీలు ఎంపికైనట్లు తెలిపారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు చర్చించాలి

–గాదె శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

'మండలి సజావుగా జరగకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి వీలుకావడం లేదు. లడ్డూ అంశం మీద చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. ప్రతిపక్షం కూడా చర్చ కావాలంటోంది. కానీ మండలి ఎందుకు సాగడం లేదో అర్థం కావడం లేదు.'

మందుల నాణ్యతపై స్పష్టమైన సమాధానంలేదు....

–వంకా రవీంద్రనాథ్, వైకాపా ఎమ్మెల్సీ

'ప్రభుత్వాసుపత్రిలో పేదలకు పంపిణీ చేస్తున్న ఔషధాల నాణ్యత, గడువు తీరిన వాటిని ఏం చేస్తున్నారు.. తదితర ప్రశ్నలకు సంబంధిత మంత్రి నుంచి వచ్చిన సమాధానం అసంపూర్తిగా ఉంది. పేదలకు ఇస్తున్న ఔషధాలు నాణ్యంగా లేవనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై దృష్టి పెట్టాలి'

హైకోర్టు, అసెంబ్లీ భవనాల్లో అంతర్గత పనులకు రూ.980.34 కోట్లు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న హైకోర్టు, అసెంబ్లీ భవనాల్లో చేపట్టనున్న అంతర్గత పనుల కోసం రూ.980.34 కోట్లకు ప్రభుత్వం శుక్రవారం వేర్వేరుగా పరిపాలన అనుమతులిచ్చింది, హైకోర్టు భవనంలో పనులకు రూ.556 కోట్లు, అసెంబ్లీ భవనంలో పనులకు రూ.424.34 కోట్లు వెచ్చించనున్నారు. వీటితో ఎలక్ట్రికల్, అగ్నిమాపక వ్యవస్థలు, లిఫ్టులు తదితర అంతర్గత పనులు చేపడతారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ మంత్రి రజిని అవినీతిపై విచారించాలి

ఈనాడు, అమరావతి: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల సేకరణలో జరిగిన దోపిడీపై విచారణ జరపాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. 'ఇక్కడ జరిగిన దోపిడీపై వైకాపా నేతలే మాజీ మంత్రి విడదల రజినిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వినుకొండలోనూ స్థలాల సేకరణలో అవినీతి జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దోపిడీపై విచారణ చేపట్టాలి' అని కోరారు. ఒక్కో టిడ్కో గృహ సముదాయం పరిధిలో 10 వేల నుంచి 20 వేల మంది నివసిస్తుంటారని, అక్కడ పాఠశాల, ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్, ఆయా మతాలకు చెందిన ఆలయాలు ఏర్పాటు చేయాలని పుల్లారావు కోరారు.

ఆ 2,500 మందికి టిడ్కో గృహాలివ్వాలి

'తిరుపతి నియోజకవర్గ పరిధిలో తెదేపా ప్రభుత్వం 2,500 మందికి కేటాయించిన టిడ్కో గృహాలను వైకాపా ప్రభుత్వం రద్దుచేసింది. కానీ వారు ప్రభుత్వానికి కట్టిన రూ.4 కోట్ల డిపాజిట్‌ను తిరిగివ్వలేదు. ఈ ప్రభుత్వం వారికి ఇళ్లు మంజూరు చేయాలి. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 3 వేల మందికి కూడా టిడ్కో గృహాల్ని నిర్మించి ఇవ్వాలి' అని స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

- ఈ చర్చ సమయంలో స్పీకర్ స్థానంలో కూర్చున్న మండలి బుద్ధప్రసాద్ జోక్యం చేసుకుంటూ.. వైకాపా హయాంలో జగనన్న కాలనీల్లో అవసరానికి మించి సిమెంట్, స్టీల్, ఇతర గృహనిర్మాణ సామగ్రి డంప్ చేశారని, అవన్నీ పాడైపోయాయని గుర్తుచేశారు. ఈ గోల్‌మాల్ వెనుకున్న అక్రమాలపై విచారణ జరపాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

పోడియంపై నిలబడటం ఛైర్‌ను అవమానించడం కాదా?

మంత్రి మనోహర్

ఈనాడు, అమరావతి: విజయనగరం జిల్లాలో గతంలో నరేగాలో జరిగిన అక్రమాలపై సభ్యుల ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరపున మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం చెప్పారు. రూ.41.71 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించామని వివరించారు. అదే సమయంలో వైకాపా సభ్యులు పోడియంపైకి ఎక్కి నినాదాలు చేయడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వాళ్లు వచ్చి మీ పక్కన నిలబడటమేంటి? మీరు ఆర్థిక మంత్రి ఛైర్‌ను అవమానించారని అన్నారు. వాళ్లు ఇప్పుడు ఛైర్‌ను గౌరవించినట్టా' అని ఛైర్మన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఛైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు: మంత్రులు

ఛైర్మన్ మోషేనురాజు సభలో వైకాపా సభ్యులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, సత్యప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలి మొదట వాయిదా పడ్డాక వారు ఛైర్మన్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను కలిశారు. మంత్రి కేశవ్ సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారంటూ మీరు చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. 'గురువారం సభ ముగిశాక కేశవ్ మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయి. అందుకే ప్రకటన చేయాల్సి వచ్చింది. అధికార, ప్రతిపక్షాలకు సర్దిచెప్పలేక మధ్యలో నేను నలిగిపోతున్నాను' అని ఛైర్మన్ వారికి వివరించినట్టు తెలిసింది.

వీర్రాజు గారూ.. మనం మనం గోదారోళ్లం!

సభ వాయిదాపడ్డ సమయంలో భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజును చూసి వైకాపా ఎమ్మెల్సీలు ఇజ్రాయెల్, భరత్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్ యాదవ్.. 'వీర్రాజు గారూ మీ మీద మేమెప్పుడు దాడి చేశాం? మీరంటే మాకు చాలా గౌరవం. వయస్సు రీత్యా మాకు తండ్రి లాంటి వారు' అని అన్నారు. వీర్రాజు వారి దగ్గరకు వెళ్లి ముచ్చటించారు. 'సార్ మనం మనం గోదారోళ్లం. పక్కపక్కనే ఉంటాం. నేను మీ మీదకు ఎందుకు వస్తాను' అంటూ ఇజ్రాయెల్ నవ్వుతూ ఆయనతో అన్నారు.

వైకాపా సభ్యులతో కలిసిపోయిన ఛైర్మన్

- మండలి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు
- ఛైర్మన్.. ప్రభుత్వాన్ని విమర్శించడం గతంలో లేదు
- కూటమి ఎమ్మెల్సీల ధ్వజం



ఈనాడు, అమరావతి: సభా సంప్రదాయాలు, గౌరవాన్ని కాపాడాల్సిన శాసనమండలి ఛైర్మనే దానికి విఘాతం కలిగిస్తున్నారని, ఆయన వైకాపా సభ్యులతో కలిసిపోయారని కూటమి పార్టీల ఎమ్మెల్సీలు ఆరోపించారు. అధికార పార్టీ సభ్యులే మండలిని అడ్డుకుంటున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు.. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ చదివినట్లుందని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించాల్సిన ఛైర్మన్.. ప్రభుత్వంపై విమర్శలు చేయడం గతంలో ఎప్పుడూ లేదని, ఆయనో కొత్త సంప్రదాయానికి తెరలేపారని దుయ్యబట్టారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీటీ నాయుడు, సోము వీర్రాజు తదితరులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలిలో ఛైర్మన్, వైకాపా సభ్యుల తీరును తప్పుబట్టారు.

అర్థాంతరంగా సభను వాయిదావేయడం సబబా?

–పంచుమర్తి అనురాధ, చీఫ్ విప్

మండలిలో స్టేట్‌మెంట్ ఇస్తానని దేవాదాయశాఖ మంత్రి నోటీస్ ఇచ్చారు. దాని గురించి ప్రస్తావించకుండానే ఛైర్మన్ సభను వాయిదా వేసి వెళ్లిపోవడం సబబేనా? అదే సమయంలో కౌన్సిల్‌లో కూర్చొని వైకాపా ఎమ్మెల్సీలు లడ్డూపై చర్చ జరగాలని కోరడం వారి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం కాదా? లడ్డూ కల్తీపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని ప్రకటించినా, కావాలనే వైకాపా సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తూ మండలిని అడ్డుకుంటున్నారు. అధికార పార్టీ సభ్యులే చర్చను అడ్డుకుంటున్నారని ఛైర్మన్ ఆరోపించడం విచారకరం.

సభ సజావుగా సాగాలని ఛైర్మన్‌కు లేదు

–ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెదేపా

సభను సజావుగా నిర్వహించాలనే ఆలోచన ఛైర్మన్‌కు లేదు. ఈ దఫా సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఒక్కరోజు కూడా సభా సంప్రదాయాల్ని కాపాడేందుకు ఆయన ప్రయత్నించలేదు. నాలుగు రోజులుగా చర్చలు జరగకుండా మండలి సమయం వృథా అవుతోంది. శాసనసభ మాదిరిగా మండలిలోనూ స్టేట్‌మెంట్ ఇవ్వాలని మంత్రి సిద్ధమైనప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారు? నెయ్యి కల్తీ ఎవరు చేశారో అందరికీ తెలుసు. అది బయటకు రాకూడదనే వారిలా చేస్తున్నారు.

చర్చకు ఎన్ని రోజులైనా సిద్ధం

–బీటీ నాయుడు, తెదేపా

లడ్డూ అంశంపై ఎన్ని రోజులైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండి రిమోట్‌తో వైకాపా ఎమ్మెల్సీలను జగన్ ఆడిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభకు రారు. ఎమ్మెల్సీలు మాత్రం మండలికి వచ్చి, చర్చను అడ్డుకుంటారు. మా సవాలును స్వీకరించి విపక్ష సభ్యులు చర్చకు రావాలి.

హెరిటేజ్‌కు, సభకు సంబంధమేంటి?

–మర్రి రాజశేఖర్, తెదేపా

గత వైకాపా ప్రభుత్వంలో తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థలు, దానికి కారణమైన వ్యక్తులపై చర్చ జరగాలి. అంతేకానీ ప్రభుత్వానికి, సభకు సంబంధం లేని హెరిటేజ్ ప్రస్తావన ఎందుకు తెస్తున్నారు? మంత్రి ప్రసంగం తర్వాత ఎంత మంది సభ్యులైనా మాట్లాడొచ్చని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా వైకాపా వాళ్లు ఎందుకు గందరగోళం చేస్తున్నారు. కృష్ణా నదిపై వైకుంఠపురం సమీపంలో ఒక ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, అక్కడి నుంచి నుంచి నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరిచ్చి ఆయకట్టును స్థిరీకరించే ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం అడ్డుకుంది. అలాంటివన్నీ బయటకొస్తాయని చర్చ జరగనివ్వడం లేదు.

ఛైర్మన్ సత్యానికి దగ్గరగా ఉండాలి

–సోము వీర్రాజు, భాజపా



ఛైర్మన్ తీరు బాధాకరం. ఆయన సత్యానికి దగ్గరగా, హుందాగా వ్యవహరించాలి. పార్టీలకు అతీతంగా ఉండాల్సిన మనిషి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదు. దేవాదాయ శాఖ మంత్రి ప్రభుత్వం తరఫున నోట్ ఇచ్చారు. సుమారు 150 కాపీలు సభలో పంపిణీ చేసినా, విపక్ష నేత తనకు రాలేదనడం విడ్డూరంగా ఉంది.

వైకాపా హయాంలో సాక్షి పత్రికకు దోచిపెట్టారు

- ఆ పార్టీ సామాజిక మాధ్యమాలకు రూ.120 కోట్లు మళ్లింపు
- అసెంబ్లీలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో సాక్షి పత్రిక నడపడానికయ్యే ఖర్చంతా ప్రజల సొమ్ము నుంచే వినియోగించారని భాజపా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ధ్వజమెత్తారు. ఆ పత్రికకు అడ్వర్టైజ్‌మెంట్ల రూపంలో రూ.348 కోట్లు ప్రజాధనాన్ని దోచిపెట్టారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతిపక్షాలపై దుష్ప్రచారాన్ని చేయడానికి రూ.120 కోట్లను డిజిటల్ కార్పొరేషన్ ద్వారా వైకాపా సామాజిక మాధ్యమాలకు మళ్లించారని దుయ్యబట్టారు. వైకాపా గొప్ప పార్టీ అని, జగన్ గొప్ప నాయకుడని ప్రచారం చేసుకోడానికి తీసిన యాత్ర-2 సినిమాకు రూ.2.12 కోట్ల ప్రభుత్వ ధనాన్ని వాడారని పేర్కొన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వైకాపా హయాంలో సర్క్యులేషన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రకటనలు ఇవ్వలేదు. సొంత పత్రిక సాక్షికి దోచిపెట్టారు. కొన్ని పత్రికలు, ఛానళ్లు, సామాజిక మాధ్యమాలు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయి. అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

జగన్ పాలన ఓ హెచ్చరిక

–మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే


గత వైకాపా ప్రభుత్వ హయాంలో సమాచార, పౌర సంబంధాల శాఖ బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్ని దోపిడీ చేశారు. మీడియాకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని పక్కన పెట్టి సొంత పత్రిక, ఛానల్‌కు రూ. కోట్లను మళ్లించారు. జగన్ పాలన ఓ హెచ్చరిక. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామీణ ప్రాంత విలేకరులకు అక్రిడిటేషన్లు ఇచ్చి బస్ పాస్ సౌకర్యాన్ని కల్పించారు.

లడ్డూ ప్రసాదంపై చర్చ జరగాల్సిందే

- వైకాపా ఎమ్మెల్సీల డిమాండ్

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడారన్న అభియోగాలపై శాసనమండలిలో కచ్చితంగా చర్చ జరగాల్సిందేనని, అప్పటి వరకూ సభలో నిలదీస్తూనే ఉంటామని వైకాపా ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం శాసనమండలి సమావేశం ప్రారంభానికి ముందు గేటు-3 వద్ద, సభ వాయిదా అనంతరం గేట్-2 వద్ద వారు ఆందోళనకు దిగారు. గేట్ల ఎదుట బైఠాయించి 'లడ్డూపై వెంటనే చర్చ జరగాలి.. ఇందాపూర్ నెయ్యి కల్తీ కల్తీ..' అంటూ నినాదాలు చేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎవరేమన్నారంటే..

- రాజకీయ స్వలాభం కోసం వైకాపాపై బురద జల్లడానికి తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని చంద్రబాబు ఆరోపించారు. హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చడానికే ఈ ఆరోపణలు చేశారు. –లేళ్ల అప్పిరెడ్డి
- శాసనమండలిలో లడ్డూపై చర్చించేందుకు ప్రభుత్వం భయపడుతోంది. చర్చకు వచ్చిన ప్రతిసారి మా గొంతు నొక్కొద్దు. –మొండితోక అరుణ్‌కుమార్
- లడ్డూపై సభలో సందేహాలన్నీ నివృత్తి చేయాలి. వేంకటేశ్వరస్వామికి క్షమాపణలు చెప్పాలి. –కుంభా రవిబాబు



అసెంబ్లీ బయట మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న వైకాపా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి. చిత్రంలో వైకాపా ఎమ్మెల్సీలు

- లడ్డూ నాణ్యతపై ల్యాబ్‌లు ఇచ్చిన నివేదికలపైనా దుష్ప్రచారం చేశారు. జంతుకొవ్వు ఉందని ఎక్కడా లేదు. –రామసుబ్బారెడ్డి
- చంద్రబాబు వేసిన నిందలు అవునా, కాదా అనేది సభ ద్వారా తెలియజేయాలనే చర్చకు డిమాండ్ చేస్తున్నాం. –కవురు శ్రీనివాస్
- తిరుమల దేశ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. అన్ని సాక్ష్యాలతో చర్చకు వస్తే ప్రభుత్వం అవకాశం ఇవ్వడం లేదు. –పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- సభలో నేలపై కూర్చొని నాలుగు గంటలపాటు అరిచినా పట్టించుకోలేదు. మా పార్టీ తరపున ఎవరినీ మాట్లాడనీయలేదు. –ఎం.వి.రామచంద్రారెడ్డి
- బడ్జెట్ చర్చను కూడా వదిలేసి లడ్డూపై చర్చ జరగాలని పోరాడుతున్నా అవకాశం ఇవ్వలేదు. –సిపాయి సుబ్రహ్మణ్యం
- హెరిటేజ్‌కు ఇందాపూర్, భోలేబాబా సంస్థలకు ఉన్న సంబంధాలు బయటపెడతామనే చర్చకు రావడం లేదు. –వరుదు కల్యాణి
- బడ్జెట్ సమావేశాల మొదటి రోజు నుంచి వాయిదా తీర్మానాలు లడ్డూ ప్రసాదంపైనే ఇచ్చాం. అయినా ప్రభుత్వం చర్చకు అవకాశం ఇవ్వలేదు. –కల్పలతారెడ్డి

ఇజ్రాయిల్ తత్తరపాటు

వైకాపా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కూటమి నేతలను విమర్శించే క్రమంలో తత్తరపాటుతో చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి ఇబ్బందిగా పరిణమించాయి. 'లడ్డూ విషయంలో ప్రజలు నిజాలేంటో తెలుసుకోవాలని ఆసక్తిగా చూస్తున్నారు. దేవుడు కళ్లు మూసుకొని లేడు. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. దేవుడు శిక్ష వేయడం ప్రారంభించాడు. కథ మొత్తం మారుస్తాడు. ఆ కథలో మీరంతా నిర్దోషులని తేలుస్తాడు' అని వ్యాఖ్యానించారు. దీంతో అక్కడున్న వైకాపా ఎమ్మెల్సీలు 'నిర్దోషులు అనకూడదు, దోషులు' అనాలని చెబుతున్నా ఆ వ్యాఖ్యలు సరిచేయకుండానే ఇజ్రాయిల్ వెళ్లిపోయారు.

(c) eenadu

కేంద్రం సహకరిస్తే రాజకీయ పార్టీగా మారుస్తాం

- సాయుధ పోరాటాన్ని విరమిస్తాం.. పీఎల్‌జీఏనూ రద్దు చేస్తాం
- లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతల వెల్లడి
- తెలంగాణ సచివాలయంలో సీఎంతో భేటీ
- అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తానన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డితో సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, ఐజీ సుమతి, నూనె నర్సింహారెడ్డి, మల్లా రాజిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, పుల్లూరి ప్రసాద్, ఓఎస్డీ దయానంద్ రెడ్డి, తిప్పిరి తిరుపతి, బడే చొక్కారావు, నిఘా విభాగాధిపతి విజయకుమార్, ఓఎస్డీ వేణుగోపాల్‌రావు

ఈనాడు, హైదరాబాద్: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఒకవైపు... ఈ ప్రజాస్వామ్యం అంతా బూటకం, సాయుధ తిరుగుబాటు ద్వారానే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఇటీవలి కాలం వరకు తుపాకులతో పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు మరోవైపు... వీరిరువురి చరిత్రాత్మక కలయికకు తెలంగాణ సచివాలయం వేదికైంది. డీజీపీ మొదలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో దాదాపు గంట పాటు వీరి మధ్య అనేక ఆసక్తికరమైన అంశాలపై శుక్రవారం చర్చ జరిగింది. లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించగా..తన పరిధిలోని అంశాలను తప్పకుండా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండి పోరాటం చేసిన మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ ఎలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నలు ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. వీరితో పాటు గతంలో లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ ఎలియాస్ చంద్రన్న, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి ఎలియాస్ సుజాతక్క శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. దేవ్‌జీ, రాజిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే సాయుధ పోరాటాన్ని విరమిస్తామన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)ని కూడా రద్దు చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజా జీవితంలోనే ఉండి, చట్టపరంగా ఉద్యమ పంథా కొనసాగిస్తామని స్పష్టం చేసిన దేవ్‌జీ తాము రాజకీయంగా పురోగమించేందుకు ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్రం సహకరించాలన్నారు. ఇలా చేస్తే మావోయిస్టు పార్టీని రాజకీయ పార్టీగా మారుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్తానని, ఆయన ఒప్పుకొంటే ఇక్కడికే పిలిపించి, సభ ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు. తమ చేతుల్లో లేనందునే హామీ ఇవ్వలేకపోతున్నానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

తక్షణం ఆరోగ్యశ్రీ అమలు

చంద్రన్న మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు ఇక్కడ 30 ఏళ్ల క్రితం ప్రకటించిన రివార్డు ఇస్తున్నారని, చాలా రాష్ట్రాల్లో రివార్డు సొమ్ము ఎక్కువగా ఉందని, ఇక్కడ కూడా ఇస్తే బాగుంటుందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. లొంగిపోయిన వారికి ఇళ్ల స్థలాలు, వ్యవసాయభూమి, ఆరోగ్యశ్రీ సదుపాయం కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ తక్షణమే అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో రివార్డు సొమ్ము గురించి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యంకాదన్నారు. ఈ విషయాల గురించి క్యాబినెట్‌లో చర్చించి వెల్లడిస్తామన్నారు. రాజకీయపరమైన అంశాల గురించైతే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాలైతే వేంనరేందర్‌రెడ్డిని కలవవచ్చని సీఎం స్పష్టం చేశారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయం తీసుకున్న మావోయిస్టు నేతలను అభినందించిన ముఖ్యమంత్రి ఎలాంటి సమస్యకైనా హింస పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. లొంగిపోయిన వారికి అవసరమైన భద్రత కల్పించే విషయంలో ఎలాంటి లోటూ రాకూడదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేశవరావు కల్పించుకొని బాహ్య ప్రపంచంలోకి వచ్చిన తర్వాత సున్నితమైన అంశాల విషయంలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని లొంగిపోయిన నేతలకు సూచించారు. తొలుత డీజీపీ శివధర్‌రెడ్డి లొంగిపోయిన మావోయిస్టులను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ముఖ్యమంత్రి పిలుపునుసరించి గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 591 మంది లొంగిపోయారని, వారంతా ఇప్పుడు సాధారణ జీవితం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం సహకారంతో చేపట్టిన పునరావాస కార్యక్రమాలు చూసి మావోయిస్టు నాయకులు తమ మనసు మార్చుకొని లొంగిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నిఘా విభాగాధిపతి విజయ్‌కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఓఎస్డీలు దయానంద్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మావోయిస్టు నేతలంతా ముఖ్యమంత్రి, డీజీపీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సుజాతక్కతో ముఖ్యమంత్రి ముచ్చట

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాలకు చెందిన సుజాతక్కతో రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కొద్దిసేపు మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో మరణించిన మల్లోజుల కోటేశ్వర్‌రావు భార్య అయిన సుజాతక్క యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు.

సెర్ప్‌లోకి బీమా కాల్ సెంటర్ సిబ్బంది

ఈనాడు, అమరావతి: చంద్రన్న బీమా పథకం అమలులో భాగంగా కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న 79 మంది సిబ్బంది మార్చి 1 నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలోకి రానున్నారు. రాష్ట్ర గ్రామ, వార్డు స్వర్ణ శాఖ ఆధ్వర్యంలో వీరంతా ఇప్పటివరకు సేవలు అందిస్తున్నారు. బీమా పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి తాజా మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. వీరందరికీ వేతనాల చెల్లింపు స్వర్ణ శాఖకు భారమవుతోంది. సెర్ప్‌కి సేవలు అవసరం కావడంతో వీరిని బదలాయిస్తూ స్వర్ణ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏకసభ్య కమిటీకి సహాయకులుగా పలువురి నియామకం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరాకు బాధ్యులపై చర్యలను సిఫార్సు చేయడానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిటీకి సహాయకులుగా పలువురు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి మునీంద్రను.. దినేష్‌కుమార్‌కు ఓఎస్డీగా నియమించింది. విశ్రాంత అసిస్టెంట్ సెక్రటరీ పీబీవీఎస్ఎస్ శివకుమార్‌ను పీఎస్‌గా, ఆర్‌టీజీఎస్ డిప్యూటీ సీఈవో డీసీ మాధురిని సహాయకురాలిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

పాలన భాషగా తెలుగు వినియోగం మరింత పెంచండి

సీఎంకు అధికార భాషా సంఘం అధ్యక్షుడు విక్రమ్ పూల వినతి

ఈనాడు, అమరావతి: పాలన భాషగా తెలుగు వినియోగాన్ని మరింత పెంచేలా తగు ఆదేశాలు ఇవ్వాలని సీఎం చంద్రబాబును మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు (విక్రమ్ పూల) కోరారు. పలు ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో తెలుగులో నామఫలకాలు లేవని, ఉత్తరప్రత్యుత్తరాలు కూడా పూర్తి స్థాయిలో తెలుగులో జరగడం లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన చంద్రబాబు .. .తెలుగు భాష, సంస్కృతుల ఔన్నత్యాన్ని కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నట్లు వివరించారు.

ఆరోగ్య సేవల బలోపేతానికి రూ.38.71 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్య సేవల బలోపేతంలో భాగంగా వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ.38.71 కోట్లు మంజూరు చేసింది. ఈ అదనపు నిధులు సాధారణ ఇమ్యునైజేషన్, క్షయ నిర్మూలన, జాతీయ ఆరోగ్య మిషన్, కేంద్ర సహాయంతో నడిచే రాష్ట్ర పథకాల అమలుకు వెచ్చించాలని పేర్కొంది.

రాష్ట్రంలోని విద్యా సంస్కరణలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు

భువనేశ్వర్ సదస్సులో ఏపీ ఉత్తమ విధానాలపై ప్రజంటేషన్



సదస్సులో ప్రసంగిస్తున్న సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: విద్యాశాఖలో ఏపీ అమలుచేస్తున్న విధానాలు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన యూడైస్ ప్లస్ జాతీయ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్రంలో అనుసరిస్తున్న వినూత్న విద్యా విధానాలు, సంస్కరణలకు ఈ సదస్సులో ప్రశంసలు దక్కాయి. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సదస్సులో ప్రసంగించారు. 'ఆధార్ ఆధారిత చైల్డ్ ట్రాకింగ్ 'ఒకే దేశం- ఒకే డేటా' విధానంలో ఏపీ అగ్రగామిగా ఉంది. జాతీయ స్థాయి యూడైస్ ప్లస్ వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధిస్తున్నాం. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను 14 విద్యాపరమైన, 18 మౌలిక సదుపాయాల సూచికల ఆధారంగా స్టార్ రేటింగ్‌తో వర్గీకరించాం. దీని ద్వారా ఉచిత విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు పారదర్శకంగా జరుగుతున్నాయి. గతంలో 46 వేర్వేరు విద్యా సంబంధిత యాప్‌ల వల్ల ఉపాధ్యాయులు పడే ఇబ్బందులు తొలగిస్తూ లీప్ అనే యాప్‌ను రూపొందించాం. పదోతరగతి హాల్‌టికెట్లు, సర్టిఫికెట్లలో దొర్లే తప్పులు నివారణకు నామినల్ రోల్స్ నేరుగా యూడైస్ ప్లస్ డేటాతో అనుసంధానం చేశాం. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, ఏకాగ్రతను పర్యవేక్షిస్తూ ఫలితాలు సాధిస్తున్నాం' అని ఎస్పీడీ పేర్కొన్నారు. ఏపీ స్టేట్ ఎంఐఎస్ సమన్వయకర్త టి.సుధాకర్ సాంకేతికత అమలుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

'మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రత్యేక సర్వీస్ నిబంధనలు తీసుకురావాలి'

ఈనాడు-అమరావతి: పుర, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో ఉద్యోగులందరికీ ఒకే ఏకీకృత సర్వీస్ నిబంధనలు కాకుండా.. భిన్న పరిస్థితులున్న నగరపాలక సంస్థల్లో ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ నిబంధనలు రూపొందించి అమలు చేయాలని ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, కమిషనర్ సంపత్‌కుమార్‌లకు శుక్రవారం వేర్వేరుగా వినతులు ఇచ్చారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటికే అమలులో ఉన్న సర్వీస్ రూల్స్ మాదిరిగా కొన్ని స్వల్ప మార్పులు చేసి అవే నిబంధనలు రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తించేలా చూడాలని కోరారు.

నీరు-చెట్టు పనుల్లో విజిలెన్స్ క్రిమినల్ కేసుల నుంచి అధికారులకు విముక్తి

ఈనాడు, అమరావతి: నీరు-చెట్టు పనుల్లో జలవనరుల శాఖ ఇంజినీర్లపై విజిలెన్స్ క్రిమినల్ చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రాష్ట్రంలో 2014-19 మధ్య చేపట్టిన నీరు-చెట్టు పనుల్లో విజిలెన్స్ నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఆ క్రమంలో ఇప్పటికే 386 మంది జలవనరుల శాఖ ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు ఉపసంహరించుకుంది. తాజాగా ఈ అంశంలో వారిపై క్రిమినల్ చర్యలనూ ఉపసంహరిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పాటు ఇందులో భాగస్వాములైన అటవీ శాఖ అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉపసంహరించుకోవడంతో పాటు జన్మభూమి మా ఊరి కమిటీ సభ్యులు, ఆ పనులు చేసిన ఏజెన్సీలపై కూడా క్రమశిక్షణ, క్రిమినల్ చర్యలు ఉపసంహరిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

కనీస వేతనాల సలహా మండలి సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: కనీస వేతనాల సలహా మండలి (మినిమం వేజ్ అడ్వైజరీ బోర్డు)కి 24 మందితో కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని పేర్కొంది.

యాజమాన్య ప్రతినిధులు: టి.అశోక్ (మంగళగిరి నియోజకవర్గం), బి.వెంకటేశ్వర్లు (కనిగిరి), టి.మధుసూధన్ (ఉదయగిరి), ఎం.పెంచలయ్య (నెల్లూరు రూరల్), పి.శ్రీనివాసరావు (విశాఖపట్నం), ఎ.సాంబశివరావు (పొన్నూరు), తెలుగు లక్ష్మి (విశాఖ సౌత్), టి.సుబ్బారావు (అరకు)

ఉద్యోగుల ప్రతినిధులు: కె.సురేష్ (కడప), వి.రామ్‌కుమార్ (విశాఖ దక్షిణ), వి.రామ్మోహన్‌రావు (గాజువాక), ఆర్.శ్యామ్ (మైలవరం), టి.నాగభూషణం (రాప్తాడు), టి.లక్ష్మీపెద్దక్క (జమ్మలమడుగు), టి.జయరాంరెడ్డి (సత్యవేడు), కె.సుబ్రహ్మణ్యం (తిరుపతి)

స్వతంత్ర ప్రతినిధులు: డి.బాబు (మైదకూరు), బి.అప్పారావు (పెందుర్తి), కె.శ్రీకాంత్‌రెడ్డి (ఆళ్లగడ్డ), డి.పుల్లయ్య (ఉంగుటూరు), ఆర్ శ్రావణ్‌కుమార్ (కుప్పం), కె.శ్రీనివాసులు (మార్కాపురం).

జీవనశైలి లోపాలతోనూ ఊబకాయం ముప్పు

- ఏఐజీ, యూకే సంస్థల అధ్యయనంలో వెల్లడి



అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి. చిత్రంలో డాక్టర్ రాకేష్ కలపాల, డాక్టర్ నితిన్

ఈనాడు, హైదరాబాద్: భారతీయుల్లో ఊబకాయం సమస్యకు జన్యువులే కారణమని ఎక్కువమంది భావిస్తుంటారు. సరైన జీవనశైలి జాగ్రత్తలు పాటించకపోవడమూ కారణమని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. 7వేల మందిపై ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ) ఈ అధ్యయనం నిర్వహించింది. యూకేలోని బయోబ్యాంకులో ఉన్న భారతీయుల డేటాతోపాటు, ఏఐజీ డేటాను ఉపయోగించి.. లక్సెంబర్గ్ సెంటర్ ఫర్ సిస్టమ్స్ బయోమెడిసిన్, యూనివర్సిటీ ఆఫ్ లక్సెంబర్గ్, సెంటర్ ఫర్ హ్యూమన్ జెనెటిక్స్, యూనివర్సిటీ ఆఫ్ మార్బర్గ్(జర్మనీ)తో కలిసి నిర్వహించిన అధ్యయనం వివరాలు ప్రతిష్ఠాత్మక జర్నల్ 'నేచర్‌'లో ప్రచురితమయ్యాయి. శుక్రవారం ఏఐజీ ఛైర్మన్ డా.నాగేశ్వరరెడ్డి... ఏఐజీ సెంటర్ ఫర్ ఒబెసిటీ మెటబాలిక్ థెరపీ డైరెక్టర్ డా.రాకేష్ కలపాల, డా.నితిన్ వివరాలు వెల్లడించారు.

ఆరు నెలల్లో పూర్తిగా బయటపడొచ్చు

"ఊబకాయం సమస్యకు చాలావరకు జన్యువులే కారణం. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, నిశ్చల జీవనశైలి, పొగతాగడం వంటివి ఈ రిస్కును మరింత పెంచుతాయి. జన్యువుల కారణంగా ఊబకాయం సమస్య తలెత్తినప్పటికీ... జీవనశైలిని మార్చుకోవడం ద్వారా అలాంటి ముప్పు కలిగించే జన్యువుల ప్రమేయాన్ని తగ్గించడంతోపాటు సాధారణ స్థితికి రావచ్చు. ఆహారంలో పిండి పదార్థాలు తగ్గించుకోవడం, శరీర బరువుకు అనుగుణంగా ప్రొటీన్ (కేజీ బరువుకు ఒక గ్రాము తప్పనిసరి) వినియోగం, చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలకు ప్రాధాన్యమివ్వడం, వారంలో 150 నిమిషాలపాటు లేదా రోజుకు 10 వేల అడుగులు నడవటం ద్వారా 6 నెలల్లో ఊబకాయం ముప్పు నుంచి పూర్తిగా బయటపడవచ్చని అధ్యయనంలో తేలింది.

జీన్స్ బాగున్నా.. జీవనశైలి బాగాలేకపోతే..

- బ్రిటన్‌తోపాటు భారత్‌లోని అన్ని ప్రాంతాల నుంచి డేటా సేకరించి ఈ అధ్యయనం నిర్వహించాం.
- జన్యువుల్లో సమస్య ఉండి జీవనశైలి సరిగాలేని వారిలో ఊబకాయ సమస్య ఎక్కువగా కన్పించింది. మరికొందరి జన్యువుల్లో సమస్య ఉన్నప్పటికీ..సమతుల జీవనశైలితో ఊబకాయం బారిన పడలేదు' అని డాక్టర్ నాగేశ్వరరెడ్డి వెల్లడించారు.

40% మందిలో ముప్పు ఉంది

'ఊబకాయం సమస్య జీవక్రియపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బీపీ, మధుమేహం, గుండె సమస్యలు, లివర్ తదితర అవయవాలపైనా ప్రభావం చూపుతోంది. గత పదేళ్లలో భారతీయుల్లో ఈ సమస్య రెండు రెట్లు పెరిగింది. బీఎంఐ కాకుండా... నడుం చుట్టుకొలతను ఊబకాయానికి ప్రామాణికంగా తీసుకుంటే దాదాపు 40% మందిలో ఈ ముప్పు పొంచి ఉంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లోనూ ఒబేసిటీ, ఫ్యాటీలివర్ సమస్య కన్పిస్తోంది. దీనిపై తల్లిదండ్రులు, ప్రభుత్వం దృష్టిపెట్టాలి' అని డాక్టర్ నాగేశ్వరరెడ్డి సూచించారు.

ఎంఎస్ఎంఈల బలోపేతానికి ప్రత్యేక విధానం

- ఏపీ సిక్ అండ్ స్ట్రెస్డ్ ఎంఎస్ఎంఈ రివైవల్ పాలసీ ఖరారు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల బలోపేతానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు వీలుగా 'ఏపీ సిక్ అండ్ స్ట్రెస్డ్ ఎంఎస్ఎంఈ రివైవల్ పాలసీ- 4.0'ను తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలసీ నిబంధనలు 2026-31 మధ్య అమలులో ఉంటాయని పేర్కొంది. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాలసీ అమలు ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. దీనిలో భాగంగా ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.500 కోట్లతో నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. సంస్థ పనితీరు ఆధారంగా రూ.2 కోట్ల వరకు రుణాన్ని అందిస్తుంది. దీనిపై 5- 7% వడ్డీనే వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రుణాలపై 18 నెలలు మారటోరియం విధిస్తుంది. తీసుకున్న రుణాన్ని 3 నుంచి 7 ఏళ్లలోగా తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పిస్తుంది. ఏపీ క్రెడిట్ గ్యారంటీ స్కీం లేదా సీజీటీఎంఎస్ఈ కింద కొల్లేటరల్ సెక్యూరిటీని ప్రభుత్వం అందిస్తుంది. పాలసీ అమలు విధానాలను త్వరలో విడుదల చేయనున్నట్లు పరిశ్రమల శాఖ పేర్కొంది.

ప్రతిపాదించిన ఉపశమన చర్యలు

- ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ కేర్ యూనిట్ల ఏర్పాటు. అక్కడ వివిధ రంగాల్లో నిపుణులను అందుబాటులో ఉంచడం
- రంగాల వారీగా పరిశ్రమలను గుర్తించి, వాటి పరిస్థితిని అంచనా వేసి పర్యవేక్షించడం
- యాజమాన్య, భాగస్వామ్యం నుంచి సులువుగా తప్పుకునేందుకు.. వారి బాధ్యతను పరిమితం చేయడం. అవసరమైన సమయంలో భాగస్వామ్యాలను సులువుగా మార్చుకునేందుకు అనుమతి
- నిర్వహణ మూలధనం అందుబాటులో ఉండేలా చేయడం.
- ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమలకు పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు కల్పించి.. ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించడం.

క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించాలి

మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను (క్రియేటివ్ ఎకానమీ) ప్రోత్సహించేలా.. పర్యాటకాభివృద్ధి సంస్థ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ, డిజిటల్ కార్పొరేషన్లు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రతిష్ఠ చాటేలా నంది అవార్డులు, టీవీ, థియేటర్ అవార్డులు, కందుకూరి పురస్కారాల ప్రదానం, నంది నాటకోత్సవాల నిర్వహణకు సన్నద్ధమవ్వాలని సూచించారు. జ్యూరీ ఏర్పాటు, వేదికలు, తేదీలపై సీఎం చంద్రబాబుతో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఎఫ్‌డీసీ అధికారులతో ఆయన సమీక్షించారు. 'యానిమేషన్, డిజిటల్ మీడియా, ఓటీటీ, ఏఐ, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించుకుని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గాలు అన్వేషించాలి. దీనికోసం త్వరలోనే రాష్ట్రస్థాయిలో కార్యశాల నిర్వహించాలి. రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటుపై ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌తో చర్చించాం. ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించేలా నూతన విధానం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక డేటా బ్యాంక్ రూపొందించాలి' అని ఆదేశించారు.

ఆప్కోకు స్కోచ్ అవార్డు

ఈనాడు, అమరావతి: ఆప్కోలో చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియకు స్కోచ్ అవార్డు దక్కినట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. ఆన్‌లైన్‌లో వస్త్రాల కొనుగోలు, వాటికి కంప్యూటర్ బిల్లులు, విధుల్లో పారదర్శకత, ముఖ ఆధారిత హాజరుకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు.

సిగాచి ఇండస్ట్రీస్‌కు టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు

- మరికొన్నింటికి భూముల కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ సంస్థ కర్నూలు జిల్లా ఓర్వకల్లులో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్, ఏపీఐ తయారీ యూనిట్‌ను రూ.1,404.66 కోట్లతో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 1,980 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొంది. ఆ సంస్థ మొదటిదశ ప్రాజెక్టును 2028 మార్చి నాటికి, రెండోదశ ప్రాజెక్టును 2029 మార్చి నాటికి పూర్తి చేయాలన్న నిబంధన విధించింది.

వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌కూ..

వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ సంస్థ 16 గిగావాట్ అవర్ లిథియం అయాన్ సెల్ గిగా-ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 300 ఎకరాలు కేటాయించింది. రూ.8,175 కోట్లు సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. 3వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొంది.

బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్‌కు సైతం..

బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్‌కూ టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ సంస్థ రూ.1,233.15 కోట్ల పెట్టుబడులతో పార్టికల్ బోర్డు తయారీ యూనిట్‌ను అనకాపల్లి జిల్లా రాంబిల్లి పారిశ్రామిక పార్కులో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం అనుమతించింది.

స్కై స్టోరేజ్‌కు 15 ఎకరాల కేటాయింపు

స్కై స్టోరేజ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలో 15 ఎకరాల భూమిని ఎకరా రూ.80 లక్షల చొప్పున రాయితీ ధరకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ సంస్థ రూ.106.75 కోట్లతో గ్రేడ్ 'ఏ' వేర్‌హౌసింగ్, లాజిస్టిక్ ఫెసిలిటీని ఏర్పాటుచేయనుంది. దీనిద్వారా 275 మందికి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొంది.

గిన్‌ఫ్రా ప్రెసిషన్స్‌కు భూ కేటాయింపులు రద్దు

గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనంతపురం జిల్లా తిమ్మసముద్రంలో కేటాయించిన 121.53 ఎకరాలను రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భూమి ధర చెల్లించనందున.. సంస్థ నుంచి అందిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌కు నెల్లూరులో 400 ఎకరాలు

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్‌కు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలో 400 ఎకరాల భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ సంస్థ డిఫెన్స్ ఎక్స్‌ప్లోజివ్స్, మందుగుండు తయారీ ప్లాంటు ఏర్పాటుకు రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2,050 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది.

వడ్డీ మినహాయింపు

రేమాండ్ గ్రూప్ సంస్థ (జేకే మెయిని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్, జేకే మెయిని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్) ఏరోస్పేస్, ఆటో కాంపొనెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుకు శ్రీ సత్యసాయి జిల్లా గుడిపల్లి దగ్గర 30 ఎకరాలు.. ఎకరా రూ.45.95 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఆ భూములకు నిర్దేశిత గడువు నుంచి 90 రోజుల్లోగా వడ్డీ లేకుండా చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

జూపిటర్‌కు భూ కేటాయింపుల రద్దు

అనకాపల్లి జిల్లా రాంబిల్లి పారిశ్రామిక పార్కులో జూపిటర్ రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4.8 గిగావాట్ల సోలార్ పీవీ సెల్, 1.5 గిగావాట్ల సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కేటాయించిన 142 ఎకరాల భూ కేటాయింపులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

రిలయన్స్‌కు భూముల ధరలు చెల్లించేందుకు అదనపు గడువు

రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు వడ్డీ మినహాయింపు ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ సంస్థకు అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 30 ఎకరాలను.. ఎకరా రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఆ భూములకు చెల్లించాల్సిన మొత్తాన్ని నిర్దేశిత గడువు తర్వాత అదనపు ఛార్జీలు లేకుండా 90 రోజుల్లోగా చెల్లించేందుకు అనుమతించింది.

సిఫి ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు వడ్డీ మినహాయింపు

సిఫి ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు విశాఖ గ్రామీణ మండలం పరదేశిపాలెం, మధురవాడలోని ఐటీ సెజ్ హిల్ నం-3లో కేటాయించిన భూములకు చెల్లించాల్సిన మొత్తంపై వడ్డీని ప్రభుత్వం మాఫీచేసింది. మధురవాడలోని ఐటీ సెజ్ హిల్ నం-3లో 3.6 ఎకరాలను.. ఎకరా రూ.కోటి చొప్పున, పరదేశిపాలెంలోని సర్వే నం-134లో 25 ఎకరాలను.. ఎకరా రూ.50 లక్షల చొప్పున కేటాయించింది. ఆ సంస్థ 550 మెగావాట్ల డేటా సెంటర్‌ను రూ.15,266 కోట్లతో ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదించింది. దీనిద్వారా 600 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది. భూములకు చెల్లించాల్సిన మొత్తాన్ని వడ్డీ లేకుండా 90 రోజుల్లోగా చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

కొండవీడులో రూ.3.79 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా కొండవీడు దగ్గర అర్షధాతు గ్రీన్ నానో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 12.31 ఎకరాల్లో రూ.3.79 కోట్లతో ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ 'ప్లగ్ అండ్ ప్లే' ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీ కింద సంస్థ దీన్ని ఏర్పాటుచేస్తుందని.. పాలసీ నిబంధనల మేరకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

పాలు, నీళ్ల పేరు వింటేనే ఉలిక్కిపడే పరిస్థితి

- చంద్రబాబు పాలనలో అతిసారం, ఫుడ్‌పాయిజన్ ఘటనలూ చూస్తున్నాం
- మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పాలు, నీళ్ల పేర్లు వింటేనే ఉలిక్కిపడే పరిస్థితి ఉత్పన్నమైందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. 'రాష్ట్రంలో ఈ రెండూ ప్రాణాంతకమవుతున్నాయి. పలు చోట్ల కల్తీ పాలు, కలుషిత నీరు తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. రాజమహేంద్రవరం, శ్రీకాకుళంలలో ఘటనలే ఇందుకు నిదర్శనం' అని శుక్రవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పాలనలో డయేరియా, ఫుడ్ పాయిజన్ ఘటనలూ తరచూ జరుగుతున్నాయని ఆరోపించారు. 'గత 14 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వసతిగృహాలు, విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్, కలుషిత నీరు, అపరిశుభ్రత వల్ల వ్యాధుల వ్యాప్తి వంటి ఘటనలు దాదాపు 25 చోటుచేసుకున్నాయి. వాటితో 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, గుర్ల, శ్రీకాకుళం, తురకపాలెం ప్రాంతాల్లో పెద్దఎత్తున డయేరియా ప్రబలి వందల మంది అస్వస్థత పాలయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం లోపాలను గుర్తించి, సరి చేయాలి. ఆహార భద్రత పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి' అని జగన్ పేర్కొన్నారు.

రేళ్ల వసతిగృహం ఘటనపై మంత్రి సవిత ఆరా

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లా రేళ్ల బీసీ వసతిగృహంలో విద్యార్థులకు డయేరియా సోకడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వసతిగృహంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటినే విద్యార్థులకు అందించాలన్నారు.

(c) eenadu

పలాసలో జీడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

• ఎమ్మెల్యే గౌతు శిరీష

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో శ్రీకాకుళం జిల్లాలో వంశధార నుంచి ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో టెయిల్ ఎండ్ వరకు నీటిని అందించాం. పలాసలో జీడి రైతుల్ని ఆదుకునేందుకు ప్రాసెసింగ్ యూనిట్లు, అనుబంధ పరిశ్రమల్ని ఏర్పాటు చేయాలి. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు ప్రతిపాదనల్ని త్వరితగతిన ఆమోదించాలి. జీడి పిక్కలకు మద్దతు ధర నిర్ణయించాలి. దీనిపై కేంద్రానికి విన్నవించాలి. పలాసలో జెట్టీని మంజూరు చేయాలి' అని గౌతు శిరీష పేర్కొన్నారు. వ్యవసాయశాఖ బడ్జెట్‌పై ఆమె మాట్లాడారు.

'ఎఫ్ఎంజీఈ' అర్హత ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన విద్యార్థులు మన దేశంలో ప్రాక్టీస్‌కు అర్హత పొందాలంటే 'ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) పాసవ్వాలి. ఎఫ్ఎంజీఈ త్వరలో జరగనుందని ఎన్ఎంసీ శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్ష రాయాలంటే మొదట అభ్యర్థులు ఎన్ఎంసీ పరిధిలోని 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్' నుంచి అర్హత ధ్రువీకరణ పత్రం పొందాలి. ఈ సర్టిఫికెట్ కోసం ఎన్ఎంసీ ఆన్‌లైన్ దరఖాస్తులకు మార్చి 2 నుంచి 31 వరకు అవకాశం కల్పించింది. అభ్యర్థులు ఈ విషయం గమనించాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.

సౌందర రాజన్ ఆధ్యాత్మిక సేవలు మరువలేం: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'చిలుకూరు క్షేత్రంలోని శ్రీబాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సౌందర రాజన్ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'విద్యావేత్తగా, ఆధ్యాత్మికవేత్తగా ఆయన అందించిన సేవలను మరువలేం. ఆలయాలను పరిరక్షించుకోవాలనే చైతన్యాన్ని భక్తుల్లో ఆయన పెంచే ప్రయత్నం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని తెలిపారు.

సౌందర రాజన్ లోటు తీర్చలేనిది: మాధవ్

చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు సౌందర రాజన్ భౌతికంగా లేకపోవడం హిందూ సమాజానికి తీరని లోటు అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 'ఆలయాల సంప్రదాయాలను, స్వతంత్రతను కాపాడేందుకు జీవితాంతం కృషి చేసిన ఆధ్యాత్మికవేత్త. ఆయన సేవలు చిరస్మరణీయం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బొత్స సత్యనారాయణ కోలుకోవాలి: పవన్

ఈనాడు, అమరావతి: శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డానని, ఆయన త్వరగా కోలుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆకాంక్షించారు. బొత్సకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థుల అస్వస్థత ఘటనపై మంత్రి సంధ్యారాణి ఆరా

ఈనాడు, అమరావతి: కురుపాం గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇంటి నుంచి తెచ్చుకున్న నిల్వ పచ్చళ్లే విరేచనాలకు కారణమని అధికారులు వివరించారు.

తోలు, చెప్పుల తయారీ పాలసీలో సవరణ

ఈనాడు, అమరావతి: తోలు, చెప్పుల తయారీ పాలసీ-4.0లో సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాలసీ కింద ఏర్పాటు చేసే పరిశ్రమలను ప్రోత్సహించేందుకు నామమాత్ర ధరకు లీజు విధానంలో భూకేటాయింపులు జరిపేందుకు గతంలో ఉన్న నిబంధనలను సవరించింది. పాలసీ కింద మొదట ఏర్పాటు చేసే 10 ప్రాజెక్టులకు నామమాత్ర ధరకు భూములు లీజు కింద ఇవ్వడంతో పాటు ఎక్కువ ఉపాధికల్పించే సంస్థలకు అద్దెను పూర్తిగా మినహాయించాలని నిర్ణయించింది.

ఆజాద్ ఇండియా మొబిలిటీకి భూకేటాయింపులు రద్దు

ఈనాడు, అమరావతి: అజాద్ ఇండియా మొబిలిటీ సంస్థకు శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లి ఏపీఐఐసీ లేఅవుట్‌లో కేటాయించిన 70.71 ఎకరాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ ఈఎండీ కింద చెల్లించిన రూ.2.5 కోట్లను ఎలాంటి వడ్డీ లేకుండా తిరిగి ఇచ్చేందుకు అనుమతించింది. కేటాయించిన భూములకు సంస్థ డబ్బు చెల్లించని కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

విరూపాక్ష ఆర్గానిక్స్‌కు ప్రోత్సాహకాలు

విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్‌కు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు నోడ్‌లో యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రిడియంట్స్ తయారీ యూనిట్‌ను రూ.1,225 కోట్లతో సంస్థ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని సంస్థ ప్రతిపాదించింది.

నాన్‌గ్రీన్ మెట్‌కు 21.36 ఎకరాలు

తిరుపతి జిల్లా నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో నాన్ గ్రీన్‌మెట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 21.36 ఎకరాలు కేటాయించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ రూ.1,366 కోట్ల పెట్టుబడితో 340 మందికి ఉపాధి కల్పిస్తుంది.

పోలవరం నల్లమలసాగర్ కొత్త డీపీఆర్‌కు వేగంగా అడుగులు

• ప్రీ ఫీజిబిలిటీ నివేదిక అనుమతులకు యత్నాలు
• పాత లింకులో ఒక స్థాయికి మిగిలిన పనులు

ఈనాడు, అమరావతి: పోలవరం నల్లమలసాగర్ అనుసంధాన పనులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర జలసంఘం నుంచి ప్రి ఫీజిబిలిటీ నివేదికకు ఇంకా అనుమతి రాకపోవడంతో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు తన దిల్లీ పర్యటన సందర్భంగా స్వయంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి ముందే దీనిపై ఉన్న అభ్యంతరాలను అడిగి తెలుసుకొని వాటిని నివృత్తి చేశారు. ఒక్కో రాష్ట్రానికి ఒకో విధానాన్ని అనుసరించవద్దని కోరారు. ఈ ప్రాజెక్టు విషయాన్ని తాను పరిష్కరిస్తానని కేంద్ర జల్‌శక్తి మంత్రి స్వయంగా ముఖ్యమంత్రికి భరోసా ఇచ్చారు. ఈ మేరకు త్వరలో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. మరో వైపు గోదావరి పెన్నా తొలిదశ అనుసంధాన పనులను పోలవరం నల్లమలసాగర్ అనుసంధానంతో లింకు చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఇందులో రెండు అంశాలు మిళితమై ఉన్నాయి

1. పోలవరం నల్లమలసాగర్ అనుసంధానం ప్రాజెక్టు డీపీఆర్, ఇతర సర్వేలు, సాంకేతిక అంశాలపై అధ్యయనం.
2. గోదావరి పెన్నా తొలిదశ పేరుతో ఇప్పటికే చేసిన పనులను తాజా అనుసంధానంతో లింకు చేయడం..

రెండింటినీ సమ్మిళితం చేస్తూ...

■ 2014-19 మధ్య నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పోలవరం పెన్నా అనుసంధానం చేపట్టాలని భావించారు. ఇందుకు డీపీఆర్‌ను వ్యాప్కోస్ తయారు చేసింది. పోలవరం పెన్నా తొలిదశ పనులను రూ.6,020.15 కోట్లతో చేపట్టేందుకు పాలనామోదం తెలిపారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో దీనికి పల్నాడు కరవు నివారణ పథకంగా పేరు మార్చారు. గోదావరి వరద జలాలు (73 టీఎంసీలు) మళ్లించి సాగర్ కుడి కాలువ ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగించడం ఇందులో ప్రధాన ఉద్దేశం. ఈ ప్రాజెక్టు వల్ల 9,61,231 ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది.

■ గోదావరి పెన్నా తొలిదశలో రెండు ప్యాకేజీలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు పేరు చెప్పి విద్యుత్ కార్పొరేషన్ నుంచి రూ.2,746 కోట్ల రుణం తీసుకున్నారు. అందులో రూ.1,453 కోట్లు అప్పట్లోనే విడుదల చేశారు.

■ ఇప్పుడు పోలవరం నల్లమలసాగర్ అనుసంధానం చేపట్టనుండటంతో పాత ప్రాజెక్టును, కొత్త ప్రాజెక్టును అనుసంధానం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

■ నాడు పాత ప్రాజెక్టులో రెండు దశల్లో కొన్ని పనులు జరిగాయి. రెండు ప్యాకేజీల్లోనూ కలిపి రూ.1,001 కోట్ల విలువైన పనులు చేశారు. మొదటి ప్యాకేజీలో రూ.479 కోట్లు, రెండో ప్యాకేజీలో రూ.522 కోట్ల మేర ఖర్చయింది. పైపులు, పంపులు, మోటర్లు, ఇతర పరికరాలు కొనుగోలు చేశారు. కాలువ, పంపుహౌస్‌ల నిర్మాణానికి 3,445.76 ఎకరాల భూమి అవసరం అవుతుంది.

■ పోలవరం నల్లమలసాగర్ అనుసంధానం పనులకు, గోదావరి పెన్నా తొలిదశ పనుల వల్ల ఇబ్బంది లేకుండా రెండింటినీ సమ్మిళితం చేయబోతున్నారు.

■ ఇందుకు ఆ రెండు ప్యాకేజీల్లో పనులు ఒక స్థాయికి తీసుకువచ్చి నిలిపివేయాలనేది ఉద్దేశం. అలా రక్షణ స్థాయికి పనులు చేసేందుకు రూ.1,644 కోట్లు అవసరమని జలవనరులశాఖ అంచనావేసింది. గతంలో తీసుకువచ్చిన రుణంలో మిగిలిన సొమ్ము సరిపోతుందనేది వారి ఉద్దేశం.

తాజా డీపీఆర్‌కు తొలిదశ నిధుల నుంచి కేటాయింపులు

■ పోలవరం నల్లమల అనుసంధానం ప్రాజెక్టుకు కొత్తగా డీపీఆర్ తయారు చేయాల్సి ఉంది. ఇందుకు టెండర్లను పిలిచి గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి గోదావరి పెన్నా తొలిదశకు రూ.200 కోట్లు కేటాయించారు. డీపీఆర్ తయారీకే రూ.9.20 కోట్లు అవసరమవుతాయి. కేంద్ర జలసంఘం మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పరిశోధనలు చేసి ఇతర అనుమతుల కోసం సర్వేలు చేయాల్సి ఉంది.

■ పర్యావరణ మదింపు సర్వేలు, ఇతర పనులకు రూ.3.50 కోట్లు అవసరమని అంచనా. సమగ్ర పునరావాస ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులకు రూ.14.37 కోట్లు అవసరం. ఈ నిధులను పోలవరం పెన్నా తొలిదశ ప్యాకేజీ నుంచి ఖర్చు చేసేందుకు అనుమతులు ఇచ్చారు.

యశస్వి పవర్‌కు 200 మెగావాట్ల సోలార్ పార్కు ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: యశస్వి పవర్ ఎల్ఎల్‌పీ సంస్థ 200 మెగావాట్ల సోలార్ విద్యుత్ పార్కు శ్రీసత్యసాయి జిల్లాలోని బీచిగానిపల్లి దగ్గర ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థకు ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 30 శాతం డిస్కంల అవసరానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాయని.. ఆ విద్యుత్‌కు టారిఫ్‌ను ఏపీఈఆర్‌సీ నిర్ణయిస్తుంది. ప్రాజెక్టును 24 నెలల్లో పూర్తి చేయాలన్న నిబంధన విధించింది.

క్రోమా-అథర్ పవర్ ప్రొడక్ట్ లిమిటెడ్‌కు అనుమతి: చిలకలూరిపేట మండలం ఎడవల్లి గ్రామంలో క్రోమా-అథర్ పవర్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రోజుకు 200 టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. రెవెన్యూ/పరిశ్రమల శాఖలు/ఏపీ ట్రాన్స్‌కో/సంబంధిత డిస్కం తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

గోదావరి పుష్కరాల నిర్వహణపై ఒకసారి కూర్చుని మాట్లాడుకుందాం

• తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆనం రామనారాయణరెడ్డి


తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబుతో ఆనం రామనారాయణరెడ్డి

ఈనాడు, అమరావతి: గోదావరి పుష్కరాల నిర్వహణపై ఒకసారి కూర్చుని మాట్లాడుకుందాం అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వెలగపూడిలోని అసెంబ్లీకి వచ్చిన వారి ఎదుట ఆనం ఈ ప్రతిపాదన పెట్టారు. 'మేం కాళేశ్వరంలో చాలా గొప్పగా చేయాలనుకుంటున్నాం' అని భట్టి చెప్పగా ఆనం స్పందించారు. 'మేం కూడా ఇక్కడ ఏర్పాట్లకు సిద్ధమవుతున్నాం. ఈ పుష్కరాల గురించి తెలంగాణ ప్రభుత్వంతో కూడా ఒకసారి మాట్లాడి, సమన్వయం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. నేను, మా పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ మీతో ఈ విషయమై మాట్లాడాలి' అని చెప్పారు. దీంతో 'ఆ పేరుతోనైనా మీరు హైదరాబాద్‌కు రండి' అని భట్టి సరదాగా వ్యాఖ్యానించారు. 'అదే ఒకసారి మాట్లాడదాం, మేం రావడమో, మీరు రావడమో. . ఏదైనా పర్లేదు. పుష్కరాలపై ఒక ఆలోచన చేద్దాం' అని ఆనం ఆయనకు చెప్పారు. తప్పకుండా కూర్చుందాం, మాట్లాడి మంచి ఏర్పాట్లు చేద్దాం అని భట్టి, శ్రీధర్‌బాబు చెప్పారు. వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత ఆనం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

10 కోట్ల మందికి పైగా వస్తారు

రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, మరో రెండు చోట్ల ఈసారి పుష్కరాలకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేసినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఘాట్‌లను 400 వరకు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఏపీ అసెంబ్లీ లాబీల్లో.. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుల సందడి

ఈనాడు, అమరావతి: ఏపీ అసెంబ్లీకి శుక్రవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికలను ఏపీ ప్రజాప్రతినిధులకు ఇచ్చేందుకు భట్టి అసెంబ్లీకి వచ్చారు. ఆయన వెంట శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. వారు తొలుత స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఆయన ఛాంబర్‌లో కలిసి మాట్లాడారు. మంత్రులు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ తదితరులు అక్కడికి రాగా, అందరికీ పెళ్లి శుభలేఖలు అందజేశారు. 'వాట్ బాస్ వెల్‌కం! మీరిలా వస్తే తెలంగాణే కదిలొచ్చినట్లుగా అనిపిస్తోంది' అంటూ ఏపీ మంత్రులు వారిని ఆప్యాయంగా పలకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో, కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అసెంబ్లీ లాబీల్లో కొందరు ఎమ్మెల్యేలు వారిని చూసి, ఆగి మాట్లాడారు. తర్వాత వారిద్దరూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన లేకపోవడంతో పెళ్లిపత్రికను మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. భట్టి, శ్రీధర్‌బాబు బయల్దేరగా, ఏపీ మంత్రులు మనోహర్, ఆనం, దుర్గేష్ తదితరులు పోర్టికో వరకు వచ్చి వీడ్కోలు పలికారు.


సీజేఐ ప్రారంభించేందుకు సిద్ధం చేసిన ఓ భవనం


హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయంలో చేస్తున్న ఏర్పాట్లు

ప్రారంభోత్సవానికి సిద్ధం!

రాజధాని అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయంలో అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ చేతులమీదుగా ప్రారంభించేందుకు ఈ సముదాయంలోని ఓ భవనంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సముదాయంలో రోడ్లు వేస్తున్నారు. మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. అదే రోజు సీజేఐ ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథిగృహం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడా సీఆర్డీయే, ఏడీసీఎల్ జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

–ఈనాడు, అమరావతి

రాజధానిలో కొత్తగా ఆరు సంస్థలకు 5.686 ఎకరాలు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో కొత్తగా ఆరు సంస్థలకు 5.686 ఎకరాల స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. 2014-19 మధ్య 13 సంస్థలకు చేసిన కేటాయింపుల్లో కొన్ని సవరణలు చేసింది. కొత్తగా... రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్‌కి 2 ఎకరాలను.. ఎకరం రూ.50 లక్షల చొప్పున 60 ఏళ్లపాటు లీజుకు కేటాయించింది. ఆ సంస్థ చదరపు మీటరుకు ఏడాదికి రూపాయి అద్దె కూడా చెల్లించాలి.

■ కరూర్ వైశ్యాబ్యాంక్‌కి 0.435 ఎకరాల స్థలాన్ని... 60 ఏళ్ల లీజుకు కేటాయించింది. ఎకరానికి లీజు మొత్తాన్ని రూ.4.1 కోట్లుగా నిర్ణయించింది. బ్యాంకుకు కేటాయించిన స్థలం దామాషాలో లీజు చెల్లించాలి.

■ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన కేంద్రానికి (ఈపీటీఆర్ఐ) 0.751 ఎకరాల్ని 60 ఏళ్లపాటు లీజుకు కేటాయించింది. దీనికీ ఎకరం రూ.4.1 కోట్లుగా నిర్ణయించింది.

■ నాబార్డ్‌కి ఎకరం స్థలాన్ని, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు అర ఎకరం స్థలాన్ని పూర్తి హక్కులతో కేటాయించింది. ఎకరం విలువ రూ.4.1 కోట్లుగా నిర్ధారించింది.

■ భారత వాతావరణ విభాగానికి (ఐఎండీ) ఎకరం స్థలాన్ని 60 ఏళ్ల లీజుకు కేటాయించింది. ఎకరం ధర రూ.కోటిగా నిర్ణయించింది.

మార్పులు ఇలా..

■ సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌కు గతంలో 15 ఎకరాల్ని 60 ఏళ్ల లీజుకు ఎకరం రూ.4.1 కోట్లకు కేటాయించింది. చదరపు మీటరుకు ఏడాదికి రూపాయి చొప్పున లీజు అద్దె చెల్లించాలని నిబంధన పెట్టింది. ఇప్పుడు ఎకరానికి రూ.4.1 కోట్ల చెల్లింపు నుంచి మినహాయింపు ఇచ్చింది. నామమాత్రంగా చదరపు మీటరుకు ఏడాదికి రూపాయి అద్దె వసూలు చేయనుంది.

■ భాజపా కార్యాలయానికి గతంలో పిచ్చికలపాలెం వద్ద 2 ఎకరాలు కేటాయించగా... ఇప్పుడు దాన్ని 1.43 ఎకరాలకు తగ్గిస్తూ, వెంకటపాలెంలో కేటాయించింది. ఎకరానికి సంవత్సరానికి రూ.వెయ్యి చెల్లించేలా స్థలం కేటాయించింది.

■ కాగ్‌కి గతంలో 2.05 ఎకరాలు కేటాయించగా.. దాన్ని ప్పుడు 2.837 ఎకరాలకు పెంచింది.

దేశీ మిర్చికి రికార్డు ధర

క్వింటా రూ.50 వేలు పలికిన ఎర్రబంగారం



ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం దేశీ మిర్చికి ఈ సీజన్‌లో రికార్డు ధర పలికింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పుల్లూరుపల్లికి చెందిన ఎ.రవీందర్‌రావు శుక్రవారం మార్కెట్‌కు 9 బస్తాల దేశీ మిర్చిని తీసుకురాగా.. గరిష్ఠ ధర రూ.50 వేలు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. మూడేళ్లక్రితం ఇదే రకం మిర్చికి క్వింటా రూ.90 వేల వరకు పలికింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో.. రెండేళ్లుగా దేశీ మిర్చికి ఆశించిన ధరలు దక్కలేదు. ప్రస్తుతం క్రమక్రమంగా పెరుగుతుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి.


యాగశాలలో మహాపూర్ణాహుతి

యాదగిరిగుట్టలో మహాపూర్ణాహుతి.. చక్రతీర్థం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: శ్రీయాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం చివరి ఘట్టాలు కొనసాగాయి. సకల దేవతల ఆరాధనకు మహాపూర్ణాహుతి, దోష నివారణకు చక్రతీర్థ స్నానం పర్వాలను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిట్టచివరి ఘట్టమైన అష్టోత్తర శత ఘటాభిషేకం శనివారం ఉదయం నిర్వహిస్తారు. కార్యక్రమాలలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవానీశంకర్, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుంచి నిలిచిపోయిన శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్సవాన్ని మార్చి 1వ తేదీ నుంచి పునఃప్రారంభించనున్నట్లు ఆలయ పూజారులు, అధికారులు తెలిపారు.

సవరించిన అంచనాలకు అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి

• 2014 నుంచి ఇప్పటివరకూ తీసుకోలేదు
• ప్రజాపద్దుల కమిటీ అభ్యంతరం

ఈనాడు, అమరావతి: కేటాయింపుల కంటే అదనంగా బడ్జెట్‌ను వినియోగించినప్పుడు ఆ సవరించిన అంచనాలకు అసెంబ్లీ ఆమోదం పొందాలని.. సప్లిమెంటరీ గ్రాంట్లకూ సభామోదం పొందాలి కదా అని అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఆర్థికశాఖ అధికారులను ప్రశ్నించింది. అప్పు తీసుకుని, ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు దాన్ని తిరిగి చెల్లిస్తే వాటిని 'వేస్ అండ్ మీన్స్' పద్దులో రాస్తున్నారు. దీనికీ సభామోదం అవసరమని కాగ్ అభ్యంతరం తెలిపిన విషయాన్ని ప్రస్తావించింది. 2014-15 నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకూ సవరించిన అంచనాలన్నింటినీ ఆమోదం కోసం మార్చి 5న అసెంబ్లీకి సమర్పిస్తామని ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ కమిటీకి నివేదించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పీఏసీ సమీక్షించింది. ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, శ్రీరాం రాజగోపాల్, ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఆడిట్‌లో కాగ్ అభ్యంతరం తెలిపిన పలు పేరాలపై కమిటీ విచారించింది. ఇందులో ఆర్థిక, నీటిపారుదల శాఖల అంశాలపై సమీక్షించింది. పోలవరం, హెచ్ఎన్ఎస్ఎస్, పట్టిసీమ ప్రాజెక్టులకు కాగ్ అభ్యంతరాలపై చర్చించిన కమిటీ.. అధికారులు ఇచ్చిన వివరణలతో సంతృప్తి చెంది కాగ్ అభ్యంతరం తెలిపిన ఆడిట్ పేరాల్లో ఒకటి మినహా మిగిలిన వాటిని డ్రాప్ చేస్తున్నట్లు ప్రకటించింది.

■ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆ శాఖ తరపున కమిటీ ముందు హాజరై ఆడిట్ అభ్యంతరాలపై వివరణ ఇచ్చారు. ఆయన శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పీఏసీ ఛైర్మన్ రామాంజనేయులు, సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

'ఉగాదిలోగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి'

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన పెన్షనర్ల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు, తగ్గించిన పింఛను మొత్తం పునరుద్ధరణ హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. విజయవాడలో శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ పురుషోత్తం నాయుడు, జి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ పింఛనుదారులకు దక్కాల్సిన అన్నిరకాల ప్రయోజనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. 'ఉగాదిలోగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటుచేయాలి. 30 శాతం ఇంటెరిం రిలీఫ్ ప్రకటించాలి. బకాయిలు చెల్లించాలి. పింఛను ప్రయోజనాలు, వైద్య బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్లు తక్షణమే చెల్లించాలి. ఈహెచ్ఎస్ సమర్థంగా అమలు చేయాలి' అని డిమాండ్ చేశారు. సమావేశంలో రెవెన్యూ, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, రవాణా, దేవాదాయ, విద్యా, వైద్య, జలవనరుల తదితర శాఖల విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి చిదంబరంపై కేసు నమోదుకు అనుమతి: ఈడీ

చెన్నై(పారిస్), న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి చిదంబరంపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదుకు అనుమతి లభించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఓ ప్రకటనలో తెలిపింది. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎయిర్‌సెల్, మెక్సిస్, ఐఎన్ఎక్స్ మీడియా తదితర సంస్థలకు విదేశీ పెట్టుబడుల బోర్డు అనుమతి ఇవ్వడంలో అక్రమాలు జరిగినట్లు ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసుల్లో కొన్నేళ్ల ముందు అభియోగపత్రం దాఖలు చేసింది. రెండు పత్రాల్లో చిదంబరాన్ని నిందితుడిగా చేర్చారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసేందుకు అనుమతి తప్పనిసరని సుప్రీంకోర్టు 2024లో ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ప్రకారం సంబంధిత అధికారుల నుంచి ఈడీ అనుమతి పొందింది. ఇందుకు సంబంధించిన పత్రాలను దిల్లీ ప్రత్యేక కోర్టుకు ఈడీ పంపింది.

ఏపీ నిర్మిస్తున్న అనుమతుల్లేని ప్రాజెక్టులను అడ్డుకోండి!

• కృష్ణా బోర్డుకు తెలంగాణ ఈఎన్సీ లేఖ
• తమ రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్రానికి బోర్డు ఫిర్యాదు చేయడంపై ఆక్షేపణ



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర విభజన చట్టం నిబంధనలను పట్టించుకోకుండా, కేంద్ర ప్రభుత్వ సంస్థల అనుమతులు పొందకుండా... ఏపీ కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను వెంటనే అడ్డుకోవాలని కృష్ణా బోర్డును తెలంగాణ కోరింది. 2021 నుంచి ఆ రాష్ట్రం చేపట్టిన నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంది. పైగా తెలంగాణ ప్రాజెక్టులపై కేంద్ర జలశక్తిశాఖకు గత జనవరిలో బోర్డు ఫిర్యాదు చేసిందంటూ ఆక్షేపణ తెలిపింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఈఎన్సీ ఓవీ రమేష్‌బాబు కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు తాజాగా లేఖ రాశారు.

★ "ఏపీ రూ.47,776.50 కోట్లతో శ్రీశైలం నుంచి నీటిని మళ్లించేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరిస్తోందని.. దీని ద్వారా శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు నగరి సుజల స్రవంతి, హంద్రీ నీవా సుజల స్రవంతికి నీటిని తీసుకెళ్లడానికి పరిపాలన అనుమతులు ఇచ్చిందని 2021లో బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు చేసింది. 2022, 2023లలోనూ ఏపీ విస్తరిస్తున్న, కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలను సమగ్రంగా తెలియజేస్తూ.. బోర్డు, అపెక్స్ కౌన్సిల్‌ల అనుమతులు ఇవ్వొద్దని స్పష్టంగా తెలంగాణ లేఖ రాసింది. ఫిర్యాదులు చేసినా బోర్డు, కేంద్రం... వాటిని అడ్డుకోవడంపై దృష్టి పెట్టలేదు. కానీ గత నెల 6న తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు చెబుతూ కేంద్ర జలశక్తిశాఖకు బోర్డు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం, తప్పుదారి పట్టించడమే.

★ 2023 అక్టోబరు 6న కేంద్ర జలశక్తిశాఖ అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం సెక్షన్-3ని అనుసరించి కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి కృష్ణా ట్రైబ్యునల్‌కు విధి విధానాలు(టీవోఆర్) జారీ చేసింది. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కావడంతో నీటి అవసరాలు, ప్రాజెక్టులకున్న కేటాయింపులు తదితర అంశాలను గతంలో ఎన్నడూ స్పష్టంగా గుర్తించలేదు. ఈ కారణంగానే 2025 సెప్టెంబరు 16న తెలంగాణ జీవో(నం.34) జారీ చేసింది. కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగం, నిర్మాణంలో ఉన్నవి, పూర్తయిన ప్రాజెక్టులు, నిల్వకు ఉన్న అవకాశాలపై డీపీఆర్‌లు సిద్ధం చేసుకోవాలని జీవోలో పేర్కొంది. ఆ జీవోను ట్రైబ్యునల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది.

★ ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీటిని నిల్వ చేసుకోవడానికి 360 టీఎంసీలకు సరిపడా పెన్నా అనుబంధ పరీవాహకంలో ప్రాజెక్టులను నిర్మించుకుంది. గతం నుంచి ఆ రాష్ట్రం వినియోగిస్తున్న కృష్ణా జలాలకు తోడు అదనంగా 114.75 టీఎంసీల వినియోగానికి ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగిస్తోంది. దీంతోపాటు గతంలో ఏపీ చేసిన ఫిర్యాదులకు తెలంగాణ.. కృష్ణా బోర్డుకు వివరణ ఇచ్చింది. ఇప్పటికైనా కృష్ణా ట్రైబ్యునల్ వాటాలను నిర్ణయించే వరకు కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టకుండా ఏపీని అడ్డుకోవాలి. కేంద్రానికి కూడా ఆ రాష్ట్ర ఉల్లంఘనలను తెలియజేయాలి' అని ఈఎన్సీ లేఖలో పేర్కొన్నారు.

(c) eenadu